బుధవారం 10-7-2024


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 109

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




సిరాజ్‌కు ప్రభుత్వోద్యోగం, స్థలం

సీఎం రేవంత్ ఆదేశం.. హైదరాబాదీ క్రికెటర్‌కు అభినందన - 20లో



కిడ్స్‌కు పాఠం... క్వీన్ స్విమ్మర్

ఇటీవల ఇంగ్లిష్ చానెల్ ఈదిన క్వీనీ విక్టోరియా మనోగతం - 17లో



గౌతముడే శిక్షకుడు

భారత సీనియర్ పురుషుల క్రికెట్ జట్టు కొత్త హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్‌ను బీసీసీఐ నియమించింది. డిసెంబర్ 2027 వరకు గంభీర్ ఈ పదవిలో కొనసాగుతాడు.

- వివరాలు 18లో



ప్రభుత్వాన్ని వదలం

కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేసే దాకా రాష్ట్ర ప్రభుత్వాన్ని విడిచిపెట్టేది లేదని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి హెచ్చరించారు.

- వివరాలు 16లో

ప్రాజెక్టుల్ని పరిగెత్తించండి

2025 డిసెంబర్ కల్లా పూర్తి చేయాలి ● అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

పాలమూరు-రంగారెడ్డి మినహా మిగతా ప్రాజెక్టులు 18 నెలల్లో పూర్తి చేయాలి

- పాలమూరు సహా అన్ని ప్రాజెక్టులపై నివేదిక ఇవ్వండి
- అన్ని ప్రాజెక్టుల కింద భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ చెల్లింపులు పూర్తి చేయాలి
- వైద్యారోగ్య శాఖలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి
- ప్రతి పంచాయతీలో ప్రభుత్వ బడి ఉండాలి
- సెక్రటేరియట్ నుంచి గ్రామ పంచాయతీ వరకు ఫేస్ రికగ్నిషన్ యాప్
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాపై ముఖ్యమంత్రి సమీక్ష
- రూ.396.06 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మహిళా సంఘాలకు రూ.334.02 కోట్ల రుణాల చెక్కు అందజేత


ప్రాజెక్టులపై సమీక్షలో సీఎం రేవంత్. చిత్రంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, ఉత్తమ్, దామోదర రాజనర్సింహ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మినహా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను 2025 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పాలమూరు-రంగారెడ్డితో పాటు అన్ని ప్రాజెక్టులకు సంబంధించి సూక్ష్మ స్థాయిలో నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ఆయకట్టుపై నివేదిక సమర్పించాలని కోరారు. అన్ని ప్రాజెక్టులపై స్టేటస్ రిపోర్ట్ (స్థాయీ నివేదిక) సమర్పించాలని ఆదేశించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల ప్రగతి, విద్య, వైద్య సదుపాయాలపై జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాజీవ్ భీమా లిఫ్ట్ ఇరిగేషన్, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులపై కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి

'పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు రెండో ప్రాధాన్యత కింద చెల్లించాలి. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసే పనులపై దృష్టి సారించాలి. గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ నెల 14 లేదా 15న సాగునీటి శాఖ మంత్రితో సమీక్షించి.. అదే రోజు ఆమోదం తీసుకోవాలి. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో సందర్శించి కార్యాచరణ రూపొందించాలి..'అని సీఎం సూచించారు.

నెట్టెంపాడు రీ ఎగ్జామిన్ చేయాలి

'జవహర్ నెట్టెంపాడు ప్రాజెక్టు మొత్తాన్ని మరోసారి పునఃపరిశీలన జరపాలి. సాంకేతిక అంశాలతో పాటు ఇతర సమస్యలను గుర్తించాలి. ప్రాజెక్టు పూర్తికి

మిగతా 2వ పేజీలో ▶

నెలకోసారి సమీక్ష

'అన్ని ప్రాజెక్టుల కింద భూసేకరణతో పాటు ఆర్‌అండ్ ఆర్ చెల్లింపులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. అన్ని ప్రాజెక్టులను 18 నెలల్లో పూర్తి చేయాలి. ఆయా ప్రాజెక్టుల కింద కొత్త ప్రతిపాదనలను న్యాయపరమైన వివాదాలకు అవకాశం లేకుండా రూపొందించాలి. ప్రస్తుతం చేపట్టిన పనులన్నింటినీ పూర్తి చేయాలి. ప్రతి ప్రాజెక్టుపై 30 రోజులకు ఒకసారి సమీక్ష ఉంటుంది. అన్ని ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో సందర్శించి పూర్తి నివేదిక ఇవ్వాలి..' అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

పరీక్షల వాయిదాకు గూడుపుఠాణి

- గ్రూప్స్, డీఎస్సీ వాయిదాకు కోచింగ్ సెంటర్ల మాఫియా కుట్ర
- కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణ
- పార్టీ ఎప్పుడు బలహీనపడితే అప్పుడు కేసీఆర్ విద్యార్థులను ముందుకు తీసుకొస్తారు... నిరుద్యోగులకు నష్టం జరుగుతోందనుకుంటే హరీశ్, కేటీఆర్ ఆమరణ దీక్ష చేయాలి

2 లో


మంగళవారం మాస్కోలో ప్రధాని మోదీని రష్యా అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్'తో సత్కరిస్తున్న ఆ దేశ అధ్యక్షుడు పుతిన్

బాంబులు, తూటాల నడుమ...

శాంతి చర్చలు సాగవు

- పుతిన్‌కు మోదీ స్పష్టీకరణ
- ఉక్రెయిన్ యుద్ధంపై చర్చలు

- వివరాలు 6లో

మళ్లీ 'టీఆర్ఎస్'!

బీఆర్ఎస్ పేరు మార్పుపై సాగుతున్న అధ్యయనం

- త్వరలో ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించే యోచన
- అసెంబ్లీ ఎన్నికల తర్వాత నుంచి పెరుగుతున్న ఒత్తిడి
- తెలంగాణతో పేగుబంధం తెగిపోతుందనే భావన
- సరైన కారణాలు చూపితే 'టీఆర్ఎస్'కు మార్గం సుగమం



సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పేరు తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్)గా మార్చాల్సిందేనంటూ పార్టీ నేతలు, కార్యకర్తల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీ పేరు మార్పునకు సంబంధించిన ప్రక్రియ కోసం త్వరలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలవాలని బీఆర్ఎస్ యోచిస్తోంది. పార్టీ పేరును తిరిగి 'టీఆర్ఎస్'గా మార్చేందుకు మిగతా 2వ పేజీలో ▶

వెదిరె శ్రీరామ్‌కు 'కమిషన్' పిలుపు

- శుక్రవారం లేదా సోమవారం రావాల్సిందిగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సూచన

16 లో

ఫిరాయింపు ఎమ్మెల్యేలను ఏ రాయితో కొట్టాలి?

- గతంలో రేవంత్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేసిన కేటీఆర్
- రాష్ట్రంలో ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ ఇతర రాష్ట్రాల్లో అనర్హత వేటు వేయాలంటున్నారు
- రాజ్యాంగ రక్షకుడినన్న రాహుల్ ఈ విషయంపై స్పందించాలి
- రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, ఈసీ, సుప్రీంల గడప తొక్కుతాం
- ఢిల్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వ్యాఖ్యలు



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపుల అంశాన్ని వదిలిపెట్టేది లేదని దీనిపై ప్రతిస్థాయిలో పోరాడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు చెప్పారు. రాజ్యాంగ రక్షకుడిని అని చెప్తున్న లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మిగతా 3వ పేజీలో ▶

ఆంబోతు రంకెలు ఆగేంతవరకు వలసలు

- బీఆర్ఎస్ అధినేతపై మంత్రి పొంగులేటి విమర్శలు
- కానీ మేము 100 మంది ఎమ్మెల్యేలు కావాలని కోరుకోవట్లేదు
- రైతు రుణమాఫీపై 2, 3 రోజుల్లో విధివిధానాలు
- ధరణి విషయంలో ఆచితూచి వెళుతున్నాం
- జీవో 59, ఎల్ఆర్ఎస్‌లను క్లియర్ చేసేపని ప్రారంభిస్తాం



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో 100 మంది ఎమ్మెల్యేలు కావాలని కాంగ్రెస్ పార్టీ కోరుకోవడం లేదని, కానీ ప్రభుత్వాన్ని కూల్చేస్తామంటూ అచ్చోసిన ఆంబోతు రంకెలు ఆగేంతవరకు వలసలు కొనసాగుతూనే ఉంటాయని, ఆ రంకెలు ఆగిపోగానే వలసలు మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



... అలవాటు ప్రకారం అలానే ఆహ్వానిస్తున్నార్సార్!

అమెరికాలో నలుగురు తెలుగోళ్ల అరెస్టు!

మానవ అక్రమ రవాణా కేసులో అరెస్టు చేసిన టెక్సాస్ పోలీసులు..

- నకిలీ కంపెనీలు సృష్టించి 15 మంది మహిళలను అక్రమంగా నిర్బంధించినందుకేనని ప్రకటన
- విచారించారు కానీ అరెస్టు చేయలేదు: నిందితులు


చందన్ దాసిరెడ్డి, ద్వారకా గుండా, సంతోష్ కట్కూరి, అనిల్ మాలే

సాక్షి, హైదరాబాద్: టెక్సాస్‌లో మానవ అక్రమ రవాణా రాకెట్‌ను నడుపుతున్న నలుగురు భారతీయులను అక్కడి పోలీసులు అరెస్టు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీరంతా.. నల్లగొండ జిల్లా కనగల్ మండలానికి చెందిన వారిగా తేలింది. అరెస్టయిన నిందితులు నకిలీ కంపెనీలను సృష్టించి, కొంతమందితో బలవంతంగా పనిచేయిస్తున్నట్టు ప్రిన్స్‌టన్ పోలీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు గుర్తించారు. స్థానిక మీడియాలో వచ్చిన వార్తల మేరకు పలు వివరాలను పీటీఐ వార్తా సంస్థ మంగళవారం వెల్లడించింది. యూఎస్‌లోని టెక్సాస్‌లో ఒక ఇంటి నుంచి మానవ అక్రమ రవాణాను ఓ పథకం ప్రకారం నడుపుతున్నారనే ఆరోపణలతో ఒక మహిళతో సహా నలుగురు భారతీయ అమెరికన్లపై అభియోగాలు నమోదయ్యాయి. పోలీసుల తనిఖీలో 15 మంది మహిళలను బాధితులుగా గుర్తించారు. ఈ అక్రమ నిర్బంధాలకు పాల్పడ్డ చందన్ దాసిరెడ్డి, ద్వారకా గుండా, సంతోష్ కట్కూరి , అనిల్ మాలేను గత మార్చిలో అరెస్టు చేశారు. తాజాగా వారిపై స్థానిక పోలీసులు వ్యక్తుల అక్రమ రవాణా,

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఫిరాయింపులపై కేటీఆర్‌కు మాట్లాడే అర్హత లేదు

టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్



సాక్షి, హైదరాబాద్: రెండోసారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీకి 88 మంది ఎమ్మెల్యేలు, దాని మిత్రపక్షం ఎంఐఎంకు ఏడుగురు ఎమ్మెల్యేలు ఉండగా..కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను ఎందుకు చేర్చుకున్నారని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధు యాష్కీగౌడ్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు ఫిరాయింపులు గుర్తు రాలేదా కేటీఆర్ అని ప్రశ్నించారు. ఫిరాయింపులను ప్రోత్సహించి, రాజకీయ వ్యవస్థని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్ నాయకులు..ఇప్పుడు నీతులు మాట్లాడటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన పది రోజుల నుంచే కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదని, కూలిపోతుందని ఒక వైపు బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్..మరో వైపు బీజేపీ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తమ మాటలతో బీరాలు పలికి రెచ్చగొట్టిన సంగతి మర్చిపోయారా? అని దుయ్యబట్టారు.

నిరుద్యోగులను రెచ్చగొడుతున్న బీఆర్ఎస్

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



సాక్షి, హైదరాబాద్: తమ ఉద్యోగాలు ఊడిపోవడంతో.. నిరుద్యోగులను కూడా రోడ్లపాలు చేసేందుకు కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆరోపించారు ఆయన గాంధీభవన్‌లో పార్టీ అధికార ప్రతినిధులు భవాని రెడ్డి, లింగం యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్న పదేళ్లలో ఏ ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగుల ఉసురు తీసుకున్న బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు డీఎస్సీ, గ్రూప్–1,2 పరీక్షల విషయంలో అబద్ధాలు ప్రచారం చేస్తూ ఆగం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అందరి సమస్యలు వింటూ , పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. జీవో 46, జీవో 317 సమస్యల పై కేబినెట్ సబ్ కమిటీ వేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. గతంలో 5,089 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి, ఎన్నికల కారణంగా నిలిపివేస్తే, రేవంత్ ప్రభుత్వం 11,062 పోస్టులకు మెగా డీఎస్సీ నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. ఉద్యోగాలు ఇవ్వాలో, పరీక్షలు వాయిదా వేయాలో కేటీఆర్ చెప్పాలని వెంకట్ కోరారు.

తెలంగాణపై చంద్రబాబు రాజకీయాలు మానుకోవాలి


టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్



సాక్షి, హైదరాబాద్: రెండు రాష్ట్రాల్లోని తెలుగు ప్రజలు పరస్పర సహకారంతో అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు తెలంగాణ రాజకీయాలపై ఆసక్తిని మానుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు నిరంజన్ హితువు పలికారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలో టీడీపీని రద్దుచేసి ఆంధ్రప్రాంతానికి పరిమితం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ లో చంద్రబాబుకు స్వాగతాలు, సన్మానాలను తెలంగాణ ప్రజలు హర్షించరన్నారు. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తెస్తామని, పటిష్టం చేస్తామనడం దింపుడు కళ్లెం ఆశ మాత్రమేనని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను తాను అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకుంటే, తెలంగాణకు చేసిన నష్టాన్ని కూడా బయటపెట్టాల్సి వస్తుందన్నారు. 2009 డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రకటన రాగానే మొదట్లో స్వాగతించిన చంద్రబాబు ఆ మరుక్షణం నుంచే తెలంగాణ ఏర్పాటును అడ్డుకున్న తీరు తెలంగాణ ప్రజలు అంత తేలికగా మరిచిపోరని తెలిపారు. ఆంధ్ర ప్రాంతానికి రెండోసారి ముఖ్యమంత్రి అయినందుకు తెలంగాణ ప్రజలు చంద్రబాబుకు శుభాకాంక్షలు చెబుతారు తప్ప తెలంగాణ రాజకీయాలలో వేలు పెడితే ఎన్నటికీ క్షమించరని చెప్పారు.

యూత్ కాంగ్రెస్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల

ముగిసిన శివసేనారెడ్డి పదవీకాలం



సాక్షి, హైదరాబాద్: యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా శివసేనారెడ్డి రాజీనామా చేశారు. ఆయన పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు యువజన కాంగ్రెస్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ... యువజన కాంగ్రెస్ అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ఎన్నికలకు సంబంధించి ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 5వరకు సభ్యత్వ నమోదు సాగుతుందని చెప్పారు. కష్ట పడి పనిచేసిన వారికి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వాలని జాతీయ నాయకత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు.

పరీక్షల వాయిదాకు గూడుపుఠాణి

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

- గ్రూప్స్, డీఎస్సీ పరీక్షల వాయిదాకు కోచింగ్ సెంటర్ల మాఫియా కుట్ర
- నిరుద్యోగులకు నష్టం జరుగుతోందనుకుంటే హరీశ్, కేటీఆర్ ఆమరణ దీక్ష చేయాలి
- పార్టీ ఎప్పుడు బలహీనపడితే అప్పుడు కేసీఆర్ విద్యార్థులను ముందుకు తీసుకొస్తారు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉద్యోగాలు ఇవ్వాలని తమ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంటే.. గ్రూప్స్, డీఎస్సీ పరీక్షల వాయిదాకు దొంగలు గూడు పుఠాణి చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. కోచింగ్ సెంటర్ల మాఫియా పరీక్షలు వాయిదా వేయించాలని చూస్తోందని, వారి ధనదాహంతో నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రగతిపై ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆయన మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం భూత్పూర్ రోడ్డులోని ఏఎస్ఎం కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

పుట్టగతులుండవనే కుట్రలు


'పార్టీ ఎప్పుడు బలహీనపడితే అప్పుడు కేసీఆర్ విద్యార్థులను ముందుకు తీసుకొస్తారు. విద్యార్థుల శవాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. హరీశ్, కేటీఆర్‌కు సవాల్ విసురుతున్నా.. పరీక్షల వాయిదా కోసం మీరు ఆమరణ దీక్షకు కూర్చోండి. మా ప్రభుత్వంలో నిరుద్యోగులకు నష్టం జరుగుతుందని నిజంగా మీరు అనుకుంటే బిల్లా, రంగాలు పరీక్షలు వాయిదా వేసేవరకు ఆర్ట్స్ కాలేజీ ముందు ఆమరణ నిరాహార దీక్షకు దిగాలి. పేదోళ్ల పిల్లల్ని రెచ్చగొట్టుడు కాదు.. మీ వాదన నిజమైతే వారి పక్షాన మీరు దీక్షకు దిగాలి. పరీక్షలు వాయిదా వేస్తే ప్రభుత్వానికి నష్టం లేదు. నిరుద్యోగులు నష్టపోకూడదనేదే ప్రభుత్వ ఆలోచన. కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు పుట్టగతులు ఉండవనే వారు కుట్రలు చేస్తున్నారు..'అని సీఎం ఆరోపించారు.

బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చాలని చూశాయి

'కేసీఆర్, కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారు.. మేం మీలా దొంగ దెబ్బ తీయడం లేదు. మీలా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయలేదు. కేసీఆర్.. ముందుంది మొసళ్ల పండగ. మా ఎమ్మెల్యేలను నువ్వు గుంజుకున్నప్పుడు నీకు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా? బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూశాయి. కాంగ్రెస్ పార్టీతో పెట్టుకుంటే నీకు పుట్టగతులు ఉండవని ఆనాడే చెప్పా. కేసీఆర్ ఇక నీకు రాజకీయ మనుగడ లేదు. చేతనైతే అభివృద్ధికి సహకరించు.. లేకపోతే ఫామ్‌హౌస్‌లోనే పడుకో. నాలుగు రోజులుగా హరీశ్, కేటీఆర్ ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారు. తనదాకా వస్తే గానీ వాళ్లకు నొప్పి తెలియలేదు..'అని రేవంత్ విమర్శించారు.

ఆగస్టు 15లోపు రుణమాఫీ

'నేను కార్యకర్తల్లో ఒక కార్యకర్తను. అందుకే ముఖ్య నాయకులను కలవాలని ఇక్కడికి వచ్చా. మిమ్మల్ని కలిస్తే నాకు వెయ్యి ఏనుగుల బలం వస్తుంది. కార్యకర్తల కష్టంతోనే టీపీసీసీ అధ్యక్షుడి నుంచి ఈ రోజు ముఖ్యమంత్రి వరకు ఎదిగా. ఈ ప్రభుత్వం మీది.. మీ సూచనలు, సలహాలను ప్రభుత్వం పాటిస్తుంది. నాయకుల ఎన్నికలు ముగిశాయి.. ఇక స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. ఇప్పటివరకు మీరు నాయకుల కోసం కష్టపడ్డారు.. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు కష్టపడి మిమ్మల్ని గెలిపిస్తారు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తాం. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్తాం..'అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



మహిళా సంఘాల ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రాజెక్టుల్ని పరిగెత్తించండి

▶ మొదటి పేజీ తరువాయి

ఎంత సమయం పడుతుంది? ఎంత మొత్తం నిధులు కావాలో అధికారులు నివేదిక సమర్పించాలి. ఇరిగేషన్ శాఖ మంత్రితో చర్చించి తుది ప్రతిపాదనలు తయారు చేయాలి. ఆర్డీఎస్‌కు సంబంధించి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో చర్చించాల్సిన విషయాలు, పరిష్కరించాల్సిన అంశాలను రూపొందించాలి. తుమ్మిళ్ల లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తికి ప్రతిపాదనలు తయారు చేయాలి. ఆర్డీఎస్‌పై కొత్త ప్రతిపాదన లేమిటో తగిన ఆలోచన చేసి సమర్పించాలి..'అని రేవంత్ చెప్పారు.

మహబూబ్‌నగర్ నుంచే పైలట్ ప్రాజెక్టు

'జిల్లా కేంద్రంలో ఆస్పత్రులు, కళాశాలలు ఒకే చోట ఉండరాదు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు ప్రోత్సాహకాలు ఇచ్చే విషయం ఆలోచించాలి. మహబూబ్‌నగర్ వంటి అత్యంత వెనుకబడిన జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖలోని సమస్యలను అధిగమించేందుకు అధ్యయనం చేయాలి. సమస్యల పరిష్కారాన్ని మహబూబ్‌నగర్ నుంచే పైలట్ ప్రాజెక్టు చేపట్టాలి.

పాఠశాలలు తనిఖీ చేయాలి

అన్ని గ్రామ పంచాయతీల్లో తప్పనిసరిగా ప్రభుత్వ బడి, ప్రతి మండలంలో జూనియర్ కళాశాల, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఉండాలి. ఒకవేళ లేకుంటే ఏర్పాటు చేసేందుకు అవకాశాలు పరిశీలించాలి. ప్రతి పార్లమెంట్ యూనిట్ ఆధారంగా నైపుణ్యాల అభివృద్ధి కేంద్రాలు, మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలల వివరాలు సమర్పించాలి. డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ ప్రతిరోజూ పాఠశాలలను తనిఖీ చేసి జిల్లా కలెక్టర్లకు నివేదించాలి. కలెక్టర్లు వారంలో ఒకరోజు పాఠశాలలు, ఆస్పత్రులను తప్పకుండా తనిఖీ చేయాలి. ఎవరైతే విధుల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటారో వారిపై చర్యలు తీసుకోవాలి..'అని రేవంత్ చెప్పారు.

ఆకస్మిక తనిఖీలు.. అవసరమైతే చర్యలు

'ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి రోజున జీతాలు ఇస్తున్నాం. విద్యా శాఖలో అందరికీ ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాం. ఉద్యోగులు, టీచర్లు వారి బాధ్యతను వారు నెరవేర్చాలి. ఇకపై నేను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తా. అవసరమైతే పై అధికారుల పైనా చర్యలు తీసుకుంటాం. సెక్రటేరియట్ నుంచి గ్రామపంచాయతీ వరకు హాజరు విషయంలో ఫేస్ రికగ్నిషన్ యాప్ పెడతాం. సెక్రటేరియట్‌లో కూడా హాజరు పరిశీలిస్తాం..'అని సీఎం తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. అన్ని ప్రాజెక్టుల కింద ప్రస్తుతం ఉన్న పద్ధతి ప్రకారం పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రిజర్వాయర్ల సామర్థ్యం పెంపుపై ప్రతిపాదనలతో వస్తే ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ కూడా మాట్లాడారు. సమావేశానికి ముందు సీఎం రేవంత్ రూ.396.06 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మహిళా సంఘాలకు రూ.334.02 కోట్ల రుణాలకు సంబంధించిన చెక్కు అందజేశారు. సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, డీకే అరుణతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలెక్టర్ విజయేందిర బోయి తదితరులు పాల్గొన్నారు.

యూఎన్ ఇంపాక్ట్ సమ్మిట్‌కు తెలంగాణ నుంచి ఐదుగురు

సాక్షి, హైదరాబాద్: యువతకు అవసరమైన హరిత నైపుణ్యాలను సమకూర్చే ప్రయాణంలో 1 మిలియన్ ఫర్ 1 బిలియన్ గ్రీన్ స్కిల్స్ అకాడమీ ఒక మైల్‌స్టోన్‌గా నిలుస్తుందని ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. న్యూయార్క్‌లోని యుఎన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలతో సుస్థిరమైన అభివృద్ధిని పెంపొందించడానికి 1 మిలియన్ ఫర్ 1 బిలియన్ చేస్తున్న కృషిని కొనియాడారు. హైదరాబాద్‌లో జరిగిన గ్రీన్ స్కిల్స్ అకాడమీ లెవరేజింగ్ ఏఐ గ్రాండ్ ఫినాలేలో ఐదుగురు యువ ఆవిష్కర్తల విజేతలను ప్రకటించారు. వీరు డిసెంబర్‌లో ఐక్యరాజ్య సమితి (యూఎన్) ప్రధాన కార్యాలయంలో జరగబోయే 1మి ఫర్ 1బి 8వ వార్షికోత్సవ యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొననున్నారు. అందులో మీత్ కుమార్ షా (విజ్ఞాన భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్), నారాయణం భవ్య (మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్స్ హైదరాబాద్) నిర్మల్‌కు చెందిన దీక్షా డిగ్రీ కళాశాల విద్యార్థి మనల్ మునీర్, హైదరాబాద్ మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల నుంచి పెమ్మసాని లిఖిత చౌదరి, సత్యవతి కోలపల్లి ఉన్నారు.

నకిలీ విత్తన విక్రయదారులపై ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: నకిలీ విత్తన విక్రయదారుల నుంచి రైతులను ఆదుకునేందుకు ఏం చర్యలు చేపట్టారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రైతుల స్థితిగతులను పట్టించుకోని వాణిజ్య విత్తన కంపెనీలపై కఠినంగా వ్యవహరించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ' కొన్ని కంపెనీలు రైతులకు విత్తనాలను అంటగడుతున్నాయి. రైతులు నష్టపోతే చట్టప్రకారం విత్తన కంపెనీలు పరిహారం చెల్లించాలి.' అని కోరుతూ 2016లో రేవంత్‌రెడ్డి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. అడిషనల్ అడ్వొకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ హాజరై 4 వారాలు సమయం కావాలని కోరడంతో ధర్మాసనం విచారణ వాయిదా వేసింది.

...ఆగేంతవరకు వలసలు

▶ మొదటి పేజీ తరువాయి

ముగించేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'తాతకు పెట్టిన బొచ్చె తలాపునే ఉంటుందనే విషయాన్ని ఎవరూ మరిచిపోవద్దు. 2018 ఎన్నికల్లో కేసీఆర్‌కు 88 సీట్లు ఇస్తే తృప్తి పడలేదు. కాంగ్రెస్ నుంచి 19 మంది గెలిస్తే ఐదుగురిని ఉంచాడు. అప్పుడు అక్కడ ఉండి అదంతా చూసిన ఎమ్మెల్యేలే ఇప్పుడు మా పార్టీలోకి వస్తున్నారు. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎప్పుడూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూలుస్తామని అనలేదు. కానీ మేం గెలిచి ప్రమాణ స్వీకారం చేయకముందు నుంచే ప్రభుత్వాన్ని కూల్చేస్తామంటూ కేసీఆర్ ప్రారంభించాడు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని ఈయన ముందుండి నడిపించాలని చూశాడు. గెలిచిన 39 మంది ఎమ్మెల్యేలను చుట్టూ కూర్చోబెట్టుకుని కేబినెట్‌లో నువ్వు మంత్రి, నువ్వు మంత్రి అని చెప్పాడు. అలా మంత్రుల లిస్టు రాసుకున్న వారిని ఏమనాలి?' అని పొంగులేటి ప్రశ్నించారు. అసలు ప్రభుత్వాన్ని కూల్చడం అన్న పదమే అప్రజాస్వామికమన్నారు. మంగళవారం సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

- రైతు రుణమాఫీ చేసి తీరుతాం. రెండుమూడు రోజుల్లోనే మార్గదర్శకాలు విడుదల చేస్తాం. ఇప్పటికే రూ.9వేల కోట్లు వ్యవసాయశాఖకు బదిలీ చేశాం. మిగిలిన నిధులు కూడా సమీకరించి రుణమాఫీ చేసి తీరుతాం.
- రైతు భరోసాపై ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే వెళతాం.కౌలు రైతులను కాపాడుకోవాలన్న ఆలోచన కూడా ప్రభుత్వానికి ఉంది.
- సామాన్యుడికి అందుబాటులో ఉండే విధంగా ధరణి పోర్టల్‌ను సంస్కరిస్తాం ఒకే మాడ్యూల్‌లో దరఖాస్తు చేసుకుంటే అది ఎలా పరిష్కరించాలో అధికారులు నిర్ణయించాలి. వీలున్నంత త్వరలోనే ధరణి పెండింగ్ దరఖాస్తులను జీరో చేస్తాం. అలాగని అడ్డగోలుగా ధరణి దరఖాస్తులను తిరస్కరిస్తే చర్యలు తీసుకుంటాం.
- ఈ ఏడునెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చాలా చేసింది. అయినా అన్ని విషయాలను ప్రజల ముందు పెట్టలేకపోయాం. మేం అధికారంలోకి వచ్చాకే హైదరాబాద్‌లో కమర్షియల్ లీజ్ బాగా పెరిగింది. ఎలాంటి సమస్యా రాకుండా టీచర్ల బదిలీలు, పదోన్నతులు పూర్తి చేశాం. గత ప్రభుత్వం చేసిన రూ. 6.82లక్షల కోట్ల అప్పుకుగాను షెడ్యూల్‌కు మించి అప్పులు కడుతున్నాం. ఇలాంటివన్నీ చెప్పుకోవాలి.
- రాష్ట్రంలో చాలామంది అర్హులకు పింఛన్లు, రేషన్ కార్డులు రావాల్సి ఉంది. కొన్ని బోగస్ కార్డులు కూడా ఉన్నాయి. ఎక్కువ మంది ఆరోగ్యశ్రీ కోసం కార్డులు రాయించుకుంటున్నారు. అందుకే రేషన్‌కార్డుకు, ఆరోగ్యానికి లింకు తీసేయాలని, రేషన్‌కార్డును, హెల్త్‌కార్డును వేర్వేరుగా ఇవ్వాలని ఆలోచిస్తున్నాం.
- 2021–22 ఆర్థిక సంవత్సరంలో భూముల విలువలు రెండుసార్లు సవరించారు. అప్పుడు శాస్త్రీయంగా జరగలేదు. ఇప్పుడు మేం శాస్త్రీయంగా చేయాలనుకుంటున్నాం. ఇందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. భూముల విలువల సవరణ ఆగస్టు1 నుంచా ఆగస్టు 15 నుంచా అన్నది ఇప్పుడే చెప్పలేం.
- జీఓ 59 దరఖాస్తులు, ఎల్‌ఆర్ఎస్‌లను మేం కావాలని ఆపడం లేదు. పేదలను ఇబ్బంది పెట్టాలన్న ఆలోచన మాకు లేదు. కానీ ఆ రెండు అంశాల్లో జరిగిన అక్రమాలను వెలికి తీస్తున్నాం. అవి మళ్లీ జరగకుండా నిషేధిత జాబితాలో పెట్టేస్తాం. ధరణి అంశం పూర్తికాగానే జీఓ 59, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు క్లియర్ చేస్తాం. ఇప్పటికే జీఓ 59 కింద చిన్న చిన్న స్థలాలు రెగ్యులరైజ్ చేయాలని ఆదేశాలిచ్చాం.
- కేంద్రం ఈనెల 23న బడ్జెట్ పెడుతుంది. అందులో రాష్ట్ర కేటాయింపులు చూసుకొని ఆ తర్వాత 1,2 రోజుల్లో రాష్ట్ర బడ్జెట్ కూడా పెడతాం. జూలై 31లోపే రెగ్యులర్ బడ్జెట్‌కు ఆమోదం లభిస్తుంది.
- కేసీఆర్ అంటే నాకేం కోపం లేదు. ఆయన అంటే నాకు లవ్వు ఎక్కువ. ఆయన ఎప్పుడు అసెంబ్లీకి వస్తారా? తన అనుభవాన్ని రంగరించి పాలన గురించి ఎప్పుడు సూచనలిస్తారా అని ఎదురు చూస్తున్నా. కానీ ఆయన రావడం లేదు.
- తుదిదశలో నిర్మాణాలు ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేసి నిరుపేద లబ్ధిదారులను గుర్తించి కేటాయిస్తాం. అతి తక్కువ మొత్తం ఖర్చు చేస్తే గృహప్రవేశాలకు సిద్ధమయ్యే స్థాయిలో ఉన్న ఇళ్లను తొలుత ఎంపిక చేస్తాం.
- అమ్ముడు కాకుండా మిగిలిపోయిన రాజీవ్ స్వగృహ ఇళ్లకు కొత్తగా ధరలు నిర్ణయించి ప్రజలకు విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.
- ప్లాట్ బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్లు చేయించుకోలేని వారి డబ్బులు నాలుగేళ్లుగా ఇవ్వడం లేదు. ఇలా రూ.32 కోట్లు ప్రభుత్వం దగ్గరే ఉన్నాయి. వాటిని 2,3 రోజుల్లో విడుదల చేస్తాం. సీఎస్ఆర్ నిధులతో అత్యాధునిక హంగులతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మిస్తాం. ప్రతి గ్రామంలో సమగ్ర రెవెన్యూ వ్యవస్థ ఉండేలా చర్యలు తీసుకుంటాం. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇస్తాం. జేఎన్‌జే సొసైటీ అంశాన్ని 2,3 రోజుల్లోనే పరిష్కరిస్తాం. రాష్ట్ర, జిల్లా స్థాయిలో విలేకరులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఆలోచన.'అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

డ్రైపోర్టుకు మచిలీపట్నం పోర్టుతో అనుసంధానం

- దీనికోసం హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలి
- ఢిల్లీ ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారుల ముందు సీఎం రేవంత్ ప్రతిపాదన



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారుల బృందం

సాక్షి, హైదరాబాద్: సముద్ర తీరం లేని తెలంగాణలో ఏర్పాటు చేసే డ్రైపోర్టును మచిలీపట్నం పోర్టుతో అనుసంధానించేలా హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ వే నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్‌హెచ్ఏఐ(జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ) ఉన్నతాధికారులను కోరారు. తెలంగాణలో నిర్మిస్తున్న జాతీయ రహదారులకు అడ్డంకిగా ఉన్న చిక్కుముడులను తొలగించే అంశాలపై చర్చించేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా వచ్చిన ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారుల బృందం మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసింది. బుధవారం ఆ బృందంతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, తనను మంగళవారం కలిసిన అధికారులతో కొన్ని ముఖ్యమైన అంశాలపై ఆయన చర్చించారు. తెలంగాణలో నిర్మిస్తున్న రోడ్లకు సంబంధించిన సమస్యలను తమ స్థాయిలో పరిష్కరించదగ్గవాటిని పరిష్కరిస్తామని, భూసేకరణ అంశాలను కొలిక్కి తెస్తామని వారికి సీఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా డ్రైపోర్టుకు బందరు పోర్టుతో కనెక్టివిటీ ప్రతిపాదనపై చర్చించారు. అలాగే హైదరాబాద్–విజయవాడ మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే మంజూరు కోసం ఏపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రస్తావించారు. రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును భారత్‌మాల పరియోజనలో భాగంగా చేపట్టాలని ఇటీవల తాను ప్రధానికి సూచించిన విషయాన్ని వారి ముందు ప్రస్తావించారు. ఓఆర్ఆర్–ఆర్ఆర్ఆర్ మధ్య 12 రేడియల్ రోడ్లు వస్తాయని, వాటి మధ్య పలు క్లస్టర్లు, శాటిలైట్ టౌన్‌షిప్స్ నిర్మిస్తామని వెల్లడించారు. వెంటనే రీజినల్ రింగ్ రోడ్డు పనులను, మన్నెగూడ జాతీయ రహదారి విస్తరణ పనులను ప్రారంభించాలని కోరారు. హైదరాబాద్–కల్వకుర్తి పనులను పూర్తిచేస్తే తిరుపతికి 70 కి.మీ. దూరం తగ్గుతుందని పేర్కొన్నారు. మంచిర్యాల–వరంగల్– ఖమ్మం–విజయవాడ రోడ్డుకు సంబంధించిన భూమి అప్పగింత, ఆర్మూరు–జగిత్యాల–మంచిర్యాల భూసేకరణకు ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం ఏర్పాటు, వరంగల్–కరీంనగర్ రహదారి నిర్మాణానికి చెరువు మట్టి, ఫ్లైయాష్ సేకరణ, కాళ్లకల్–గుండ్లపోచంపల్లి రహదారి ఆరు వరసల విస్తరణకు భూ సేకరణ, జాతీయ రహదారుల నిర్మాణంలో విద్యుత్ సంస్థలతో తలెత్తుతున్న సమస్యల పరిష్కారం, ఖమ్మం–దేవరపల్లి, ఖమ్మం–కోదాడ రహదారుల నిర్మాణంలో పోలీసు భద్రత ఏర్పాటు.. తదితర అంశాలను ఎన్‌హెచ్ఏఐ అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ఆయా అంశాలపై బుధవారం సమగ్రంగా సమీక్షించనున్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, అటవీ శాఖ అధికారులు కూడా ఈ భేటీలో పాల్గొననున్నారు. పలు సమస్యలకు ఈ సమావేశంలో పరిష్కారం దొరికే అవకాశం ఉంది.

అమెరికాలో నలుగురు తెలుగోళ్ల అరెస్టు

▶ మొదటి పేజీ తరువాయి

సెకండ్ డిగ్రీ నేరం వంటి అభియోగాలు మోపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో మరిన్ని అరెస్టులు చేసే అవకాశం ఉన్నట్టు స్థానిక మీడియా పేర్కొంటోంది.

15మందిని ఒకే గదిలో నిర్బంధించి..

సంతోష్ కట్కూరి, అతడి భార్య ద్వారకా గుండాకు చెందిన పలు షెల్ కంపెనీలలో పనిచేయాలని బాధితులను బలవంతం చేశారని దర్యాప్తులో వెల్లడైంది. మొత్తం 15 మందిని వీరు ఒకే గదిలో నిర్బంధించి పని చేయిస్తున్నట్టు గుర్తించారు. ప్రిన్స్‌టన్‌లోని కొలిన్ కౌంటీ సమీపాన గిన్స్‌బర్గ్ లేన్‌లోని సంతోష్ ఇంటిలో ఈ యువతులందరూ బలవంతంగా నేలపై పడుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ ఇంట్లో పలు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్‌లు, ప్రింటర్లు, మోసపూరిత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఆ ఇంటిలోని ఒక గదిలో ఏవిధమైన ఫర్నిచర్ లేకుండా కేవలం కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, దుప్పట్లు, పెద్ద సంఖ్యలో సూట్‌కేస్‌లను గమనించి ఓ పెస్ట్ కంపెనీకి చెందిన ఓ ఉద్యోగి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంతోష్ కట్కూరి ఇంటిలో సోదాలు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్టు ఓ వార్తా సంస్థ వెల్లడించింది.

ఇంకా బాధితులుండే అవకాశం?

మరో వార్తా పోర్టల్ ప్రకారం.. ప్రిన్స్‌టన్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోని సీఐడీ డిటెక్టివ్‌లు.. సంతోష్ కట్కూరి ఇంటిలో సోదాలు చేయగా, 15 మంది యువతులను గుర్తించినట్టు తెలిపింది. వీరంతా సంతోష్ కట్కూరి, అతని భార్య ద్వారకా గుండా యాజమాన్యంలోని షెల్ కంపెనీల్లో బలవంతంగా పని చేస్తున్నట్టు పేర్కొంది. బాధితుల సంఖ్య వందకు పైగానే ఉంటుందని, వీరిలో సగానికి పైగా భారతీయులే ఉంటారని తెలిపింది. సంతోష్, ద్వారకా గుండాలకు చందన్ దాసిరెడ్డి, అనిల్‌మాలె సైతం సహకరించడంతో వారిని కూడా అరెస్టు చేశారు. స్థానిక పోలీసుల దర్యాప్తులో ప్రిన్స్‌టన్, మెలిసా, మెకెన్నీ ప్రాంతాల్లోనూ బాధితులను గుర్తించారు.

విచారించారు.. అరెస్టు చేయలేదు

మానవ అక్రమ రవాణా కేసులో అరెస్టు వార్తలను ఖండించిన ఆ నలుగురు

కనగల్: అమెరికాలోని టెక్సాస్‌లో మానవ అక్రమ రవాణా అభియోగంపై అరెస్టు చేసినట్టు అక్కడి పోలీసులు ప్రకటించిన నలుగురిదీ నల్లగొండ జిల్లా కనగల్ మండలమే. కనగల్ మండల పరిధిలోని చినమాదరం గ్రామపంచాయతీ పరిధిలోని తంగెళ్లవారిగూడెం గ్రామానికి చెందిన భార్యాభర్తలు గుండా ద్వారక కట్కూరి సంతోష్‌రెడ్డితో పాటు ఇదే గ్రామానికి చెందిన మాలే అనిల్ రెడ్డి, శాబ్దుల్లాపురం గ్రామానికి చెందిన దాసిరెడ్డి చందన్‌ను అరెస్టు చేసినట్లుగా అమెరికా పోలీసులు ప్రకటించారు. కట్కూరి సంతోష్ ఆయన భార్య ద్వారక ఆరేళ్ల క్రితమే అమెరికా వెళ్లగా ఈ ఏడాది నుంచే కంపెనీ పెట్టారు. చందన్‌రెడ్డి వీరి వద్ద రెండు నెలల నుంచి పనిచేస్తున్నాడు. ఇక మాలే అనిల్ 8 సంవత్సరాల క్రితమే అక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అతను కూడా ఏడాది క్రితమే కంపెనీ పెట్టి నిర్వహిస్తున్నాడు.ఈ నలుగురూ ద్వారక పేరు మీద కంపెనీ పెట్టారు.

ఎవరినీ మోసం చేయలేదు

తమను అరెస్ట్ చేసినట్లు మీడియాతో పాటు సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు అవాస్తమని కట్కూరి సంతోష్, గుండా ద్వారక, చందన్‌రెడ్డి, మాలే అనిల్‌రెడ్డి తెలిపారు. ఇది నాలుగు నెలల క్రితం జరిగిన సంఘటన అని చెప్పుకొచ్చారు. తాము అన్ని ఆధారాలు సమర్పించామని, చట్టప్రకారంగానే తమ కంపెనీలు నడుస్తున్నట్లు వారు తెలిపారు. మహిళల అక్రమ రవాణా, ఉద్యోగాల పేరుతో ఎవరినీ మోసం చేయలేదని, షెల్ కంపెనీలు నిర్వహిస్తూ శ్రమదోపిడీకి గురిచేసినట్లు తమనే పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు తెలిపారు. తాము ఇప్పటికే న్యాయస్థానాన్ని ఇప్పటికే ఆశ్రయించినట్లు వారు తెలిపారు. నాలుగు నెలల క్రితం అమెరికా పోలీసులు స్టేషన్‌లో విచారించిన విషయం వాస్తవమే అయినప్పటికీ అరెస్ట్ చేసినట్లు వస్తున్న కథనాలు మాత్రం పూర్తిగా అవాస్తవమన్నారు.

మళ్లీ 'టీఆర్ఎస్'!

▶ మొదటి పేజీ తరువాయి

అనురించాల్సిన ప్రక్రియపై ఇప్పటికే పార్టీపరంగా అధ్యయనం జరుగుతోంది. పార్టీ పేరు మార్పునకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను పరిశీలిస్తోంది. బీఆర్ఎస్ పేరును తిరిగి టీఆర్ఎస్‌గా మార్చడం సాంకేతికంగా సాధ్యమేనని ఎన్నికల సంఘం నిబంధనలు వెల్లడిస్తున్నట్టు పార్టీవర్గాలు తెలిపాయి. టీఆర్ఎస్‌గా పేరును మార్చేందుకు కేంద్ర ఎన్నికల సంఘం బీఆర్ఎస్ నుంచి పలు వివరణలు కోరే అవకాశమున్నందున, అవసరమైన సమాచారాన్ని కూడా సిద్ధం చేసుకోవడంపై దృష్టి సారించింది.

'టీఆర్ఎస్'పై ఆరేళ్లు ఫ్రీజ్

'తెలంగాణ రాష్ట్ర సమితి'పేరు ఇతరులకు కేటాయించకుండా ఎన్నికల సంఘం ఆరేళ్ల పాటు ఫ్రీజ్ చేసింది. పేరు మార్పుకు బీఆర్ఎస్ నుంచి అందిన దరఖాస్తును ఆమోదిస్తే ఓటర్లలో ఏదైనా గందరగోళం ఏర్పడుతుందా అనే విషయాన్ని ఎన్నికల సంఘం ప్రధానంగా పరిశీలిస్తుందని పార్టీవర్గాలు చెబుతున్నాయి. తిరిగి టీఆర్ఎస్‌గా పేరు మార్పునకు ఎన్నికల సంఘం అంగీకరిస్తే పార్టీ ఎన్నికల చిహ్నం 'కారు గుర్తు'తిరిగి దక్కుతుందా లేదా అంశాన్ని కూడా బీఆర్ఎస్ అధ్యయనం చేస్తోంది. పేరు మార్పుకు అవసరమైతే పార్టీ నియమావళిని సవరించాల్సి ఉంటుంది. ఈ మేరకు పార్టీ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి నియమావళిలో సవరణలను ఆమోదించాల్సి ఉంటుంది. బీఆర్ఎస్ పేరును తిరిగి టీఆర్ఎస్‌గా మార్చడంపై పార్టీ చేసే విన్నపాన్ని ఆమోదించే విచక్షణాధికారం కేంద్ర ఎన్నికల సంఘానికే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈసీ నియమావళిని లోతుగా అధ్యయనం చేసి పార్టీ పేరు మార్పుపై సాధ్యాసాధ్యాలపై ఇప్పటికే ప్రాథమికంగా ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. త్వరలో జరిగే పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పార్టీ పేరు మార్పు అంశంపై తీర్మానం చేసే అవకాశముందని బీఆర్ఎస్ నేతలు వెల్లడించారు.

జాతీయ రాజకీయాల కోసం 'బీఆర్ఎస్'..

తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి రెండు దశాబ్దాల అనంతరం పార్టీ పేరును మార్చుకుంది. జాతీయ రాజకీయాల్లో పార్టీ కార్యకలాపాల విస్తరణకు 2022 అక్టోబర్ 5న భారత రాష్ట్ర సమితిగా పేరు మార్చారు. పార్టీ పేరు మార్పిడికి కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలపడంతో పార్లమెంటు, అసెంబ్లీలోనూ బీఆర్ఎస్ పేరు మార్పునకు ఆమోదముద్ర పడింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పేరిట పోటీ చేసి రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయింది. ఆ ఓటమిపై ఈ ఏడాది జనవరిలో లోక్‌సభ నియోజకవర్గాల వారీగా జరిగిన పోస్ట్‌మార్టమ్‌లో పార్టీ పేరు మార్చడం కూడా ఓటమికి కారణంగా పార్టీ శ్రేణులు నొక్కి చెప్పాయి. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అన్ని చోట్లా ఓటమి పాలవడంతో పార్టీ పేరును తెలంగాణ రాష్ట్ర సమితిగా మార్చాలని అధినేత కేసీఆర్‌పై ఒత్తిడి చేస్తున్నారు. ఎర్రవల్లి నివాసంలో జరిగిన భేటీల్లోనూ పార్టీ నేతలు ఇదే అంశాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. పార్టీ పేరు మార్పుతో 'తెలంగాణతో పేగు బంధం తెగిపోయిందనే భావన'ప్రజల్లో నెలకొందని కొందరు అధినేతకు వివరించారు. ఈ నేపథ్యంలో పార్టీ పేరును తిరిగి టీఆర్ఎస్‌గా మార్చడానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై అధ్యయనం జరుగుతోంది.

కాంగ్రెస్‌పై అప్పుడే వ్యతిరేకత

- ప్రజల్లో సంక్షేమం, అభివృద్ధిలో గత ప్రభుత్వమే మేలన్న భావన మొదలైంది
- ఢిల్లీలో మీడియాతో హరీశ్‌రావు చిట్‌చాట్
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాలని చూశారన్న సీఎం ఆరోపణలు పచ్చి అబద్ధం
- ఈ ప్రభుత్వం ఐదేళ్లుంటేనే ఏ పార్టీ గొప్పో, తెలంగాణకు ఎవరు అవసరమో తేలుతుంది
- ఫిరాయింపులపై కాంగ్రెస్‌ను, రాహుల్‌ను ఎండగడతాం



మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో హరీశ్‌రావు, సురేష్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు అన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో గత ప్రభుత్వమే మేలన్న భావన నెలకొంటోందని చెప్పారు. ఫిరాయింపులపై కాంగ్రెస్ పార్టీని ఎండగడతామని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని కూల్చాలని బీఆర్‌ఎస్ పార్టీ ప్రయత్నించిందన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణల్లో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. ఈ ప్రభుత్వం ఐదేళ్లుంటేనే ఏ పార్టీ గొప్పో, తెలంగాణకు ఎవరి అవసరం ఉందో తేలిపోతుందని వ్యాఖ్యానించారు. పలు అంశాలకు సంబంధించి సీనియర్ న్యాయవాదులతో మాట్లాడేందుకు ఢిల్లీకి వచ్చిన ఆయన మంగళవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్లు ఉండాలని కేసీఆర్ అన్నారు

'కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాలని చూశారన్న సీఎం రేవంత్ ఆరోపణలు పచ్చి అబద్ధం. ఆ పార్టీకి పూర్తి మెజార్టీ వచ్చాక, ఎంఐఎం సైతం వారితో కలిశాక ప్రభుత్వం కూల్చడం అనే మాట ఉత్పన్నం కాదు. ఆందోల్‌లో నిర్వహించిన సభలో, లక్షలాది ప్రజల సమక్షంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా ఈ ప్రభుత్వం ఐదేళ్లు ఉండాలని కోరుకుంటున్నట్లు ప్రకటించారు. అప్పుడే ప్రజలకు నీళ్లేవో, పాలేవో అర్థమవుతుందని అన్నారు. కేసీఆర్‌ది అయినా, నాదైనా, పార్టీదైనా ఇదే మాట. కొన్ని పత్రికలు మాత్రమే ప్రభుత్వాన్ని పడగొడతామని కేసీఆర్ వ్యాఖ్యలు చేశారంటూ కల్పిత కథనాలు అల్లాయి..' అని హరీశ్‌రావు విమర్శించారు.

అప్పుడు గంపగుత్తగా చేరారు కాబట్టి విలీనం

'రాష్ట్రంలో ఎమ్మెల్యేలను బ్లాక్‌మెయిల్ చేసి, వివిధ ఆశలు చూపి కాంగ్రెస్‌లోకి లాక్కుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలోనే ఒక పార్టీలో గెలిచి మరో పార్టీకి మారే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడేలా 10వ షెడ్యూల్‌లో మార్పులు చేస్తామని హామీ ఇచ్చింది. రాహుల్‌గాంధీ స్వయంగా పార్టీ జాతీయ మేనిఫెస్టోని హైదరాబాద్‌లో ప్రకటించారు. ఇప్పుడు కూడా రాజ్యాంగాన్ని రక్షించాలంటూ రాజ్యాంగాన్ని పట్టుకుని ఊరూరా తిరుగుతున్నారు. మరి అలాంటి రాహుల్, అతని పార్టీ.. మా ఎమ్మెల్యేలను చేర్చుకోవడం ఏంటి?. కాంగ్రెస్, రాహుల్ ద్వంద్వ నీతిని ఎండగడతాం. కాంగ్రెస్, బీజేపీలకు సమదూరంగా ఉంటూనే కలిసొచ్చే పార్టీలతో రాష్ట్రంలో జరుగుతున్న ఫిరాయింపులపై కొట్లాడతాం. అవసరాన్ని బట్టి బీజేపీకి అంశాలవారీ మద్దతు ఉంటుంది. గతంలో కాంగ్రెస్ నుంచి గంపగుత్తగా 12 మంది ఎమ్మెల్యేలు చేరినందునే శాసనభా పక్ష విలీనం జరిగింది. ప్రస్తుతం ఒక్కో ఎమ్మెల్యేకు విడిగా కండువాలు కప్పుతున్నందున బీఆర్‌ఎస్ నుంచి మూడోవంతు ఎమ్మెల్యేలు వెళ్లినా కాంగ్రెస్‌లో విలీనం సాధ్యం కాదు. ఫిరాయింపులపై న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నాం. దీనిపై సీనియర్ న్యాయవాదులతో చర్చించాం..' అని మాజీ మంత్రి తెలిపారు.

కేసీఆరే సుప్రీం

'ఇటీవల ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ నా ట్రాప్‌లో ఉన్నారంటూ చేసిన వ్యాఖ్యలు అర్థరహితం. కుటుంబంలో చిచ్చుపెట్టేలా ఆయన వ్యాఖ్యలున్నాయి. పార్టీలో కేసీఆరే సుప్రీం. ఆయన మాటే చెల్లుబాటు అవుతుంది..' అని స్పష్టం చేశారు.

ప్రభుత్వానికి రెండేళ్ల టైమ్ ఇస్తున్నాం..

➤ 'తెలంగాణలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం కచ్చితంగా ఏర్పాటవుతుంది. రాష్ట్రంలో ఇప్పటికే గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య పోలిక మొదలైంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 7 నెలలు గడిచినా ఆ ప్రభుత్వానికి పరిపాలన చేతకావట్లేదు. రాష్ట్రంలో తీవ్ర విద్యుత్, తాగునీటి కొరత ఏర్పడినా పట్టించుకున్న నాథుడే లేడు. 2 నెలలుగా ఆసరా పింఛన్లు ఇవ్వడం లేదు. మధ్యాహ్న భోజన వర్కర్లకు జీతాలు లేవు. కనీసం గ్రామ పంచాయతీల్లో చెత్త కూడా ఎత్తడం లేదు. బీఆర్‌ఎస్ ఇంకా ఎక్కడా రోడ్డెక్కకున్నా, ఆందోళనలు చేయకున్నా ప్రజల్లో అప్పుడే వ్యతిరేకత ప్రారంభమయ్యింది. ప్రభుత్వానికి రెండేళ్ల సమయం ఇస్తున్నాం. ఆ తర్వాత ప్రజాందోళనలు నిర్వహిస్తాం. జాతీయ స్థాయి ఎన్నికలప్పుడే బీజేపీ ప్రభావం ఉంటుంది. పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ, నాన్ మోదీ ప్రాతిపదికన ఎన్నికలు జరిగాయి. రెండు పక్షాలకు దూరంగా ఉన్న బీఆర్‌ఎస్ సహా వైఎస్సార్‌సీపీ, బీఎస్పీ, బిజూ జనతాదళ్ వంటి పార్టీలు నష్టపోయాయి..'హరీశ్‌రావు వివరించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలను ఏ రాయితో కొట్టాలి?

▶ మొదటి పేజీ తరువాయి

మాటలకు, చేతలకు పొంతన లేదని దుయ్యబట్టారు. ఫిరాయింపులపై కాంగ్రెస్ అవలంభిస్తున్న ద్వంద్వ విధానాన్ని ఇటు పార్లమెంటులో అటు ప్రజాక్షేత్రంలో ఎండగడతామన్నారు. 'పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టి చంపాలి.. పార్టీ మారే వారు పిచ్చికుక్కల్లాంటి వారు..'అని గతంలో రేవంత్‌రెడ్డి అన్నారంటూ.. ప్రస్తుతం పార్టీ మారిన ఎమ్మెల్యేలను ఏ రాయితో కొట్టాలని కేటీఆర్ నిలదీశారు. పార్టీ ఫిరాయింపులకు, ఆయారాం గయారాం సంస్కృతికి శ్రీకారం చుట్టిందే కాంగ్రెస్ పార్టీ అని ధ్వజమెత్తారు. మంగళవారం ఢిల్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, దీవకొండ దామోదర్‌రావులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు.

తెలంగాణలో రూ.50 కోట్లా, రూ.100 కోట్లా?

'రాజ్యాంగ ప్రతిని పట్టుకుని, రక్షకుడిని నేనే అంటూ ఆస్కార్ తరహాలో నటించిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్‌లోకి మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేరికను స్వాగతించారు. తమ పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చిన పార్టీ ఫిరాయింపుల నిరోధక అంశాన్ని పక్కన పెట్టి రాష్ట్రంలో ఫిరాయింపులను ప్రోత్సహించారు. ఇదే కాంగ్రెస్ పార్టీ హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, గోవాల్లో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ అటు కోర్టుల్లో, ఇటు చట్టసభల్లో పోరాడుతోంది. మరో పక్క తెలంగాణలో మాత్రం ఫిరాయింపులు ప్రోత్సహిస్తూ ఎమ్మెల్యేలను చేర్చుకుంటోంది. ఇది కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. రాహుల్ దీనిపై నోరు విప్పాలి. ద్వంద్వ వైఖరిని వీడాలి. ఆయన రాజ్యాంగాన్ని చదవడంతో పాటు రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి. కర్ణాటకలో ఒక్కో ఎమ్మెల్యే కొనుగోలుకు రూ.50 కోట్లు ఖర్చు చేశారని సీఎం సిద్ధరామయ్య ఆరోపిస్తున్నారు. మరి తెలంగాణలో రూ.50 కోట్లా, రూ.100 కోట్లా? ఎంత వెచ్చిస్తున్నారు..'అని కేటీఆర్ ప్రశ్నించారు.

పాత్రధారి హైదరాబాద్‌లో, సూత్రధారులు ఢిల్లీలో

'అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. దానిని మర్చిపోయి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల చేరికలు మొదలుపెట్టింది. అధిష్టానం అనుమతితోనే రేవంత్ రెడ్డి ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారు. సీఎం స్వయంగా ఎమ్మెల్యేల ఇళ్లకు వెళ్లి కండువాలు కప్పుతున్నారు. పాత్రధారి హైదరాబాద్‌లో సూత్రధారులు ఢిల్లీలో ఉన్నారు. పార్టీ ఫిరాయించిన ఆరు, ఏడుగురు ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు తప్పవు. ప్రజలు వీళ్ల పదవులు ఊడగొట్టడం ఖాయం. వీరంతా ప్రజా క్షేత్రంలో పరాభవం ఎదుర్కోక తప్పదు. ఫిరాయింపుదారులను అనర్హులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం..'అని బీఆర్‌ఎస్ నేత అన్నారు.

ఫిరాయింపులపై న్యాయ నిపుణులతో సంప్రదింపులు

'కాంగ్రెస్ వైఖరిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్, కేంద్ర ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టుల గడపతొక్కుతాం. పార్టీ ఫిరాయించిన దానం నాగేందర్ విషయంలో ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించాం. అక్కడ న్యాయం జరగకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం. పార్టీ ఫిరాయింపులపై ఢిల్లీలో నాలుగు రోజులుగా న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపాం. భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి పోరాడతాం..'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

పార్టీ విలీనాన్ని రాజ్యాంగం అనుమతిస్తుంది

'పార్టీ విలీనానికి, ఫిరాయింపునకు వ్యత్యాసం ఉంది. పార్టీ విలీనాన్ని రాజ్యాంగం అనుమతిస్తుంది. కానీ పార్టీ ఫిరాయింపు మాత్రం రాజ్యాంగ విరుద్ధం. గతంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 18 మంది ఎమ్మెల్యేల్లో 12 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇప్పుడు 38 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల్లో ఏడుగురిని కాంగ్రెస్ తమ పార్టీలో చేర్చుకుంది. అది మూడింట ఒక వంతు కాదు.. మూడింట రెండో వంతూ కాదు. మూడింట రెండో వంతు విలీనం అయితే రాజ్యాంగబద్ధం. దీనిని సుప్రీంకోర్టు కూడా ప్రశ్నించలేదు..' అని కేటీఆర్ వివరించారు.

పరీక్షల వాయిదాపై పరిణతి లేని వ్యాఖ్యలు: హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులు, నిరుద్యోగులు పరీక్షలు వాయిదా కోరడంపై సీఎం రేవంత్‌రెడ్డి పరిణతి లేని వ్యాఖ్యలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. గ్రూప్–2, టెట్ పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థులు అడిగితే గతంలో రేవంత్ మద్దతు తెలిపిన విషయం మరిచిపోయారని విమర్శించారు. సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని గతంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మీరు.. ఇప్పుడెందుకు సానుకూలంగా ఆలోచించడం లేదని హరీశ్ ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకమాట, అధికారంలోకి వచ్చాక మరొక మాటనా? అని నిలదీశారు. 'ఊసర వెల్లి కూడా మిమ్మల్ని చూసి సిగ్గుపడుతుంది. విద్యార్థులు, నిరుద్యోగుల ఆశయాలతో, జీవితాలతో మీరు రాజకీయం చేశారు. డీఎస్సీ పరీక్ష వాయిదా కోరితే అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. సీఎం స్థాయి వ్యక్తి అభ్యర్థులు, నిరుద్యోగులపై దిగజారుడు వ్యాఖ్యలు చేయడం దౌర్భాగ్యం. పార్టీల బలోపేతానికే విద్యార్థులను రెచ్చగొడుతున్నారు సన్నాసులు అంటున్న రేవంత్.. గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా రాజకీయం కోసమే వాయిదా కోరారా? రాత్రి, పగలు లెక్కచేయకుండా అభ్యర్థులు, పోరాటం చేస్తుంటే సానుభూతి చూపకుండా రాజకీయం చేస్తున్నారు. మీ రెండు నాల్కల ధోరణిని గమనిస్తున్న ప్రజలు తప్పక బుద్ధి చెబుతారు'అని హరీశ్‌రావు 'ఎక్స్'వేదికగా హెచ్చరించారు.

ఆ కాలేజీ వాదనలు వినండి

మెడికల్ పీజీ సీట్లపై కేంద్రానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మెడికల్ పీజీ ప్రవేశాల రద్దు నిర్ణయంపై మహేశ్వర వైద్య కళాశాల వాదనలు మరోసారి వినాలని తెలంగాణ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మహేశ్వర వైద్య కళాశాల దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేయడాన్ని ఆక్షేపించింది. విచారణ తర్వాత వివరాలను కోర్టుకు తెలియజేయాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది. నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) జారీ చేసిన ఉత్తర్వులపై గత ఏడాది కళాశాల రెండు అప్పీళ్లను దాఖలు చేయగా.. వాటిని కేంద్ర ప్రభుత్వం కొట్టివేసింది. దీన్ని సవాల్ చేస్తూ కళాశాల యాజమాన్యం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 2021–22 విద్యా సంవత్సరానికి 12 పీజీ మెడికల్ కోర్సులకు ఎన్‌ఎంసీ అనుమతి ఇచ్చింది. ఒక్కొక్క సబ్జెక్టుకు రూ.80 లక్షల చొప్పున కళాశాల బ్యాంకు గ్యారంటీ ఇచ్చింది. ఇవి నకిలీవని తేలడంతో నేషనల్ మెడికల్ కమిషన్ ప్రవేశాలను రద్దు చేసింది. అప్పటికే ప్రవేశాలు జరిగిన విద్యార్థులను వేరే వైద్య కళాశాలల్లో సర్దుబాటు చేయాలని కాళోజీ వర్సిటీని ఆదేశించింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ నంద విచారణ చేపట్టారు. ఒక ఏజెంట్ మోసం చేసినందున నకిలీ గ్యారంటీలని తేలిందని కళాశాల తరఫు న్యాయవాది స్పష్టం చేశారు. ఆ వ్యక్తిపై కేసు పెట్టామని, ఆ వెంటనే గ్యారంటీలను కూడా సమర్పించామని వాదించారు. కానీ తమపై కళాశాల మోసపూరితంగా వ్యవహరించిందని ఎన్‌ఎంసీ తరఫు న్యాయవాది చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కళాశాల అప్పీళ్లను మరోసారి పునః విచారణ చేయాలని కేంద్రాన్ని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎంగా మోకా వస్తే.. ధోకా చేస్తారా?

యువతకు ఉద్యోగాలు అవసరం లేదా?

రణరంగంగా ఉస్మానియా: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు కావస్తున్నా యువతకు ఉద్యోగాల గురించి సీఎం రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించడంతో పాటు పత్రికా ప్రకటన విడుదల చేశారు. 'మీరు కొలువుదీరితే సరిపోతుందా, యువతకు కొలువులు అవసరం లేదా?' అని ప్రశ్నించారు. మంత్రివర్గ తొలి భేటీలోనే 25 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలతో మెగా డీఎస్సీ వేస్తామని సీఎం రేవంత్ చేసిన ప్రకటన ఏమైందన్నారు. డీఎస్సీ వాయిదా వేయాలంటూ, పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. లక్షలాది మంది డీఎస్సీ అభ్యర్థులు చేస్తున్న ఆక్రందనలు సీఎంకు వినిపించడం లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఓయూ విద్యార్థులు అడ్డా మీది కూలీలు అని రేవంత్ గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ.. వారిని బీరు–బిర్యానీ బ్యాచ్ అంటూ బద్నాం చేశాడన్నారు. తమ సమస్యలపై గొంతెత్తుతున్న డీఎస్సీ అభ్యర్థులపై పోలీసులను ప్రయోగించి అణచివేస్తున్నారని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీని ప్రభుత్వం రణరంగంగా మార్చిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

డీఎస్సీ అభ్యర్థులకు వెన్నుపోటు..

ముఖ్యమంత్రిగా అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ అని చెప్పి ఇప్పుడు వారిని దగా చేస్తారా? అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ చేతకానితనాన్ని ప్రశ్నించడమే నిరుద్యోగులు చేసిన నేరమా? ప్రచారంలో ఇచ్చిన హామీలు నెరవేర్చమని అడగడమే పాపమా? అని రేవంత్ సర్కార్‌ను నిలదీశారు. ముఖ్యమంత్రిగా మీకు మోకా వస్తే.. డీఎస్సీ అభ్యర్థులకు ఇంత ధోకా చేస్తారని ఊహించలేదన్నారు. ఇప్పటికే మెగా డీఎస్సీ అని నిరుద్యోగ యువతను నిలువునా మోసం చేశారు. ఇప్పుడు ప్రిపరేషన్‌కు కూడా టైమ్ ఇవ్వకుండా వారి భవిష్యత్తుతో చెలగాటం ఆడటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. పరీక్షలు వాయిదా వేయాలంటూ డీఎస్సీ అభ్యర్థులు కోరుతుంటే వారి డిమాండ్‌ను పరిశీలించటంలో ప్రభుత్వానికి ఎందుకింత మొండి వైఖరో చెప్పాలన్నారు. ఇన్నాళ్లూ కాంగ్రెస్ సర్కార్‌ను భుజాన మోసిన సోకాల్డ్ మేధావులు ఇప్పుడు ఎక్కడున్నారని, ప్రశ్నించే గొంతులు ఎందుకు మూగబోయాయో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.



"శరీరాన్ని మంచి ఆరోగ్యంతో ఉంచుకోవటం ఒక కర్తవ్యం.
లేకుంటే మనస్సును బలంగా, స్పష్టంగా ఉంచుకోలేం.
- గౌతమ బుద్ధుడు

సాక్షి
బుధవారం, 10 జులై 2024

భారత్-రష్యా సాన్నిహిత్యం

దౌత్య ప్రపంచంలో ఏదీ యాదృచ్ఛికంగా జరగదు. పర్యటనలైనా, ప్రసంగాలైనా, సమావేశాలైనా, ఒప్పందాలైనా- దేశాల ప్రయోజనాలతో ముడిపడివుంటాయి. సమయం, సందర్భం తప్పనిసరిగా ఉంటాయి. తమ ఆలోచనలేమిటో నిక్కచ్చిగా చెప్పడం కూడా వీటి ఉద్దేశం కావొచ్చు. ప్రధాని మోదీ మూడోసారి అధికార పగ్గాలు చేపట్టాక తన తొలి విదేశీ పర్యటన కోసం ఇరుగు పొరుగు దేశాలను సందర్శించే ఆనవాయితీని పక్కనబెట్టి రష్యాను ఎంచుకున్నారు. రెండు రోజుల ఆ పర్యటన మంగళవారం ముగియబోతుండగా అమెరికా ప్రాపకంతో 75 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన సైనిక కూటమి నాటో వజ్రోత్సవాలు వాషింగ్టన్‌లో మొదలయ్యాయి. ఇవి మూడురోజులపాటు సాగుతాయి. రష్యా పూర్వరూపమైన సోవియెట్ యూనియన్‌కు వ్యతిరేకంగా నాటో ప్రారంభమైంది. కనుక మోదీ రష్యా పర్యటన సహజంగానే అమెరికాకు కంటగింపుగా ఉండొచ్చు. ఈ పర్యటన 'శాంతి ప్రయత్నాలకు' తీవ్ర విఘాతం కలిగిస్తుందని ఇప్పటికే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. పైగా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాధినేత అత్యంత క్రూరుడైన నేరగాణ్ణి హత్తుకోవటం ఏమిటని విమర్శించారు. జెలెన్‌స్కీ చెబుతున్న శాంతి ప్రయత్నాలేమిటో ప్రపంచంలో ఎవరికీ తెలియదు. తెలిసిందల్లా రష్యాను ఎదుర్కొనటానికి యుద్ధం మొదలైననాటి నుంచీ ఉక్రెయిన్‌కు అమెరికా, పాశ్చాత్య దేశాలు ఎడాపెడా ఆయుధాలు, డబ్బు సరఫరా చేయటం. అందువల్లే ఆ ఘర్షణ ఎడతెగకుండా సాగుతోంది. ఇందులో శాంతి ప్రసక్తి ఎక్కుడుందో అర్థంకాదు. రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని ఖండించాల్సిందే. కానీ ఇందులో ఉక్రెయిన్ బాధ్యత కూడా ఉంది.

దాని సంగతలావుంచితే భారత-రష్యా 22వ వార్షిక శిఖరాగ్ర సమావేశం కోసం ప్రధానంగా మోదీ రష్యా వెళ్లారు. ఈ సందర్భంగా వివిధ ఒప్పందాలు కూడా కుదిరాయి. రష్యా అధ్యక్షుడు పుతిన్, మోదీకి తమ అత్యున్నత పౌర పురస్కారాన్ని కూడా అందజేశారు. అయితే మంగళవారం ఉక్రెయిన్ రాజధాని కియూవ్‌లో ఒక ఆసుపత్రిపై జరిగిన క్షిపణి దాడిలో 37 మంది చనిపోయిన ఉదంతాన్ని ఖండించటానికి మోదీ వెనకాడలేదు. రష్యాతో మనకున్న మైత్రి ఈనాటిది కాదు. ఆ మైత్రికి ఏడు దశాబ్దాల చరిత్ర ఉంది. మోదీ అన్నట్టు రష్యా అన్ని కాలాల్లోనూ దృఢంగా మన వెనక నిలబడింది. స్నేహ హస్తం అందించింది. 1971లో పాకిస్తాన్‌తో మనకు యుద్ధం వచ్చినప్పుడు అన్నివిధాలా ఆదుకుంది. ఆ యుద్ధంలో మనం సాధించిన విజయంలో సోవియెట్ పాత్ర కీలకమైనది. మన అమ్ములపొదిలో ఉన్న రక్షణ పరికరాల్లో అత్యధిక భాగం ఆ దేశం నుంచి దిగుమతి చేసుకున్నవే. ఇది కేవలం కొనుగోలుదారు- అమ్మకందారు సంబంధం కాదు. పరిశోధన, అభివృద్ధితో మొదలెట్టి ఉమ్మడి ఉత్పత్తుల వరకూ ఇరు దేశాలూ సహకరించుకుంటున్నాయి. మనకున్న రెండు విమానవాహక నౌకల్లో ఒకటి రష్యానుంచి వచ్చినదే. ఇంకా ఎస్-400 గగనతల రక్షణ క్షిపణి వ్యవస్థ, మిగ్-29, ఎస్‌యూ-30 ఎంకెఐ యుద్ధ విమానాలు, సైనిక హెలికాప్టర్లు, ఏకే-203 రైఫిళ్లు, బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులు తదితరాలున్నాయి. ఇవిగాక తన టీ-90 శతఘ్నుల ఉత్పత్తికి మనకు అనుమతులిచ్చింది. విడి భాగాల దగ్గర్నుంచి నూతన పరిశోధనల వరకూ మన రక్షణ వ్యవస్థ పూర్తిగా రష్యాతో ముడిపడివుంది. అణు విద్యుత్ కర్మాగారాల స్థాపన, నిర్వహణలో తోడ్పడుతోంది. ఇరవై అయిదేళ్ల క్రితం మనకు అమెరికాతో కూడా సత్సంబంధాలు ఏర్పడ్డాయి. అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ తదితర దేశాల నుంచి కూడా మనం రక్షణ పరికరాలు కొనుగోలు చేస్తున్నాం. మనను రష్యాకు దూరం చేయాలని ఆది నుంచీ అమెరికా ప్రయత్నిస్తోంది. ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాకైతే ఇది మరింతగా పెరిగింది. ఐక్యరాజ్యసమితి, భద్రతామండలి వంటి అంతర్జాతీయ సంస్థల్ని బేఖాతరుచేసి ఘర్షణలు నివారించే పేరుమీద అమెరికా ఒక పక్షాన్ని సమర్థించటం, అవతలిపక్షంతో ఎవరూ సాన్నిహిత్యం నెరపకూడదని ఫర్మానా జారీచేయటం ఆశ్చర్యకరం. వాస్తవాధీన రేఖ వద్ద చైనాతో మనకు అయిదేళ్లుగా లడాయి నడుస్తోంది. ఆ దేశంతో ఘర్షణలు వస్తే మనకు రష్యా నుంచి రక్షణ పరికరాలు, విడిభాగాలు అత్యవసరమవుతాయి. అంతేకాదు... రక్షణ సాంకేతికతలు చైనాకు పోకుండా చూడటం మనకు ముఖ్యం. ఇలాంటి పరిస్థితుల్లో అన్ని ప్రయోజనాలూ వదులుకుని తాను చెప్పినట్టల్లా నడుచుకోవాలని అమెరికా భావించటం ఎంతమాత్రం సరికాదు. పాకిస్తాన్‌తో మనకున్న సమస్యల విషయంలో ఏనాడూ అమెరికా సానుభూతిగా లేదు. కంటితుడుపు చర్యలు తీసుకోవటం, ఏదో వంకన ఆ దేశానికి సైనిక, ఆర్థిక సాయం అందించటం అమెరికాకు రివాజుగా మారింది. మనం మాత్రం తన ఫర్మానాలు పాటించాలని ఆ దేశం ఆశిస్తుంది. ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక రష్యా నుంచి ముడి చమురు దిగుమతి వద్దన్న అమెరికా ఒత్తిడిని కాదని, రోజుకు 21 లక్షల బ్యారెళ్ల చొప్పున దిగుమతి చేసుకుంటున్నాం. చౌకగా లభించే ఆ ముడి చమురు వల్ల మనం లాభపడటం మాట అటుంచి ప్రపంచ చమురు మార్కెట్ స్థిరత్వం సాధించింది.

వర్తమాన సంక్లిష్ట పరిస్థితుల్లో రష్యాతో సాన్నిహిత్యం ఇబ్బందికరమే అయినా, దేశ ప్రయోజనాల రీత్యా దాన్ని కొనసాగించాలనుకున్న మన దేశ వైఖరి మెచ్చదగినది. ఏదేమైనా రెండు దేశాల మధ్య ఉండే ద్వైపాక్షిక సంబంధాలను మూడో దేశం ప్రభావితం చేయాలనుకోవటం, వాటిని తెంచుకోవాలని ఒత్తిడి తీసుకురావటం మంచి సంప్రదాయం కాదు. తన పర్యటన ద్వారా అమెరికాకు ఈ సంగతిని స్పష్టం చేసిన ప్రధాని మోదీ చర్య ప్రశంసించదగ్గది.

'ఒకే పన్ను'కు పెద్ద రంగాలే దన్ను

విశ్లేషణ



సుష్మా రామచంద్రన్

జీఎస్టీని మరింత సమర్థంగా అమలు చేసేందుకు ఇంకా ఎంతో అవకాశం ఉంది. పన్ను రేట్ల హేతుబద్ధీకరణ, విధానాన్ని సులభతరం చేయడం వీటిల్లో కొన్ని చర్యలు మాత్రమే. అదే సమయంలో ఒకే పన్ను రేటు అన్న అసలు లక్ష్యాన్ని అందుకోవాలంటే ఆర్థిక వ్యవస్థలోని అతి పెద్ద రంగాలైన పెట్రోలియం వంటి వాటిని జీఎస్టీ పరిధిలోకి చేర్చడం తప్పనిసరి. ఒకే పన్ను అన్నది ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపోయినా ఇప్పుడున్న పన్ను స్లాబ్‌లను తగ్గించి, దీర్ఘకాలంలో పన్ను వసూళ్ల ప్రక్రియను మరింత సులభతరం చేయవచ్చు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రాలు కూడా హేతుబద్ధమైన దృష్టితో ఆలోచించి దేశ ఆర్థిక వృద్ధి కోసం జీఎస్టీ లక్ష్యానికి దన్నుగా నిలవాలి.

దేశంలో ఏడేళ్ల క్రితం వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ని తొలిసారి ప్రవేశపెట్టినప్పుడు దాని అమలుపై చాలా సందేహాలు వ్యక్తమయ్యాయి. ఈ సందేహాల నివృత్తి జరక్కుండానే జీఎస్టీ అమలుకు నిర్ణయం తీసుకోవడం దుందుడుకు చర్యగా కొందరు అభివర్ణించారు కూడా! అంతకు ఏడాది క్రితమే పెద్దనోట్ల రద్దు జరిగిందని, ఆ నష్టం నుంచి తేరుకోకముందే అరకొరగా జీఎస్టీని అమలు చేయడం సరికాదని వాదించారు. ఆర్థికవేత్తలు, పన్ను నిపుణులు చాలామంది జీఎస్టీ అమలు విఫలం కాక తప్పదన్న హెచ్చరికలూ జారీ చేశారు. అయితే అన్ని అభ్యంతరాలను తోసిరాజని అప్పటి ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ముందడుగు వేయడం తెలివైన పనే అని ఇప్పుడు అనిపిస్తోంది. ఎందుకంటే అనుమానాలు తీర్చడంలో, జీఎస్టీలో భాగస్వాములైన వారందరి అభ్యంతరాలకు సమాధానాలు ఇవ్వడంలో ఏళ్లు పూళ్లు అవడం ఖాయం. కానీ ఒక్క విషయమైతే ఇక్కడ చెప్పుకోవాలి. దేశ వ్యాప్తంగా ఒకే రకమైన పన్ను ఉండాలన్న జీఎస్టీ లక్ష్యం పెద్ద పెద్ద ఆర్థిక వ్యవస్థలనూ దీని పరిధిలోకి తీసుకు రాగలిగితేనే నెరవేరుతుంది.

జీఎస్టీపై సాధికార కమిటీ

దేశవ్యాప్తంగా ఒకే పన్ను అన్న అంశంపై సుమారు 18 ఏళ్లు చర్చలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వ పరోక్ష పన్నులు, రాష్ట్రాల పన్నుల స్థానంలో ఒకటే పన్ను ఉండాలన్నది 1999 నాటి వాజ్‌పేయి ప్రభుత్వ ఆలోచన. విజయ్ కేల్కర్ నివేదిక ఈ కొత్త పన్ను విధానాన్ని ప్రతిపాదించింది. తద్వారా పన్ను వసూళ్లు మెరుగవుతాయని, ఆర్థిక వ్యవస్థల ఏకీకరణ సాధ్యమవుతుందని అంచనా వేశారు. జీఎస్టీ అమల్లో ఉన్న దేశాల్లో ఆర్థిక వృద్ధి రేటు బాగున్నట్లు అప్పటికే జరిగిన పలు అధ్యయనాలు స్పష్టం చేశాయి కూడా. జీఎస్టీపై 2000లో ఆర్థిక మంత్రులతో కూడిన ఒక సాధికార కమిటీ ఏర్పాటైంది. పశ్చిమ బెంగాల్ ఆర్థిక శాఖ మంత్రి అసిమ్‌దాస్ గుప్తా ఆ కమిటీకి నేతృత్వం వహించారు. ఇప్పటి జీఎస్టీ కౌన్సిల్ తొలి రూపం ఆ కమిటీనే. దాని సిఫారసులను అనుసరించి అన్ని రాష్ట్రాలకు ప్రాతినిధ్యం, ఆదాయ వ్యవహారాల్లో ఏకాభిప్రాయ సాధన సూత్రాలుగా జీఎస్టీ కౌన్సిల్ పని చేస్తుంది. చర్చోపచర్చల తరువాత ఈ కమిటీ జీఎస్టీ బిల్లు తొలి ముసాయిదాను సిద్ధం చేసింది. ఇందుకు సుమారు ఇరవై ఏళ్లు పట్టింది. అప్పటికీ కొన్ని అభ్యంతరాలు ఉండగా... 2016 నాటికి గానీ స్థూలమైన ఏకాభిప్రాయం కుదరలేదు.

మెరుగుపడిన పన్ను వసూళ్లు!

ఒకే ఒక్క పన్ను అన్న లక్ష్యంతో మొదలైన జీఎస్టీలో సంక్లిష్టతలు వచ్చేందుకు ఒక కారణం... తమ ఆదాయం పడిపోతుందన్న రాష్ట్రాల బెంగ. ఫలితంగా... ఒకే పన్ను స్థానంలో



ఇటీవలి జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

పలు రకాల పన్ను రేట్లు ఏర్పాటు చేశారు. రాష్ట్రాల జీఎస్టీ, కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ, అంతర్రాష్ట్ర రవాణాపై సమీకృత జీఎస్టీ ఇలా పలు రకాల పన్నులు ఏర్పాటు చేశారు. ఇవి కాకుండా... ఐదు నుంచి 28 శాతం వరకూ నాలుగు విభాగాల పన్ను రేట్లను నిర్ధారించారు. అంతే కాదు... తమకు అత్యధిక ఆదాయాన్నిచ్చే పెట్రోలు, మద్యం జీఎస్టీ పరిధిలోకి రాకుండా ఉండాలని రాష్ట్రాలు పట్టుబట్టాయి. జీఎస్టీ అమలు సమయంలో ఈ పన్ను ద్వారా తగినంత ఆదాయం వస్తుందా? అన్న అనుమానాలు రాష్ట్రాలకు ఉండేది. అయితే ఈ అనుమానాలు వట్టివేనని తేలిపోయింది. వాస్తవానికి పన్ను వసూళ్లు మునుపటి కంటే బాగా మెరుగయ్యాయి.

జీఎస్టీ తాజా గణాంకాలను పరిశీలిస్తే గత జూన్ నెలలో వసూళ్లు 1.74 లక్షల కోట్ల రూపాయలకు చేరుకున్నాయి. జీఎస్టీని ప్రవేశపెట్టిన తొలి ఏడాది ఈ మొత్తం నెలకు 90 వేల కోట్ల రూపాయలు మాత్రమే. రాష్ట్రాల సొంత ఆదాయం కూడా జీఎస్టీ అమలు తరువాత పెరిగినట్టు ఆర్‌బీఐ జరిపిన ఒక అధ్యయనంలో వెల్లడయింది. అంటే... రాష్ట్రాలు జీఎస్టీ విషయంలో ఏర్పాటు చేసిన కాంపెన్సేషన్ లేకుండా సొంత ఆదాయాలతోనే వ్యవహారాలు చక్కబెట్టుకునే అవకాశం ఉందన్న మాట. ఈ కాంపెన్సేషన్ అనేది ముందు ఐదేళ్లు ఉంటుందని అనుకున్నారు కానీ... కోవిడ్ కారణంగా 2026 వరకూ పొడిగించారు. ఆదాయం ఇప్పటి మాదిరే పెరుగుతూ ఉంటే ఈ ఏర్పాటును రద్దు చేయవచ్చు.

చిన్న వ్యాపారులకు మేలే జరిగింది!

మొత్తమ్మీద జీఎస్టీ అమలులో కొన్ని ఆటుపోట్లు ఉన్నాయన్నది వాస్తవం. పద్ధతులను సులువు చేసే విషయంలో, మరీ ముఖ్యంగా రెడ్‌టేప్‌ను తగ్గించడంలో! అయితే ఇతర సమస్యలేవైనా వచ్చినా వాటి పరిష్కారం కోసం రాష్ట్రాలు తరచూ జీఎస్టీ కౌన్సిల్ రూపంలో సమావేశమవుతూండటం గమనార్హం. చిన్న చిన్న వ్యాపారాలను జీఎస్టీ పరిధిలోకి తేవడం ఎలా అనే సవాలును కంప్యూటర్ల సాయంతో అధిగమించారు. జీఎస్టీ అమలుతో చిన్న వ్యాపారులకు నష్టం జరుగుతుందని కొంతమంది భయపడ్డారు కానీ.. వాస్తవానికి జరిగింది మేలే. లక్షలాది చిన్న వ్యాపారులు డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమైపోయారు.

జీఎస్టీ పరిధిలోకి పెట్రోలు

జీఎస్టీ అమలుతో సామాన్యులపై పన్ను భారం ఎక్కువ అవుతుందని కొందరు ఆందోళన వ్యక్తం చేశారు కానీ దీనికి కూడా సరైన హేతువు ఏదీ లేదని ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది. వినియోగమవుతున్న వస్తువుల్లో 60 శాతం వాటికి అతి తక్కువ పన్ను రేట్లు (సున్నా లేదంటే ఐదు శాతం) ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. మరోవైపు కేవలం మూడు శాతం వస్తువులపై మాత్రమే 28 శాతం అత్యధిక పన్ను పడుతోంది. అయినా ఒక్క విషయాన్ని మాత్రం మనం అంగీకరించాల్సి ఉంటుంది. జీఎస్టీ పన్ను రేట్లను మరింతగా హేతుబద్ధీకరించాలి. ఒకే పన్ను రేటు అన్నది ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపోయినా ఇప్పుడున్న పన్ను స్లాబ్‌లను తగ్గించి దీర్ఘకాలంలో పన్ను వసూళ్ల ప్రక్రియను మరింత సులభతరం చేయవచ్చు.

ఇక రెండో అంశం. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తేవాల్సిన అవసరం ఉంది. విద్యుత్తు, భూమి వంటి వాటిని కూడా చేర్చాలన్న వాదన ఉంది. తొలి దశలో భాగంగా వైమానిక ఇంధనం, సహజవాయువులను జీఎస్టీ పరిధిలోకి తేవాలి. పెట్రోలు, డీజిళ్లను కూడా చేర్చడం ఇప్పటికే ఆలస్యమైందని చెప్పాలి. రాష్ట్రాలకు సంబంధించి అతి పెద్ద ఆదాయ వనరుగా ఉండటం వల్ల మద్యం అమ్మకాలపై జీఎస్టీ అనేది కొంచెం సున్నితమైన అంశం అవుతుంది. అయితే నేడు కాకపోతే రేపు అయినా సరే... ఈ మార్పు అనివార్యం.

అప్పిలేట్ ట్రిబ్యునల్ అవసరం

జీఎస్టీ కౌన్సిల్ ఇటీవలి సమావేశాల్లో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు మేలు చేసేలా కొన్ని నిర్ణయాలు జరిగాయి. జీఎస్టీకి ముందు కాలం నాటి వివాదాల విషయంలో కొంత వెసులుబాటు కల్పించారు. అదే సమయంలో జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటు అవసరాన్ని కూడా కౌన్సిల్ గుర్తించింది.

జీఎస్టీ అమలును మరింత సమర్థంగా మార్చేందుకు ఇంకా ఎంతో అవకాశం ఉంది. పన్ను రేట్ల హేతుబద్ధీకరణ, విధానాన్ని సులభతరం చేయడం వీటిల్లో కొన్ని చర్యలు మాత్రమే. అదే సమయంలో ఒకే పన్ను అన్న అసలు లక్ష్యాన్ని అందుకోవాలంటే ఆర్థిక వ్యవస్థలోని అతిపెద్ద రంగాలైన పెట్రోలియం వంటి వాటిని జీఎస్టీ పరిధిలోకి చేర్చడం తప్పనిసరి అవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా చొరవ తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రాలు కూడా హేతుబద్ధమైన, దీర్ఘకాలిక దృష్టితో ఆలోచించి దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడేలా జీఎస్టీ లక్ష్యానికి దన్నుగా నిలవాలి.

వ్యాసకర్త ఆర్థిక వ్యవహారాల సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కూలిన విలువలు



బిహార్‌లో 15 రోజుల్లో 10 వంతెనలు కూలిపోయాయి. ఏ ఇతర ప్రభుత్వం అయినా అక్కడ ఉండి ఉంటే ఈపాటికి రద్దయి ఉండేది. లేదంటే... సిగ్గుతో రాజీనామా చేసి ఉండేది. (బిహార్‌లో నితీష్ కుమార్ ప్రభుత్వం కేంద్రంలో ఎన్డీయేే భాగస్వామిగా ఉండటాన్ని గుర్తు చేస్తూ).

– ఆదిత్య ఠాక్రే, యువ(శివ)సేన అధ్యక్షుడు

ఇదసలు కరెక్టేనా?



ప్రధాన మీడియా సంస్థలో పని చేస్తున్నప్పుడు పైవాళ్ల నుంచి మేమెప్పుడూ వింటుండే మాట – 'టార్గెట్ ఆడియెన్స్'! ముఖ్యంగా 30+ వయసులోని టెకీలకు ఆసక్తికరంగా ఉండే స్టోరీలను చేయమని చెప్పేవారు. నేనెప్పుడూ ఆ మాటను పట్టించుకోలేదు. (వరద ముంపు స్టోరీ క్లిప్‌ను తన ట్వీట్‌కు జత చేస్తూ..)

– షబ్బీర్ అహ్మద్, ఒకప్పటి పేపర్ బాయ్ (నేడు రిపోర్టర్)

రెండు ప్రశ్నలు



రెండు రోజుల క్రితం కథువా ఉగ్రదాడిలో మరణించిన ఐదుగురు సైనికులలో 26 ఏళ్ల రైఫిల్‌మన్ ఆదర్శ్ నేగీ ఒకరు. జమ్మూ ప్రాంతంలో ఇటీవలి వారాల్లో పకడ్బందీగా జరిగిన దాడులలో ఇది ఐదవది. కఠినమైన ప్రశ్న : మన నిఘా విభాగం ఏం చేస్తోంది? పెద్ద ప్రశ్న : ఇండియా ఇప్పుడు ఏం చేయబోతోంది?

– శివ్ అరూర్, పాత్రికేయుడు


ఓర్వ లేరు!!



చాలా కాలంగా మనం ఏ ప్రపంచ కప్ టైటిల్‌నూ గెలవక పోవటం వల్ల వెల్లివిరుస్తున్న ఆనందం ఇది. ఇండియా టీ20 వరల్డ్ కప్ టైటిల్ సాధించటం నిజంగానే పెద్ద ఘనత. ఈ ఉద్వేగాన్ని 'అతి'కి ప్రతీకగా విమర్శిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆటల గురించి తెలియదనే అంటాను. ఇలాంటి వారు ప్రజలు సంతోషంగా ఉండటాన్ని సహించలేరు.

– నిమిష్ దూబే, రచయిత, సంపాదకుడు

సామాజిక సమరసతా కవి



వరకవి సిద్ధప్ప రాజయోగి

'వినుడి మాయప్ప సిద్ధప్ప విహితుడప్ప/ కనుడి కరమొప్ప కవికుప్ప కనకమప్ప' అనే మకుటంతో సామాజిక అంశాలు ఇతివృత్తంగా అనేక పద్యాలు రచించి సమాజాన్ని మేల్కొల్పిన వర కవి సిద్ధప్ప రాజయోగి. ఈయన నాటి కరీంనగర్, నేటి సిద్దిపేట జిల్లా కోహెడ మండలం గుండారెడ్డిపల్లిలో 1903 జులై 9న ఓ శాలివాహన కుటుంబంలో జన్మించారు. ఆ కాలంలోనే 7వ తరగతి వరకు చదివారు. సిద్ధప్ప పదిహేనవ యేటనే రామాయణ, అమరకోశాలను పుక్కిట పట్టారు. స్వతహాగా సాహిత్య రచన చేసి 'సిద్ధప్ప వరకవి'గా ప్రసిద్ధి చెందారు. సాహిత్యంతో పాటు జ్యోతిష్యం, వాస్తు, ఆయుర్వేద, యోగసేవలు కొనసాగిస్తూ మానసిక రుగ్మతలకు సలహాలు ఇస్తుండేవారు. తన కలం ద్వారా శ్రామికుల కండ్లు తెరిపించారు. మంచికి ప్రాధాన్యమిస్తూ కులవ్యవస్థ, మూఢ నమ్మకాలను ఖండించారు.

సాధారణ జనం సైతం అలవోకగా పాడుకునే విధంగా రచనలు చేసిన సిద్ధప్ప పద్యాలలో 'యేకులంబని' పద్యం నేటికీ భజన మండళ్ల గాయకుల నాలుకలపై నాట్యం చేస్తోంది:

'ఏ కులంబని నన్ను ఎరుకతో నడిగేరు/ నా కులంబును జెప్ప నాకు సిగ్గు/ తండ్రి బొందిలివాడు తల్లి దాసరి వనిత/ మా తాత మాలోడు మరియు వినుడి/ మా యత్త మాదిగది మామ యెరుకలివాడు/మా బావ బల్లతడు మానవతుడు/ కాపువారీ పడుచుకాంత దొమ్మరివేశ్య/ భార్యగావలె నాకు ప్రాణకాంత'- అంటూ ఆయన కుల వాదాన్ని నిరసించారు. సమస్త కులాల విరాట్ స్వరూపంగా కనిపిస్తారు. భక్తిమార్గంలో ఉంటూనే మూఢభక్తిని ఆయన నిరసించారు.

సిద్ధప్ప రాసిన చాలా పద్యాలలో ఆర్తి, వేదన, సంఘ రీతి పట్ల కసి, అసమానతల పట్ల అసహ్యం కనపడుతుంటాయి. సరస్వతీ కటాక్షంతో 40 వరకు రాసిన వీరి రచనల్లో 'జ్ఞానబోధిని' నాలుగు సంపుటాలు ప్రసిద్ధిగాంచాయి. 'వర్ణమాల కందార్థములు', 'కాలజ్ఞాన కందార్థములు', 'నరసింహ స్వామి వర్ణమాల', 'విష్ణు భజనావళి', 'శివ భజనావళి', 'గోవ్యాఘ్ర సంభాషణ', 'కాకి హంసోపాఖ్యానం', 'అర్చకుల సుబోధిని' వంటి రచనలు ఎన్నో చేసి తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. 'జీవ నరేంద్ర' నాటకంతో పాటు, 'గాంధీ మహాత్మ' యక్షగానం కూడా అందించారు. ఆత్మ తత్త్వాన్ని తెలియపరుస్తూ 'ఘటము కంటె వేరైన మఠము లేదు/ ఆత్మకంటె వేరైన హరియు లేదు' అని చెప్పారు. ఆత్మతత్త్వం అర్థం అయితే హెచ్చు తగ్గులు వాటంతట అవే సమాజం నుండి దూరం అవుతాయనే అనుభవజ్ఞుల మాటలను ఒక్క పాదంలో అర్థమయ్యేలా సిద్ధప్ప చెప్పారు. ఆయన కాలజ్ఞాని కూడా! నిజాం ప్రభుత్వం కూలుతుందని, కరీంనగర్‌కు దక్షిణాన పెద్ద జలాశయం (మానేరు) ఏర్పడుతుందని ముందే ఊహించి చెప్పారు.

'తెలంగాణ తొలి సమాజ కవి'గా, 'తెలంగాణ వేమన'గా వెలుగొంది 'గోల్కొండ కవి'గా గోల్కొండ కవుల సంచికలో ఒకరిగా వెలుగొందారు. పరిశోధకుడు జయధీర్ తిరుమలరావు సిద్ధప్పను వేమనతో పోల్చారు. బిరుదురాజు రామరాజు తన యోగుల పుస్తకంలో సిద్ధప్ప గూర్చి సమీక్షించారు. రచనల ద్వారా సమాజ మూఢత్వాన్ని, కులం కుళ్ళును ముక్కుసూటిగా ఖండించిన సిద్ధప్ప 1984 మార్చి 23న తనువు చాలించారు. 1996లో ఆయన విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి నాడు గుండారెడ్డి పల్లెలో సమారాధనోత్సవం జరగటం విశేషం. కులాలకు అతీతుడైన ఆ మహనీయుని మార్గంలో పయనిస్తూ సమరసతాయుక్త సామాజిక భారతాన్ని నిర్మిద్దాం.

– సాకి, కరీంనగర్ I 9949394688

ఆ వ్యాఖ్యలు ముమ్మాటికీ తప్పే!

కశ్మీర్ వేర్పాటు వాదుల తీవ్రవాద చర్యలను సమర్థిస్తూ, భారత సైన్యంపై విషం కక్కుతూ ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్ చేసిన వ్యాఖ్యలు 14 సంవత్సరాల క్రిందటివి. 2010 అక్టోబర్ 21న దేశ రాజధాని నగరం ఢిల్లీలో 'ఆజాది ఓన్లీ ద వే' అనే అంశంపై కశ్మీరీ వేర్పాటు వాదులు ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కశ్మీర్ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్, రచయిత్రి అరుంధతీ రాయ్ భారత సైన్యానికీ, భారత ప్రభుత్వానికీ వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు క్షమించరానివి. ఈ వ్యాఖ్యలు రాజ్యాంగం ఇచ్చిన వాక్ స్వాతంత్ర్య పరిధిని అతిక్రమించాయనే చెప్పాలి. దేశభద్రతపై ఆ వ్యాఖ్యలు చూపే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని, సామాజిక కార్యకర్త సుశీల్ పండిట్ ఫిర్యాదు మేరకు 'ఉపా' కింద 2010 అక్టోబర్ 28న ఢిల్లీ పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు. లౌకికవాద ముసుగు వేసుకున్న కాంగ్రెస్ తదితర పార్టీల నాయకులు కశ్మీర్ వేర్పాటువాదుల వాదనలకు వ్యతిరేకంగా విచారణ చేస్తే... ముస్లిం ఓటు బ్యాంకు ఎక్కడ దెబ్బ తింటుందో అనే భీతితో ఆ కేసును తొక్కి పట్టారు.

వాస్తవంగా దేశ భద్రతతో ముడిపడిన ఈ విషయంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నడిచే కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచించి ఉండాలి. 14 ఏళ్లు ఆ కేసుపై విచారణ జరగకుండా తాత్సారం చేయడం దేశాన్ని ప్రేమించే వాళ్లకు మాత్రమే ఆశ్చర్యం కలిగిస్తుంది. దేశ భద్రత విషయంలో కఠిన వైఖరి అవలంబించే మోదీ ప్రభుత్వం పది సంవత్సరాలు ఈ కేసును విచారణ చేయకుండా నిర్లక్ష్యం చేయడానికి కారణాలనూ దేశ ప్రజలకు వివరించవలసిన బాధ్యత మూడోసారి అధికారాన్ని చేపట్టిన ఎన్డీఏ ప్రభుత్వ పెద్దలదే! అనూహ్యంగా ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఈ కేసు ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వడం దేశ ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. దేశానికి వ్యతిరేకంగా, దేశ భద్రతకు సవాల్‌గా మారిన తీవ్రవాదులకు అనుకూలంగా గళం విప్పిన వాళ్ళ పని పట్టడానికి మూడోసారి అధికారంలో కూర్చున్న మోదీ ప్రభుత్వం చురుకుగా పని చేస్తుందని ముందస్తు సమాచారం ఇవ్వడంలో భాగంగానే ఈ 'ఉపా' కేసును తెరపైకి తెచ్చేలా కేంద్రం చేసిందా అనే అనుమానం దేశ ప్రజలకు కలగక మానదు.



'ఆజాదీ ఓన్లీ ద వే' కాన్ఫరెన్స్‌లో అరుంధతీ రాయ్ మాట్లాడిన మాటలను, ఆమె ఉద్దేశాలను ఈ దేశ ప్రజలకు తెలియజేయవలసిన బాధ్యత ఎవరిది? కశ్మీర్ స్వతంత్ర దేశమనీ, దాన్ని భారత ప్రభుత్వం దౌర్జన్యంగా ఆక్రమించిందనీ, కశ్మీర్ ప్రజలు స్వతంత్రంగా బతికే హక్కు ఉందనీ, ఈ హక్కు కోసం భారత సైన్యంతో పోరాడే కశ్మీరు వేర్పాటు వాదులు తన సోదరులనీ, ఈ పోరాటంలో భారత సైన్యానికి ఎదురొడ్డి నిలవడం సమర్థనీయమనీ ఆమె చేసిన వ్యాఖ్యలను దేశ ప్రజలకు తెలియనీయకుండా కనుమరుగు చేసింది ఎవరు?

స్వాతంత్ర్యానంతరం 562 సంస్థానాలు భారతదేశంలో విలీనమైనట్లే జమ్మూ-కశ్మీర్ సంస్థానం రాజు 'రాజా హరి సింగ్' భారత ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొని, జమ్మూ-కశ్మీర్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశారు. నిజానికి పాకిస్తానే 1948లో కశ్మీర్‌లో మూడో వంతును ఆక్రమించింది. దాన్ని 'పాక్ ఆక్రమిత కశ్మీర్' అని పిలుస్తున్నారు. అప్పటి నుంచి కశ్మీర్‌లో పాక్ వెన్నుదన్నుతో తీవ్రవాదులు చేసిన మారణహోమం అంతా ఇంతా కాదు.

ఈ దేశంలో ఉంటూ, ఈ దేశం గాలి పీల్చుతూ, ఈ దేశం తిండి తింటూ, ఈ దేశం ముక్కలు కావాలని ఎవరు కోరినా క్షమించరాని నేరమే అవుతుంది.

– ఉల్లి బాలరంగయ్య, సామాజిక, రాజకీయ విశ్లేషకులు

నమ్మకం వమ్ముకాదు!

అనన్యాశ్చిన్తయన్తో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్

– ఇది భగవద్గీతలోని 9 వ అధ్యాయంలో ఉన్న 22వ శ్లోకం. దీని అర్థం: ఎవరు ఇతర భావములు లేనివారై నన్ను గూర్చి చింతించుచు ఎడతెగక ధ్యానించుచున్నారో అట్టివారి యోగక్షేమములను నేను వహించుచున్నాను (పుట – 683 – గీతా మకరందం). ఇవి శ్రీకృష్ణ భగవానుడు అర్జునునకు చెప్పిన మాటలు. మనం మహాభారతం చదివితే శ్రీకృష్ణుడు ఎల్లవేళలా పాండవులను కనిపెట్టి ఉండి, ఎన్నో కష్టాల నుండి వారిని కాపాడి గట్టెక్కించిన సంగతి తెలిసి వస్తుంది. మహాభారతాన్ని కొంతసేపు ప్రక్కన పెడదాం.

జ్యోతిర్మయం

మొన్న మొన్న జీవించిన శ్రీ రామకృష్ణ పరమహంస తనను నమ్ముకొన్న, తననే ధ్యానించిన శిష్యులను ఎలా సంరక్షించాడో కళ్ళారా చూసి, స్వయంగా అనుభవించిన వారు చెప్పిన, గ్రంథస్థం చేసిన విషయాలను పరికిద్దాం.

రామకృష్ణ పరమహంస ధర్మపత్ని శారదా దేవి చెప్పిన మాటలివి– 'వారంతా (శ్రీరామకృష్ణుల యువ శిష్యులు) బారానగర మఠంలో ఎంత కఠోరమైన జీవితాన్ని గడిపారో కదా! నిరంజన్ తదితరులు పస్తులుండేవారు. వాళ్ళు తమకున్న సమయాన్ని పూర్తిగా జపధ్యానాలలో గడిపేవారు. ఒకరోజు వారంతా తమలో తాము ఇలా తీర్మానించుకున్నారు. 'శ్రీరామకృష్ణుల పేరిట మనమంతా సర్వసంగ పరిత్యాగం చేశాం. కేవలం ఆయన మీదే ఆధారపడ్డాం. కనుక, ఆయన మనకు ఈనాడు అన్నం పెడతాడో లేదో చూద్దాం. మన అవసరాల గురించి ఇతరులెవరికీ ఏమీ చెప్ప వద్దు. భిక్ష కోసం బయటకు వెళ్ళవద్దు.' ఇలా నిశ్చయించుకొని ధ్యానంలో కూర్చొన్నారు. రాత్రి బాగా పొద్దు పోయింది. ఇంతలో ఎవరో గది తలుపు తట్టడం వినబడింది. తలుపు తెరచి చూస్తే అద్భుతం! గంగానది సమీపంలోని లాలా బాబు కృష్ణ మందిరం నుంచి వచ్చిన ఒక వ్యక్తి చేతుల్లో రుచికరమైన పదార్థాలతో కనిపించాడు. ఆ శిష్యుల ఆనందానికి అవధుల్లేవు. శ్రీరామకృష్ణులు వారిని సదా కనిపెట్టి సంరక్షిస్తున్నాడన్న నమ్మకం వారిలో మరింత బలపడింది. (పుట 666 – శ్రీరామకృష్ణ లీలామృతం).'మీ యోగ క్షేమాలను నేను చూసుకొంటాను' అని శ్రీకృష్ణుడు చెప్పినా శ్రీరామకృష్ణులు చెప్పినా అది కచ్చితంగా అలా జరిగి తీరుతుంది.

సందేహించాల్సిన పనేలేదు!

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం


శ్రీ క్రోధి నామ సంవత్సరం; ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; **తిథి:** శు.చవితి ఉ.6.36 వరకు, తదుపరి పంచమి; **నక్షత్రం:** మఖ ఉ.9.55 వరకు, తదుపరి పుబ్బ; **వర్జ్యం:** సా.6.43 నుండి 8.28 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.11.38 నుండి 12.30 వరకు; **అమృత ఘడియలు:** ఉ.7.12 నుండి 8.56 వరకు, తిరిగి తె.5.15 నుండి 7.01 వరకు (తెల్లవారితే గురువారం); **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు; **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **సూర్యోదయం:** 5.35; **సూర్యాస్తమయం:** 6.35

తహసీల్దార్ల బదిలీలకు త్రిసభ్య కమిటీ

సాక్షి, హైదరాబాద్: సాధారణ బదిలీల్లో భాగంగా రాష్ట్రంలోని తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్ల బదిలీల కోసం ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ముగ్గురితో కమిటీని ఏర్పాటు చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

యాదాద్రిలో క్యూలైన్ నుంచే స్వామివారి దర్శనం

తిరుమల తరహాలో ఏర్పాట్లు



సాక్షి, యాదాద్రి: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వయంభూ దర్శన భాగ్యం ఇక నుంచి క్యూలైన్ నుంచే నేరుగా దక్కనుంది. భక్తులు ఆలయంలోకి ప్రవేశించగానే ముఖ మండపం క్యూలైన్‌ల నుంచే స్వయంభూలను దర్శించుకునేందుకు వీలుగా దేవస్థానం ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న క్యూలైన్లలో ఒకటి ప్రత్యేక దర్శనం కోసం, మరొకటి బ్రేక్ దర్శనం కోసం ఉపయోగించనున్నారు. భక్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు దేవస్థానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈవో భాస్కరరావు 'సాక్షి'కి వెల్లడించారు. ప్రతిరోజు వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. తిరుమల తర్వాత అత్యధిక మంది భక్తులు దర్శించుకునే యాదాద్రిలో భక్తులకు మరిన్ని వసతులు కల్పిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రెండు క్యూలైన్లు ఆలయ ప్రాకారం వెంట ఉన్నాయి. భక్తులు గర్భాలయం గడప ముందుకు వచ్చే వరకు స్వామి దర్శన భాగ్యం లభించదు. అయితే, తిరుమల బాలాజీ దేవాలయం మాదిరిగా దేవునికి అభిముఖంగా క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నారు. క్యూలైన్‌లో 20 మీటర్ల నుంచే స్వయంభూలను నేరుగా దర్శించుకునే వీలు కల్పిస్తున్నారు. ఆలయ ముఖ మండపంలోకి రాగానే మూలవరులను దర్శించుకుంటూ ముందుకు సాగుతారు.

సింగరేణిలో మహిళలకూ 'కారుణ్యం'

సింగరేణి (కొత్తగూడెం): మహిళలకు అండర్ గ్రౌండ్, పర్సనల్ విభాగాల్లో నియామక అవకాశాలు కల్పించిన సింగరేణి.. తాజాగా మంగళవారం మరో సువర్ణావకాశం కల్పించింది. ఇప్పటివరకు కుమారులకే పరిమితమైన కారుణ్య నియామకాలను కూతుళ్లకు కూడా వర్తింపజేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. సంస్థలో పనిచేసే ఉద్యోగి వివిధ కారణాలతో మృతిచెందితే ఆయన స్థానంలో కుమారులకు ఇచ్చేవారు. వారికి 18 ఏళ్ల వయసు లేకుంటే వచ్చేంతవరకు ఆపి.. 18 ఏళ్లు నిండాక ఉద్యోగం ఇచ్చేవారు. పురుషులకు మాత్రమే ఉన్న ఈ వెసులుబాటును ఇక నుంచి మహిళలకు కూడా వర్తింపజేస్తున్నారు. ఈ మేరకు అన్ని ఏరియాల జీఎంలకు సమాచారం అందించారు. డిపెండెంట్ ఉద్యోగాల కోసం ఇటీవల కొందరు తప్పుడు సమాచారంతో (కొడుకులు, అల్లుళ్లు కానివారు కూడా) విధుల్లో చేరుతున్న నేపథ్యంలో ఈ అక్రమాలకు చెక్ పెట్టేందుకు సంస్థ మంచి నిర్ణయం తీసుకుందని కార్మికులు, కార్మిక సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నీటిపారుదల శాఖలో 'టెక్నికల్' బదిలీలకు మార్గదర్శకాలు

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో ఒకే చోట 4 ఏళ్లు, ఆపై కాలం నుంచి కొనసాగుతున్న నాన్ టెక్నికల్ పర్సనల్ అసిస్టెంట్లు, టెక్నికల్ ఆఫీసర్, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్ల బదిలీలకు ఆ శాఖ ఈఎన్‌సీ (అడ్మిన్) మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేటగిరీల వారీగా బదిలీ కానున్న వారి సీనియారిటీ జాబితాను విడుదల చేశారు. ఈనెల 12లోగా ఆన్‌లైన్ ద్వారా ఆప్షన్లు ఇచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2 ఏళ్లు పూర్తి చేసుకున్న వారు కూడా ఆన్‌లైన్ ద్వారా రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వారు కూడా 12లోగా ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇచ్చి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఏఈ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు శాఖలో రిపోర్టు చేసిన తర్వాతే ఇంజనీర్ల బదిలీల ప్రక్రియను ప్రారంభించాలని నీటిపారుదల శాఖ నిర్ణయం తీసుకుంది.

ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు నియామకాలకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: అగ్నిపథ్ పథకంలో భాగంగా భారత వాయుసేనలో అగ్నివీర్ వాయుగా పనిచేసేందుకు అవివాహితులైన అభ్యర్థుల నుంచి అధికారులు దరఖాస్తులు ఆహ్వానించారు. ఈనెల 8న ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ ఈనెల 28న రాత్రి 11 గంటలతో ముగియనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కోసం https://agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. అదనపు వివరాల కోసం సికింద్రాబాద్‌లోని నెంబర్-12, ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్‌లో సంప్రదించవచ్చని, లేదా 040-27753500 నంబర్‌కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు. co.12asc&ap@gov.in ఈ-మెయిల్ ఐడీకి మెయిల్ కూడా పంపవచ్చని అధికారులు పేర్కొన్నారు.

బెట్టింగ్ ఆడి.. ప్రాణాలు తీసుకుని..

పోచారం: కాలేజీ ఫీజు చెల్లించమని తల్లిదండ్రులు డబ్బు పంపితే.. బెట్టింగ్ ఆడి పోగొట్టుకున్న ఒక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనపై రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి. నల్లగొండ పట్టణం రవీంద్రనగర్‌కు చెందిన కొండూరు శ్రీనివాస్ కుమారుడు నితిన్ (21) యమ్నంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతూ సమీపంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. కాలేజీ ఫీజు చెల్లించమని తల్లిదండ్రులు ఇచ్చిన రూ.1.3 లక్షల డబ్బును ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడి పోగొట్టుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలోని యంనంపేట్ వద్ద ఖాజీపేట్ నుంచి సనత్‌నగర్ వైపు వస్తున్న గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి నితిన్ తల్లిదండ్రులకు సమాచారం తెలిపారు. అనంతరం మృతదేహాన్ని నితిన్ కుటుంబ సభ్యులకు అందజేశారు.



ఉక్రెయిన్ సమగ్రతను గౌరవించాలి

భారత్ మా వ్యూహాత్మక భాగస్వామి. ఇరు దేశాల మధ్య బంధాన్ని నిరంతరం సమగ్రమైన చర్చలతో ముందుకు తీసుకెళ్తున్నాం. అయితే రష్యాతో భారత్ మైత్రి కొనసాగింపుపై మా ఆందోళనలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. ఉక్రెయిన్ వివాదం విషయంలో ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు కట్టుబడి తీర్మానం చేయాలంటూ రష్యాతో చర్చలు జరిపే ప్రతి దేశాన్ని కోరతాం. ఇప్పుడు భారత్‌కు కూడా ఇదే విజ్ఞప్తి చేస్తున్నాం.

- అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్

నేరస్తునితో ఆలింగనమా?

సోమవారం ఉక్రెయిన్‌పై రష్యా దారుణ క్షిపణి దాడుల్లో ముగ్గురు చిన్నారులుసహా 37 మంది ప్రాణాలు కోల్పోయారు. 13 మంది పిల్లలు సహా 170 మంది గాయపడ్డారు. చిన్నారుల ఆసుపత్రిపైనా రష్యా కనికరంచూపలేదు. ఎంతోమంది శిథిలాల కింద సమాధి అయ్యారు. ఈరోజే ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి చెందిన నాయకుడు.. ప్రపంచంలోనే అత్యంత కిరాతక నేరస్థుడిని ఆలింగనం చేసుకున్నారు. ఇది తీవ్ర నిరాశ కలిగించింది. శాంతి ప్రయత్నాలకు ఇది గట్టి ఎదురుదెబ్బ.

- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

రక్షణ విడిభాగాల తయారీకి...
భారత్‌లో కొత్తగా ప్లాంట్

2030కల్లా 100 బిలియన్ డాలర్లకు వాణిజ్యం

దిగుమతులకు సొంత కరెన్సీల్లోనే చెల్లింపులు

మాస్కో: రష్యా నుంచి దిగుమతి చేసుకున్న ఆయుధాలు, రక్షణ ఉత్పత్తుల విడిభాగాలు ఆలస్యంగా సరఫరా అవుతుండటంతో ప్రత్యామ్నాయంగా భారత్‌లోనే విడిభాగాల తయారీ కర్మాగారాలను నెలకొల్పాలని భారత్, రష్యా నిర్ణయించాయి. దీంతో విడిభాగాల కొరతతో సతమతమవుతున్న భారత త్రివిధ దళాలకు పెద్ద ఊరట లభించనుంది. జాయింట్ వెంచర్ ద్వారా సంయుక్తంగా తయారీకి, అదనపు ఉత్పత్తులను ఉమ్మడి అంగీకారంతో ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు భారత్, రష్యా సూచనప్రాయంగా అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది. స్పేర్ పార్ట్‌లు, కాంపోనెంట్లు, మెయింటెనెన్స్‌కు సంబంధించిన ఇతర పరికరాలను ఇకపై ఇక్కడే తయారుచేయనున్నారు. ''భారత ఆత్మనిర్భరతకు బాటలు పరుస్తూనే సంయుక్తంగా పరిశోధన, అభివృద్ధి, సంయుక్తంగా రక్షణ సాంకేతికత, వ్యవస్థల ఉత్పత్తిని ఈ ఉమ్మడి సాకారం చేయనుంది' అని ఇరుదేశాలు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నాయి.

తొమ్మిది అవగాహన ఒప్పందాలు

భారత్–రష్యా మధ్య వాణిజ్యాన్ని 2030కల్లా 100 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని ఇరుదేశాలు కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి. దిగుమతులకు సొంత కరెన్సీల్లోనే చెల్లింపులు చేసుకోవాలంటూ ఈ సందర్భంగా కీలక నిర్ణయం కూడా తీసుకోవడం విశేషం. దీంతోపాటు మొత్తం తొమ్మిది అవగాహన ఒప్పందాలు కుదిరాయి.



మాస్కో శివార్లలోని పుతిన్ అధికార నివాస ప్రాంగణంలో ఇరువురు నేతల చర్చలు

బాంబులు, తూటాల నడుమ...
శాంతి చర్చలు సాగవు

పుతిన్‌కు మోదీ స్పష్టీకరణ • ఉక్రెయిన్ యుద్ధంపై చర్చలు

మాస్కో: బాంబులు, తుపాకులు, తూటాల వర్షం నడుమ శాంతి చర్చలు ఎప్పటికీ ఫలప్రదం కాబోవని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ సమస్యకు పరిష్కారం ఎప్పటికైనా చర్చలతోనే లభిస్తుంది తప్ప యుద్ధ క్షేత్రంలో కాదని కుండబద్దలు కొట్టారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో పిల్లల ఆస్పత్రిపై జరిగిన క్షిపణి దాడిపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. రెండు రోజుల రష్యా పర్యటనలో భాగంగా మంగళవారం ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో క్రెమ్లిన్ భవనంలో మోదీ 22వ ఇండో–రష్యా శిఖరాగ్ర చర్చలు జరిపారు. ముక్కుపచ్చలారని అమాయక చిన్నారులు దాడిలో పదుల సంఖ్యలో బలైన వైనం హృదయాలను తీవ్రంగా కలచివేస్తోందంటూ ఆవేదన వెలిబుచ్చారు. చర్చల వివరాలను మీడియాతో పంచుకుంటూ విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా ఈ మేరకు వెల్లడించారు. పుతిన్, మోదీ గాఢాలింగనంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చిన నేపథ్యంలో ప్రధాని తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సోమవారం పుతిన్‌తో వ్యక్తిగత సంభాషణ సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధంపై లోతుగా చర్చించినట్టు మోదీ వెల్లడించారు. ''సమస్యకు చర్చల ద్వారానే ముగింపు పలకాలన్నదే భారత వైఖరి. ఈ విషయాన్ని అంతర్జాతీయ సమాజానికి స్పష్టం చేయదలచా. అందుకు అన్నివిధాలా సాయపడేందుకు భారత్ ఎప్పుడూ సిద్ధమే. నేను చెప్పిన అన్ని విషయాలనూ పుతిన్ ఓపిగ్గా విన్నారు. ఉక్రెయిన్ సమస్యపై అభిప్రాయాలను పంచుకున్నారు. యుద్ధానికి తెర దించేందుకు ఆసక్తికరమైన మార్గాలు చర్చ సందర్భంగా తెరపైకొచ్చాయి'' అని ప్రధాని వివరించారు. భారత్‌ను పట్టి పీడిస్తున్న సీమాంతర ఉగ్రవాదాన్ని కూడా ప్రస్తావించారు. ఉక్రెయిన్ సంక్షోభ నివారణకు మోదీ చేస్తున్న ప్రయత్నాలకు పుతిన్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపినట్టు టాస్ వార్తా సంస్థ పేర్కొంది. అన్ని అంశాలపైనా మోదీ, తాను మనసు విప్పి మాట్లాడుకున్నట్టు పుతిన్ వెల్లడించారు. అనంతరం ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తూ నేతలిద్దరూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. మాస్కో సిటీ హాల్‌పై, కశ్మీర్‌లో సైనిక కాన్వాయ్‌పై ఉగ్రవాదుల ప్రాణాంతక దాడిని తీవ్రంగా నిరసించారు. ఉగ్రవాదంపై పోరులో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని ఇవి గుర్తు చేశాయన్నారు. ఉక్రెయిన్ సమస్య పరిష్కారానికి మోదీ చేసిన శాంతి ప్రతిపాదనలతో నాటో కూటమి ఏకీభవించకపోవచ్చని రష్యా అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ అన్నారు.

ద్వైపాక్షిక బంధం మరింత సుదృఢం

కొన్నేళ్లుగా ప్రపంచాన్ని వేధిస్తున్న ఆహార, ఇంధన, ఎరువుల కొరత భారత్‌లో రైతులకు ఎదురవకుండా రష్యా అందిస్తున్న సహకారం అమూల్యమంటూ మోదీ కొనియాడారు. ''పుతిన్‌తో చర్చలు అత్యంత ఫలప్రదంగా సాగాయి. వర్తకం, వాణిజ్యం, భద్రత, వ్యవసాయం, టెక్నాలజీ వంటి పలు రంగాలపై లోతుగా చర్చించాం. పలు రంగాల్లో రష్యాతో బంధాన్ని మరింతగా విస్తరించడమే మా లక్ష్యం'' అని స్పష్టం చేశారు. ఐరాసతో పాటు పలు అంతర్జాతీయ వేదికలపై పలు అంశాల్లో భారత్, రష్యా సన్నిహితంగా కలిసి పని చేస్తున్నాయని పుతిన్ అన్నారు. ''ఇరు దేశాలదీ దశాబ్దాలకు పైబడ్డ సుదృఢమైన బంధం. భారత్‌తో రష్యా వర్తకం గతేడాది ఏకంగా 66 శాతం పెరిగింది. ఈ ఏడాది తొలి త్రైమాసికంలోనే మరో 20 శాతం పెరుగుదల నమోదైంది'' అని అన్నారు. అక్టోబర్లో రష్యాలోని కజాన్‌లో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్రానికి మోదీని ఈ సందర్భంగా పుతిన్ ఆహ్వానించారు. అనంతరం మోదీ రష్యా పర్యటన ముగించుకుని ఆస్ట్రియా రాజధాని వియన్నా చేరుకున్నారు. భారత ప్రధాని ఆ దేశంలో పర్యటించనుండటం 41 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి.

రష్యా సైన్యంలోని భారతీయులకు విముక్తి!

ఉక్రెయిన్ కదనరంగంలో రష్యా సైన్యంలో పనిచేస్తున్న భారతీయులను స్వదేశానికి పంపేందుకు రష్యా అంగీకరించింది. పుతిన్ వద్ద ఈ అంశాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. యుద్ధంలో పని చేస్తున్న భారతీయులను క్షేమంగా స్వదేశానికి పంపిస్తామని పుతిన్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. రష్యాలో ఉపాధి కల్పిస్తామంటూ కొందరు భారతీయ యువకులను ఏజెంట్లు రష్యాకు తీసుకెళ్లి అక్కడి సైన్యం సహాయకులుగా నియమించిన సంగతి తెలిసిందే.

మన అభివృద్ధి ప్రపంచాన్నే
ఆశ్చర్యపరుస్తోంది

- మూడో దఫాలో మూడురెట్లు వేగంతో పనిచేస్తా..
- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరింపజేస్తా
- రష్యాలో ప్రవాస భారతీయులతో మోదీ

మాస్కో: భారత్ అద్భుత పురోగతి సాధిస్తోందని, దేశాభివృద్ధి చూసి ప్రపంచమే నివ్వెరపోతోందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మాస్కో పర్యటనలో ఉన్న మోదీ మంగళవారం అక్కడి ప్రవాస భారతీయులనుద్దేశించి ప్రసంగించారు. 'మోదీ మోదీ', 'మోదీ ఉంటే ఏదైనా సాధ్యమే' నినాదాల నడుమ నరేంద్ర మోదీ మాట్లాడారు. ''140 కోట్ల మంది భారతీయుల శక్తిసామర్థ్యాలను వినియోగించుకుంటూ భారత్ దీటుగా ఎదుగుతోంది. భారతీయులంతా వికసిత్ భారత్ కలను నిజంచేసుకునేందుకు కృతనిశ్చయంతో ముందుకుసాగుతున్నారు. 2014కు ముందు భారత్‌లో పరిస్థితి వేరేలా ఉండేది. కానీ ఇప్పుడు భారత్ పూర్తి ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతోంది. ఆత్మవిశ్వాసమే భారత్‌కున్న అతిపెద్ద మూలధనం. మీలాంటి ప్రజల ఆశీస్సులు ఉంటే పెద్ద ఆశయాలను సైతం దేశం సాధించగలదు. అనుకున్న లక్ష్యాలను భారత్ చేరుకోవడం మీరందరూ చూస్తున్నారు. రాబోయే రోజుల్లో భారత్ తన నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తూ నూతన అధ్యాయనాన్ని లిఖించబోతోంది. సవాళ్లకే సవాల్ విసిరే గుణం నా డీఎన్ఏలోనే ఉంది. సరిగ్గా నెలరోజుల క్రితం మూడోసారి ప్రధానిగా పగ్గాలు చేపట్టా. మూడో దఫాలో మూడు రెట్లు వేగంతో పనిచేస్తా. భారత ఆకాంక్షలను నెరవేరుస్తా. భారత్‌ను ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరింపజేయాలనేదే మా ప్రభుత్వ సంకల్పం. పేదల కోసం మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తాం. మూడు కోట్ల మంది పేద మహిళలు లక్షాధికారులను చేస్తాం. గత పదేళ్లలో భారత్‌లో కనిపించిన అభివృద్ధి ఒక ట్రైలర్ మాత్రమే. వచ్చే పదేళ్లలో అంతకు మించిన అభివృద్ధిని మీరు చూడబోతున్నారు'' అని మోదీ అన్నారు.

సర్వకాల సర్వావస్థలయందు స్నేహితుడే

రష్యాతో భారత బంధాన్ని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'రష్యా అనే పేరు వినబడగానే ప్రతి భారతీయుని మదిలో మెదిలే ఒకే ఒక్క వాక్యం.. సర్వకాల సర్వావస్థలయందు తోడుగా నిలిచే స్నేహితుడు. నమ్మకమైన నేస్తం' అని మోదీ కొనియాడారు. 'అన్ని కాలాల్లోనూ రష్యాతో భారత స్నేహం కొనసాగుతుంది. రష్యాలో గడ్డకట్టే చలిలో ఉష్ణోగ్రత సున్నా డిగ్రీ సెల్సియస్‌కు పడిపోతుందేమోగానీ ఇండియా–రష్యా స్నేహబంధం ఎల్లప్పుడూ 'ప్లస్'లోనే నులివెచ్చగా ఉంటుంది అని మోదీ అన్నారు.

రష్యాలో మరో రెండు కాన్సులేట్లు

రష్యాతో పర్యాటకం, వాణిజ్యం, విద్యా రంగాల్లో బంధం బలోపేతానికి భారత్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. రష్యాలో కొత్తగా రెండు నగరాల్లో భారత కాన్సులేట్లను ఏర్పాటు చేయబోతోంది. ప్రధాని మోదీ స్వయంగా ఈ విషయాన్ని ప్రకటించారు. కజన్, యెకటేరిన్‌బర్గ్ నగరాల్లో వీటిని నెలకొల్పుతారు. ప్రస్తుతం సెయింట్‌పీటర్స్‌బర్గ్, వ్లాడివోస్టాక్ నగరాల్లో మాత్రమే భారత కాన్సులేట్లు పనిచేస్తున్నాయి.

మోదీకి అత్యున్నత పౌర పురస్కారం

ఇరుదేశాల ద్వైపాక్షిక బంధాల బలోపేతానికి కృషిచేస్తున్నందుకు సూచికగా ప్రధాని మోదీని పుతిన్ 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్' పురస్కారంతో సత్కరించారు. రష్యా అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయ నేతగా మోదీ రికార్డ్ సృష్టించారు. ఈ పురస్కారాన్ని భారతీయులకు అంకితం చేస్తున్నానని పురస్కారం స్వీకరించిన సందర్భంగా మోదీ 'ఎక్స్'లో పోస్ట్‌చేశారు. రష్యాలో తొలి క్రైస్తవ మత బోధకుడైన సెయింట్ ఆండ్రూ పేరిట 1698 సంవత్సరంలో రష్యా చక్రవర్తి పీటర్ కృషితో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయడం ప్రారంభించారు.



కార్యక్రమంలో మోదీ ప్రసంగాన్ని శ్రద్ధగా వింటున్న ప్రవాస భారతీయులు

భూగోళం లాంటి మరో గ్రహం!

మాంట్రియల్: సువిశాల విశ్వంలో జీవుల నివాసయోగ్యమైన గ్రహం ఇప్పటి దాకా మనకు తెలిసి భూమి ఒక్కటే. ఇతర గ్రహాలపై జీవం ఉందా? లేదా? అనేది గుర్తించడానికి దశబ్దాలుగా పరిశోధనలు జరుగుతున్నాయి. మానవ నివాసానికి ఆస్కారం ఉన్న మరో గ్రహం కోసం అన్వేషణ కొనసాగుతూనే ఉంది. నిజంగా ఇలాంటి గ్రహం ఒకటి దొరికితే అది మానవాళికి ఒక వరం అనే చెప్పాలి. కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ మాంట్రియల్ సైంటిస్టులు ఈ దిశగా కొంత పురోగతి సాధించారు. భూగోళం లాంటి మరో గ్రహం ఉన్నట్లు గుర్తించారు. జేమ్స్ వెబ్ స్పేస్‌తో పాటు స్పిట్జర్, హబుల్ అంతరిక్ష టెలిస్కోప్‌లు సేకరించిన సమాచారాన్ని, చిత్రాలను క్రోడీకరించి ఈ సూపర్ ఎర్త్‌పై వాతావరణాన్ని అంచనా వేశారు. భూమికి 48 కాంతి సంవత్సరాల దూరంలో రాళ్లు, నీటితో నిండి ఉన్న ఈ గ్రహాన్ని ఎల్‌హెచ్ఎస్ 1140బిగా పిలుస్తున్నారు. దీనిపై నీరు చాలావరకు ద్రవ రూపంలోనే ఉందని, భూమిపై మాదిరిగానే అక్కడ నైట్రోజన్ వాయువుతో కూడిన వాతావరణం ఉందని పరిశోధకులు చార్లెస్ కాడియక్స్ తెలిపారు. భూమి కంటే పెద్దదైన ఇది ఎరుపు రంగు మరుగుజ్జు నక్షత్రం చుట్టూ పరిభ్రమిస్తోందని వెల్లడించారు.

పూరీ రథయాత్రలో మరో అపశ్రుతి

భువనేశ్వర్: ఒడిశాలో పూరీలోని జగన్నాథుని రథయాత్రలో మంగళవారం మరో అపశ్రుతి చోటుచేసుకుంది. బలభద్రుని భారీ దారు విగ్రహం గుండీచా మందిరంలోకి తీసుకువెళ్లే క్రమంలో రథంపై నుంచి పడిపోయింది. ఘటనలో 9 మంది సేవకులు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ ఐదుగురిని ఆస్పత్రిలో చేర్చారు. ఘటన తర్వాత జగన్నాథ, సుభద్ర విగ్రహాలను మందిరంలోకి చేర్చినట్లు అధికారులు చెప్పారు. 15వ తేదీన మూడు దేవతా మూర్తుల విగ్రహాలు జగన్నాథుని ఆలయానికి తిరుగు పయనమవుతాయి.

రాయ్‌బరేలీలో రాహుల్ పర్యటన

వీర జవాను కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ ఎంపీ



రాయ్‌బరేలీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న చిన్నారితో ముచ్చటిస్తున్న రాహుల్ గాంధీ

రాయ్‌బరేలీ: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మంగళవారం సొంత నియోజకవర్గం యూపీలోని రాయ్‌బరేలీలో పర్యటించారు. మరణానంతరం కీర్తి చక్ర పురస్కారం పొందిన కెప్టెన్ అన్షుమన్ సింగ్ కుటుంబాన్ని పరామర్శించడంతోపాటు వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఉదయం ఢిల్లీ నుంచి లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ విమానాశ్రయానికి చేరుకున్న రాహుల్ అక్కడికి 80 కిలోమీటర్ల దూరంలోని రాయ్‌బరేలీలోకి రోడ్డు మార్గంలో ప్రయాణం చేశారు. స్థానిక అతిథిగృహంలో రాహుల్ గాంధీ కెప్టెన్ అన్షుమన్ సింగ్ తల్లి మంజు సింగ్, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మంజు సింగ్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ..తమ కుటుంబానికి సాధ్యమైనంత మేర సాయం అందేలా చూస్తామని రాహుల్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం రాహుల్ కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. స్థానిక నేతలతో ముచ్చటించారు. రాయ్‌బరేలీలోని ఎయిమ్స్‌ను సందర్శించారు. రాహుల్ మీడియాతో మాట్లాడుతూ..ఆర్మీని రెండు వర్గాలుగా విడగొట్టే అగ్నివీర్ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్రాన్ని కోరారు.

జనాభా నియంత్రణకు జాతీయ విధానం: ఆరెస్సెస్

కొన్ని ప్రాంతాల్లో ముస్లింల సంఖ్య పెరిగిపోతోందని ఆందోళన

న్యూఢిల్లీ: దేశంలో కొన్ని ప్రాంతాల్లో ముస్లింల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోందని ఆర్ఎస్ఎస్ పత్రిక 'ఆర్గనైజర్' ఆందోళన వ్యక్తం చేసింది. ''ఫలితంగా అక్కడ జనాభా అసమతుల్యత ఏర్పడుతోంది. ఈ పరిస్థితిని నివారించడానికి సమగ్ర జాతీయ జనాభా నియంత్రణ విధానం తేవాలి'' అని తాజా సంచిక సంపాదకీయంలో సూచించింది. జనాభా విషయంలో ప్రాంతాల మధ్య కూడా అసమతుల్యత కనిపిస్తోందని, దేశంలో కొన్ని రాష్ట్రాల్లో జనాభా విపరీతంగా పెరిగిపోతోందని ఆర్గనైజర్ పేర్కొంది. జనాభా పెరుగుదల నియంత్రణలో పశ్చిమ, దక్షిణాది రాష్ట్రాలు మెరుగైన పనితీరును ప్రదర్శిస్తున్నాయని ప్రశంసించింది. అయితే, జనాభా తగ్గిపోతుండడం వల్ల పార్లమెంట్‌లో తమ రాష్ట్రాల నుంచి కొన్ని సీట్లు కూడా తగ్గిపోతాయని ఆందోళన చెందుతున్నాయని వెల్లడించింది. ఇతర దేశాలతో సరిహద్దులు పంచుకుంటున్న పశ్చిమ బెంగాల్, బిహార్, అస్సాం, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాల్లో అక్రమ వలసల కారణంగా జనాభా అసహజ రీతిలో పెరుగుతోందని వివరించింది. దేశవ్యాప్తంగా చూస్తే జనాభా పెరుగుదల స్థిరంగా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ కొన్ని మతాలు, ప్రాంతాలకు సంబంధించి జనాభా పెరుగుదలలో స్పష్టమైన వ్యత్యాసాలు ఉన్నాయని, కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా సరిహద్దు జిల్లాల్లో ముస్లింల జనాభా పెరుగుతోందని స్పష్టం చేసింది.

ముస్లింలు పూజాసామగ్రి అమ్మకుండా నిలువరించాలి: వీహెచ్‌పీ

ఆలయాల సమీపంలో ముస్లింలు ప్రసాదాలు, ఆహార పదార్థాలు, పూజా సామగ్రి విక్రయించకుండా నిలువరించాలని వీహెచ్‌పీ డిమాండ్ చేసింది. 'కేదర్‌నాథ్ వంటి ప్రఖ్యాత పుణ్యక్షేత్రాల వద్ద కొందరు ముస్లిం దుకాణదారులు ప్రసాదాలు, పూజ సామగ్రిపై ఉమ్మేసి వాటిని విక్రయిస్తున్నారు'' అని ఆరోపించింది.

కుట్రను కొట్టిపారేయలేం

హత్రాస్ తొక్కిసలాటపై 'సిట్' నివేదిక

లక్నో: 121 మందిని బలితీసుకున్న హత్రాస్ తొక్కిసలాట వెనుక పెద్ద కుట్రను కొట్టిపారేయలేమని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) పేర్కొంది. ఈ మేరకు తన ప్రాథమిక దర్యాప్తు నివేదికను మంగళవారం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సమర్పించింది. నివేదికపై ప్రభుత్వం వెంటనే స్పందించింది. తొక్కిసలాటకు బాధ్యులుగా గుర్తిస్తూ స్థానిక సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్(ఎస్‌డీఎం), సర్కిల్ అధికారి, ఎస్‌హెచ్ఓ, తహసీల్దార్, ఇన్‌స్పెక్టర్, పోలీసు ఔట్‌పోస్టు ఇన్‌చార్జిని సస్పెండ్ చేసింది. ఈ నెల 2న యూపీలోని హత్రాస్ జిల్లా ఫుల్‌రాయ్ గ్రామంలో సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాటలో 121 మంది మరణించిన సంగతి తెలిసిందే. స్థానిక అధికారుల తప్పిదాలు, నిర్లక్ష్యం వల్ల తొక్కిసలాట జరిగినట్లు 'సిట్' తన నివేదికలో పేర్కొంది. ఈ ఘటనకు సత్సంగ్ నిర్వాహకులు కూడా బాధ్యత వహించాలని తేల్చిచెప్పింది.

ముంబై బీఎండబ్ల్యూ ప్రమాదం కేసు..
ప్రధాన నిందితుడు మిహిర్ షా అరెస్ట్

ముంబై: ముంబై బీఎండబ్ల్యూ హిట్ అండ్ రన్ కేసులో ప్రధాన నిందితుడు, శివసేన నేత కుమారుడు మిహిర్ షా (24)ను పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. ఆదివారం ఉదయం మద్యం మత్తులో కారు నడుపుతూ బైక్‌ను ఢీకొట్టడంతో కావేరీ నఖ్వా అనే మహిళ చనిపోగా ఆమె భర్త గాయపడటం తెలిసిందే. మూడు రోజులుగా పరారీలో ఉన్న మిహిర్‌ను ముంబైలోని విరార్ వద్ద మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అతని తల్లి, ఇద్దరు చెల్లెళ్లను మరో 10 మందితో కలిపి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మిహిర్‌కు మద్యం సరఫరా చేసిన బార్ యజమానిని అరెస్ట్ చేయడంతో పాటు బార్‌ను మూసేశారు. మిహిర్ తండ్రిని, స్నేహితున్ని ఇప్పటికే అరెస్ట్ చేశారు.



నీ రాక కోసం...

అంతరిక్షంలో చిక్కుబడ్డ సునీత

- నెలకు పైగా ఐఎస్ఎస్‌లోనే ఎదురుతెన్నులు
- దానికి చేయాల్సిన రిపేర్లపై నాసా కసరత్తులు
- బోయింగ్ వ్యోమనౌకలో సమస్యలే కారణం
- ఐఎస్ఎస్‌లో పరిశోధనల్లో గడుపుతున్న సునీత
- తిరుగు ప్రయాణానికి మరింత సమయం!

సునీతా విలియమ్స్. పరిచయమే అవసరం లేని పేరు. భారత మూలాలున్న ఈ నాసా వ్యోమగామి మరో సహచరునితో కలిసి ఇటీవలే ముచ్చటగా మూడో అంతరిక్ష యాత్ర చేపట్టి మరోసారి వార్తల్లోకెక్కారు. తీరా అంతరిక్ష కేంద్రానికి చేరాక వ్యోమ నౌకలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అక్కడే చిక్కుబడిపోయి నెలకు పైగా రోజూ వార్తల్లోనే నిలుస్తూ వస్తున్నారు. వ్యోమ నౌకకు నాసా తలపెట్టిన మరమ్మతులు ఎప్పటికి పూర్తవుతాయి, సునీత ఎప్పుడు సురక్షితంగా తిరిగొస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. దీనికి ఎప్పటికి తెర పడుతుందన్న దానిపై ప్రస్తుతానికైతే స్పష్టత లేదు...



ఐఎస్ఎస్‌లో సునీత, విల్మోర్

ప్రపంచంలో అతి పెద్ద ఏరో స్పేస్ కంపెనీల్లో ఒకటైన బోయింగ్ ప్రయోగాత్మకంగా చేపట్టిన తొలి మానవసహిత రోదసీ యాత్రలో సునీత భాగస్వామి అయ్యారు. సహచరుడు బారీ బుచ్ విల్మోర్‌తో కలిసి బోయింగ్ 'స్టార్‌లైనర్' వ్యోమ నౌకలో జూన్ 5న అంతరిక్ష కేంద్రానికి పయనమయ్యారు. అయితే యాత్ర సజావుగా సాగలేదు. ఐఎస్ఎస్‌తో అనుసంధానమయ్యే క్రమంలో హీలియం లీకేజీ మొదలుకుని వ్యోమ నౌకలో పలు లోపాలు తలెత్తాయి. ఉత్కంఠ నడుమే ఎట్టకేలకు జూన్ 6న స్టార్‌లైనర్ సురక్షితంగా ఐఎస్ఎస్‌తో అనుసంధానమైంది. నిజానికి ఇది మానవసహిత యాత్రల సన్నద్ధతను పరీక్షించేందుకు బోయింగ్ చేసిన క్రూ ఫ్లైట్ టెస్ట్ (సీఎఫ్‌టీ). షెడ్యూల్ ప్రకారం సునీత, విల్మోర్ వారం పాటు ఐఎస్ఎస్‌లో ఉండి జూన్ 13న బయల్దేరి 14న భూమికి చేరుకోవాలి. కానీ ఐఎస్ఎస్‌తో అనుసంధానమయ్యే క్రమంలో హీలియం లీకేజీ తదితరాలకు తోడు వ్యోమ నౌకలో మరిన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినట్టు గుర్తించారు. వీటన్నింటినీ సరిచేసే పనిలో నాసా ప్రస్తుతం తలమునకలుగా ఉంది. వ్యోమగాములను వెనక్కు తీసుకొచ్చే విషయంలో తమకు హడావుడేమీ లేదని నాసా కమర్షియల్ క్రూ ప్రోగ్రాం మేనేజర్ స్టీవ్ స్టిచ్ స్పష్టం చేశారు. వారి భద్రతకే తొలి ప్రాధాన్యమని వివరించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

సమస్యలు ఏమిటి?

- స్టార్‌లైనర్ వ్యోమ నౌకలో ఏకంగా ఐదు చోట్ల హీలియం లీకేజీలు చోటుచేసుకున్నాయి. ఇది పెను సమస్య. దీనివల్ల వ్యోమనౌక లోపలి భాగంలో అవసరమైన మేరకు ఒత్తిడిని మెయిన్‌టెయిన్ చేయడం కష్టమవుతుంది. నౌక పనితీరూ బాగా దెబ్బ తింటుంది.
- దీంతోపాటు వ్యోమ నౌకలో కీలకమైన 28 రియాక్షన్ కంట్రోల్ సిస్టం థ్రస్టర్లలో ఏకంగా ఐదు విఫలమైనట్టు నాసా సైంటిస్టులు గుర్తించారు. అవి ఉన్నట్టుండి పని చేయడం మానేశాయి. సురక్షితంగా తిరిగి రావాలంటే కనీసం 14 థ్రస్టర్లు సజావుగా పని చేయాలి.
- ప్రొపెల్లెంట్ వాల్వ్ కూడా పాక్షికంగా ఫెయిలైంది.
- వీటిని పరిశీలిస్తున్న క్రమంలో మరిన్ని సాంకేతిక సమస్యలూ బయటపడ్డాయి. థ్రస్టర్లలో ప్రస్తుతానికి నాలుగింటిని రిపేర్ చేశారని, అవి సజావుగా పని చేస్తున్నాయని చెబుతున్నారు.
- ఈ సమస్యలను సరి చేసేందుకు బోయింగ్ బృందం నాసాతో కలిసి పని చేస్తోంది. నెవెడాలో అచ్చం ఐఎస్ఎస్ తరహా పరిస్థితులను సృష్టించి స్టార్‌లైనర్‌లో తలెత్తిన సమస్యలను ఎలా పరిష్కరించాలో పరీక్షిస్తున్నారు. ఇది తుది దశలో ఉన్నట్టు సమాచారం.

ప్రత్యామ్నాయాలూ ఉన్నాయి...

బోయింగ్ స్టార్‌లైనర్ గరిష్ఠంగా 45 రోజుల పాటు ఐఎస్ఎస్‌తో అనుసంధానమై ఉండగలదు. అది జూన్ 6న అక్కడికి చేరింది. ఆ లెక్కన జూలై 22 దాకా సమయముంది. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే? సునీత, బుచ్ విల్మోర్‌లను వెనక్కు తీసుకొచ్చేందుకు ప్రత్యామ్నాయాలున్నాయి. స్పేస్ ఎక్స్‌కు చెందిన క్రూ డ్రాగన్ ద్వారా, లేదంటే రష్యా సూయజ్ వ్యోమ నౌక ద్వారా వారిని వెనక్కు తీసుకురావచ్చు.

ఐఎస్ఎస్‌లోనే మకాం

సునీత, విల్మోర్ ప్రస్తుతానికి ఐఎస్ఎస్‌లోనే సురక్షితంగా ఉన్నారు. సునీత తన అనుభవం దృష్ట్యా పరిశోధనలు, ప్రయోగాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే అక్కడున్న ఏడుగురుతో కలిసి ఐఎస్ఎస్ నిర్వహణకు సంబంధించిన కార్యకలాపాల్లో బిజీగా గడుపుతున్నారు.

నేను, మీ సునీతను...!

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న సునీతా విలియమ్స్ తమ తాజా అంతరిక్ష యాత్ర గురించి ప్రత్యక్ష ప్రసారం ద్వారా మాట్లాడనున్నారు. భారత కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 8.30కు ఈ కార్యక్రమం ఉంటుంది. నాసా టీవీ, నాసా యాప్, సంస్థ వెబ్‌సైట్‌తో పాటు యూట్యూబ్‌లో దీన్ని ప్రత్యక్షంగా వీక్షించవచ్చు.



భాగ్యనగరంలో నిత్యం చిన్నారులు మొదలు విద్యార్థులు, పెద్దల దాకా లాగించే స్ట్రీట్ ఫుడ్ గోల్‌గప్పా.

అదేనండి.. పానీపూరీ లేదా గప్‌చుప్.

పానీపూరీలకు మధ్యలో చిల్లు పెట్టి.. ఉడికించిన ఆలూ, కాబూలీ చెనా దట్టించి.. ఆపై పుదీనా, చింతపండు, మసాలా కలగలిపిన నీటిలో ముంచి ఇస్తుంటే మనోళ్లు గుటుక్కుమనిపిస్తుంటారు. దాని రుచికి ఫిదా అవుతూ వహ్వా అంటుంటారు. గల్లీగల్లీలో కనిపించే పానీపూరీ బండ్ల వద్ద ఈ టేస్టీ ఎక్స్‌పీరియన్స్ కోసం క్యూలు కూడా కడుతుంటారు. కానీ కొందరు పుదీనా నీటిలో కలిపే కృత్రిమ రంగులు, పూరీల తయారీకి వాడే నూనెల వల్ల అనారోగ్యం పాలవుతారని వైద్యులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరిస్తున్నా ఎవరూ పెద్దగా పట్టించుకోవట్లేదు. అయితే ఇటీవల తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లో పానీపూరీ నమూనాలను పరీక్షించగా వాటిల్లో కేన్సర్‌కారక పదార్థాలు ఉన్నట్లు తేలింది. దీంతో పానీపూరీల వినియోగంపై నిషేధం విధించాలని ఆ రాష్ట్రాలు యోచిస్తున్నాయి.

పానీ పూరీ రోగాల దారి

పానీపూరీ నీటిలో కలిపే రసాయనాల్లో కేన్సర్ కారకాలు ఉన్నట్లు గుర్తించిన కర్ణాటక, తమిళనాడు

తమ రాష్ట్రాల్లో వాటిని నిషేధించాలని ఆయా ప్రభుత్వాల యోచన

నగరంలోనూ చాలా చోట్ల కలుషిత వాతావరణంలో అపరిశుభ్ర నీటితో తయారీ

అల్సర్లు, డయేరియా, క్షయ, టైఫాయిడ్ సోకే ప్రమాదముందంటున్న వైద్యులు

ఇప్పటికే గోబీ మంచూరియాపై పలు రాష్ట్రాల బ్యాన్

సాక్షి, హైదరాబాద్

పానీపూరీల తయారీలో వాడే పదార్థాలు ఎలా ఉన్నా.. చాలా మంది పరిశుభ్రమైన వాతావరణంలో వాటిని తయారు చేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన కొన్ని వీడియోలు సైతం అప్పుడప్పుడూ చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా కలుషితమైన నీటినే కొందరు చిరువ్యాపారులు వినియోగిస్తున్నారు. అలాంటి నీటిలో ఈ-కొలి వంటి బ్యాక్టీరియా, సూక్ష్మక్రిములు, ఇతర రోగకారకాలు ఉంటాయి. అలాంటి నీటిని పానీపూరిలో వాడితే ఇక మన ఆరోగ్యం అంతే సంగతులు.

ఎసిడిటీ.. అల్సర్లు..!

పానీపూరీ అంటే ఎంత ఇష్టమైనా అతిగా తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే తరచూ పానీపూరీ లాగించే వారిలో గ్యాస్ట్రిక్ ట్రబుల్, ఎసిడిటీ, అల్సర్ వంటి జబ్బులు చిన్న, పెద్ద అనే తేడా లేకుండా వస్తున్నట్లు చెబుతున్నారు. దీనివల్ల టైఫాయిడ్, కలరా వంటి వ్యాధులు కూడా ప్రబలే ప్రమాదం ఉందని వైద్యులు అంటున్నారు.

వర్షాకాలంలో జాగ్రత్త..

అసలే వర్షాకాలం.. ఇంట్లో తాగే నీటి విషయంలోనే చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే కలరా, డయేరియా వంటి అనారోగ్యాలు చుట్టుముడతాయి. అలాంటిది ఏ నీటిని వాడారో తెలియని పానీపూరీ బండ్ల వద్ద తిని ఏరికోరి అనారోగ్య సమస్యలు తెచ్చుకోవడం ఎందుకని వైద్యులు ప్రశ్నిస్తున్నారు. ఎందుకంటే.. సాధారణంగా చిరువ్యాపారులు ఎక్కడా చేతులకు గ్లౌజులు తొడుక్కోరు. ఒక చేత్తో పొయ్యిపై ఆలూ, శనగలను ఉడకబెడుతూనే అదే చేత్తో ఉప్పు, కారం, మసాలాలు చల్లుతూ పక్కనుండే ఓ నీటి గిన్నెలో చేతులు కడుగుతుంటారు. ఆపై అదే చేత్తో పానీపూరీలను మసాలా నీటిలో ముంచి అందిస్తుంటారు.

టీబీ వచ్చే చాన్స్..

అపరిశుభ్ర వాతావరణంలో తయారైన ఆహార పదార్థాలు, పరిసరాల వల్ల క్షయ వ్యాధి వచ్చే ప్రమాదమూ ఉంది. ఇదే విషయాన్ని అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధకులు కూడా చెబుతున్నారు. అపరిశుభ్ర ప్రదేశాల్లో ఉండే బ్యాక్టీరియాలు శోషరస గ్రంథుల్లోకి (లింఫ్ ఎడినైటిస్) చేరితే క్షయ వ్యాధి (ఎక్స్‌ట్రా పల్మొనరీ) సోకే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.



మెనింజైటిస్ వచ్చే ప్రమాదం

పానీపూరీలో ఎలాంటి నీళ్లు వాడుతారో తెలియదు. కలుషితమైన నీటిలో బ్రెయిన్ ఈటింగ్ అమీబా ఉండే అవకాశం ఉంది. ఇటీవల కేరళలో ఇలాంటి కేసులు నమోదయ్యాయి. దీంతో మెనింజైటిస్ అనే వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. ఎక్కువగా చిన్న పిల్లల్లో వస్తుంది. ఇది చాలా ప్రాణాంతక వ్యాధి.

- డాక్టర్ నాజ్నీన్ తబస్సుమ్

ఇంట్లో చేసుకుంటే మేలు..

పానీపూరీ అంటే ఇష్టమున్నా బయట తింటే అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయని బాధపడుతున్నారా? అయితే ఎంచక్కా ఇంట్లోనే రుచిగా, శుచిగా తయారు చేసుకోండి. ఇందుకు అవసరమయ్యే పదార్థాలన్నీ దుకాణాల్లో దొరుకుతాయి. వాటిని ఎలా తయారు చేయాలో యూట్యూబ్ వీడియోల్లో చూసి

మిగతా 8వ పేజీలో ▶

రెయిన్.. ఫ్యాషైన్..



- సీజన్‌కు అనుగుణంగా మార్పు చేర్పులు
- అందుబాటులో వాటర్ ప్రూఫ్ ఫ్యాబ్రిక్స్
- తేమను విడగొట్టే పాలియెస్టర్ బ్లెండ్స్
- ఫుట్ వేర్ కూడా ఫ్యాషనబుల్‌గా

- వివరాలు 13లో

ఆహా సురభి

నాటకరంగానికి కేరాఫ్..

సినిమాలకు దీటుగా సెట్టింగులు

రాజసం ఉట్టిపడే నటన

అద్భుత హావభావాలు

139 వసంతాలుగా ప్రదర్శనలు

- వివరాలు 13లో

చిన్నచిన్న మార్పులతో ఈ–మెయిల్ క్రియేట్ చేసిన సైబర్ కేటుగాళ్లు	ఇటీవల ఓ ఫార్మా సంస్థ నుంచి రూ.11 కోట్లు కాజేసే యత్నం	హైదరాబాద్‌లో తరచూ 'అకౌంట్ టేకోవర్లు'	వీటి ద్వారా కాజేసే మొత్తాలు లక్షలు, కోట్లలోనే	ఆన్‌లైన్ లావాదేవీల్లో అప్రమత్తత అవసరం అంటున్న సైబర్ సెక్యూరిటీ అధికారులు



కోట్లు కొట్టేసి

సాక్షి, హైదరాబాద్

ఒక వెబ్‌సైట్ అడ్రస్‌కు సంబంధించి చివరలో ఉండే .కామ్‌కు బదులు .నెట్ ఎంటర్ చేస్తే ఏమవుతుంది? ఆ సైట్ తెరుచుకోకపోవడమో లేదా మరో సైట్‌కు కనెక్ట్ కావడమో జరుగుతుంది. అయితే అకౌంట్ టేకోవర్ ఫ్రాడ్స్‌లో ఇలా జరిగితే మాత్రం భారీగా ఆర్థిక నష్టం వస్తుంది. నగరానికి చెందిన వ్యాపారవేత్తలు, సంస్థలు తరచూ ఈ నేరాల బారినపడుతున్నాయి. ఇలాంటి ఓ ఈ–మెయిల్‌ను నమ్మిన రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఓ ఫార్మాస్యూటికల్ కంపెనీ ఇటీవల ఏకంగా రూ.11.4 కోట్లు సైబర్ నేరగాళ్ల ఖాతాకు బదిలీ చేసింది. అమెరికాకు చెందిన బ్యాంకు అప్రమత్తతతో ఈ మొత్తం సేఫ్‌గా ఉన్నా, రాజధాని కేంద్రంగా తరచూ ఈ అకౌంట్ టేకోవర్ ఫ్రాడ్స్ జరుగుతున్నట్టు చెబుతున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ కేవీఎం.ప్రసాద్ ఆన్‌లైన్ లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలంటున్నారు.

బాధితులుగా మారేది వ్యాపారులు, సంస్థలే..

అకౌంట్ టేకోవర్‌గా పిలిచే ఈ సైబర్ నేరాల్లో ఒకప్పుడు బాధితులంతా ఉత్తరాదిలో ఉన్న వ్యాపారులే ఉండేవారు. ఆపై హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఈ తరహా నేరాలు జరుగుతున్నాయి. ఈ సైబర్ నేరం చేయడానికి తొలుత నైజీరియన్లు గ్రూపులుగా ఏర్పడి వ్యాపార/ఆర్థిక లావాదేవీలతో కూడిన ఈ–మెయిల్ ఐడీలను గుర్తించి హ్యాక్ చేస్తారు. అందులో ఉండే లావాదేవీలతోపాటు వారి భాషాశైలి, చెల్లింపులు/వసూళ్ల విధానాన్ని కొంతకాలం పాటు క్షుణ్ణంగా పరిశీలిస్తారు. ప్రధానంగా ఇంపోర్ట్–ఎక్స్‌పోర్ట్ వ్యాపారం చేసే వారే ఎక్కువగా టార్గెట్ అవుతున్నారు. హ్యాకింగ్ చేసిన తర్వాత ఏ దశలోనూ సదరు వ్యాపారికి అనుమానం రాకుండా జాగ్రత్త పడతారు.

చిక్కకుండా ఉండేందుకు జాగ్రత్తలు

అకౌంట్ టేకోవర్ స్కామ్స్‌లో టార్గెట్ చేసిన సంస్థ నుంచి డబ్బు డిపాజిట్ చేయించుకోవడానికి బ్యాంకు ఖాతాలు ఎంతో కీలకం. వీటిని వారే నేరుగా తెరిస్తే పోలీసులకు దొరికే అవకాశాలు ఉంటాయి. ఇలా కాకుండా ఉండేందుకు ఇక్కడివే, బోగస్ చిరునామాలతో ఉండేవి తప్పనిసరి. దీనికోసం నైజీరియన్లు భారీ పథక రచన చేస్తున్నారు. నకిలీ పత్రాలతో వీటిని తెరుస్తున్నారు. రాయదుర్గంలోని ఫార్మా స్యూటికల్ సంస్థ నుంచి రూ.11.4 కోట్లు కాజేయడానికి ప్రయత్నించిన నేరగాళ్లూ ఇలానే చేశారు. అయితే నగదు రిసీవ్ చేసుకునే సంస్థ పేరుతోనే బ్యాంకు ఖాతా తెరవడం సాధ్యం కాలేదు. కొద్దిగా మార్పులతో కూడిన పేరుతో సంస్థను ఏర్పాటు చేసి ఆ పేరుతో ఖాతా తెరిచారు. రాయదుర్గం సంస్థ నుంచి వెళ్లిన నగదును అమెరికాలోని బ్యాంకు నేరుగా ఈ ఖాతాలోకి బదిలీ చేయాల్సి ఉండగా, కంపెనీ పేరుతో ఉన్న మార్పును గమనించి ఆ మొత్తాన్ని హోల్డ్‌లో పెట్టింది. దీంతో రూ.11.4 కోట్లు నేరగాళ్ల పాలు కాకుండా ఆగాయి.

చిన్నచిన్న మార్పులతో మెయిల్ ఐడీలు...

సైబర్ నేరగాళ్లు ఇలా హ్యాక్ చేసిన ఈ–మెయిల్‌ను నిరంతరం అధ్యయనం చేయడం ద్వారా వారికి డబ్బు రావాల్సి, చెల్లించాల్సిన సమయం వచ్చే వరకు వేచి చూస్తున్నారు. సరైన టైమ్‌లో నగదు రిసీవ్ చేసుకునే సంస్థ పేరును పోలిన, అదే యూజర్ నేమ్‌తో కూడిన, ఆఖరులో ఉండే .కామ్, .నెట్ తదితరాలను మార్చి ఈ–మెయిల్ ఐడీలు క్రియేట్ చేస్తున్నారు. వీటిని వినియోగించి నగదు పంపాల్సిన సంస్థకు నగదు రిసీవ్ చేసుకునే సంస్థ నుంచి వచ్చినట్టే ఈ–మెయిల్ పంపుతున్నారు. అందులో ఆడిటింగ్, ఫైనాన్షియల్ ఇయర్ ఎండింగ్‌ల తోపాటు సాంకేతిక కారణాలను వివరిస్తూ..నిత్యం నగదు బదిలీ చేసే బ్యాంక్ ఖాతాకు కాకుండా మరో దానికి పంపాల్సిందిగా కోరుతున్నారు. రాయదుర్గంలోని ఫార్మా స్యూటికల్ సంస్థ విషయంలో ఇలానే జరిగింది. ఈ సంస్థకు ముడిసరుకు సరఫరా చేసే అమెరికన్ సంస్థను పోలిన ఈ–మెయిల్ ఐడీ సృష్టించారు. అసలు దానికి చివరలో .కామ్ ఉంటుంది. అయితే సైబర్ నేరగాళ్లు .నెట్‌తో ముగిసేలా మరోటి సృష్టించారు. దీని ఆధారంగా మెయిల్ పంపి రూ.11.4 కోట్లకు సమానమైన అమెరికన్ డాలర్లు తమ ఖాతాల్లో వేయించుకున్నారు.

సరిచూసుకోకుంటే నష్టపోవాల్సిందే



కేవీఎం.ప్రసాద్, డీఎస్పీ, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో

అకౌంట్ టేకోవర్ నేరాల్లో ప్రతి ఏడాది నగరానికి చెందిన వ్యాపారులు, వ్యాపార సంస్థలు రూ.లక్షలు, కోట్లల్లో నష్టపోతున్నారు. ఈ–మెయిల్స్ విషయంలో చాలా మంది దాన్ని పంపిన యూజర్ నేమ్ చూసి ఎదుటివారు తమ వారే అని భావిస్తారు. అనేక ఈ–మెయిల్ ఖాతాలకు ఒకే యూజర్ నేమ్ ఉండవచ్చు. అందులో ప్రధానంగా యూజర్ ఐడీని చూడాలి. ఈ–మెయిల్స్ అవి పంపిన సంస్థల నుంచి వచ్చినట్టు ఉన్నా.. ఆఖరులో .కామ్ ఉందా? .నెట్ ఉందా? అనేది క్షుణ్ణంగా గమనించాలి. సైబర్ నేరగాళ్లు ఎక్కువగా ఇంటర్ నెట్‌లో ఫ్రీగా దొరికే '.ఓఆర్‌జీ'తో కూడినవి తయారు చేసి వాడతారు. ఈ తరహా నేరాల్లో నిందితులు చిక్కడం, నగదు రికవరీ కావడం కష్టసాధ్యం.

అకౌంట్ టేకోవర్ నేరాల్లో నష్టపోయిన కొన్ని సంస్థలు...

2020 జూలై	కేపీసీ ఇన్‌ఫ్రా, హైదరాబాద్	రూ.9.9లక్షలు
2020 అక్టోబర్	పోకర్ణ ఇంజనీరింగ్ స్టోన్ లిమిటెడ్	రూ.2.09లక్షలు
2021 ఫిబ్రవరి	హేమా ఎలక్ట్రానిక్స్, సికింద్రాబాద్	రూ.లక్ష
2021 జూన్	నిర్మా సిన గ్లాస్ కంపెనీ, మాసబ్‌ట్యాంక్	రూ.55లక్షల స్వాహాకు యత్నం
2022 ఏప్రిల్	అమీర్‌పేటకు చెందిన ఓ సంస్థ	రూ.1.19కోట్లు
2022 జూలై	నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్	రూ.64లక్షలు
2023 ఫిబ్రవరి	హెచ్‌బీఎల్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థ, బంజారాహిల్స్	రూ.1.16కోట్లు
2023 మార్చి	ఏబీఆర్ ఆర్గానిక్స్ లిమిటెడ్ సంస్థ, బాగ్‌అంబర్‌పేట	రూ. 7 లక్షలు

పానీపూరీ.. రోగాల దారి!

▶ 8వ పేజీ తరువాయి

నేర్చుకొని ఇంట్లోనే ఎంచక్కా తయారు చేసుకుంటే చాలు. రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం మీ సొంతం అవుతుంది.

ఆటోమేటిక్ పానీపూరీ డిస్పెన్సర్లు..

ఇటీవల కాలంలో చాలా ప్రాంతాల్లో ఆటోమేటిక్ పానీపూరీ డిస్పెన్సర్లు అందుబాటులోకి వచ్చాయి. వెండింగ్ మెషీన్ లాంటి ఈ డిస్పెన్సర్లలో మనం డబ్బు చెల్లిస్తే చాలు పానీపూరి ఆటోమేటిక్‌గా మనం తీసుకుని ఎంజాయ్ చేయొచ్చు. దీనివల్ల కొంతలో కొంత కలుషితం కాకుండా ఉంటుంది.





గోబీ మంచూరియాపై నిషేధం..

గోబీ మంచూరియాపై ఇప్పటికే దక్షిణాదిలోని నాలుగు రాష్ట్రాలు నిషేధం విధించాయి. గోబీ మంచూరియాను గోవా, పుదుచ్చేరి, తమిళనాడు, కర్ణాటక బ్యాన్ చేశాయి. టార్‌ట్రజైన్, కార్మోసిన్, సన్‌సెట్ యెల్లో, రోడమైన్ అనే రసాయనాలను గోబీ మంచూరియా తయారీలో వాడుతున్నారని, అవి తీవ్ర అనారోగ్య సమస్యలు తీసుకొస్తాయని గుర్తించారు. గోబీ మంచూరియాతోపాటు పీచు మిఠాయిని కూడా ఆయా రాష్ట్రాలు నిషేధించాయి. వాటిల్లో వాడే రసాయనాలు చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు కారణం అవుతాయని చెబుతున్నారు.



రుచి కాదు.. శుచి ముఖ్యం..

పానీపూరీ బండ్లు కొన్ని చోట్ల అపరిశుభ్రమైన వాతావరణంలో ఉంటాయి. చేతులు కడగకుండానే ఇస్తుంటారు. వాటినే చాలామంది రుచిగా తింటారు. అయితే రుచి కాదు.. శుచి ముఖ్యం.. ఈ మధ్య చిన్నపిల్లలు, కాలేజీ విద్యార్థులు ఇష్టంగా తినే మెనూలో పానీపూరీ ఉండటం బాధాకరం.

- వేణుగోపాల్, బ్యాంకు ఉద్యోగి, ఉప్పల్

దుమ్ము, ధూళి వాటిపైనే..

పానీపూరీ చాలామంది తింటుంటారు. అందులో వాడే నీరు ఎలాంటిదో ఎవ్వరికీ తెలియదు. పైగా.. ప్లాస్టిక్ ఫోమ్ ప్లేట్లు వాడుతుంటారు. వాటి మీద వేడి పదార్థాలు వేస్తే.. రసాయనాలు కరిగి.. ఆరోగ్య సమస్యలు తెస్తుంటాయి. ఆ బళ్ల కూడా రోడ్ల పక్కనే ఉంటాయి. దుమ్ము, ధూళి వాటిపై పడి కలుషితం చేస్తాయి.

- సురేశ్ బొల్లేపల్లి, అంబర్‌పేట



సాక్షి హైదరాబాద్

బుధవారం । 10 । జూలై । 2024



హైదరాబాద్ టు సింగపూర్

సింగపూర్ టూరిజం బోర్డు కన్ను హైదరాబాద్ మీదకు మళ్లింది. హైదరాబాదీల్లో పర్యాటకం పట్ల పెరుగుతున్న ఆసక్తి సింగపూర్‌కు కనక వర్షం కురిపిస్తోంది. -10లో



వరద గోడుకు అడ్డు'గోడ'

వర్షం వస్తే చాలు మౌలాలి డివిజన్‌లోని దీన్ దయాళ్‌నగర్ కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. -12లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/23.0

నగర పరిధిలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. నైరుతి దిశలో గంటకు 6 నుండి 10 కి.మీ వేగంతో ఉపరితల గాలులు వీచే అవకాశం ఉంది.

అనురాగ హృదయం!

- 9 ఏళ్ల చిన్నారికి వెంట్రిక్యులర్ సెప్టల్ డిఫెక్ట్
- రూ.12 లక్షల క్రౌడ్ ఫండింగ్ సేకరణ
- చికిత్స చేయించిన 'ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్'



సాక్షి, సిటీబ్యూరో: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తొమ్మిదేళ్ల బాలిక సానియాకు 'ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్' అండగా నిలిచింది. రూ.12 లక్షల క్రౌడ్ ఫండింగ్ సేకరించి చిన్నారికి చికిత్స చేయించి ప్రాణం పోసింది. కర్నూలు జిల్లాకు చెందిన సానియా వెంట్రిక్యులర్ సెప్టల్ డిఫెక్ట్ వ్యాధితో బాధపడుతోంది. దీనిని నయం చేయడానికి సీహెచ్‌డీ– వీఎస్‌డీ అనే చికిత్సకు దాదాపు రూ.12 లక్షలు అవసరమయ్యాయి. సానియా తండ్రి రాళ్లు కొట్టే పని చేస్తుంటాడు. తల్లి సాధారణ గృహిణి. కుమార్తెకు చికిత్స చేయించే ఆర్థిక స్తోమత లేకపోవడంతో దాతల సహాయం కోసం ఎదురు చూశారు. విషయం తెలుసుకున్న 'ప్యూర్ లిటిల్ హార్ట్స్' ఫౌండేషన్ చిన్నారి సానియాను చేరదీసింది. వివిధ వేదికల్లో క్రౌడ్ ఫండింగ్ చేపట్టింది. వివిధ సంఘాలను సంప్రదించింది. ఈ ప్రయత్నంలో క్రౌడ్ ఫండింగ్‌తో పాటు సంజన అనే వ్యక్తి ప్రత్యేకంగా ఆర్థిక సహాయం అందించడంతో నగరంలోని రెయిన్‌బో చిల్డ్రన్ హార్ట్ ఇనిస్టిట్యూషన్‌లో విజయవంతంగా సర్జరీ చేయించారు. తమ కూతురు సర్జరీకి ఆర్థిక సాయం అందించిన దయార్ద్ర హృదయులైన దాతలకు, పీఎల్‌హెచ్‌ఎఫ్ సంస్థకు సానియా తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

హెచ్ఎండీఏ భూములకు ఫెన్సింగ్

సాక్షి, సిటీబ్యూరో: మియాపూర్‌లోని హెచ్ఎండీఏ భూములకు అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. ఒకవైపు అక్రమ నిర్మాణాల కూల్చివేత పనులను కొనసాగిస్తూనే మరోవైపు 8.5 కిలోమీటర్ల పరిధిలో ఫెన్సింగ్ పనులను ప్రారంభించినట్లు అధికారులు చెప్పారు. సర్వే నంబర్లు 100, 101లలో ఉన్న 445 ఎకరాల హెచ్ఎండీఏ భూముల్లో పెద్ద ఎత్తున ఆక్రమణలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఇటీవల నిర్మాణాల తొలగింపు చర్యలను చేపట్టిన సంగతి తెలిసిందే. పలువురికి నోటీసులు సైతం అందజేశారు. భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ట్రెంచింగ్ పనులను కూడా చేపట్టినట్లు పేర్కొన్నారు. మరోవైపు వివిధ ప్రాంతాల్లో ఉన్న హెచ్ఎండీఏ భూములు అన్యాక్రాంతం కాకుండా అవకాశం ఉన్న అన్ని చోట్ల జియోఫెన్సింగ్ చేయాలని భావిస్తున్నారు. సీసీ కెమెరాలు, సెక్యూరిటీ సిబ్బందిని నియమించడంతో పాటు ఫెన్సింగ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు.

ఫ్లై ఓవర్ పనులు వేగవంతం చేయండి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి



గచ్చిబౌలిలో ఫ్లై ఓవర్ పనులను పరిశీలిస్తున్న ఆమ్రపాలి

గచ్చిబౌలి: ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొండాపూర్ వెళ్లేందుకు నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులను వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. మంగళవారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలో గచ్చిబౌలి జంక్షన్, ట్రిపుల్ ఐటీ జంక్షన్, లింగంపల్లి ఆర్ఓబీ, మసీద్‌బండ తదితర ప్రాంతాలలో ఆమె పర్యటన చేశారు. ఫ్లై ఓవర్ పనులు నత్తనడకన సాగడంపై కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫ్లై ఓవర్‌కోసం భూ సేకరణను వేగవంతం చేయాలని, ఆస్తుల యజమానులకు టీడీఆర్ రూపంలో పరిహారం అందజేయాలని చెప్పారు. జంక్షన్లను అభివృద్ధి చేసి ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలపై ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కూడళ్ల సుందరీకరణ, కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్ పేర్కొన్నారు. మసీద్‌బండ–గచ్చిబౌలి రోడ్డు విస్తరణకు ఆటంకంగా ఉన్న కోర్టు కేసులను త్వరగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ వైన్ తయారీ.. మహిళ అరెస్టు



ముషీరాబాద్: ఇంట్లో కల్తీ వైన్ తయారు చేసి విక్రయిస్తున్న మహిళను మంగళవారం ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ డి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. లాలాగూడ, విజయపురి కాలనీకి చెందిన గెరాల్డింగ్ మిల్స్ గృహిణి. తన ఇంట్లో ద్రాక్ష పండ్లు, చక్కెరతో కల్తీ వైన్ తయారు చేస్తూ వాటిని లీటర్, రెండు లీటర్ల బాటిళ్లలో నింపి విక్రయిస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఉదయం ఆమె ఇంటిపై దాడి చేసి తనిఖీలు నిర్వహించగా 112 బాటిళ్లలో నింపిన 90 లీటర్ల కల్తీ ద్రాక్ష వైన్‌ను పట్టుకున్నారు. వైన్‌ను నింపడానికి సిద్ధంగా ఉన్న ఖాళీ బాటిల్స్‌ను సైతం సీజ్ చేశారు. గెరాల్డింగ్ మిల్స్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ పోలీసులు పేర్కొన్నారు.

నేడు 'గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్'

గచ్చిబౌలి: కేన్సర్ అవేర్‌నెస్‌లో భాగంగా 130కి పైగా దేశాల నుంచి లక్ష మంది ప్రజలు పాల్గొనే ప్రపంచంలోనే అతిపెద్ద గ్లోబల్ గ్రేస్ కేన్సర్ రన్– 2024 ఏడో ఎడిషన్‌ను బుధవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేశారు. గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్, క్యాంబియంట్ డెవలపర్స్ ఆధ్వర్యంలో నేటి మధ్యాహ్నం 3 గంటలకు సైబరాబాద్ కమిషనరేట్ వద్ద సీపీ అవినాష్ మహంతి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభిస్తారు. కార్యక్రమంలో గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి పాల్గొంటారు.



అమ్మవారి కల్యాణానికి వస్తున్న జోగిని శ్యామల



ఎల్లమ్మ కల్యాణ ఘట్టం



ఎల్లమ్మ కల్యాణం.. ఎల్లెడలా ఆనందం

తండోపతండాలుగా తరలివచ్చిన భక్తజనం

- బల్కంపేట పరిసరాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి కొండా సురేఖ

అమీర్‌పేట: జయహో ఎల్లమ్మా అంటూ భక్తుల నినాదాలు.. శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికతను సంతరించుకుంది. భక్తుల కోర్కెలు తీర్చే బల్కంపేట శ్రీ రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. మంగళవారం ఇక్కడి ఆలయంలో నిర్వహించిన పూజల అనంతరం సర్వాంగసుందరంగా తీర్చి దిద్దిన కల్యాణ వేదికపైకి ఉత్సవ మూర్తులను తీసుకువచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఉదయం 11.34 నిమిషాలకు ముఖ నక్షత్రయుక్త అభిజిత్ లగ్న సుముహూర్తంలో కల్యాణం వైభవంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పుస్తె, మెట్టెలు, పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.

హాజరైన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, సీఎస్..

కల్యాణ మహోత్సవానికి నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలి వచ్చారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి, పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హనుమంత్‌రావు, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి శశిధర్‌రెడ్డి, కాట్రగడ్డ ప్రసూన, కార్పొరేటర్ సరళ, ఈఓ అంజనీదేవి, ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్ హాజరయ్యారు. ఎల్లమ్మ కల్యాణ వేళ.. బల్కంపేట పుర వీధులు పసుపుమయంగా మారాయి. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తజనులు అమ్మవారి కల్యాణాన్ని కనులారా తిలకించి పునీతులయ్యారు. ఎల్లమ్మ కీర్తనలకు యువతీ యువకులు నృత్యాలు చేస్తూ మైమరిచిపోయారు.

ఒగ్గు కళాకారుల ఆధ్వర్యంలోనూ..

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాన్ని 30 ఏళ్లకు పైగా రాష్ట్ర దేవాదాయ శాఖ నిర్వహిస్తూ వస్తోంది. అయితే.. ఒగ్గు కళాకారులు కూడా తమ సంప్రదాయాన్ని వీడలేదు. కరువు కాటకాలు తొలగి పోవాలని, వ్యాధులు దూరం కావాలని అమ్మవారికి కల్యాణం జరిపిస్తారు. ఇదే రోజున దేవస్థానం ఆవరణలో అమ్మవారి కల్యాణ వేడుకను నిర్వహిస్తూ వస్తున్నారు.

నాయకా.. న్యాయమా?

- బీపీఎల్ కుటుంబాలు సైతం దూరమే
- కొందరికే పరిమితమైన సబ్సిడీ
- నిబంధనలపై స్పష్టత లేని అధికారులు

రూ.500 సిలిండర్ వర్తింపేదీ?



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడు నెలలు గడుస్తోంది.. కానీ.. రూ.500కు వంటగ్యాస్ అమలు మాత్రం పేద కుటుంబాలకు అందని ద్రాక్షగా మారింది. ఆరు గ్యారంటీలలో భాగంగా సిలిండర్‌పై సబ్సిడీ అందిస్తున్నా.. మెజార్టీ బీపీఎల్ కుటుంబాలకు వర్తించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. పేద కుటుంబాలు గృహలక్ష్మి పథకానికి అర్హత సాధించినా.. మహాలక్ష్మి పథకం మాత్రం అందని దాక్షగా తయారైంది. లోక్‌సభ ఎన్నికల ముందు గ్యాస్ సబ్సిడీ వర్తింపు అమలు ప్రారంభమైంది. ఆరు నెలల క్రితం నిర్వహించిన ప్రజాపాలనలో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా బీపీఎల్ కుటుంబాలను గుర్తించారు. మిగతా పథకాల మాదిరి మహాలక్ష్మి పథకానికి కూడా తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకున్నారు. కానీ పథకం వర్తింపు మాత్రం కొందరికే వర్తింపజేయడంతో నిరుపేదల్లో అంసంతృప్తి వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీ నిబంధనలపై పౌరసరఫరాల అధికారులతో పాటు ఆయిల్ కంపెనీలకు సైతం స్పష్టత కరువైంది.

ఇది పరిస్థితి..

గ్రేటర్ పరిధిలో గృహోపయోగ వంట గ్యాస్ కనెక్షన్లు 30.18 లక్షలపైగా ఉండగా అందులో సుమారు 24.74 లక్షల కుటుంబాలు మహాలక్ష్మి పథకం కింద రూ. 500కు వంట గ్యాస్ సిలిండర్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందులో సుమారు 19.01 లక్షల కుటుంబాలు మాత్రమే తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్నాయి. దరఖాస్తుదారుల్లో కేవలం 10 శాతం కుటుంబాలకు కూడా సబ్సిడీ వర్తించకపోవడం గమనార్హం.

నగదు జమ రూ.40.71

గృహోపయోగ వంట గ్యాస్ వినియోగదారులకు బ్యాంక్ ఖాతాలో నగదు బదిలీ పథకం కింద సబ్సిడీ రూ. 40.71 మాత్రమే జమ అవుతోంది. కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధరతో నిమిత్తం లేకుండా వినియోగదారుడి బ్యాంక్ ఖాతాలో పరిమితంగా నగదు జమ చేస్తోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్ ప్రకారం 14.5 కేజీల డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.855. పలుకుతోంది. గృహ వినియోగదారులందరూ సిలిండర్ ధరను పూర్తిగా చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చమురు సంస్థల ద్వారా సబ్సిడీని నగదు బదిలీ కింద వినియోగదారుల ఖతాలో జమ చేస్తూ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం గత మూడు నెలలుగా ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా కొందరు లబ్ధిదారులకు మాత్రమే సిలిండర్ ధరలో రూ. 500 మినహాయించి మిగిలిన సొమ్మును నగదు బదిలీ ద్వారా వినియోగదారుల ఖాతాలో వేస్తోంది.

కొన్నారా.. ఆక్రమించుకున్నారా?

- కుటుంబ సామాజిక, ఆర్థిక స్థితిగతులపై సమగ్ర అధ్యయనం
- 55 కి.మీ పరిధిలో 12,500 నిర్మాణాల గుర్తింపు
- ఇప్పటి వరకు 1,500 కుటుంబాల సర్వే పూర్తి
- నెల రోజుల్లో మొత్తం కానిచ్చేందుకు కార్యాచరణ

మూసీకి రెండు వైపులా 50 మీటర్ల పరిధిలో కొనసాగుతున్న సర్వే



మూసీ పరిధిలో సర్వే చేస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మూసీ అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. నదికి ఇరువైపులా నిర్మాణాలపై సామాజిక, ఆర్థిక సర్వే కొనసాగుతోంది. అటు గండిపేట నుంచి ఇటు ఘట్కేసర్ వరకు సుమారు 55 కిలోమీటర్ల మార్గంలో మూసీ నదిని పూర్తిగా ప్రక్షాళన చేయాలని ప్రభుత్వ లక్ష్యం. ఈ మేరకు ఇప్పటికే మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సామాజిక, ఆర్థిక సర్వే పనులను ప్రారంభించింది. ఇప్పటివరకు 1500కుపైగా కుటుంబాల వివరాలను సేకరించారు. నదికి రెండు వైపులా 50 మీటర్ల పరిధిలో ఉన్న నిర్మాణాలపై సర్వే చేపట్టారు. ఈ పరిధిలో సుమారు 12,500 నిర్మాణాలను తొలగించేందుకు అధికారులు గుర్తించారు.

పక్కాగా సర్వే..

సామాజిక, ఆర్థిక సర్వేలో హెచ్ఎండీఏ, జలమండలి, రెవెన్యూ, మున్సిపల్ తదితర విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయి. రెవెన్యూ మండలాల వారీగా నిర్మాణాలను గుర్తించారు. చార్మినార్ పరిధిలో కేవలం 56 నిర్మాణాలు ఉండగా, బహదూర్‌పురాలో అత్యధికంగా 2,080 ఉన్నాయి. మేడిపల్లి, ఘట్కేసర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల పరిధిలో సుమారు 100 వ్యవసాయ భూములను గుర్తించారు. ఉప్పల్ మండలంలో 1,589 నిర్మాణాలు, నాంపల్లి పరిధిలో 2,059 చొప్పున ఉన్నట్లు అధికారులు తెలిపారు. అంబర్‌పేట్, గండిపేట్, సైదాబాద్ తదితర మండలాల్లోనూ తొలగించాల్సిన నిర్మాణాలు వందల్లోనే ఉన్నాయి. రాజేంద్రనగర్‌లో 1,334, గోల్కొండ మండలంలో 1,113 నిర్మాణాలను గుర్తించినట్లు చెప్పారు. అంబర్‌పేట్‌లో 1154 నిర్మాణాలు ఉన్నాయి. ఇప్పటి వరకు సుమారు 12,500 వరకు గుర్తించారు.

- వంద మంది అధికారులతో కూడిన 33 బృందాలు సర్వే చేస్తున్నాయి. ప్రతి ఇంటికి సంబంధించిన ఆర్థిక స్థితిగతులను, సామాజిక స్థితిగతులను అధ్యయనం చేస్తున్నారు. ఎంతకాలంగా ఆ కుటుంబం ఆ ఇంట్లో నివసిస్తోంది, కుటుంబంలో ఎంతమంది ఉంటారు. వారికి ఆ ఇల్లు ఎలా వచ్చింది. స్థలం కొనుగోలు చేసి ఇల్లు కట్టుకున్నారా, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని కట్టుకున్నారా? వంటి వివరాలను సర్వేలో నమోదు చేస్తున్నారు. ఈ మేరకు 'మూసీ సామాజిక, ఆర్థిక సర్వే' సర్వే పేరిట ఒక మొబైల్ యాప్‌ను కూడా రూపొందించారు. ఈ యాప్‌లో అన్ని వివరాలను నిక్షిప్తం చేస్తున్నారు.

నెల రోజుల్లో సాధ్యమా..

చారిత్రక మూసీకి పూర్వవైభవాన్ని తెచ్చేందుకు చేపట్టిన ఈ బృహత్ ప్రాజెక్టులో ప్రస్తుతం ప్రారంభించిన సామాజిక,ఆర్థిక సర్వే తొలి అడుగు మాత్రమే. నెల రోజుల్లో ఈ సర్వేను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ గుర్తించిన 12,500 నిర్మాణాల వివరాలను కేవలం 30 రోజుల్లో సేకరించి నమోదు చేయడం సాధ్యం కాకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ సర్వే ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 1500 నిర్మాణాలను మాత్రమే సర్వే చేశారు. ప్రస్తుతం ఈ సర్వే పనులు జరుగుతున్నాయి. తొలగించనున్న నిర్మాణాలకు మూడు పద్ధతుల్లో పరిహారం అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అర్హులైన వారికి డబుల్ బెడ్రూం ఇళ్లను ఇవ్వనుంది. నగదు రూపంలో పరిహారం కోరుకొంటే చెల్లించనుంది. టీడీఆర్‌ల రూపంలోనూ అందజేయనుంది.

రూ. 200 కోట్లు.. 18 ఏళ్లు

ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినా పనులు నిల్



అప్పట్లోనే సికింద్రాబాద్ గేట్‌వేగా రూపుదిద్దుకున్న క్లాక్ టవర్



శిథిలావస్థకు చేరుకుంటున్న '200 ఇయర్స్ ఆఫ్ సికింద్రాబాద్' స్మారక స్థూపం

- లష్కర్ అభివృద్ధిపై పాలకుల నిర్లక్ష్యం
- శిథిలావస్థకు చేరిన స్మారక స్థూపం

సికింద్రాబాద్: పద్దెనిమిదేళ్ల క్రితం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీతో సికింద్రాబాద్ నగరం సమగ్ర అభివృద్ధి బాట పడుతుందని ఈ ప్రాంత ప్రజలు ఎన్నో కలలు కన్నారు. సికింద్రాబాద్ నగరం ఆవిర్భవించి 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్ ప్రకటనతో ఈ ప్రాంతంలోని ఐదు నియోజకవర్గాల్లో ప్రత్యేక ప్యాకేజీ ద్వారా భారీ అభివృద్ధి పనులకు అప్పట్లో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. కొన్నాళ్లకే ఆయన హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. ఆ తర్వాత ప్రత్యేక ప్యాకేజీని పట్టించుకున్నవారే కరువయ్యారు. లష్కర్ ద్విశతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించి నాడు ఆవిష్కరించిన స్మారక స్థూపం సైతం క్రమేణా శిథిలావస్థకు చేరుకుంటోంది. తెలంగాణ స్వరాష్ట్ర కల నెరవేరినా లష్కర్ నగరానికి న్యాయం జరగట్లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ ప్రత్యేక అభివృద్ధిని పాలకులు పట్టించుకోవట్లేదనే విమర్శలు ఉన్నాయి.

ద్విశతాబ్ది వేడుకల వేళ..

2006 నాటికి సికింద్రాబాద్ నగరానికి 200 సంవత్సరాలు నిండడంతో ద్విశతాబ్ది వేడుకలకు అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ముగింపు వేడుకలకు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హాజరై 200 ఇయర్స్ ఆఫ్ సికింద్రాబాద్ స్థూపాన్ని ఆవిష్కరించారు. రూ.200 కోట్ల ప్రత్యేక ప్యాకేజీతో ఈ ప్రాంతాన్ని సమగ్ర అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. అనంతరం వచ్చిన ఎమ్మెల్యేలు సికింద్రాబాద్ అభివృద్ధి విషయాన్ని పట్టించుకున్న దాఖలాలు లేకుండాపోయాయి. ఒకవైపు వందలాది కోట్ల రూపాయలతో కేంద్ర ప్రభుత్వం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తుండగా ఈ ప్రాంతంలో అధునాతన అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం లేదని స్థానికులు పెదవి విరుస్తున్నారు.

ప్యాకేజీ ప్రతిపాదనలివీ..

- మోండా మార్కెట్‌లో అధునాతన భూగర్భ డ్రైనేజీ నిర్మాణం.
- ప్యారడైజ్ ప్రాంతంలో ట్రాఫిక్ నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం. మల్టీ లెవల్ పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటు.
- వాహనాల సంఖ్యకు అనుగుణంగా ఇక్కడి రహదారులను ఆధునికీకరించి, పాదచారులకు మార్గం సుగమం చేయడం. ఈ ప్రాంతంలోని పార్కుల్లో విరివిగా పచ్చదనం ఏర్పాటు.
- రైల్వేస్టేషన్ సమీపంలోని క్లాక్‌టవర్‌ను ఆధునికీకరించి సికింద్రాబాద్ గేట్ వేగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ముందు స్కైవాక్‌లను ఏర్పాటు.
- పై ప్రతిపాదనల్లో క్లాక్‌టవర్‌ని ఆధునికీకరించి సికింద్రాబాద్ గేట్‌వేగా తీర్చిదిద్దడం మినహా ఇతరేతర అభివృద్ధి పనులు చేపట్టలేదు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



సికింద్రాబాద్ ప్రాంతానికి అన్ని విధాలా అన్యాయం జరుగుతోంది. ఈ ప్రాంతం నుంచి ప్రభుత్వానికి పన్నుల రూపంలో వస్తున్న ఆదాయంలో సగం నిధులు కూడా ఇక్కడి అభివృద్ధికి వెచ్చించడం లేదు. సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయడంలోనూ మొండిచేయి చూపించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా ప్రత్యేక ప్యాకేజీ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి లష్కర్‌కు న్యాయం జరిగేందుకు కృషి చేస్తాం.
– గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, లష్కర్ జిల్లా సాధన సమితి, అధ్యక్షుడు



కనీస వసతులు కరువైన సికింద్రాబాద్ మోండా మార్కెట్

హైదరాబాద్ టు సింగపూర్

నగరం నుంచి పెరుగుతున్న పర్యాటకులు • పర్యాటకం ద్వారా సింగపూర్‌కు భారీ ఆదాయం

సాక్షి, సిటీబ్యూరో: సింగపూర్ టూరిజం బోర్డు కన్ను హైదరాబాద్ మీదకు మళ్లింది. హైదరాబాదీల్లో పర్యాటకం పట్ల పెరుగుతున్న ఆసక్తి సింగపూర్‌కు కనకవర్షం కురిపిస్తోంది. సింగపూర్‌కు వెళ్లి రావడాన్ని మనోళ్లు వీకెండ్‌లో తమ సొంతూరికి వెళ్లివచ్చినట్లు భావిస్తున్నారు. అందుకు సాక్ష్యం ఈ ఏడాది తొలి ఐదు నెలల్లో చేసిన ప్రయాణాలే. ఈ ఏడాది తొలి ఐదు నెలల్లో ఐదు లక్షలకు పైగా పర్యాటకులు భారత్ నుంచి సింగపూర్ విమానం ఎక్కారు. అందులో సింహభాగం హైదరాబాదీలే అంటున్నారు సింగపూర్ టూరిజమ్ బోర్డుకు చెందిన ఇండియా, మిడిల్ ఈస్ట్ అండ్ సౌత్ ఏషియా ఏరియా డైరెక్టర్ వాంగ్ రేంజీ. సింగపూర్ గురించిన మరిన్ని విశేషాలు ఆయన మాటల్లోనే...



ఫ్యామిలీ ఫ్రెండ్లీ వెకేషన్

సింగపూర్ ప్రకృతి ఇచ్చిన వనరులను సద్వినియోగం చేసుకుంటూ మనిషి నిర్మించిన హరితసౌధం. మాన్‌మేడ్ నేచర్ అనవచ్చు. చెంగి ఎయిర్‌పోర్టు ఇందుకు గొప్ప ఉదాహరణ. ఇందులో 14 మీటర్ల వాటర్‌ఫాల్ ఉంది. ఇది ప్రపంచంలోనే ఎత్తైన ఇండోర్ వాటర్ ఫాల్. ఎయిర్‌పోర్టులో రకరకాల చెట్లు, మొక్కలు 63 వేలున్నాయి. మామూలుగా ఎయిర్‌పోర్టు అంటే రవాణా సదుపాయ కేంద్రం మాత్రమే. కానీ చెంగి ఎయిర్‌పోర్టును టూరిస్ట్ డెస్టినేషన్‌గా మలుచుకున్నాం. హాట్ ఐలాండ్ అయిన సింగపూర్‌ని కూల్‌గా మార్చింది మాన్‌మేడ్ గ్రీనరీనే. ఇది గార్డెన్ సిటీ కాదు, సిటీ ఇన్ గార్డెన్ అంటాం. జెన్ జెడ్ నుంచి, న్యూలీ మ్యారీడ్ కపుల్, పిల్లలతో వచ్చే కుటుంబాలు అన్నీ సంతోషంగా గడిపే విధంగా ఉంటుంది. క్రూయిజ్‌లో నైట్ స్టే చేయడం నుంచి కోరల్ రీఫ్స్‌ను చుట్టి రావడం, కనోపీ ట్రీ గార్డెన్ మీద స్కై వాక్... ప్రతిదీ గొప్ప అనుభూతిగా మిగులుతుంది.

యూపీఐతో చెల్లింపులు

డిజిటల్ పేమెంట్స్ విస్తృతంగా వాడుకలోకి వచ్చిన నేపథ్యంలో సింగపూర్ ఫోన్‌పే వంటి డిజిటల్ పేమెంట్ సంస్థలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో సింగపూర్ వెళ్లే ముందు కరెన్సీ మార్పిడికి వెళ్లాల్సిన అవసరం లేదు. సింగపూర్‌లో ఎక్కడ షాపింగ్ చేసినా, హోటల్‌లో బస చేసినా మనం యూపీఐ ద్వారా చెల్లిస్తే ఆటోమేటిగ్గా ఆ రోజు మారకం విలువను బట్టి సింగపూర్ డాలర్‌లోకి కన్వర్ట్ అవుతుంది. మనకు రూపాయల్లో ఎంత చెల్లించిందీ స్పష్టంగా కనిపిస్తుంది.

పీపుల్ ఫ్రెండ్లీ పోలీస్

హైదరాబాద్ నుంచి సింగపూర్‌కి వెళ్లే టూరిస్టుల్లో మహిళలు, సోలో ట్రావెలర్స్ కూడా పెద్ద సంఖ్యలో ఉంటున్నారు. అలా వచ్చిన వారికి కూడా సురక్షితమైన ప్రదేశం సింగపూర్. పోలీస్ సేవలు పీపుల్ ఫ్రెండ్లీగా ఉంటాయి. సోలో విమెన్‌కు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సేవలందించే వ్యవస్థ ఉంది.

బడ్జెట్‌లో వెళ్లి రావచ్చు



వాంగ్ రేంజీ, సింగపూర్ టూరిజం బోర్డు అధికారి

పర్యాటక ప్యాకేజీలు మధ్య తరగతి వాళ్లకు కూడా అందుబాటులో ఉండే విధంగా చూస్తున్నాం. సింగపూర్ ఎలాంటిదంటే ఓ లక్ష రూపాయలతో ఒక రోజు గడపవచ్చు, అదే లక్ష రూపాయలతో ఏడాది పాటూ నివసించవచ్చు. స్కై ఈజ్ లిమిట్ అనేది ఎంత నిజమో పైసా వసూల్‌లాగ కూడా టూర్ చేయవచ్చు. నేరుగా టికెట్ కొనుక్కుని విమానం ఎక్కేసి సింగపూర్‌లో దిగినా సరే ఎవరి బడ్జెట్‌కు తగినట్లు వాళ్లు రోజును గడపవచ్చు. ఇండియాలోని 17 నగరాలు సింగపూర్‌తో కనెక్ట్ అయి ఉన్నాయి. ఈ నగరాల నుంచి సింగపూర్‌కి వారానికి 288 విమాన సర్వీసులు నడుస్తున్నాయి. అందులోనూ హైదరాబాద్ టూ సింగపూర్ సర్వీసులదే ప్రథమ స్థానం.

హైదరాబాదీ బిర్యానీ సైతం..

దక్షిణాది రాష్ట్రాలకూ సింగపూర్‌కి ఆహారపు అలవాట్ల నుంచి జీవనశైలి వరకు అనేక విషయాల్లో అవినాభావ బంధం ఉంది. హైదరాబాద్ నుంచి పర్యాటకులు ఎక్కువ కావడంతో మెనూలో బిర్యానీని చేర్చాం. దక్షిణాది రుచుల రెస్టారెంట్ నిర్వహిస్తున్న విజయన్, ఇతర దక్షిణాది వంటల్లో నిష్ణాతులైన షెఫ్‌లు టూరిజమ్ బోర్డుతో కలిసి పని చేస్తున్నారు. మా దగ్గరకు వచ్చిన పర్యాటకులు ఇడ్లీ, దోసె, రోటీలతో తమ ఇంటి భోజనాన్ని ఆస్వాదించాలి.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

సాక్షి, సిటీబ్యూరో: మౌలిక సదుపాయాలకు సంబంధించి జీహెచ్‌ఎంసీ చేపట్టిన పనుల్ని సకాలంలో పూర్తిచేయాలని కమిషనర్ ఆమ్రపాలి సంబంధిత అధికారులకు సూచించారు. టౌన్ ప్లానింగ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలం అయినందున పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మంగళవారం బుద్ధభవన్‌ల రెవెన్యూ, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, ఫైనాన్స్ విభాగాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా అంశాలపై సూచనలు చేశారు. ఆస్తిపన్ను ద్వారా జీహెచ్‌ఎంసీ ఆదాయం పెరిగేందుకు చేపట్టిన జీఐఎస్ సర్వేను నిర్ణీత వ్యవధిలో పూర్తిచేయాలన్నారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను ఎలా తొలగించాలో వివరించారు. నాలాల్లో వరద నీరు సాఫీగా పారేందుకు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. నగరంలోని పబ్లిక్ టాయ్‌లెట్లను వినియోగంలోకి తేవాలన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులపై పోలీసులకు మేయర్ ఫిర్యాదు

హిమాయత్‌నగర్: సోషల్ మీడియాలో తనపై అసభ్యకర పోస్టులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె సోషల్ మీడియా వేదికలలో అసభ్యకరమైన వీడియోలను సృష్టించి, పోస్ట్ చేయడంపై తన పీఏ ద్వారా ఫిర్యాదు చేశారు. తనను అవమానించేలా..పరువుకు భంగం కలిగేలా పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వీడియోలను 'నిజమేనయ్య1' అనే ఎక్స్ ఖాతా పేరుతో ఫేస్‌బుక్, ఇన్‌స్టాలలో పోస్ట్ చేసి వైరల్ చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే ఈ నకిలీ వీడియోలను తొలగించి, పోస్ట్ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మేయర్ పోలీసులను కోరారు.

చెరువులకు జీవం పోద్దాం

– ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో అన్యాక్రాంతమయిన చెరువుల పునరుద్ధరణకు అడుగులేద్దామని ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్ అధికారులకు పిలుపునిచ్చారు. ట్రై సిటీ పరిధిలోని రెవెన్యూ, జీఐఎస్ హబ్ టీమ్స్, ఇరిగేషన్ విభాగాలకు చెందిన అధికారులతో మంగళవారం బుద్ధభవన్‌లో సమావేశమయ్యారు. సమావేశంలో నగరంలో గతంలో ఉన్న చెరువులెన్ని..ప్రస్తుతం ఎన్ని ఉన్నాయి.. ఎన్ని అన్యాక్రాంతమయ్యాయి..అనే అంశాలతోపాటు ప్రస్తుత చెరువుల బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్, చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణలకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం సిటీ టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బహుళ అంతస్తులు, గృహనిర్మాణాలను అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి చెరువులను ఆక్రమించి నిర్మాణాలు జరుగుతున్నాయేమో పరిశీలించాలన్నారు. ఇకపై క్షేత్రస్థాయి పరిశీలన జరిపాకే నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు.

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఇంట్లో భారీ చోరీ

మణికొండ: కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడి ఏకంగా కిలో బంగారం, ఓ ల్యాప్‌టాప్ దొంగలించిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంధంగూడ కృష్ణారెడ్డినగర్ కాలనీలో చోటుచేసుకుంది. నార్సింగి క్రైం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం...రిటైర్డ్ ఐఏఎస్ అధికారి హరిబాబు ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలసి వారం రోజుల క్రితం విజయవాడ వెళ్లారు. తిరిగి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు తెరచి ఉండటం, ఇంట్లో ఉన్న వంద తులాలకు పైగా బంగారం, ఓ ల్యాప్ ట్యాప్ కనిపించకపోవటంతో నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు మొదలు పెట్టారు. వారి ఇంట్లో సీసీ కెమెరాలు లేవని, చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని, క్లూస్‌టీం, ఫింగర్‌ప్రింట్స్ టీం ద్వారా దొంగల ఆనవాళ్లను గుర్తించే పనిలో ఉన్నామని ఎస్‌హెచ్‌ఓ హరికృష్ణారెడ్డి తెలిపారు.

క్లౌడ్ నైన్ ఆధ్వర్యంలో చైల్డ్ కేర్ సెంటర్

సాక్షి, సిటీబ్యూరో: మాతాశిశు సంరక్షణలో ప్రసిద్ధి చెందింన క్లౌడ్ నైన్ ఆధ్వర్యంలో 3వ ఆసుపత్రిని కొంపల్లిలో ప్రారంభించారు. హాస్పిటల్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆర్.కిశోర్‌కుమార్ మంగళవారం ఈ చైల్డ్ కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నితిన్ నాగ్ మాట్లాడుతూ బిడ్డ పుట్టుక అనేది తల్లిదండ్రులందరికీ ఒక గొప్ప ప్రయాణం కావాలని, దీనికి అనువైన మాతా శిశు సంరక్షణ అందించడంతో పాటు అధునాతన సాంకేతికతతో ఆరోగ్య భద్రతను క్లౌడ్ నైన్ అందిస్తుందని అన్నారు. బంజారాహిల్స్, హైటెక్ సిటీ యూనిట్లతోపాటు ఈ నూతన సెంటర్ ద్వారా నగర వాసులకు సేవలందిస్తున్నామని పేర్కొన్నారు.

ఇష్టంతో కష్టపడి చదవాలి: కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరవచ్చని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకాంక్షించారు. మంగళవారం నగరంలోని అంబర్ పేట ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతి గృహాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని బాగా చదివి జీవితంలో రాణించాలన్నారు. తాను కూడా తెలంగాణ బిడ్డనేనని, మారుమూల మెట్‌పల్లిలో ప్రభుత్వ పాఠశాలలో చదివానని, అనంతరం జగిత్యాల, కరీంనగర్, హైదరాబాద్‌లో చదివి ఈ స్థాయికి చేరానన్నారు. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం లభిస్తాయని తెలిపారు. చదువును కష్టంగా భావించకుండా ఇష్టంగా చదివినప్పుడే మంచి ర్యాంకులు సాధిస్తారని అన్నారు. భాషపై పట్టు సాధించాలన్నారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న భోజనాలను పరిశీలించారు. వసతి గృహంలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఆశన్న తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ కిచెన్‌లో కలెక్టర్ పరిశీలన..

దోపిడీ సూత్రధారులు దొరికారు

- పాతబస్తీలో పంజా విసిరిన పశ్చిమ బెంగాల్ గ్యాంగ్
- పసిడి కార్ఖానా నుంచి 80 గ్రాముల బంగారం దోపిడీ
- సూత్రధారులను అరెస్టు చేసిన సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీలోని పసిడి కార్ఖానాలో పంజా విసిరి 80 గ్రాముల స్వచ్ఛమైన బంగారం దోచుకుపోయిన పశ్చిమ బెంగాల్ ముఠా కేసును దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించారు. ఈ దోపిడీకి సూత్రధారులుగా ఉన్న ఇరువురిని పట్టుకున్నామని, వీరి నుంచి 56 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని డీసీపీ వైవీఎస్ సుధీంద్ర మంగళవారం తెలిపారు. పరారీలో ఉన్న ముగ్గురు పాత్రధారుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. కోల్‌కతా శివారు ప్రాంతాలకు చెందిన షేక్ రోస్తిక్, షేక్ హసిజుల్ నగరానికి వలసవచ్చి హుస్సేనిఆలంలో నివసిస్తున్నారు. అదే ప్రాంతంలో ఉన్న వేర్వేరు పసిడి కార్ఖానాల్లో కార్మికులుగా పని చేస్తున్నారు. ఇలా వస్తున్న ఆదాయంతో సంతృప్తి చెందని రోస్తిక్ తేలిగ్గా డబ్బు సంపాదించడానికి ఉపకరించే మార్గాలు అన్వేషించాడు. ఇందులో భాగంగా తన ఆలోచనను హసిజుల్‌కు చెప్పాడు. ఇద్దరం కలిసి తేలిగ్గా డబ్బు సంపాదిద్దామని చెప్పిన హసిజుల్.. ప్రస్తుతం తన వద్ద పశ్చిమ బెంగాల్ నుంచే బతుకుతెరువు కోసం వచ్చిన బాపి, మాణిక్, కార్తీక్ ఉన్నారని, వీరిని వినియోగించి భారీ దోపిడీ చేసి సెటిల్ అవుతామని చెప్పాడు. దీనికి రోస్తిక్ సైతం అంగీకరించడంతో ముగ్గురినీ రంగంలోకి దింపారు. కొన్ని రోజుల పాటు సూత్రధారులైన ఇద్దరూ వివిధ కార్ఖానాల్లో ఉన్న పరిస్థితులు, దోచుకోవడానికి అనువైన మార్గాలు తదితరాలను అధ్యయనం చేశారు. ఆపై ఘాన్సీబజార్‌లోని ఓ కార్ఖానాను టార్గెట్‌గా చేసుకున్నారు. ఈ నెల 5న ముగ్గురికీ కత్తులు ఇచ్చిన ఈ ద్వయం ఆ కార్ఖానాలోకి పంపారు. అక్కడ పని చేస్తున్న వారిని కత్తులతో బెదిరించిన ముగ్గురు దుండగులు 80 గ్రాముల స్వచ్ఛమైన బంగారం, సెల్‌ఫోన్లు, నగదు ఎత్తుకుపోయారు. ఈ బంగారంలో అధిక మొత్తం సూత్రధారులైన ఇద్దరికీ అప్పగించిన ఈ ముగ్గురూ మిగిలింది విక్రయించగా వచ్చిన మొత్తంతో స్వస్థలాలకు పారిపోయారు. బాధితుల ఫిర్యాదుతో హుస్సేనిఆలం ఠాణాలో కేసు నమోదైంది. ఈ దోపిడీ కేసు ఛేదించడానికి టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు నేతృత్వంలో దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర, ఎస్సైలు ఎన్.నవీన్, కె.నర్సింములు, జి.ఆంజనేయులు రంగంలోకి దిగారు. ఘటనాస్థలితో పాటు వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజ్‌తో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి ముందుకు వెళ్లారు. ఈ నేపథ్యంలోనే రోస్తిక్, హసిజుల్ దోపిడీకి సూత్రధారులు తేల్చారు. ఈ ద్వయాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ టీమ్ వీరి నుంచి 56 గ్రాముల స్వచ్ఛమైన బంగారం, రూ.90 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి చర్యల నిమిత్తం హుస్సేనిఆలం పోలీసులకు అప్పగించారు. పరారీలో ఉన్న ముగ్గురు పాత్రధారుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.


అరబ్ దేశాల్లో ఉద్యోగాలంటూ టోకరా

- దేశ వ్యాప్తంగా పలువురిని ముంచిన ఢిల్లీ వాసి
- బాధితుల జాబితాలో నగరానికి చెందిన వ్యక్తి
- అరెస్టు చేసి తీసుకువచ్చిన సిటీ సైబర్ క్రైమ్ కాప్స్

సాక్షి, సిటీబ్యూరో: వివిధ జాబ్ పోర్టల్స్‌లో దరఖాస్తు చేసుకుని, ఉద్యోగాల కోసం ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు అరబ్ దేశాల్లో ఉద్యోగాల పేరుతో ఎర వేసి మోసాలకు పాల్పడుతున్న ఢిల్లీ వాసి నిషాంత్‌ను సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. దేశ వ్యాప్తంగా అనేక మందిని ముంచిన ఈ మోసగాడు నగరానికి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.4.71 లక్షలు కాజేసినట్లు డీసీపీ డి.కవిత మంగళవారం వెల్లడించారు. తూర్పు ఢిల్లీ ప్రాంతానికి చెందిన నిషాంత్ కుమార్ రాయ్ అక్కడ ఆర్విస్ వెబ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో సంస్థను నిర్వహిస్తున్నాడు. అరబ్ దేశాల్లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు ఎర వేసి అందినకాడికి దండుకోవాలని పథకం వేశాడు. దీనికోసం నోయిడాలో ఓ కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి నలుగురు టెలీకాలర్స్‌ను నియమించుకున్నాడు. బోగస్ వివరాలతో సిమ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు సమకూర్చుకున్నాడు. ఉద్యోగార్థుల వివరాలను ఇతగాడు షైన్.కామ్, టైమ్స్ జాబ్స్.కామ్, నౌకరి.కామ్ వెబ్‌సైట్ల నుంచి సంగ్రహించే వాడు. తన కాల్ సెంటర్ నుంచి వారికి కాల్స్ చేయించి అరబ్ దేశాల్లో వివిధ ఉద్యోగాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పించేవాడు. అక్కడకు వెళ్లేందుకు ఆసక్తి చూపిన వారితో రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్, వీసా ఫీజులు, జీఎస్టీ పేరు చెప్పి విడతల వారిగా అందినకాడికి దండుకునే వాడు. ఈ మొత్తాలను బాధితుల నుంచి తాను నకిలీ పేర్లతో ఓపెన్ చేసిన బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేయించేవాడు. బాధితులకు తాము మోసం చేస్తున్నామనే విషయం తెలిసినా, వారు సందేహించినా వారి కాల్స్‌కు స్పందించవద్దంటూ టెలీకాలర్స్‌కు చెప్పి కొన్నాళ్లకు బ్లాక్ చేయించే వాడు. నిషాంత్ కోఠి ప్రాంతానికి చెందిన యువకుడిని టార్గెట్ చేశాడు. సౌదీ అరేబియాలోని జేజన్ యూనివర్శిటీలో ఉద్యోగం పేరుతో అతడి నుంచి రూ.4.71 లక్షలు కాజేశాడు. దీనిపై బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఏసీపీ ఆర్‌జీ శివమారుతి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ఎన్.బోస్ కిరణ్, ఎస్సై పి.సురేష్‌తో కూడిన బృందం ఈ కేసు దర్యాప్తు చేసింది. సాంకేతిక ఆధారాలను బట్టి నిందితుడు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నట్లు గుర్తించింది. అక్కడకు వెళ్లిన ప్రత్యేక బృందం నిషాంత్‌ను అరెస్టు చేసి పీటీ వారెంట్‌పై తీసుకువచ్చింది.

రౌడీషీటర్ బిల్లా పవన్

- 25 కేసులు..22 సార్లు జైలుకు
- తీరుమార్చుకోని రౌడీషీటర్
- మరోసారి కటకటాలపాలు



బంజారాహిల్స్: బెదిరింపుల కేసులో కరడుగట్టిన రౌడీషీటర్‌ను బంజారాహిల్స్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్‌గా ఉన్న బిల్లా పవన్ గత మే నెల 28వ తేదీన అర్ధరాత్రి బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్ బస్తీలో తమ అనుచరులు శ్రావణ్, ప్రశాంత్‌లతో కలిసి ఓ ఇంటి ముందు కూర్చొని మద్యం సేవిస్తున్నారు. అదే ప్రాంతంలో నివసించే హేమంత్ అనే యువకుడు మెడికల్ షాపులో మందులు తీసుకుని తన ఇంటికి వెళ్తుండగా మద్యం మత్తులో ఉన్న బిల్లా పవన్, ఆయన అనుచరులు అకారణంగా గొడవ పడ్డారు. దాడికి పాల్పడ్డారు. బిల్లా పవన్ తన జేబులో ఉన్న కత్తి తీసి పొడిచేందుకు యత్నించాడు. బాధితుడు వారి బారి నుంచి బయటపడి నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై బిల్లా పవన్, శ్రావణ్, ప్రశాంత్‌లపై బంజారాహిల్స్ పోలీసులు 25 ఆఫ్ ఆంసీయాక్ట్, సెక్షన్ 506, రెడ్‌విత్ 34 కింద కేసు నమోదు చేసి అదే రోజు శ్రావణ్, ప్రశాంత్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బిల్లా పవన్ పోలీసుల కళ్లుగప్పి అక్కడి నుంచి పరారయ్యాడు. తిరుపతి, బెంగుళూరు, కర్నూలు, రామేశ్వరం, కొచ్చిన్ తదితర ప్రాంతాల్లో పోలీసులకు దొరక్కుండా తిరిగినా ఎక్కడికక్కడ పోలీసుల డేగ కళ్లు తనను వెంటాడుతున్నాయని అనుమానించాడు. అనుకున్న విధంగానే పోలీసుల ఉచ్చులో సోమవారం రాత్రి ఇరుక్కున్నాడు. విచారించగా జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఎస్ఆర్‌నగర్, మధురానగర్, బోరబండ తదితర పోలీస్‌స్టేషన్ల పరిధిలో 25 కేసుల్లో 22 సార్లు జైలుకు వెళ్లినట్లు తేలింది. రెండు సార్లు పీడీయాక్ట్‌పై జైలుకు వెళ్లాడు. పేరు మోసిన రౌడీషీటర్‌గా పోలీసుల రికార్డుల్లోకెక్కాడు. నిందితుడిని తాజా కేసులో మంగళవారం రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ కేఎం రాఘవేంద్ర నేతృత్వంలో ఎస్ఐ వెంకటేష్ దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఎల్లమ్మ కల్యాణం

పంజగుట్ట: శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, డోలు చప్పుళ్ల మధ్య సోమాజిగూడలోని రేణుకా ఎల్లమ్మ దేవస్థానంలో అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే పూజలు చేసిన అనంతరం 11.30 గంటలకు కల్యాణాన్ని జరిపించారు. అలాగే అమ్మవారికి సూర్యబోనం సమర్పించారు. పూజారి, దేవస్థాన ట్రస్టు సభ్యుడు జానకీరాం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు ఎం. నాగభూషణం, విఠల్‌కుమార్, ఎం. నాగేశ్వర్‌రావు, జి. కృష్ణ యాదవ్, రమేశ్, లక్ష్మణ్, నాగరాజు, నర్సింగ్, వెంకటయ్య, కిషన్, మహేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

లిబర్టీ: దళితుల అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరుతూ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ. 25 వేల కోట్లు కేటాయించేలా చూడాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే కూడా సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

బీసీ సాధికారత సంఘం కార్యవర్గం



నూతన కమిటీని సన్మానించిన దృశ్యం

పంజగుట్ట: సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సాధికారత సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కొండ దేవయ్య పటేల్, తెలుగు రాష్ట్రాల కౌన్సిల్ అధ్యక్షుడిగా కొప్పూరి భాస్కర్ రావు, అధ్యక్షుడిగా ప్రతాని రామకృష్ణ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జే వెంకటేశ్వర్ రావుతో పాటు పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని బీసీ కుల సంఘాల నాయకులను ఐక్యం చేసి సాధికారత సంఘం ఆధ్వర్యంలో బీసీలకు ఏ సమస్య వచ్చినా ముందుంటామని, వారు రాజకీయంగా ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తామని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. వేముల తిరుమలాదేవి, గురు రాజ్, వెంకటేశ్, సముద్ర శివకుమార్, మహేందర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా

ఖైరతాబాద్: వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం హెల్త్ సెంటర్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సాయిరాం కాంట్రాక్ట్ ఏజెన్సీ తరపున రెండున్నరేళ్లుగా పనిచేస్తున్న తమకు 4 నెలలుగా కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వడం లేదన్నారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసనలో మల్లేశ్, స్వర్ణలత, అమృత, శైలజ, లక్ష్మి, శ్రీలత, అనురాధ, ఫర్జోజ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన మహిళలు

బంజారాహిల్స్: ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయ్యిందని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద మంగళవారం నిర్వహించిన ధర్నాకు ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త నీరజ, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షురాలు డోంగరి రాజకళ ఆధ్వర్యంలో మహిళలు తరలివెళ్లారు. మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. కల్యాణలక్ష్మి కింద రూ. లక్ష నగదు, తులం బంగారం, కళాశాలలకు వెళ్లే వారికి స్కూటీ వంటివి ఇంతవరకు అమలు చేయలేదని మండిపడ్డారు.

మహా అన్నదానం

బంజారాహిల్స్: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 2లోని ఇందిరానగర్ బస్తీకి చెందిన మురళీ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం మహా అన్నదానం నిర్వహించారు. కల్యాణం రోజున అన్నదానం చేయడం 25 ఏళ్లుగా ఆనవాయితీగా వస్తున్నదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆనంద్‌గౌడ్, బాబు గౌడ్, శంకర్‌గౌడ్, శరత్‌గౌడ్, అఖిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రాణాలకే ప్రమాదం

పంజగుట్ట: పాదాచారులు రోడ్డుపై నడిచేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, ఆదమరిచి నడిస్తే ప్రాణాలకే ప్రమాదమని బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్ట్యూట్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ అన్నారు. సోమాజిగూడలోని మలబార్ గోల్డ్, డైమండ్ షోరూం ఉద్యోగులకు 'రోడ్డు ప్రమాదాలు–నివారణ' అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023లో 2370 ప్రమాదాలు జరగగా అందులో 280 మంది మృతి చెందారని, ఇందులో 121 మంది పాదాచారులే ఉండడం బాధాకరమన్నారు. పాదాచారులు జీబ్రాలైన్ వద్ద మాత్రమే రోడ్డు దాటాలని, ఫుట్‌పాత్‌లను ఉపయోగించుకోవాలని, ఇప్పుడు చాలాచోట్ల స్కైబ్రిడ్జిలు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. ప్రమాదాలు నివారించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.షోరూం మేనేజర్ కిషన్‌రావు, స్టోర్ హెడ్ అయాన్, శ్రీకృష్ణ పాల్గొన్నారు.

పనుల పరిశీలన

వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఇంజినీరింగ్ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న క్యాచ్‌పిట్లు, ప్యాచ్‌వర్క్ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బోనాల ఉత్సవాల లోపు పనులు పూర్తి చేయాలని, అలాగే పాడైపోయిన క్యాచ్‌పిట్లకు మరమ్మతులు చేయాలన్నారు. అనంతరం ఆమె బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని ఎస్వీనగర్‌లోని బస్తీ దవాఖానాను పరిశీలించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో వెంటనే తగు చర్యలు చేపట్టాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కున్వర్‌కు సూచించారు.

వన మహోత్సవం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జూబ్లీహిల్స్ న్యూ ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలో గల బటర్‌ఫ్లై పార్కులో మంగళవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా అవకాశం ఉన్న ప్రతిచోట మొక్కలు నాటాలని సూచించారు.

నల్లతెరలపై స్పెషల్ డ్రైవ్!

- ఈ నెల 1 నుంచి నిర్వహిస్తున్న వెస్ట్ జోన్ ట్రాఫిక్ పోలీసులు
- కార్ల అద్దాల బ్లాక్ ఫిల్మ్‌లపై ఫోకస్
- నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా, అక్కడిక్కడే తొలగింపు
- ఇప్పటివరకు 298 మందిపై కేసు



కారు అద్దాల బ్లాక్ ఫిల్మ్‌ను తొలగిస్తున్న పంజగుట్ట ట్రాఫిక్ సీఐ గౌస్‌ఖాన్

బంజారాహిల్స్: కొంతమంది తమ భద్రత కోసం కారు అద్దాలకు బ్లాక్ ఫిల్మ్‌లు ఏర్పాటు చేసుకుంటే.. మరికొంత మంది అదొక స్టేటస్ సింబల్‌గా భావిస్తూ నిబంధనలు అతిక్రమిస్తున్నారు. ఎంవీ యాక్ట్ ప్రకారం షోరూం నుంచి బయటకు వచ్చిన కారుకు అదనపు హంగులు ఏర్పాటు చేయకుండా అలాగే నడపాలి. కానీ కొంతమంది ఆ రూల్స్ బ్రేక్ చేస్తుండడంతో వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఈ నెల 1 నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ జరిమానాలు విధించడంతో పాటు నల్ల తెరలను అక్కడికక్కడే తొలగిస్తున్నారు. ఇప్పటివరకు నిబంధనలు ఉల్లంఘించిన 298 మందిపై కేసులు నమోదు చేశారు. ఇందులో పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 103, ఎస్ఆర్‌నగర్ పరిధిలో 58, జూబ్లీహిల్స్ పరిధిలో 86, బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 51 కేసులు నమోదయ్యాయి. వీరందరికీ జరిమానాలు విధించడమే కాకుండా అక్కడికక్కడే బ్లాక్ ఫిల్మ్ తొలగిస్తూ కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నారు. దీనివల్ల తలెత్తే ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు.



బ్లాక్ ఫిల్మ్‌ను తొలగిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీధర్

బ్లాక్ తెరలు ఉంటే జరిమానా..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. షోరూం నుంచి కారు రోడ్డు మీదకు వచ్చినప్పుడు అద్దాలు ఎలా ఉంటాయో అలాగే ఉండాలి. అద్దాలకు టింటెడ్ గ్లాస్ ఏర్పాటు చేసి పట్టుబడితే అక్కడికక్కడే తొలగించి రూ.700 జరిమానా కూడా విధిస్తున్నాం. వాహనదారులు తమ కార్ల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ ఉంటే వెంటనే తొలగించుకోవాలి.

– గౌస్‌ఖాన్, ఇన్‌స్పెక్టర్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్

స్పెషల్ డ్రైవ్ కొనసాగిస్తాం..

వెస్ట్ జోన్ పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో కారు అద్దాల బ్లాక్ ఫిల్మ్‌లపై స్పెషల్ డ్రైవ్ ఇకముందు కూడా కొనసాగిస్తాం. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటున్నారు. ఎవరైనా బ్లాక్ ఫిల్మ్‌తో కారు నడిపితే జరిమానా విధించడంతో పాటు వానిని అక్కడిక్కడే తొలగిస్తున్నాం.

– హరిప్రసాద్ కట్టా, ఏసీపీ వెస్ట్‌జోన్ ట్రాఫిక్

బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులకు రివార్డు



బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులకు రివార్డు అందజేస్తున్న డీజీపీ రవిగుప్తా

బంజారాహిల్స్: బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులకు డీజీపీ రవిగుప్తా రివార్డును అందజేశారు. ఈ నెల 1న బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని మోర్ సూపర్ మార్కెట్ ఎదుట విధుల్లో ఉన్న ఏఎస్ఐ భాగేందర్‌సింగ్ వద్దకు ఓ వృద్ధురాలు వచ్చింది. గత నెల 16న తాను అగ్రసేన్ ఐల్యాండ్‌లో రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేశానంటూ ఈ–చలాన్ పడిందని పరిశీలించాలని కోరింది. దీంతో ఆమెను స్టేషన్‌లోకి తీసుకెళ్లాడు. ఈ–కాప్స్ ఆపరేటర్ మహ్మద్ ఇర్షాద్ అలీ, జీడీ రైటర్ రాఘవచారిని ఫైన్ గురించి పరిశీలించాలని సూచించారు. అయితే ఈ–చలాన్ తప్పుగా పడిందని గుర్తించిన వారు దానిని తొలగించాలని కోరుతూ ఈ–చలానా సెంటర్‌కు వారు ఈ–మెయిల్ చేశారు. సత్వర చర్యలకు ఫిదా అయిన ఆమె ఇదే విషయాన్ని డీజీపీ రవిగుప్తాతో పంచుకున్నారు. దీంతో డీజీపీ వారికి నగదు రివార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. భవిష్యత్‌లోనూ అంకితభావంతో పనిచేయాలని డీజీపీ సూచించారు.

బల్కంపేట ఎల్లమ్మకు పట్టువస్త్రాల సమర్పణ

వెంగళరావునగర్ : వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ దంపతులు మంగళవారం బల్కంపేట అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, పూజారి బాలు, కిట్టు, బాలు రజక, మహిళా నాయకురాలు కట్ట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ దేదీప్య విజయ్

కారకులను సర్వీస్ నుంచి తొలగించాలి

ఖైరతాబాద్: దళిత సామాజిక వర్గానికి చెందిన అశ్వారావుపేట ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి మృతికి కారకులైన సీఐ, ఇతర సిబ్బందిని సర్వీసు నుంచి తొలగించాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ డిమాండ్ చేశారు. మింట్ కాంపౌండ్ అంబేడ్కర్ స్ఫూర్తిభవన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఐ జితేందర్ రెడ్డి, సిబ్బంది సుభాని, శివ నాగరాజు, సన్యాసినాయుడు, శేఖర్ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మరణించిన ఎస్ఐ కుటుంబంలో ఒకరికి ఉద్యోగాన్ని ఇవ్వాలని, అంతేగాకుండా రూ. 2 కోట్ల నష్ట పరిహారం చెల్లించాలని, వారి పిల్లలకు కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య సదుపాయం కల్పించాలని, బాధిత కుటుంబానికి హైదరాబాద్‌లో 250 గజాల స్థలం కేటాయించాలని కోరారు. సమావేశంలో తెలంగాణ మాల సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్లు బాలకిషన్, మేక వెంకన్న, కో చైర్మన్ గడ్డం సత్యనారాయణ, వైస్ చైర్మన్లు మల్లేశ్, గంగాధర్, చింతపల్లి కాశీనాథ్, అచ్చుతయ్య, ఎస్.కృష్ణ, సీహెచ్ శంకర్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.43, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 45, పందిరి బీర 38, క్యాబేజీ 33, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 85, గోకరకాయ 45, కీర 25, దోసకాయ 23, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 37.

నియామకం



మాజీద్ రహమాన్

లిబర్టీ: సిటీజన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మాజీద్ రహమాన్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా రహమాన్ మాట్లాడుతూ సిటీజన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల శాఖ పరిధిలో పని చేస్తుందని ఆ శాఖ నిర్దేశించిన మేరకు తెలంగాణ వ్యాప్తంగా మానవ హక్కుల రక్షణే ధ్యేయంగా పని చేస్తానని పేర్కొన్నారు.

ఘనంగా కీర్తిరెడ్డి బర్త్ డే



శ్రీనగర్‌కాలనీ: బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు జూటూరి కీర్తిరెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేతలు ఆమెను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. నేతలు కైలాస్‌నాథ్, గూడూరి శ్రీధర్‌తో పాటు మహిళా నేతలు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి గాయాలు

వెంగళరావునగర్: బైక్‌పై నుంచి పడిపోయిన ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా వాహనం కూడా మాయమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజినీర్స్ కాలనీలో నివసించే ఎం.సాయికుమార్ అతని స్నేహితుడు గౌతంతో కలిసి బైక్‌పై ఈనెల 30న యూసుఫ్‌గూడ వైపు నుంచి అమీర్‌పేటకు వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డారు. దాంతో ఇద్దరు అపస్మారకస్థితిలోకి వెళ్లారు. వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి వారిని ఆసుపత్రిలో చేర్చారు. మరుసటి రోజు వారు ఘటనా స్థలానికి వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. దాంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు ఆభరణాల చోరీ

వెంగళరావునగర్ : ఇంట్లోని బంగారం, వెండి ఆభరణాలు చోరీకి గురైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమాదేవి, గౌతంకుమార్ రహమత్‌నగర్‌లో నివసిస్తున్నారు. ఈనెల 4న వారి కుమార్తె బర్త్‌డే ఉండడంతో 3 వ తేదీన అత్తమామలు, 7న రమాదేవి తల్లిదండ్రులు వారి ఇంటికి వచ్చారు. ఈ నెల 5న తమ కుమారుడు సరిగా చూడడం లేదని నెలకు రూ.5 వేలు ఇవ్వాలని కమాండెంట్‌కు ఫిర్యాదు చేసేందుకు అత్తమామ వెళ్లారు. ఈ నెల 8వ తేదీన ఆమె తండ్రి బంగారు ఆభరణలు బయట పెట్టి స్నానానికి వెళ్లాడు. తర్వాత ఆమె తల్లిదండ్రులు వారి ఊరికి వెళ్లారు. కుమార్తెకు ఫోన్ చేసి తమ బంగారు ఆభరణాలు తీసుకురాలేదని చూడాలని కోరగా 8 తులాల బంగారం, 3 తులాల రింగ్స్, 50 తులాల వెండి కనిపించలేదు. వాటి విలువ దాదాపు రూ.2 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. దీంతో మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్ : బంగారు మైసమ్మ 11 కేవీ ఫీడర్ శ్రీకృష్ణానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు బంగారు మైసమ్మ ఆలయం, చంద్రమ్మ గల్లీ, రహమత్‌నగర్, సంతోష్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

బీసీలకు టీపీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలి

లిబర్టీ: టీపీసీసీ అధ్యక్ష పదవిని బీసీలకు ఇవ్వాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి అన్నారు. దళ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీని నమ్ముకొని 15 ఏళ్లుగా నిజాయితీగా పని చేస్తున్న సీనియర్ బీసీ నాయకులు, మేధావులు, విద్యావేత్తలు ఎందరో ఉన్నారని వారిలో ఒకరికి అధ్యక్ష పదవికి అప్పగిస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ఆ దిశగా పార్టీ పెద్దలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు ఆలోచించాలని కోరారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్‌కు బాసటగా నిలిచారని గుర్తు చేశారు.

అకారణంగా యువకుడిపై దాడి

వెంగళరావునగర్: అకారణంగా యువకుడిపై దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమకు చెందిన పీవీ విక్రం మూడు నెలలుగా మధురానగర్ కాలనీలో ఉంటూ ఫుడ్ డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం విధులు ముగించుకుని హాస్టల్ వద్దకు రాగానే గుర్తు తెలియని ముగ్గురు యువకులు కారులో వచ్చి ఆపి ఇక్కడెందుకు ఉన్నావురా.. అంటూ బెదిరించారు. తాను హాస్టల్‌లో ఉంటున్నానని చెప్పినప్పటికీ వినకుండా దాడి చేశారు. దాంతో భయపడి హాస్టల్‌లోకి పారిపోయి ఇన్‌చార్జికి తెలియజేశారు. ఇన్‌చార్జి చందు పోలీసులకు సమాచారం అందించాడు. యువకుడు మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రెడిట్ కార్డు నుంచి నగదు తస్కరణ

వెంగళరావునగర్ : పోగొట్టుకున్న క్రెడిట్ కార్డు నుంచి రూ.లక్షకు పైగా తస్కరణకు గురైన ఘటన మధురానగర్ పీఎస్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరికి చెందిన ఎస్.సత్యసాయిరామ మధురానగర్‌కాలనీలో జ్యోతిష్యం చెబుతుంటాడు. ఈనెల 7న తన హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు పోగొట్టుకున్నాడు. దానిని బ్లాక్ చేసే క్రమంలోనే తొలుత రూ.5 వేలు విత్‌డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. అనంతరం వరుసగా మొత్తంగా రూ.లక్షా ఐదువేలు విత్ డ్రా అయ్యాయి. దాంతో ఆందోళన చెందిన సాయిరామ సామ క్రెడిట్‌కార్డు బ్లాక్ చేశాడు. అనంతరం మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీనియర్ వాకర్ మృతి



లయన్ కృష్ణకుమారి

వెంకటేశ్వరకాలనీ: కేబీఆర్ పార్కు సీనియర్ వాకర్, లయన్స్ క్లబ్ సభ్యురాలు అరిగపూడి కృష్ణకుమారి మంగళవారం మృతి చెందారు. ఆమె కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుందని భర్త లయన్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కేబీఆర్ పార్కులో వాకర్లు ఆమె మృతికి సంతాపం తెలిపారు. పార్కులో వాకర్ల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసేవారని వాకర్లు తెలిపారు. నేడు మధ్యాహ్నం 2.30 గంటలకు జూబ్లీహిల్స్ మహా ప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రత్యేక పోలీస్ అధికారుల (ఎస్‌పీఓ) ఉద్యోగ ప్రకటన

హిమాయత్‌నగర్: హైదరాబాద్ సిటీ పోలీస్‌లో 120 ప్రత్యేక పోలీసు అధికారులు (ఎస్‌పీఓ) పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నగర పోలీస్ అడిషనల్ కమిషనర్ (టీఆర్‌జీ, కార్ హెడ్ క్వార్టర్స్) మంగళవారం ఉద్యోగ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని మాజీ సైనికులు, మాజీ పారామిలిటరీ బలగాలు, రిటైర్డ్ పోలీసు సిబ్బంది మాత్రమే అర్హులని పేర్కొన్నారు. రాష్ట్రానికి చెందిన మాజీ సైనికుడు, మాజీ పారామిలిటరీ వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. రాష్ట్ర రిటైర్డ్ పోలీసులు, మాజీ సైనికుల వయస్సు 01–08–2024 నాటికి 58 ఏళ్ల కంటే తక్కువగా ఉండాలి. మాజీ పారామిలటరీ, రిటైర్డ్ పోలీసు సిబ్బంది రెండేళ్లలోపు సర్వీస్ నుంచి పదవీ విరమణ చేసిన వారై ఉండాలి. గరిష్ట వయోపరిమితి 61 ఏళ్ల వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. నెలకు గౌరవ వేతనం రూ.26,000, కాగా వేతనం చెల్లింపు లేకుండా అవసరమైతే సెలవులు మంజూరు చేస్తామని తెలిపారు. అదేవధంగా దరఖాస్తుదారులు డిశ్చార్జ్ బుక్, డిశ్చార్జ్ సర్టిఫికెట్, రిటైర్మెంట్ ఆర్డర్, ఆధార్, పాన్ కార్డ్, టెక్నికల్ ట్రేడ్ ప్రొఫిషియన్సీ సర్టిఫికెట్ గల మాజీ సైనికుడు, మాజీ పారామిలిటరీ డ్రైవర్ అభ్యర్థులకు మాత్రమే చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఒరిజినల్, జిరాక్స్ కాపీని కలిగి ఉండాలని, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల వారు వ్యక్తిగతంగా ఎస్‌పీఓ ఆఫీస్, కార్ హెడ్‌క్వార్టర్స్, పెట్లబుర్జ్, హైదరాబాద్‌లో ఈ నెల 18 న సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



అవార్డు ప్రదానం చేస్తున్న మంత్రి పొన్నం, శ్రీనివాస్ రెడ్డి

హిమాయత్‌నగర్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో హెచ్‌యూజే అధ్యక్షుడు శిగ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సీనియర్ ఉర్దూ జర్నలిస్ట్ ఫైజ్ మహమ్మద్ అస్గర్ స్మారక అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలో హెచ్‌యూజేతో సమావేశం నిర్వహిస్తామన్నారు. అనంతరం మీడియా అకాడమీ చైర్మన్ మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ. మాజీద్, ఐజేయూ కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ,హెచ్‌యూజే కార్యదర్శి అబ్దుల్ హమీద్ షౌకత్, ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేఎస్.హరి, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నరేందర్ రెడ్డికి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు

35 యేండ్లుగా అటు మీడియా రంగం, ఇటు వర్కింగ్ జర్నలిస్ట్స్ ఉద్యమంలో ప్రధాన భూమిక పోషిస్తున్న సీనియర్ పాత్రికేయుడు, ముద్ర దినపత్రిక సంపాదకుడు, ఐజేయూ జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డిని ఉత్తమ జర్నలిస్టుగా ఎంపిక చేశారు. మంత్రి మీడియా అకాడమీ చైర్మన్ చేతుల మీదుగా సీనియర్ ఉర్దూ జర్నలిస్ట్ ఫైజ్ మహమ్మద్ అస్గర్ స్మారక అవార్డును ఆయనకు ప్రదానం చేశారు.

జీహెచ్‌ఎంసీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మిద్దె కృష్ణ

పంజగుట్ట: జీహెచ్‌ఎంసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ జీహెచ్‌ఎంసీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌కు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ప్రతీనెలా ఇచ్చే పరికరాలు చీపుర్లు, గంపలు, పారలు, రేకులు, తోపుడు బండ్లు, రిక్షాలను కొన్ని నెలలుగా సరిగా ఇవ్వడం లేదని, దీంతో కార్మికులు విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాజరు యాప్‌లో సాంకేతిక కారణాల వల్ల వారి వేతనాల్లోనూ కోతలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

వీసా ఇప్పిస్తానని మోసం

వెంగళరావునగర్: వీసా ఇప్పిస్తానని పలువురు మహిళల నుంచి నగదు తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలో ఫ్యాషన్ డిజైనర్‌గా విధులు నిర్వహించే వి.భార్గవి, భోపాల్ చెందిన సినీ ఆర్టిస్ట్ జయారావుకు ఈనెల 7–9 తేదీల్లో అమెరికాలో ఈవెంట్‌కు రావాలని ఆహ్వానం అందింది. అయితే వారికి వీసా లేకపోవడంతో ఇరువురు కలిసి ఏప్రిల్‌లో ఉషా అనే మహిళను కలవగా ఆమె మణికంఠారెడ్డి అనే వ్యక్తిని పరిచయం చేసింది. తనకు తన కుటుంబ సభ్యులకు వీసా ఇప్పించాడని చెప్పడంతో వారు అతనిని నమ్మి రూ.52 వేలు అతనికి ఇచ్చారు. అయితే నగదు తీసుకున్న తర్వాత నుంచి అతను ఫోన్లకు స్పందించడం లేదు. దాంతో తాము మోసపోయామని గ్రహించి మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని అపహరించిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌కు చెందిన సయ్యద్ తబ్రేజ్ ట్రాన్స్‌ఫోర్ట్ బిజినెస్ చేస్తుంటాడు. ఈనెల 6న తన స్నేహితుడి బైక్ తీసుకుని ఇంటికి వచ్చి పార్క్ చేశాడు. తిరిగి బయటకు వచ్చి చూడగా కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్ దొంగ అరెస్టు

వెంగళరావునగర్: మొబైల్ చోరీ చేస్తున్న దొంగను మెట్రో సిబ్బంది పట్టుకుని మధురానగర్ పీఎస్‌లో అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 8వ తేదీన అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో బంటి కుమార్ అనే యువకుడు అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. కొద్దిసేపటికి నాలుగో నెంబర్ ప్లాట్‌ఫాంలో ప్యాసింజర్ నుంచి మొబైల్ తస్కరించేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ గమనించి పట్టుకున్నారు. స్టేషన్ కంట్రోలర్ హనుమాన్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులకు వెల్కంపేట

బల్కంపేట రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. అమ్మవారి కల్యాణానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో ఆలయం ఆవరణంలో కోలాహలం నెలకొంది. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, నగర మేయర్ విజయలక్ష్మి, సీఎస్ శాంతికుమారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అమ్మవారిని దర్శించుకున్నారు.


బల్కంపేట రేణుకా ఎల్లమ్మ ఆలయంలో భక్తుల కోలాహలం


మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


తలంబ్రాలు తీసుకొస్తున్న మంత్రి సురేఖ


మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, మంత్రి కొండా సురేఖ


జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీఎస్ శాంతికుమారి


క్యూ లైన్‌లో బారులు తీరిన భక్తులు


అమ్మవారికి మొక్కుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


భక్తి పారవశ్యంతో...

ఫిలింనగర్ సొసైటీ ఎన్నికల ప్రక్రియలో కదలిక

బంజారాహిల్స్: సినీ ప్రముఖులు నివాసం ఉండే ఫిలింనగర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్‌ఎన్నికల ప్రక్రియలో హైకోర్టు ఆదేశాల మేరకు కదలిక వచ్చింది. ఈ మేరకు అధికారులు ఎన్నికలకు రంగం సిద్ధం చేస్తున్నారు. వివరాలు... గత సొసైటీ పాలకమండలి గడువు మే 30న ముగిసింది. ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే చెప్పాలంటూ అధికారులు నోటీసులు కూడా జారీచేశారు. ఎన్నికల అధికారిగా నియమితులైన అసిస్టెంట్ రిజిస్ట్రార్ జూన్ 7న షెడ్యూల్ విడుదల చేసి అదే నెల 11, 12, 13 తేదీల్లో కమిటీ మెంబర్ పోస్టులకు నామినేషన్లు సమర్పించాలని పేర్కొన్నారు. సజావుగా సాగుతున్న ఎన్నికల ప్రక్రియను నిలిపివేస్తూ రాష్ట్ర కో–ఆపరేటివ్ సొసైటీ ఎలక్షన్ ఆఫీసర్ జూన్ 13న ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని సవాల్ చేస్తూ హైకోర్టులో సభ్యులు పిటిషన్ దాఖలు చేయగా, జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఎన్నికల ప్రక్రియ ఆగిన చోటు నుంచి కొనసాగించి నోటిఫికేషన్ ప్రకారం పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ మేరకు 14 మందితో కూడిన కమిటీ సభ్యులను 240 మంది సొసైటీ సభ్యులు ఎన్నుకోనున్నారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో ఎప్పుడైనా ఎన్నికలు జరిపేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

అయోధ్యకు 21వ భారత్ గౌరవ్ రైలు

సాక్షి,సిటీబ్యూరో: సాంస్కృతిక, వారసత్వ, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాల సందర్శన కోసం ప్రారంభించిన భారత్ గౌరవ్ రైళ్లలో భాగంగా 21వ రైలు మంగళవారం సికింద్రాబాద్ నుంచి అయోధ్యకు బయలుదేరింది. ఈ రైలులో ప్రయాణిస్తున్న సీనియర్ సిటిజన్ హన్మంతు దీనిని ప్రారంభించారు. ఇది అయోధ్య–కాశీ పుణ్యక్షేత్ర యాత్ర రైలు. మొత్తం 9 రోజులపాటు ఈ పర్యటన ఉంటుంది. గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లోని తీర్థ స్థలాలను సందర్శిస్తారు. కాజీపేట్, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, వైజాగ్, విజయనగరం, ఒడిశాలోని టిట్లాగఢ్ స్టేషన్‌లలో హాల్టింగ్ ఉంటుందని రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ సంతోషం వ్యక్తం చేశారు.

తూతూ మంత్రంగా నాలా పూడికతీత

- వానొస్తే దీన్‌దయాళ్‌నగర్ దీనావస్థ
- 400 ఇళ్లకు ముంపు ముప్పు.. ఇప్పటికే 20 ఇళ్లు ఖాళీ..

వరద గోడుకు అడ్డు‘గోడ’


దీన్‌దయాళ్‌నగర్ కాలనీలో ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్న రక్షణ గోడ

మౌలాలి: అది మౌలాలి డివిజన్‌లోని దీన్‌దయాళ్‌నగర్.. 400 ఇళ్లు ఉన్నాయి.. చిన్న వర్షం వస్తే చాలు.. ఆ కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే.. ఎందుకంటే.. ఇళ్లను ఆనుకుని పెద్ద నాలా.. వర్షం వస్తే పొంగుపొర్లుతుంది.. వరద ఇళ్లను ముంచెత్తుతుంది.. ఇళ్లన్నీ బురదమయంగా మారతాయి.. గతంలో రెండేళ్ల చిన్నారి నాలాలో పడి మృతి చెందిన ఘటన కూడా చోటుచేసుకుంది. కాలనీవాసులు ఇన్ని అవస్థలు పడుతున్నా అధికారులు నివారణ చర్యలు చేపట్టకుండా ‘నిమ్మకు నీరెత్తినట్లు’గా వ్యవహరిస్తున్నారు. దీంతో ఇళ్లలోకి వరద రాకుండా కాలనీవాసులు ఎవరికి వారు తమ ఇళ్ల ముందు అడ్డుగోడలు కట్టుకున్నారు.

స్థానికులు ఏం చేశారంటే...

వరదనీరు ఇళ్లలోకి రాకుండా కాలనీవాసులు తమ ఇళ్ల గేట్ల దగ్గర, ఇళ్ల ముందు గోడలు కట్టుకున్నారు. కొందరు రేకులను అడ్డుగోడగా పెడుతున్నారు. ఇళ్లలోకి బురద రాకుండా చూసుకుంటున్నారు. అయితే గత కొంతకాలంగా చిన్నపాటి వర్షానికే ఇళ్లలోకి నీరు వచ్చి చేరుతోంది. దీంతో రాత్రివేళ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కునుకు లేకుండా గడపాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. వరద వచ్చినప్పుడు ఎమ్మెల్యే, కార్పొరేటర్ వచ్చి చూసి పోవడం తప్ప తమ సమస్యను పరిష్కరించడం లేదంటున్నారు. వరదనీటి గండంతో ఇంకా ఎన్ని రోజులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీయాలని ప్రశ్నిస్తున్నారు. ఇళ్లల్లోకి వరదనీరు చేరడం వల్ల బియ్యం, వంట సామగ్రి, ఇతర వస్తువులు పాడైపోతున్నాయి. అంతేకాకుండా కాలనీవాసులు అనారోగ్యాల పాలవుతున్నారు.

ఇళ్లను రక్షించుకోవడానికి స్థానికుల ఏర్పాటు



ఇప్పటికే 20 ఇళ్లు ఖాళీ

దీన్‌దయాళ్‌నగర్ కాలనీలో రోడ్ 4 బిలో వరద తాకిడికి తట్టుకోలేక 20 కుటుంబాలు ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయాయి. అందరికీ అదే పరిస్థితి వస్తుందేమోనని కాలనీవాసులు భయపడుతున్నారు. వానాకాలంలో దీన్‌దయాళ్‌నగర్ కాలనీకి ఆనుకుని ఉన్న నాలాలో వర్షపునీరు చేరి స్థానికులను బెంబేలెత్తిస్తుండగా, దీనికి వాయుపురి, సాయినగర్, అంబేడ్కర్ నగర్, కాకతీయనగర్, వెంకటేశ్వర్‌నగర్, సమతానగర్, ఆర్కె హెచ్ కాలనీ, గీతానగర్, దీన్‌దయాళ్‌నగర్ ఇలా 13 కాలనీలకు చెందిన మురుగునీరు తోడవుతోంది. దీంతో ముంపు సమస్య మరింత తీవ్రమవుతోంది.

జీహెచ్‌ఎంసీ ఎదుట ధర్నా



వరద సమస్యపై జీహెచ్‌ఎంసీ ఎదుట ప్లకార్డుతో నిరసన వ్యక్తం చేశాం. ప్రతి ఏడాది పూడికతీతకు రూ.9.50 ఖర్చు చేస్తున్నా బురదలో పోసిన పన్నీరులాగానే ఉంది. సమస్య పరిష్కారానికి తన వంతుగా ప్రయత్నిస్తున్నా.
– సునీతాయాదవ్, మౌలాలి కార్పొరేటర్

పార్క్ చేసిన వాహనాలు పాడై...

ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన వాహనాలు వరద నీటికి పాడైపోతున్నాయి. కొన్నిసార్లు వరదతాకిడి అవి కొట్టుకుపోతున్నాయి. గత 9 ఏళ్లగా ఉన్న తమ సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకొని పరిష్కరించాలని దీన్‌దయాళ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవేంద్రరావు, కార్యదర్శి శ్రవణ్‌కుమార్ కోరుతున్నారు.

ప్రతిఏటా గోడల ఎత్తు పెంచుతున్నాం..



వరదనీటి తాకిడిని రక్షించుకోవడం కోసం ఇళ్ల ముందు ఏర్పాటు చేసుకున్న గోడలను ప్రతి ఏడాది రెండు అడుగుల మేర ఎత్తు పెంచుతున్నాం. ఇలా ఎన్నాళ్లు చేయాలో తెలియడంలేదు.
– విజయ స్వరూప, దీన్‌దయాళ్‌నగర్

వర్షం లేకపోయినా వరదతాకిడి



దీన్ దయాళనగర్ కాలనీలో వర్షం లేకపోయినా ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి వరద నాలాలో చేరి ఉప్పొంగడంతో దీన్‌దయాళ్‌నగర్ కాలనీ ముంపునకు గురవుతోంది. వర్షం కాలం అయితే కాలనీవాసులందరికి జాగరమే.
– ప్రమీలా దీన్‌దయాళ్‌నగర్

ఈ‘ఏడు’ రియల్ జోరు!

గ్రేటర్‌లో రిజిస్ట్రేషన్ల రాబడి 4,670.52 కోట్లు

- గత ఏడాది కన్నా 12.5 శాతం అధికంగా రిజిస్ట్రేషన్లు
- జీహెచ్‌ఎంసీ ఇచ్చిన భవన నిర్మాణ అనుమతులు 7,809

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ పరిధిలో భవనాలు, లేఅవుట్ల అనుమతులతోపాటు ప్లాట్లు, భవనాలకు రిజిస్ట్రేషన్ల తద్వారా ఆదాయం పెరుగుతుండటమే అందుకు నిదర్శనమని పేర్కొంది. ప్రభుత్వ వర్గాల కథనం ప్రకారం... ఎన్నికల కోడ్ కారణంగా దాదాపు మూడు నెలల పాటు ఆర్థిక లావాదేవీలు స్తంభించినప్పటికీ గత ఏడాదితో పోలిస్తే స్థిరాస్తి రంగం పుంజుకుంది. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టిన 2023 డిసెంబర్ నుంచి ఈ ఏడాది జూన్ నెలాఖరు వరకు, ఏడు నెలల్లోనే ప్లాట్లు, భవనాల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.4,670.52 కోట్ల ఆదాయం వచ్చింది. అంతకుముందు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న చివరి ఏడు నెలలు... మే 2023 నుంచి నవంబర్ 2023 వరకు వచ్చిన ఆదాయం రూ.4,429.23 కోట్లు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఏడునెలల్లో రూ.241.29 కోట్ల ఆదాయం పెరిగింది. డిసెంబర్ 2022 నుంచి జూన్ 2023 వరకు జరిగిన రిజిస్ట్రేషన్ల ఆదాయంతో పోల్చినా తాజా రాబడి రూ. 270.86 కోట్లు ఎక్కువ. కాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడు నెలల్లో జరిగిన మొత్తం రిజిస్ట్రేషన్ల సంఖ్య 2,18,160. గత ఏడాది ఇదే వ్యవధిలో 1,93,962 రిజిస్ట్రేషన్లు జరిగాయి. అంటే.. 12.5 శాతం అధికంగా జరిగాయి.

అనుమతుల్లో 13.17 శాతం పెరుగుదల

గత ఏడాది డిసెంబర్ 7 నుంచి ఈ ఏడాది జూన్ 30 వరకు జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో అనుమతి ఇచ్చిన భవనాల దరఖాస్తుల సంఖ్య 18,077 కాగా, గత ఏడాది మే నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు 17,911 భవన నిర్మాణాలకు అనుమతులు లభించాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏడు నెలల్లో ఆమోదించిన భవన నిర్మాణ అనుమతులు 7,809. అంతకు ముందు ఏడు నెలలతో పోలిస్తే 13.17 శాతం పెరిగింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టు, మెట్రో రైలు విస్తరణ, సికింద్రాబాద్ నుంచి జాతీయ రహదారులకు అనుసంధానం చేసే రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంతో రాబోయే రోజుల్లో సిటీ రూపురేఖలు మారిపోనున్నాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. రీజినల్ రింగ్ రోడ్డు వరకు హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరించే ప్రణాళికలు, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనులపై ప్రభుత్వం దృష్టా సారించటంతో స్థిరాస్తి రంగానికి అనుకూల వాతావరణం ఏర్పడిందని పేర్కొంది.



నేతల విగ్రహాలకు త్వరలో వెలుగులు

- బల్దియా మేయర్ ప్రయత్నాలు
- ప్రధాన కార్యాలయ ఆవరణలోని గాంధీ, అంబేడ్కర్, వైఎస్ విగ్రహాల ముసుగుల తొలగింపునకు చర్యలు

సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎన్నో ఏళ్లగా ముసుగులో కప్పబడి ఉన్న మహా నాయకుల విగ్రహాలకు ముసుగుల నుంచి విముక్తి లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజకీయ కారణాలతో దశాబ్దానికిపైగా అవి ముసుగుల్లోనే మగ్గుతున్నాయి. చిరిగిపోతున్న ముసుగుల్ని ఆర్నెళ్లకో, నాలుగు నెలలకోసారి రాత్రికిరాత్రే మారుస్తున్నారు తప్ప పూర్తిగా తొలగించే చర్యలు చేపట్టలేదు. వాటి పరిస్థితిని చూసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్పందించి ముసుగులు తొలగించిందుకు ప్రయత్నిస్తున్నారు. వాటిపై గతంలో వివాదాలు ఉండటంతో తిరిగి ఆ పరిస్థితులు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీలో గుర్తింపు పొందిన ఐదు కార్మిక సంఘాల నేతలతో సంప్రదింపులు జరిపారు. విగ్రహాలు అలా ఉండటం అవమానకరంగా ఉందని, ముసుగులు తొలగించేందుకు సహకరించాలని కోరగా యూనియన్లు సుముఖత వ్యక్తం చేశాయి. ఈ మేరకు రెండు యూనియన్లు లిఖితపూర్వకంగా అందజేశాయి. మిగతా యూనియన్లు కూడా ఇచ్చాక ముసుగులు తొలగించి మూడు విగ్రహాలను జీహెచ్‌ఎంసీ ఆవరణలోనే వేర్వేరు చోట్ల ప్రతిష్ఠించనున్నట్లు తెలిసింది. విగ్రహాలకు ముసుగులు కప్పడానికి దారి తీసిన ఫ్లాష్‌బ్యాక్ ఇలా ఉంది.

ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని అప్పటి జీహెచ్‌ఎంసీ పాలకమండలి భావించింది. జీహెచ్‌ఎంసీ ఏర్పాటుకు కారణమైన వైఎస్ విగ్రహం ప్రధాన కార్యాలయం ఆవరణలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందుకనుగుణంగా 2010లో వైఎస్సార్ జయంతిని పురస్కరించుకొని జూలైలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన జరిపారు. విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు జరుగుతుండగా, అప్పటి జీహెచ్‌ఎంసీలో టీడీపీ ఫ్లోర్‌లీడర్ రాత్రికిరాత్రి మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలను తెప్పించి వైఎస్ విగ్రహానికి చెరో వైపు ఉంచారు. అయితే అవి వైఎస్ విగ్రహం కంటే చిన్నవిగా ఉండటంతో, వైఎస్ కంటే ఆ మహానుభావులు తక్కువవారనే అభిప్రాయం కలుగుతుందని ఆవిష్కరించకుండా టీడీపీ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో ఆ విగ్రహాలనూ ముసుగులతో కప్పేశారు. తర్వాత కొంతకాలానికి అప్పటి కాంగ్రెస్ మేయర్ బండ కార్తీకరెడ్డి ప్రయత్నాలు చేశారు. వైఎస్ విగ్రహాన్ని మేయర్ ప్రవేశ ద్వారం ఎదుట ఉంచి, మిగతా వాటిని ఆవరణలోనే వేరేచోట్ల ఆవిష్కరించాలనుకుని స్టాండింగ్ కమిటీలోనూ తీర్మానం చేశారు. అయినప్పటికీ టీడీపీ అడ్డుపడటంతో ఆవిష్కరణలకు నోచుకోకుండా అవి అలాగే ఉండిపోయాయి. తిరిగి ఇంతకాలానికి మేయర్ చొరవ చూపి విగ్రహాలకున్న ముసుగులు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు.

డెంగీ నియంత్రణకు కృషి చేయాలి

బల్దియా చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ

లక్డీకాపూల్: నగరంలో వ్యాప్తి చెందుతున్న డెంగీ వ్యాధి నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని బల్దియా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ పద్మజ కోరారు. డెంగీ లక్షణాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి దానకిషోర్ ఆదేశాల మేరకు మంగళవారం జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలోని 7వ అంతస్తులో డాక్టర్ పద్మజ, చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో డెంగీ నియంత్రణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శానిటేషన్ మెడికల్ ఆఫీసర్లు, డిప్యూటీ డీఈలు, సీనియర్, అసిస్టెంట్ ఎంటమాలజిస్టులతో సమన్వయ సమావేశం జరిగింది. డెంగీ నియంత్రణ కార్యాచరణ ప్రణాళికపై సూచనలు చేశారు. జీహెచ్‌ఎంసీ చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ డెంగీ నియంత్రణ పద్ధతులను పీపీటీ ద్వారా వివరించారు. ఈ క్రమంలో డెంగ్యూ నివారణకు చేపట్టాల్సిన అంశాలను వివరిస్తూ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

14 నుంచి కులగణన సాధనయాత్ర

పంజగుట్ట: రాష్ట్రంలో జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్‌పై బీసీలను చైతన్యవంతులను చేసేందుకు ఈ నెల 14 నుంచి 31వ తేదీ వరకు 10 ఉమ్మడి జిల్లాల్లో సమగ్ర కులగణన సాధన యాత్ర చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన బీసీ కమిషన్‌ను నియమించి కులగణన చేస్తామని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే కొందరు అగ్రకులాల నాయకులు రిజర్వేషన్లు పెంచకుండా అడ్డుకునే కుట్రలు పన్నుతున్నారని, వాటిని తిప్పికొట్టేందుకు, ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి పెంచేందుకు ఈ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కామారెడ్డిలో ఈ నెల 14వ తేదీన యాత్ర ప్రారంభమై 17 రోజుల తర్వాత చివరగా కరీంనగర్‌లో ముగింపు సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుందారం గణేష్ చారి, బాలగోని బాలరాజ్ గౌడ్ పాల్గొన్నారు.

డిజైన్ ప్రొటోటైపింగ్ సెంటర్ సందర్శన


ఎస్కీలో డిజైన్ ప్రొటోటైపింగ్ సెంటర్, మెకానికల్ విభాగాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లోని డిజైన్ ప్రొటోటైపింగ్ సెంటర్, మెకానికల్ విభాగాన్ని కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ హైదరాబాద్ ఐఈడీఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి ఆధ్వర్యంలో పలువురు అధికారులు మంగళవారం సందర్శించారు. వినూత్న ఆలోచనల ఫలితాలు, ఎస్కీ వద్ద ఆవిష్కరణ, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడానికి చొరవ చూపాలని సూచించింది. ధ్రువీకరణలో ఎంఎస్ఎంఈ హ్యాకథాన్‌లో ఆమోదించిన ఆలోచనలు ఉన్నాయి. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు, ఇతర అధికారులు ఆయా విభాగాల పనితీరును వివరించారు. ఎంఎస్ఎంఈ ఇంక్యుబేటీలు డాక్టర్ వెంకట కృష్ణప్రసాద్, డాక్టర్ దేవయాని సింఘి, డాక్టర్ ఎన్‌వీఎస్ఎస్ శ్రీదత్త మార్గదర్శకత్వంలో చేపడుతున్న తమ ప్రాజెక్టులలో ఇన్నోవేషన్ ప్రాముఖ్యాను వివరించారు. ఈ వినూత్న ఆలోచనలను అధికారులు ఎంబీ ప్రవీణ్‌కుమార్, డి శ్రీధర్‌బాబు, డాక్టర్ పీవీఎస్ఎస్ శ్రీధర్, డాక్టర్ ఆర్ఎస్ఎస్ ప్రశాంత్ ప్రశంసించారు.

‘ప్రజావాణి’కి 618 అర్జీలు


ప్రత్యేక అధికారి దివ్యతో కలిసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ‘ప్రజావాణి’కి మొత్తం 618 దరఖాస్తులు అందాయి. ఈ క్రమంలో పలువురు ఉద్యోగులు, నిరుద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన తెలిపారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్యతో కలిసి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి దరఖాస్తులను అడిగి సమస్యల గురించి తెలుసుకున్నారు. ఆర్థికేతర సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి స్వతర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రెవెన్యూ, ఉద్యోగ సంబంధిత సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని భరోసా ఇచ్చారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించి 163 అర్జీలు వచ్చాయి. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రేషన్ కార్డులు, వృద్ధాప్య పింఛన్ వంటి సమస్యలపై 89 దరఖాస్తులు అందాయి. విద్యుత్ శాఖ 56, హౌసింగ్ 63, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి 36, ఇతర శాఖలకు సంబంధించి 211 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

జేఎన్‌టీయూ ప్రొటెక్షన్ ఫోర్స్ ఫిర్యాదు


నోడల్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న ప్రొటెక్షన్ ఫోర్స్ నేతలు

కేపీహెచ్‌బీకాలనీ: మెస్‌చార్జీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ జేఎన్‌టీయూహెచ్‌కు చెందిన ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర నోడల్ అధికారి దివ్యకు ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన నోడల్ అధికారి వెంటనే సంబంధిత శాఖ ఉన్నతాధికారి దేవసేనకు ఫోన్ కాల్ చేశారు. పరీక్ష ఫీజులు చెల్లించకుండా నిరియంతించటం, పరీక్ష రాయకుండా నిలువరించటం, ఫలితాలను చూసుకోకుండా నిలిపివేయటం వంటి చర్యలు పునరావృతంకాకుండా చూడాలని కోరగా, వర్సిటీ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు రాహుల్ నాయక్, గాదె పవన్ కుమార్, చంద్రశేఖర్ పటేల్, కళ్యాణ్, స్నేహిత్, జవ్వాజి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వాన రాకడ ఫ్యాషన్ పోకడ.. రెండూ అనూహ్యామే. ఎప్పుడు కురుస్తుందో.. ఎప్పుడు మెరుస్తుందో.. తెలియని పరిస్థితుల్లో.. సిటీలోని ఫ్యాషన్ లవర్స్ ఎలాంటి ఫ్యాషన్ అనుసరించాలో తెలియక సిటీలోని ఫ్యాషన్ లవర్స్‌ని అయోమయపు మబ్బులు కమ్మేస్తుంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని నగరానికి చెందిన హామ్‌స్టెక్ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్ నగరవాసుల కోసం మాన్‌సూన్ ఫ్యాషన్ తొలకరి చినుకులు కురిపిస్తోంది.. - సాక్షి, సిటీబ్యూరో

రెయిన్.. ఫ్యాషైన్..

వర్షంలోనూ ఫ్యాషన్ సాధ్యమే

- సీజన్‌కు అనుగుణంగా మార్పు చేర్పులు
- అందుబాటులో వాటర్ ప్రూఫ్ ఫ్యాబ్రిక్స్
- తేమను విడగొట్టే పాలియెస్టర్ బ్లెండ్స్
- జాయ్‌ఫుల్‌గా ఉంచే బ్రైట్‌కలర్స్
- ఫుట్ వేర్ కూడా ఫ్యాషనబుల్‌గా









మహిళలు వాటర్ ప్రూఫ్ ఫ్యాబ్రిక్స్‌ను ఎంచుకోవాలి. నైలాన్, పాలియెస్టర్ మేళవింపు ఫ్యాబ్రిక్స్, అలాగే ట్రీటెడ్ కాటన్.. వంటివి బెస్ట్. అనుకోని వర్షం కలిగించే ఇబ్బందులను తగ్గిస్తూ మనల్ని పొడిగా ఉంచుతాయి. లైట్ వెయిట్‌తో, గాలి పీల్చుకోవడానికి అనువుగా ఉండే లినెన్ లేదా కాటన్ అయితే త్వరగా పొడిగా మారతాయి. ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులను స్వీకరించేందుకు లేయరింగ్ స్టైల్ (ఒకదాని మీద మరొకటి ధరించడం) ఉపకరిస్తుంది. బ్రైట్‌కలర్స్‌తో ప్రయోగాలు చేయాలి. ఎల్లో, గ్రీన్, బ్లూ కలర్స్ మబ్బు పట్టిన వాతావరణంలో సైతం మూడ్స్‌ని జాయ్‌ఫుల్‌గా ఉంచుతాయి. అలాగే ట్రెంచ్ కోట్స్, పార్కాస్, స్టైలిష్ వాటర్ ప్రూఫ్ జాకెట్స్. వంటి.స్టైలిష్ రెయిన్ వేర్ వినియోగించాలి.

- మగవాళ్లు బోర్ కొట్టించే రెయిన్ కోట్స్‌ను విడిచిపెట్టి లైట్ వెయిట్ వాటర్ ప్రూఫ్ జాకెట్స్, హుడీస్ - విండ్ బ్రేకర్స్ వినియోగించాలి. తేలికపాటి డిజైన్స్‌ను ఎంచుకోవాలి. తేమను విడగొట్టే పాలియెస్టర్ బ్లెండ్స్ లాంటి ఫ్యాబ్రిక్స్‌ను వినియోగించాలి. ఇవి త్వరగా పొడిగా మారతాయి. రోజంతా సౌకర్యవంతంగా ఉంచుతాయి. నేవీ, చార్కోల్, ఆలివ్ రంగులు వంటివి నప్పుతాయి. ఇవి మరకల్ని, బురద తుంపర్లని దాచే వీలు కల్పిస్తాయి. ట్రౌజర్స్, షర్ట్స్, అవుటర్ వేర్‌లో ఈ షేడ్స్ పాలిష్డ్ లుక్ అందిస్తాయి. చినోస్, జీన్స్ క్యాజువల్ ట్రౌజర్స్‌ను లైట్ వెయిట్ స్వెటర్స్, గాలి బాగా తగిలేలా చేసే షర్ట్స్‌తో కాంబినేషన్‌గా వాడవచ్చు. ఇవి అటు కంఫర్ట్ ను, ఇటు స్టైల్‌నూ అందిస్తాయి.

పాదరక్షలిలా...

మహిళలు పాదాలను పొడిగా ఉంచుతూనే ఫ్యాషనబుల్‌గా ఉండేలా ఫుట్ వేర్‌ను ఎంచుకోవాలి. రబ్బర్ బూట్స్, వాటర్ ప్రూఫ్ స్నీకర్స్, డ్యూరబుల్ ఫ్లాట్స్.. వంటివి బెస్ట్. మగవాళ్లు మంచి మెటీరియల్‌తో తయారైన వాటర్ ప్రూఫ్ బూట్స్, స్టర్డీ లోఫర్స్ ఫుట్‌వేర్‌గా ఎంచుకోవాలి. కాన్వాస్ షూస్, స్యూడ్‌లు వాడవద్దు..

యాక్సెసరీస్ ఇలా..

- మహిళలు కనీసస్థాయికి జ్యూయలరీ తగ్గించి, వాటర్ ప్రూఫ్ యాక్సెసరీస్ వినియోగించాలి. వాటర్ ప్రూఫ్, స్లీక్‌గా ఉండే బ్యాగ్స్, బ్యాక్ ప్యాక్స్ క్యారీ చేస్తే మొబైల్స్ వంటి ముఖ్యమైనవి భద్రపరచుకోవచ్చు. మగవాళ్లు.. వాటర్ రెసిస్టెంట్ ఫీచర్స్ ఉన్న యాక్సెసరీస్ బెస్ట్. లెదర్, సింథటిక్‌ల కలయికతో రూపొందిన వాచ్‌లు, బ్యాగ్స్ వాడాలి.
- తడిసిన పరిస్థితిలో సైతం మ్యానేజ్ చేయగలిగేలా హెయిర్ స్టైల్ మార్చుకోవాలి. జుట్టు బిగుసుకుపోకుండా నియంత్రించే యాంటీ ఫ్రీజ్ ఉత్పత్తులు వాడాలి లేదా జుట్టును పూర్తిగా వెనక్కి సెట్ చేసి ఉంచాలి.
- కలర్‌ఫుల్‌గా ఉండే నాణ్యమైన బ్రాండెడ్ గొడుగును వెంట తీసుకెళ్లాలి. వర్షాకాలంలో వాన నుంచి రక్షణగా మాత్రమే కాదు మన స్టైల్‌కి చిహ్నంగా కూడా కనిపించాలి.



రెయిన్‌లోనూ ఫ్యాషైన్ సాధ్యమే..

వానలు పడుతున్నంత మాత్రాన ఫ్యాషన్స్‌ను విడిచిపెట్టనక్కర్లేదు. అయితే సీజన్‌కి అనుగుణంగా కొన్ని మార్పు చేర్పులు తప్పనిసరి. వాటర్ ప్రూఫ్ అనేది దుస్తులకైనా యాక్సెసరీస్‌కైనా ఒక రూల్‌గా పెట్టుకోవాలి. ఇదే విధంగా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే రెయినీ సీజన్‌ను స్టైల్‌గా ఎంజాయ్ చేయవచ్చు...
–చారోల్, హామ్‌స్టెక్ ఫ్యాషన్ డిజైనింగ్ ఇన్‌స్టిట్యూట్.

'షాప్సీ' మూడు కోట్ల డౌన్‌లోడ్స్..

షాపింగ్ యాప్‌గా నగరవాసులకు చిరపరిచితమైన షాప్సీ.. మూడేళ్ల కాలంలో 3.30 మిలియన్ల డౌన్‌లోడ్స్ సాధించింది. సంస్థ 3వ వార్షికోత్సవంలో భాగంగా బిజినెస్ హెడ్ ప్రత్యూష అగర్వాల్ తెలిపారు. తమ యాప్ ద్వారా 1300 కేటగిరీల్లో ఉత్పత్తులను అందిస్తున్నామని, 19వేల పైగా పిన్ కోడ్స్‌కు కలాపాలను విస్తరించామన్నారు. మరింత మెరుగైన హైపర్ వాల్యూ ఆన్‌లైన్ షాపింగ్ అనుభూతిని అందించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు.

అతిపెద్ద అవేర్‌నెస్ రన్‌కు శ్రీకారం...

నగరానికి చెందిన గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేన్సర్ పైన అవగాహన కల్పించడానికి ప్రపంచంలోనే అతిపెద్ద కేన్సర్ అవేర్‌నెస్ రన్ నిర్వహించనున్నారు. ఈ రన్‌కు సంబంధించి కర్టెన్ రైజర్ కార్యక్రమం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఆదివారం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

13న తార్నాకలో ఎక్స్‌పో..

గ్రామ భారతి స్వచ్ఛంద సంస్థ స్థాపించి 28 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 13న తార్నాకలోని మర్రి కృష్ణారెడ్డి హాల్లో ప్రత్యేక ఎక్స్‌పో ఏర్పాటు చేయనున్నామని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, మిద్దెతోట, దేశీయ విత్తనాలు, మొక్కలు, తినుబండారాలు, వ్యవసాయ ఉత్పత్తులు, దేశం, ధర్మం, ప్రకృతి వ్యవసాయం, పాడి పై పుస్తకాలు, అయుర్వేద, ఆరోగ్య విషయాలు, చేనేత దుస్తులు, వస్త్రాలు, కుల వృత్తులు, చేతి వృత్తులు, ఆరోగ్యానికి మేలు చేసే ఉత్పత్తులు, రైతులకు, చిన్న వ్యాపారస్తులకు ఉపయోగపడే ఉపకరణాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇందులో స్టాల్ పెట్టుకోదలచినవారు 9490850766, 6305182620 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నాలెడ్జ్‌సిటీలో 'బార్ బే క్యూ' బఫెట్

హఫీజ్‌పేట్ : రాయదుర్గంలోని నాలెడ్జ్‌సిటీలోని సలాపురియా సత్వలో 13వ నూతన బార్ బే క్యూ నేషన్ బఫెట్‌ను మంగళవారం ప్రారంభించారు. 2007లో బార్‌బేక్యూ నేషన్‌ను ప్రారంభించామని, హైదరాబాద్‌లో 13వ అవుట్‌లెట్ ఏర్పాటు చేశామని ఆ సంస్థ చీఫ్ డెలప్‌మెంట్ ఆఫీసర్ మన్సూర్ మెమాన్ తెలిపారు. దేశంలోనే కాకుండా ప్రపంచంలోని వివిధ దేశాలు యూఏఈ, మలేషియా, ఓమెన్, దుబాయ్, సౌదీలోనూ బార్‌బేక్యూ రెస్టారెంట్‌లు ఉన్నాయని, లైవ్ కౌంటర్ల ద్వారా భోజన ప్రియులకు రుచికరమైన వంటకాలు అందిస్తున్నామని అన్నారు. సుమారు 70కి పైగా వెరైటీలు, 10 రకాల ఐస్‌క్రీమ్‌లు అందుబాటులో ఉంచామని, రానున్న రోజుల్లో నార్సింగ్, నల్లగండ్లలో బార్‌బేక్యూ నేషన్ బఫెట్‌లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

నేటి నుంచి 'స్కిల్' మేళా..

కాచిగూడ: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి వారం రోజుల పాటు ఆన్‌లైన్‌లో స్కిల్ ఎడ్యుకేషన్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ శ్రీమాన్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ పూర్తి చేసిన వారు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, బిజినెస్ ఎనలిస్ట్, దేవోప్స్, ఫుల్‌స్టాక్ డెవలపర్, పైథాన్, డేటా సైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ తదితర 50కి పైగా ఉద్యోగ, ఉపాధి కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు సెల్: 9505800050, 9505800047ను సంప్రదించాలని కోరారు.

ఏనా.. హన్నన్నా!

అమెరికా యువతి నోట తెలుగు మాట

- అనర్గళంగా మాట్లాడుతున్న ఏనా
- చదవడం, రాయడం నేర్చుకున్న రెమిల్లార్డ్
- ఉచ్చారణపైనా ప్రత్యేక శ్రద్ధ
- పట్టుదలతో విదేశీ భాషలో నైపుణ్యం
- పలువురి ప్రశంసలు పొందుతున్న యువతి

దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. తెలుగు భాష తియ్యదనం తెలుసుకున్న వారికే అర్థం అవుతుంది. కాకపోతే మన భాషను మనమే పరాయి భాషగా చూస్తున్నాం. ఇప్పుడున్న యువతలో చాలా మంది తెలుగు మాట్లాడటానికే నామోషీగా భావిస్తున్నారు. ఇప్పటి తరం యువత తెలుగు స్పష్టంగా చూస్తూ చదవడానికే చాలా కష్టపడుతున్నారు. పాఠశాల స్థాయి నుంచే తెలుగు భాష అంటే మార్కుల కోసం అన్నట్టు చెబుతున్నారు. నాలుగు పద్యాలు బట్టీ పట్టిస్తే చాలు అన్నట్లుంది పరిస్థితి. కానీ అమెరికాలో పుట్టి.. అమెరికాలో పెరిగి తెలుగుపై మక్కువ పెంచుకుని తెలుగులో అనర్గళంగా మాట్లాడుతున్నారు ఏనా . ఆమె గురించిన మరిన్ని వివరాలు.. – సాక్షి, సిటీబ్యూరో



తెలుగు భాష నేర్చుకోవడం చాలా కష్టమంటూనే ప్రావీణ్యం సంపాదించారు. మాట్లాడటమే కాదు.. రాయడం, చదవడం కూడా నేర్చుకున్నారు. అంతేకాదు యూట్యూబ్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యంగా.. హైదరాబాద్‌తో తనకున్న అనుభవాలను వీక్షకులతో పంచుకుంటూనే.. తెలుగు భాష గొప్పతనాన్ని చాటిచెబుతున్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, తెలుగు భాష అంటే ఎంతో ఇష్టమని చెబుతున్నారు. ఆమె పేరే ఏనా రెమిల్లార్డ్.

ఇతర భాషలపై ఆసక్తితో..

'చిన్నప్పటి నుంచే కొత్త భాషలు, కొత్త సంస్కృతుల గురించి తెలుసుకోవడం అంటే ఆసక్తి ఉండేది. అమెరికాలోని యూనివర్సిటీల్లో నాలుగేళ్ల డిగ్రీ కోర్సుల్లో మూడో సంవత్సరం వేరే దేశాల్లోని వర్సిటీల్లో చదువుకోవాల్సి వస్తుంది. అందులో భాగంగానే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చదువుకున్నాను. హెచ్‌సీయూలో తోటి విద్యార్థులతో కలసి భారత్‌లోని మతాలు, కులాల గురించి అధ్యయనం చేసేందుకు చాలా ప్రాంతాలు తిరిగాను. అప్పుడే దేశంలోని అనేక సంప్రదాయాల గురించి అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాను. ఆ సమయంలోనే తెలుగు నేర్చుకోవాలనే ఆసక్తితో పాటు సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకోవాలని నిర్ణయించుకున్నాను' అని రెమిల్లార్డ్ వివరించారు.

అద్భుతమైన ఉచ్చారణ..

అమెరికాలో పుట్టినప్పటికీ రెమిల్లార్డ్ తెలుగు భాష ఉచ్చారణ మాత్రం అద్భుతంగా ఉంటుంది. ప్రతి పదాన్నీ ఎలా పలకాలో ఇక్కడి తెలుగు గురువుల నుంచి ఇప్పటికీ అడిగి తెలుసుకుంటారు. మొదట్లో తెలుగు భాష ఎవరైనా మాట్లాడితే భయంగా ఉండేదట. కానీ, చాలా సీరియస్‌గా సాధన చేసి తెలుగులో అనర్గళంగా మాట్లాడుతున్నారు. అయితే ఇంకా తాను నేర్చుకోవాల్సింది చాలా ఉందని, ఇంకా ప్రావీణ్యం సాధించాల్సిన అవసరం ఉందని, తెలుగులో నిత్య విద్యార్థినేనని చెప్పుకొచ్చారు.

భారత సంస్కృతి అంటే ఇష్టం..

ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు అంటే తనకు చాలా ఇష్టమని రెమిల్లార్డ్ పేర్కొన్నారు. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలకు, అమెరికాకు చాలా వ్యత్యాసం ఉందని చెప్పారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అంటే ఎంతో ఇష్టమని వివరించారు. అమెరికాలో ఇలా తక్కువగా ఉంటారన్నారు. కాగా, వేరే దేశాలకు వెళ్లి వారి భాష మాట్లాడితే అంతగా పట్టించుకోరని, అదే ఇక్కడి ప్రజలతో వారి భాషలో మాట్లాడితే చాలా సంతోషిస్తారని చెప్పారు. తెలుగుతో పాటు హిందీ కూడా నేర్చుకున్నానని, ఇక్కడి వారు ఎంతో స్నేహపూర్వకంగా మాట్లాడతారని ఆనందం వ్యక్తం చేశారు. కాకపోతే చాలా మంది తమ మాతృభాష అయిన తెలుగు భాషలో మాట్లాడేందుకు అయిష్టత చూపుతున్నారని, అలా చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

మరింత నైపుణ్యం సాధిస్తా..

తెలుగులో ఇంకా ఓనమాలు నేర్చుకుంటున్నానని, ఇంకా నైపుణ్యం సాధించేందుకు కష్టపడుతున్నానని రెమిల్లార్డ్ చెప్పుకొచ్చారు. హాలీవుడ్ సినిమాల్లో చూపించినట్టు అమెరికా సమాజం ఉండదని, సినిమాలకు, నిజజీవితానికి చాలా వ్యత్యాసం ఉంటుందని వివరించారు. సినిమాల వల్ల కూడా అమెరికా సమాజాన్ని వేరే దేశాల వారు అపార్థం చేసుకుంటున్నారని చెప్పారు. అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ స్టడీస్ అనే సంస్థలో తెలుగు నేర్చుకున్నట్లుగా ఆమె తెలిపారు.

భాషతో పాటు సంస్కృతి కూడా..



విదేశీ విద్యార్థులకు 20 ఏళ్లుగా తెలుగు చెబుతున్నాను. వీరికి కొత్త భాష నేర్చుకోవాలనే తపన ఎక్కువగా ఉంటుంది. వాళ్లకు తెలుగుతో పాటు ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలను బోధిస్తుంటాం.
– కొల్లాపురం విమల, తెలుగు ప్రొఫెసర్

ఎంతో కష్టపడుతుంటారు..



రెమిల్లార్డ్ తెలుగు నేర్చుకునేందుకు ఎంతో కష్టపడేవారు. ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా అడిగి తెలుసుకునేవారు. ఉచ్చారణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. తెలుగులో ఏ డౌట్ వచ్చినా ఇప్పటికీ అడుగుతుంటారు. ఆమెతో పాటు చాలా మంది విద్యార్థులు మా వద్ద తెలుగు నేర్చుకున్నారు.
– డాక్టర్ చంద్రయ్య శివన్న, తెలుగు ప్రొఫెసర్

ఆహో సురభి

నాటకరంగానికి కేరాఫ్..

- సినిమాలకు దీటుగా సెట్టింగులు
- రాజసం ఉట్టిపడే నటన
- అద్భుత హావభావాలు
- 139 వసంతాలుగా ప్రదర్శనలు



రాజసం ఉట్టిపడే నటన... అద్భుత హావభావాలు... స్పష్టమైన వాక్పటిమ... 'సురభి' కళాకారులకు సొంతం. 'సురభి' వేదికపై తెరలు ఒకదాని తర్వాత ఒకటి కనురెప్ప మూసి తెరిచేలోపే మారిపోతాయి. రంగస్థలం మీదనే భారీ సెట్టింగులను తలపించే అనేక రకాల తెరలు కదలాడతాయి. అయితే అలా ఎన్నో సంభ్రమం కలిగించే దృశ్యాలను ప్రదర్శించడం 'సురభి' కళాకారులకే సాధ్యం. 139 సంవత్సరాలుగా పౌరాణిక, జానపద నాటకాలను ప్రదర్శిస్తూ 'సురభి' కళాకారులు నాటకరంగానికి సేవలు అందిస్తున్నారు. అందులోని ఓ బృందమే వనస్థలిపురంలో నాటక ప్రదర్శనలిస్తున్న 'శ్రీ వినాయక నాట్యమండలి (సురభి).
– వనస్థలిపురం

కడప జిల్లా రాయచోటి తాలూకా 'సురభి' గ్రామంలో (గతంలో దీన్ని సొరుగు గ్రామంగా పిలిచేవారు) 1885లో వనారస గోవిందరావు 'శ్రీ గోవిందరాయ సురభి నాట్య మండలి'ని ఏర్పాటు చేశారు. కాలక్రమేణా గోవిందప్ప కుటుంబం విస్తరించడంతో పలు బృందాలుగా నాటక సమాజం ఏర్పడింది. ప్రస్తుతం ఐదు బృందాలవారు మాత్రమే నాటక ప్రదర్శనలిస్తున్నారు. అందులో ఒకటి 'శ్రీ వినాయక నాట్య మండలి' (సురభి). రేకందార్ వేణుగోపాలరావు ఆధ్వర్యంలోని శ్రీ వినాయక నాట్యమండలి వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియంలో తాత్కాలికంగా 'సురభి' నాటకశాలను ఏర్పాటు చేసుకుని 15 ఏళ్లుగా నాటక ప్రదర్శనలు ఇస్తోంది. ఇక్కడే కాకుండా తరచూ ఇతర ప్రాంతాల్లో కూడా వీరు నాటక ప్రదర్శనలు ఇస్తున్నారు.

వనస్థలిపురంతో అనుబంధం..

వనస్థలిపురంలో నాటక ప్రదర్శనలిస్తూ స్థానికులతో అనుబంధం పెంచుకున్నారు. వారి పిల్లలు స్థానికంగా ఉన్న పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి చదువుకుంటున్నారు. స్థానిక రచయిత పీఎస్ఆర్.ఆంజనేయులు రచించిన 'శ్రీనివాస కళ్యాణం' నాటకాన్ని సురభి వారు ప్రదర్శిస్తుండడం గమనార్హం.

అద్భుత నటన, హావభావాలు...

సురభి కళాకారులు ప్రేక్షకుల కోరిక మేరకు తరచూ మాయాబజార్, బాలనాగమ్మ, చింతామణి, పాతాళభైరవి, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర, శ్రీకృష్ణలీలలు, షిరిడీసాయి మహాత్మ్యం, శ్రీనివాస కళ్యాణం నాటకాలను ప్రదర్శిస్తూ మన్ననలు పొందుతున్నారు. నిర్వాహకుడు వేణుగోపాలరావు కుమారుడు దినకర్ వేదికపై శ్రీనివాసుడిగా, శ్రీ వెంకటేశ్వర స్వామిగా కన్పించగానే ప్రేక్షకులు మంత్రముగ్ధులవుతారు. ఇక హరిశ్చంద్రుడు, రావణబ్రహ్మ, దుర్యోధనుడు, రాముడు, మాయల మరాఠీ, నారదుడు, బలరాముడు, హిరణ్యకశిపుడు లాంటి విభిన్న పాత్రలు పోషిస్తూ వేణుగోపాలరావు 'భేష్' అనిపించుకుంటున్నారు.





ఒకే కుటుంబంలో 45 మంది...

సమిష్టి కృషి, వారసత్వం, ఏకాగ్రత, పట్టుదల, భక్తి భావం సురభి నాటక సమాజంలో కనిపిస్తుంది. ఒకే కుటుంబానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుని మొదలు 3 నెలల పాప వరకూ 45 మంది కళాకారులు నాటక ప్రదర్శనలో పాల్గొంటుండడం విశేషం.

అన్ని శాఖల్లోనూ ఐకమత్యంగా...

ఈ సంస్థలోని వారు కథానాయకి, కథానాయకుడు, దుష్టపాత్రల దగ్గర నుంచి చిన్న పాత్రల వరకూ ఒకే విధంగా శ్రద్ధతో పోషిస్తారు. పాత్రలు లేనివారు తెరలు దించడం, ఎక్కించడం, అలంకరణ, లైటింగ్, తెరల తయారీ, విగ్గులు, కిరీటాలు రూపొందించడం, దుస్తులు కుట్టుకోవడం స్త్రీ, పురుషులదరూ కలసి చేస్తారు. తీరిక సమయాల్లో పిల్లలకు సంగీతంలో శిక్షణ ఇస్తారు. ఇలా అన్ని శాఖల్లోనూ అందరూ కలసి పనిచేస్తారు.



ఆదరణ తగ్గుతోంది...

కళలు, కళాకారులకు గుర్తింపు తెచ్చింది మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి. ఆయన మా కులాన్ని బీసీ(బీ)లో చేర్పించి అండగా నిలిచారు. ప్రస్తుతం నాటకరంగం నిరాదరణకు గురవుతోంది. కళాకారులందరూ నాటకరంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. సినిమాలు, టీవీల రాకతో నాటక రంగానికి ఆదరణ తగ్గుతోంది. ప్రభుత్వం సురభి కళాకారులపై దృష్టి సారించి తగిన సౌకర్యాలు కల్పించాలి. నాటక ప్రదర్శనలకు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తే, థియేటర్ నిర్మించుకుని నాటకాలు ప్రదర్శిస్తాం.
– రేకందార్ వేణుగోపాలరావు, నిర్వాహకులు, శ్రీ వినాయక నాట్యమండలి.

వైట్ పేపర్.. లైట్ తీస్కో..

కరెంట్‌పైనా కోతలే!

పొంతనలేని లెక్కలు..అర్థం లేని ఆరోపణలు ● తెలంగాణ నుంచి బకాయిలు వసూలు చేయనిది ఈ బాబే

- ట్రాన్స్ మిషన్ చార్జీలేని సెకీ విద్యుత్‌కు ట్రాన్స్ మిషన్ చార్జీల కోసమే అధికధర అంటూ వక్ర భాష్యం
- థర్మల్ బ్యాక్ డౌన్ చేసి విద్యుత్ సంస్థలపై అదనపు భారం వేసి ఆ నెపం గత ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నం
- మిగులు విద్యుత్ ఉండగా అధిక ధరలకు పీపీఏలు కుదుర్చి డిస్కంలను అప్పుల కుప్పలు చేసిన టీడీపీ
- ప్రాజెక్టుల అంచనా వ్యయాలు పెంచి జాప్యం చేసిందే బాబు
- వాస్తవాలు దాచి విద్యుత్ పై వైట్ పేపర్ పేరుతో చంద్రబాబు ఫీట్లు
- టారిఫ్ పెంపు, ట్రూ అప్ తగ్గింపుపై మాట దాటవేత



శ్వేత పత్రం... యథార్థాలు చెబుతుందన్న అర్థాన్ని వదిలేస్తే.. జస్ట్ తెల్ల కాగితం! ఎవరికిష్టం వచ్చినట్లు వాళ్లు రాసుకోవచ్చు. అందుకే... సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే శ్వేతపత్రాల పరంపర మొదలెట్టారు. పోలవరం.. అమరావతి.. ఇప్పుడు విద్యుత్ రంగం. కానుల కోసం ప్రత్యేక హోదాపై రాజీ పడి.. ప్యాకేజీగా తెచ్చుకున్న పోలవరాన్ని తమ వారికి కట్టబెట్టేసి... డబ్బులొచ్చే పనులు మాత్రమే చేసి తాను నాశనం చేసిన జీవ నాడి పాపాలను సైతం వైఎస్ జగన్‌పైకే నెట్టేయడమన్నది తొలి తెల్ల కాగితం సారాంశం. తను ఏలిన ఐదేళ్లూ గ్రాఫిక్స్‌లోనే చూపించిన అమరావతిని కూడా జగనే దెబ్బ తీశారనేది మరో శ్వేతపత్ర కథనం. కోలుకోలేని బకాయిలతో విద్యుత్ సంస్థల మనుగడనే ప్రశ్నార్థకం చేసి... నాడు సరఫరా వ్యవస్థను సర్వనాశనం చేసిన చంద్రబాబు... పాత ప్రభుత్వ బకాయిల్ని కూడా చెల్లించి విద్యుత్ వ్యవస్థను పట్టాలెక్కించిన వైఎస్ జగన్‌పై మూడో పత్రం సహితంగా మరిన్ని అసత్యాలు వండివార్చారు.

సాక్షి, అమరావతి: అబద్ధాలతో మునుపటి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై బురద జల్లడమే ప్రధాన అజెండాగా సీఎం చంద్రబాబు మంగళవారం విద్యుత్ శాఖపై శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. ఐదేళ్లలో ఒక్క సారి కూడా పవర్ హాలిడే విధించకుండా, విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో జరిగినప్పుడు కూడా ఎక్కడా సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టిన గత ప్రభుత్వంలో లేని తప్పులను, జరగని నష్టాలను కల్పించి శ్వేతపత్రంలో పొందుపరిచారు. తాను గతంలో అధికారంలో ఉన్నప్పుడు కుదుర్చుకున్న ఒప్పందాలతో కుదేలైన డిస్కంలను ఆదుకున్న వైఎస్ జగన్ వల్లనే విద్యుత్ రంగం రూ.1,29,503 కోట్ల నష్టం వచ్చిందంటూ చంద్రబాబు కనికట్టు విద్యను ప్రదర్శించారు. 2018–19 నాటికి జెన్‌కో ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ 5613 మెగావాట్లుకాగా 7,213 మెగావాట్లు అని చంద్రబాబు అబద్ధాలు చెప్పుకొచ్చారు. ఆ అబద్దాలు..వాటి వెనుక వాస్తవాలు ఇవీ...

మీ వల్ల కానిది జగన్ చేసి చూపించలేదా?

కృష్ణపట్నంలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్‌డీఎస్‌టీపీఎస్)లోని 800 మెగావాట్ల యూనిట్, నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్)లోని 800 మెగావాట్ల యూనిట్‌ల జాప్యం వల్ల రూ.12,818 కోట్లు నష్టమని అసత్యాల కథ అల్లారు చంద్రబాబు. నిజానికి ఈ రెండు యూనిట్లతో 1,600 మెగావాట్ల విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చిందే జగన్. ఈ రెండు ప్రాజెక్టుల్లో పనులకు స్థిర (ఫిక్స్‌డ్) రేటును నిర్ణయించారు. దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చడానికి, పెంచడానికి అవకాశం లేదు. కోవిడ్ రెండు దశల కారణంగా 2020, 2021 సంవత్సరాల్లో ఏడాదిన్నరకు పైగా ప్రాజెక్టుల పనులు నిలిచి పోయాయి. కోవిడ్ మూడో దశలో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి కార్మికులను సమీకరించడం, వారికి పునరావాసం కల్పించడానికి చాలా సమయం పట్టింది. అయినప్పటికీ పనులు చకచకా జరిపించి 2022 అక్టోబర్‌లో ప్రారంభించారు. అదే విధంగా ఎన్టీటీపీఎస్‌లో యూనిట్‌లో అదే ఏడాది డిసెంబరులో ఉత్పత్తి మొదలుపెట్టారు. అయితే జీఎస్టీ అమలు, చట్టంలో మార్పు, ఇప్పటికే ఖర్చు చేసిన మొత్తంపై వడ్డీ కారణంగా అంచనా వ్యయంతో పోలిస్తే ప్రాజెక్ట్ వ్యయం పెరిగింది. ఇందులో జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం ఏమాత్రం లేదు. అంతే కాకుండా జగన్ హయాంలో ఉత్పత్తి 63,675 మిలియన్ యూనిట్లు కాస్తా, ఉత్పత్తి 2023–24 నాటికి 80,151 మిలియన్ యూనిట్లకు పెరిగింది.

డిస్కంలకు అప్పుల పాలు చేసింది మీరేగా బాబు:

డిస్కంల నికర విలువ 2014లో చంద్రబాబు గెలిచే నాటికి సుమారు మైనస్ రూ.4,315 కోట్లు ఉంటే, ఆ ప్రభుత్వం దిగిపోయేనాటికి... అంటే 2019 నాటికి నికర విలువ దారుణంగా క్షీణించి ఏకంగా మైనస్ రూ.20వేల కోట్లకు చేరింది. 2014–15 నుంచి 2018–19 వరకు ఐదేళ్ళలో రూ.13,225 కోట్లు మాత్రమే అప్పటి ప్రభుత్వం సబ్సిడీ చెల్లించింది. 2019–20 నుంచి 2023–24 వరకు నాలుగేళ్ళలోనే సబ్సిడీ, ఆర్థిక మద్దతు కింద జగన్ సర్కారు రూ.47,800.92 కోట్లు చెల్లించింది. జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కంల అప్పులు, విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు పంపిణీ సంస్థలు చెల్లించాల్సిన బకాయిలు 2014 మార్చి నాటికి రూ.29,551 కోట్లు ఉంటే, చంద్రబాబు దిగిపోయే నాటికి రూ.86,215 కోట్లకు పెరిగాయి. అంటే ఏకంగా 56,663 కోట్లు పెరిగాయి. సగటున అప్పుల వృద్ధిరేటు 24శాతం. అదే జగన్ హయాంలో రూ.86,215 కోట్లు కాస్తా.. రూ.1,22,518కోట్లకు పెరిగాయి. అంటే కోవిడ్ లాంటి సంక్షోభాలున్నా, చంద్రబాబు చేసిన అప్పులభారం అధికంగా ఉన్నా... జగన్ హయాంలో పెరిగిన అప్పులు కేవలం రూ.36,303 కోట్లు. వాటి వృద్ధిరేటు 7.3 శాతమే. టీడీపీ ప్రభుత్వం 8 వేల మెగావాట్ల పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ)లను అధిక ధర (యూనిట్ రూ.7)లకు కుదుర్చుకుంది. దీనివల్ల డిస్కంలు ఏటా దాదాపు రూ.3,500 కోట్ల చొప్పున 25 ఏళ్ల పాటు ఈ భారం మోయాల్సి వస్తోంది. ఈ ఒప్పందాల కోసం థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని (బ్యాక్ డౌన్)తగ్గించింది. గత ప్రభుత్వంలో తీసుకున్న రుణాలపై వడ్డీలు చెల్లించడం కోసం డిస్కంలు ఆర్థిక సంస్థల నుంచి మరిన్ని రుణాలను తీసుకోవాల్సి వచ్చింది. బాబు సీఎంగా ఉన్నన్నాళ్లూ విద్యుత్ కొనుగోలు వ్యయం (ట్రూ అప్)ను బిల్లుల్లో సర్దుబాటు చేసుకునే అవకాశాన్ని డిస్కంలకు ఇవ్వలేదు. దీంతో 2014–19 మధ్య దాదాపు రూ.20 వేల కోట్లు డిస్కంలు నష్టపోవాల్సి వచ్చింది. ఆ ట్రూ చార్జీలే జగన్ హయాంలో ఏపీఈఆర్సీ అనుమతితో డిస్కంలు వేశాయి. మరిప్పుడు ట్రూ అప్ ఛార్జీలను వెనక్కి తీసుకునే ఆలోచన ఉందా?, విద్యుత్ చార్జీల టారిఫ్ పెంచరా? అని విలేకరులు అడిగితే 'నేను అలా అన్నానా'అంటూ, అవేవీ జరగవని, చార్జీల పెంపు తప్పదనే సంకేతాన్ని చంద్రబాబు ఇవ్వనే ఇచ్చారు.

బట్టలారేసుకోవాలన్నది ఎవరు:

రాష్ట్రంలోని వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడంతో పాటు విద్యుత్ పంపిణీ నష్టాల తగ్గింపు, పారదర్శకత కోసమే స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా రైతు ఖాతాలో నెలవారీ వినియోగ చార్జీలను ప్రభుత్వం జమ చేస్తుంది. ఆ మొత్తాన్ని రైతులు డిస్కంలకు చెల్లిస్తారు. ఇదంతా తప్పని ఎన్నికల ముందు గొంతు చించుకున్న చంద్రబాబు ఇప్పుడు మాత్రం స్మార్ట్ మీటర్లపై సమాధానం దాటవేశారు. వ్యవసాయానికి స్మార్ట్ మీటర్లు పెడుతుంటే, రైతులపై విద్యుత్ బిల్లులు భారం వేస్తారని తప్పుడు ప్రచారం చేసిన బాబు..మీటర్లపై మీ వైఖరేమిటని అడిగితే అర్థం లేని సమాధానాలతో తప్పించుకునే ప్రయత్నం చేశారు. స్మార్ట్ మీటర్ల గురించి చెప్పకుండా సోలార్ నెట్ మీటరింగ్ గురించి చెప్పుకొచ్చారు. నిజానికి వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తే తీగలపై బట్టలు ఆరేసుకోవాలని ఇదే చంద్రబాబు ప్రతిపక్షంలో ఉండగా ఎద్దేవా చేశారు. అధికారంలో ఉండగా రైతులకు ఉచిత విద్యుత్ బకాయిలను రూ.8845 కోట్లు ఎగవేశారు. దానిని కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించింది. ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ కింద రూ.43,744 కోట్లను జగన్ ప్రభుత్వం అందించింది.

తెలంగాణ బకాయిలు వసూలుకు చొరవ తీసుకున్నది జగనే:

తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు ఆంధ్రప్రదేశ్ సరఫరా చేసిన విద్యుత్‌కు చెల్లించాల్సిన రూ.7300 కోట్ల బకాయిలను వసూలు చేసేందుకు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రంపై అనేక పర్యాయాలు వత్తిడి తీసుకువచ్చారు. దాంతో రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏపీకి విద్యుత్ బకాయిలు కట్టాల్సిందేనని కేంద్రం తెలంగాణకు చెప్పింది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ)ల నుంచి 2014 జూన్ 2 నుంచి 2017 మార్చి 31 మధ్య రూ.5625 కోట్ల రుణాలను ఏపీ జెన్‌కో తీసుకుంది. అలా తీసుకున్న డబ్బులతోనే తెలంగాణకు విద్యుత్ సరఫరా చేసింది. కానీ వాడుకున్న విద్యుత్‌కు తెలంగాణ నుంచి అప్పుడు అధికారంలో ఉన్న చంద్రబాబు వసూలు చేయలేకపోయారు. ఇప్పుడు ఆ బకాయిలను కూడా గత ప్రభుత్వం ఖాతాలోకి నెట్టే ప్రయత్నం చేశారు. మీరేం చొరవ తీసుకుంటున్నారని విలేకరులు అడిగితే మాత్రం 'వాళ్లేదో అంటున్నారు. కమిటీ వేస్తాం ..చూస్తాం'అంటూ సమాధానం చెప్పలేకపోయారు.

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

విద్యుత్తులో విధ్వంసం!

- జగన్ తప్పుడు నిర్ణయాలతో రూ.1,29,503 కోట్ల నష్టం: శ్వేతపత్రంలో సీఎం చంద్రబాబు
- ఐదేళ్లలో ప్రజలపై చార్జీల రూపంలో రూ.32,166 కోట్ల భారం
- గత ప్రభుత్వం వివిధ సంస్థలతో చేసుకున్న ఒప్పందాలపై సమీక్ష చేస్తాం



సాక్షి, అమరావతి: గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రజలకు, విద్యుత్ రంగానికి రూ.1,29,503 కోట్ల నష్టం వాటిల్లిందని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. ట్రూ అప్, ట్రూ అప్ ఫ్యూయల్ అంటూ కొత్త పేర్లతో వడ్డించిన ఛార్జీలతో రూ.32,166 కోట్ల భారాన్ని మోపి ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. 1995–2004లో 1.0 సంస్కరణలు తెచ్చానని చెప్పారు. 2014లో తాను అధికారంలోకి వచ్చాక 22.5 మిలియన్ యూనిట్ల కొరత ఉందని, అప్పుడు 2.0 సంస్కరణలు తెచ్చానన్నారు. సీఎం చంద్రబాబు సచివాలయంలో మంగళవారం విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేసి మాట్లాడారు.

అప్పట్లో మిగులు విద్యుత్

1998లో విద్యుత్ సంస్కరణలు తెచ్చాం. దేశంలోనే మొదటి ఈఆర్సీని తీసుకొచ్చాం. వీటి ఫలితంగా జనరేషన్, ట్రాన్స్ మిషన్, పంపిణీ సంస్థలు వచ్చాయి. జాతీయ స్థాయిలో సగటున 7.1 శాతం మిగులు విద్యుత్ సాధించాం. 2003–04 మధ్య మిగులు విద్యుత్ సాధించాం. 2004లో నా పవర్ పోయినా.. నేను తెచ్చిన సంస్కరణల వల్ల దేశం బాగుపడింది. ట్రాన్స్ మిషన్ నష్టాలు ఒకప్పుడు 35 శాతం చూపించేవారు. నేను వచ్చాక ఆడిటింగ్ పెట్టడంతో 28 శాతానికి తగ్గించడంతో పాటు చివరకు 7 శాతానికి తీసుకొచ్చా. 2014లో అధికారం చేపట్టాక 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరత ఉన్నా పవర్ మేనేజ్‌మెంట్ చేశాం. 2018 జనవరి నాటికి మిగులు విద్యుత్ సాధించాం. డిమాండ్‌ను 6,784 మెగావాట్ల నుంచి 9,453 మెగావాట్లకు పెంచాం. వినియోగాన్ని 40,174 మిలియన్ యూనిట్ల నుంచి 54,555 మిలియన్ యూనిట్లకు పెంచాం. ఐదేళ్లలో ఒక్కసారి కూడా విద్యుత్ కోతలు విధించలేదు. టారిఫ్ పెంచకుండా నాణ్యమైన విద్యుత్ అందించాం. థర్మల్ యూనిట్స్ రెండు కొత్తవి తీసుకొచ్చాం. ఏపీ జెన్‌కో సామర్థ్యాన్ని 4,114 నుండి 7,213 మెగా వాట్లకు పెంచాం. ట్రాన్స్ మిషన్ సామర్థ్యాన్ని 29,863 నుండి 46,987 మెగా ఓల్ట్ ఆంప్స్‌నకు పెంచాం. గత ప్రభుత్వం వినియోగదారులపై రూ.32,166 కోట్ల భారం మోపింది. వీటీపీఎస్, కేటీపీఎస్ పనుల్లో ఆలస్యం వల్ల రూ.12,816 కోట్లు అదనంగా భారం పడింది. పోలవరం హైడ్రాలిక్ కాంట్రాక్ట్ మార్చడం వల్ల 2023కి పూర్తి కావాల్సి ఉన్నా పూర్తి కాకపోవడంతో రూ.4,737 కోట్లకు భారం పెరిగింది. సెకీ సోలార్ వల్ల, అప్పులు, వడ్డీలు, పవర్ స్టేషన్ కెపాసిటీ తగ్గించడం, నిలిపివేత కారణంగా మొత్తంగా రూ.47,741 కోట్లు భారం పడింది.

అప్పులన్నీ ప్రజలే కట్టాలి..

ఈ అప్పులన్నీ ప్రజల నుంచే చెల్లించాలి. పెట్టుబడి దారులకు నమ్మకం పోవడంతో పాటు రాష్ట్ర బ్రాండ్ దెబ్బతింది. సోలార్ వాడుకుంటే కరెంట్ మనకు వచ్చేది. కానీ వాడకుండా రిజెక్ట్ చేశారు. వినియోగించని కరెంట్‌కు కూడా కోర్టు ఆదేశాలతో రూ.9 వేల కోట్లు చెల్లించాల్సి వచ్చింది. 21 విండ్, ఇతర ఒప్పందాలను రద్దు చేయడం వల్ల కూడా భారం పడింది. ట్రూ అప్ ఫ్యూయల్ పేరిట రూ.5,886 కోట్లు, ట్రూ అప్ ఛార్జెస్ కింద రూ.3,977 కోట్లు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ కింద రూ.5,604 కోట్లు ఇలా అన్నీ కలిపి రూ.32,166 కోట్లు ప్రజలపై భారం వేశారు. గత ప్రభుత్వం మోపిన భారం పేదలపైనే ఎక్కువ పడింది. 1.53 కోట్ల కుటుంబాలు ఇబ్బంది పడ్డాయి. రూ.17,137 కోట్లు ట్రూ అప్, ఫ్యూయల్‌లో ఇంకా పెండింగులో ఉన్నాయి.

సరిగా పని చేయకుంటే చర్యలు తప్పవు..

మద్యంపై ఆదాయాన్ని చూపి అప్పులు తెచ్చారు. ప్రభుత్వ భూములు తాకట్టు పెట్టారు. నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో చూడని దుర్మార్గ పాలనను గత ఐదేళ్లలో చూశాను. అధికారులు ఎవరు సరిగా పని చేయకపోయినా చర్యలు ఉంటాయి. రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఉండకూడదు. నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకు అందించాలి. నాకు ఒక్క ఫిర్యాదు కూడా రావడానికి వీల్లేదు.

ఒళ్లు దగ్గర పెట్టుకోండి..
ఉద్యోగులకు సీఎం చంద్రబాబు హెచ్చరిక

విద్యుత్ శాఖపై శ్వేత పత్రం విడుదల సందర్భంగా సీఎం చంద్రబాబు తీవ్ర అసహనానికి గురయ్యారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాట్లు సరిగా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. "బ్యాటరీ అయిపోయినట్టుంది. చూసుకోండయ్యా.. జాగ్రత్తగా చూసుకోండి.. ఒళ్లు దగ్గర పెట్టుకుని పని చేయండి. తమాషాలాడుతున్నారు. ప్రభుత్వంలో ఉన్న వారు ఇలా పనిచేస్తున్నారు. తొలి రోజు వస్తే కమోడ్ కూడా పని చేయలేదు. నా రూమ్‌లో కూడా ఏమీ పనిచేయడం లేదు. ప్రజెంటేషన్‌కు వచ్చే ముందు అన్నీ చూసుకోవాలి. ఇలాగే ఉంటే చాలా సీరియస్‌గా చర్యలు తీసుకోవాల్సి వస్తుంది"అంటూ అధికారులను హెచ్చరించారు. చివరిలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక సీఎం తడబడ్డారు.

క్లుప్తంగా...

ఐపీఎస్ సుబ్బారాయుడు ఏపీకి బదిలీ

- మూడేళ్ల డిప్యూటేషన్‌పై అంతర్రాష్ట్ర బదిలీకి కేంద్రం అనుమతి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సుబ్బారాయుడు అంతర్రాష్ట్ర డిప్యూటేషన్‌పై ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అభ్యర్థన మేరకు తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారి సుబ్బారాయుడును మూడేళ్లపాటు డిప్యుటేషన్‌పై ఏపీకి బదిలీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు మంగళవారం ఆయన్ను రిలీవ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు వెల్లడించినట్లు తెలిసింది. ఐపీఎస్ సుబ్బారాయుడు ఏపీ సీఎం చంద్రబాబునాయుడికి అత్యంత సన్నిహితుడని, ఏపీలో ఆయనకు కీలక పోస్టింగ్ దక్కుతుందన్న ప్రచారం పోలీస్ వర్గాల్లో జరుగుతోంది.

నిరుద్యోగులపై ఎందుకింత కక్ష
రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య



పంజగుట్ట (హైదరాబాద్): ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి నిరుద్యోగుల ప్రతి డిమాండ్‌ను సమర్థించి.. అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల న్యాయమైన ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'మన బిడ్డల ఉద్యోగాల కోసం పోరాడదాం, విద్యార్థి, నిరుద్యోగులకు మద్దతుగా' అంశంపై ప్రజా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య అధ్యక్షుడు కొంపెల్లి రాజు, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్‌ల అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆర్.కృష్ణయ్య, బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. జూలై 15వ తేదీన విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య తలపెట్టిన చలో సెక్రటేరియట్ విజయవంతం చేయాలని కోరారు. ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. నెల రోజులుగా విద్యార్థులు, నిరుద్యోగులు రోడ్డుపైకి వచ్చి పోరాడుతున్నా ప్రభుత్వం నుండి ఒక్కరూ స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించి.. ప్రతిఘటించడంతో రైలు నుంచి తోసేసి..

కిందపడిన యువతికి గాయాలు

- బ్యాలెన్స్ తప్పి తనూ కిందపడిన నిందితుడు
- గాయాలతోనే అర కిలోమీటరు నడుచుకుంటూ ఓ తండాకు చేరి సాయం కోరిన యువతి.. ఆస్పత్రిలో బాధితురాలు..



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బిశ్వాల్

మిర్యాలగూడఅర్బన్: ప్రయాణిస్తున్న రైలులో యువతి పట్ల ఓ యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె ప్రతిఘటించే ప్రయత్నించగా కిందకు తోశాడు. ఈ క్రమంలో ఆ యువకుడు కూడా రైలు నుంచి జారి కిందపడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని వాటర్‌ట్యాంక్ తండా వద్ద మంగళవారం రాత్రి జరిగింది. బాధితురాలు, స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ యువతి హైదరాబాద్ చింతల్‌లో నివాసముంటూ ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తుంది. ఆమె మంగళవారం విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో తన స్వగ్రామానికి బయలుదేరింది. అదే ట్రెస్‌లో ప్రయాణిస్తున్న ఒడిషాకు చెందిన బిశ్వాల్ ఆమెను గమనిస్తూ ఉన్నాడు. ఈ క్రమంలో ఆ యువతి చేతులు కడుక్కునేందుకు ట్రెస్‌లోని వాష్‌బేసిన్ దగ్గరకు వెళ్లగా, ఆమె వెనకాలే అక్కడకు చేరుకున్న బిశ్వాల్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ సంఘటనతో ఒక్కసారిగా ఆందోళనకు గురైన ఆమె అతడిని ప్రతిఘటించింది. దీంతో బిశ్వాల్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆమెను ట్రైన్‌లోంచి కిందకు నెట్టివేశాడు. ఈ క్రమంలో బిశ్వాల్ కూడా పట్టుకోల్పోయి ట్రైన్ కింద పడిపోయాడు.

మాజీ సర్పంచ్ సాయంతో ఆస్పత్రికి...

ట్రైన్ నుంచి కిందపడిన ఆ యువతి గాయాలతోనే సమీపంలో ఉన్న వాటర్‌ట్యాంక్ తండా వరకు అంటే అరకిలోమీటర్ వరకు నడుచుకుంటూ వెళ్లింది. తండాకు చెందిన మాజీ సర్పంచ్ ధనావత్ రామచంద్‌నాయక్ స్థానికుల సాయంతో ఆమెను మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తల, చేతులకు గాయాలు కాగా, ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని పోలీసులు తెలిపారు. ఆ యువతి ఇచ్చిన సమాచారం మేరకు బిశ్వాల్‌ను కూడా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన జరిగిన కొద్ది దూరంలోనే మిర్యాలగూడ రైల్వేస్టేషన్ ఉంది. ఆ స్టేషన్‌లో విశాఖ రైలు ఆగాల్సి ఉండడంతో రైలువేగం చాలా స్లోగా ఉంది. దీంతో ఇద్దరూ కొద్దిపాటి గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

అర్ధరాత్రి ఓయూలో అలజడి

- పరీక్ష వాయిదాకు డీఎస్సీ అభ్యర్థుల డిమాండ్
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం.. 21 మంది విద్యార్థులు అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఓయూలో సోమవారం అర్ధరాత్రి అలజడి నెలకొంది. క్యాంపస్‌లోని ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. టీచర్ పోస్టుల సంఖ్య 25 వేలు పెంచి మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, డీఎస్సీ పరీక్షలు వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ తెల్లవారేవరకు ఆందోళన చేపట్టారు. మంగళవారం ఉదయం 6.30 నిమిషాల వరకూ ఆందోళన విరమించలేదు. దీంతో పోలీసులు 100 మంది డీఎస్సీ అభ్యర్థులను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత డీఎస్సీ అభ్యర్థులు ఉదయం ఎనిమిది గంటలకు విడిచిపెట్టారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ సమీపంలోని ల్యాండ్‌స్కేప్ గార్డెన్‌లో పోలీసులు హల్‌చల్ చేశారు. డీఎస్సీ పరీక్ష వాయిదా కోసం భవిష్యత్ కార్యచరణ సిద్ధం చేసుకొని డీఎస్సీ అభ్యర్థులు మంగళవారం ఉదయం పదకొండు గంటలకు మీడియాతో మాట్లాడుతుండగా, ఓయూ ఏసీపీ జగన్ నేతృత్వంలో పోలీసు బలగాలు అక్కడకు చేరుకున్నాయి. అరెస్ట్ భయంతో డీఎస్సీ అభ్యర్థులు పరుగులు తీశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిని అరెస్టుల పేరుతో భయాబ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. బీఆర్ఎస్వీ నేతలు మధ్యాహ్నం ఆర్ట్స్ కాలేజీ ఎదుట సీఎం దిష్టిబొమ్మ దహనం చేసి ఆయనకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా 10 మంది డీఎస్సీ అభ్యర్థులు, 11 మంది బీఆర్ఎస్వీ నేతలను అరెస్ట్ చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు ఓయూ సీఐ రాజేందర్ తెలిపారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలి

- మహాభారతంలో శ్రీకృష్ణుడు మొట్టమొదటి రాయబారం చేశాడు
- ఇగోలు పక్కన పెడితే సమస్యలే ఉండవు
- దేశంలో మూడున్నర కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేశ్



సదస్సులో ప్రసంగిస్తున్న జస్టిస్ భీమపాక నగేశ్

హిమాయత్‌నగర్: మనుషులు తమ ఇగోలను పక్కన పెట్టి మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని, ఇగోలు పక్కన పెడితే అసలు సమస్యలే ఉండవని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భీమపాక నగేశ్ అన్నారు. మహాభారతంలో మొట్టమొదటిసారి శ్రీకృష్ణుడు రాయబారం చేసి మధ్యవర్తిత్వం చేశారని ఆయన గుర్తు చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 'వివాద పరిష్కారాలు–ప్రత్యామ్నాయాల చట్టం 2023, బార్ అసోషియేషన్ పాత్ర'అనే అంశంపై కౌన్సిల్ ఫర్ ఆల్టర్‌నేట్ డిస్ప్యూట్ రెజల్యూషన్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించారు. తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ.నర్సింహరెడ్డి అధ్యక్షత వహించిన ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ నగేష్ మాట్లాడుతూ దేశంలో ఇప్పటికే మూడున్నర కోట్ల కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రోజుకు 100 కేసుల చొప్పున పరిష్కరించినా 34 ఏళ్లు పడుతుందని, అందువల్ల మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యత ఇచ్చి కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

ఇరు పార్టీలు రాజీకి సిద్ధంగా ఉన్నప్పటికీ న్యాయవాదులు రాజీ పడడం లేదని, దీని వల్ల కొత్త సమస్యలు వస్తున్నాయని జస్టిస్ నగేష్ అన్నారు. న్యాయవాదులు కేసుల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీనియర్ న్యాయవాది, తెలంగాణ హైకోర్టు అడిషనల్ సోలిసిటర్ జనరల్ బి.నర్సింహ శర్మ మాట్లాడుతూ లోక్ అదాలత్‌ల ద్వారా మధ్యవర్తిత్వం చేస్తున్నా అవి కొంత వరకే పనిచేస్తున్నాయని చెప్పారు. సుప్రీం కోర్టులో సైతం మధ్యవర్తిత్వ కేంద్రం ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ప్రపంచ వ్యాప్తంగా మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. సదస్సులో మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ న్యాయవాది ఎస్.రాంచందర్‌రావు, సీనియర్ న్యాయవాది, తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఏ.రవీందర్ రెడ్డి, బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కె.సునీల్ గౌడ్, సీనియర్ న్యాయవాదులు ఎం.రాజేందర్ రెడ్డి, పరంకుశం వేణుగోపాల్, జూపూడి రంగారావు, న్యాయవాదులు శిల్ప, లలిత రెడ్డి పాల్గొన్నారు.

టీటీడీ.. మాకే కావాలి!

చైర్మన్ పదవి కోసం పట్టుబడుతున్న టీడీపీ, జనసేన



సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) చైర్మన్ పదవి కోసం కూటమి పార్టీలు పోటీ పడుతున్నాయి. టీడీపీ, జనసేన నేతలు ఆ పదవి కోసం గట్టిగా పట్టుపడుతున్నారు. టీడీపీ నుంచి అశోక్ గజపతిరాజు, వేమిరెడ్డి ప్రశాంతి, రఘురామకృష్ణరాజు రేసులో నిలవగా.. జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ సోదరుడైన నాగబాబుకే టీటీడీ చైర్మన్ పదవి ఇవ్వాలంటూ ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. తమ పార్టీకి చెందిన సీనియర్ నేత ఎవరికైనా ఆ పదవి ఇవ్వాలని సీఎం చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు పేరును ఆయన పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరిగింది. అశోక్ గజపతిరాజు ఇటీవల జరిగిన ఎన్నికల్లో తన కుమార్తె అదితికి అవకాశం కల్పించి.. తాను పోటీ నుంచి వైదొలిగారు. దీంతో ఆయనకే ఈ పదవి ఇస్తారనే ప్రచారం జరిగింది. కానీ ఆయన పూర్తికాలం ఆ పదవి కోసం సమయం కేటాయించకపోవచ్చని, అలాగే అందరికీ అందుబాటులో ఉండడం కష్టమనే అభిప్రాయం టీడీపీ నేతల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణరాజు పేరును కూడా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. మంత్రివర్గంలో స్థానం దక్కకపోవడం.. స్పీకర్ పదవి ఆశించినా అదీ రాకపోవడంతో ఆయన తనకు తగిన గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి కూడా రేసులో ఉన్నట్లు తెలిసింది. నెల్లూరు జిల్లాలో పార్టీ గెలుపు కోసం చాలా కష్టపడ్డామని.. తమకు టీటీడీ చైర్మన్ పదవి ఇవ్వాలని ఆమె కోరుతున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

నాగబాబు కోసం ఒత్తిడి!


టీడీపీలోనే టీటీడీ చైర్మన్ పదవి కోసం ఎంతో మంది ఆశలు పెట్టుకోగా.. దాన్ని ఎలాగైనా దక్కించుకునేందుకు జనసేన పార్టీ పావులు కదుపుతోంది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సోదరుడైన నాగబాబుకు ఆ పదవి ఇవ్వాల్సిందేనని జనసేన పార్టీ చంద్రబాబుపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయనకు టీటీడీ చైర్మన్ పదవి ఖాయమైనట్లు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. అనంతరం ఆ ప్రచారాన్ని ఖండించిన నాగబాబు.. అధికారిక ప్రకటన వస్తేనే ఇలాంటి వాటిని నమ్మాలన్నారు. దీంతో నాగబాబుకు టీటీడీ చైర్మన్ పదవిపై ఆశ ఉన్నట్లు బయటపడింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీగా పోటీ చేయడానికి సిద్ధమైన నాగబాబు.. సర్దుబాటులో భాగంగా ఆ సీటును వదులుకున్నారు. దీంతో అన్నకు ఏదైనా మంచి పదవి ఇప్పించాలనే ఉద్దేశంలో పవన్‌కళ్యాణ్ ఉన్నట్లు తెలిసింది. అందులో భాగంగానే టీటీడీ చైర్మన్ పదవిని అడుగుతున్నట్లు సమాచారం. నెల రోజులుగా ఆ పోస్టు ఖాళీగా ఉన్నా కూడా ఆ పదవికి ఉన్న ప్రాధాన్యత.. పోటీ నేపథ్యంలో చంద్రబాబు ఏమీ తేల్చట్లేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు టీటీడీ బోర్డులో కూడా తమ పార్టీకి చెందిన వారిని సగం మందిని నియమించాలని జనసేన కోరుతున్నట్లు తెలిసింది. బీజేపీ కూడా మూడుకు తగ్గకుండా తమ వారిని బోర్డులో సభ్యులుగా నియమించాలని డిమాండ్ చేస్తోందని సమాచారం.

కొత్త చట్టాలపై అందరికీ అవగాహన ఉండాలి

- పాత, కొత్త చట్టాల మధ్య తేడా తెలుసుకోవాలి
- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుకారాంజీ
- నాంపల్లిలో నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం
- నాంపల్లి బార్ అసోసియేషన్ సభ్యులకు బుక్స్, హెల్త్ కార్డులు పంపిణీ



సిటీ కోర్టులు: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుకారంజీ అన్నారు. మంగళవారం నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజావర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సి.వి.శ్రీనాథ్, బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. నాంపల్లి క్రిమినల్ కోర్టు ఆవరణలోని సీబీఐ కోర్టు బిల్డింగ్ బార్ అసోసియేషన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుకారాంజీ, అదనపు సొలిసిటర్ జనరల్ బి.నర్సింహ శర్మ హాజరై జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ) చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జస్టిస్ తుకారాంజీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పాత చట్టాలు, కొత్త చట్టాలకు తేడా తెలుసుకోవాలన్నారు. కొత్త చట్టాలను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. బి.నర్సింహ శర్మ మాట్లాడుతూ పాత చట్టం ఐపీసీలో సెక్షన్ 53 ఉన్న శిక్షతో పోలిస్తే బీఎన్ఎస్‌లో సెక్షన్ 4లో మరిన్ని ఎక్కువగా జోడించారని వివరించారు. ఇలా కొన్ని సెక్షన్లలో చాలా ముఖ్యమైన మార్పులు చేశారని వెల్లడించారు. అనంతరం నాంపల్లి కోర్టు జడ్జిలకు నూతన చట్టాల పుస్తకాలను, బార్ అసోసియేషన్ సభ్యులకు హెల్త్ కార్డులను వారివురు పంపిణీ చేశారు. అనంతరం బార్ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు.



ఇకపై పరగడుపున కొలెస్ట్రాల్ టెస్ట్ అక్కర్లేదు!

మంచి కొలెస్ట్రాల్, చెడు కొలెస్ట్రాల్‌లకు కొత్త నార్మల్ విలువలు

కార్డియాలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా కొత్త మార్గదర్శకాలు

ఇప్పటివరకూ రక్తంలో కొలెస్ట్రాల్ విలువలు తెలుసుకోడానికి రాత్రి భోజనం తర్వాత కనీసం 12 గంటలపాటు ఆగాక..ఉదయమే ఏదీ తినకుండా పరగడుపున ఈ పరీక్ష చేయించాల్సి వచ్చేది. ఇకపై అలాంటి ఆంక్షలేమీ ఉండవని కార్డియాలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఐ) పేర్కొంది. 'లిపిడ్ ప్రొఫైల్'పరీక్ష ఇకపై పరగడుపున చేయించాల్సిన అవసరం లేదని సీఎస్ఐ తెలిపింది. రక్తంలో ఈ విలువలు నార్మల్‌గా లేకపోవడాన్ని 'డిస్‌లిపిడేమియా'అని పేర్కొంటారు. ఇలా లేకపోవడం వల్ల గుండెజబ్బులు వచ్చే అవకాశముంటుంది. ఈ మేరకు సీఎస్ఐ తొలిసారిగా 'డిస్‌లిపిడేమియా'కు కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. నిజానికి ఇప్పటివరకూ మన దేశంతోపాటు ప్రపంచంలోని చాలా దేశాల్లో యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ నిర్దేశించిన మార్గదర్శకాలనే అనుసరిస్తున్నాయి. అయితే కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 22 మంది సభ్యులతో ఒక కమిటీ ఏర్పడింది. ఇటీవలే అది డిస్‌లిపిడేమియా మార్గదర్శకాలనూ, మంచి, చెడు కొలెస్ట్రాల్‌ల నార్మల్ తాలూకు కొత్త విలువలను వెల్లడించింది. ఈ సందర్భంగా కార్డియాలజీ సొసైటీ ఆనరరీ జనరల్ సెక్రటరీ డాక్టర్ ధూర్జటి ప్రసాద్ సిన్హా మాట్లాడుతూ ఇకపై పరగడుపున మాత్రమే లిపిడ్ ప్రొఫైల్ అక్కర్లేదనే సూచన తొలగిపోవడం అందరికీ మంచి సౌలభ్యం కలిగించే అంశమన్నారు. దీంతో అనేకమంది ఎప్పుడంటే అప్పుడు ఈ పరీక్ష చేయించుకునే సౌకర్యం కలిగిందని చెప్పారు.

- సాక్షి హెల్త్‌డెస్క్

ఈ మార్గదర్శకాల ప్రకారం..

- లిపిడ్ ప్రొఫైల్ పరీక్ష వీలైనంత త్వరగా (18 ఏళ్లు దాటినాటికే) చేయించుకోవాలి. అయితే కుటుంబంలో గుండెజబ్బులు, రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదులు ఎక్కువగా ఉన్న కుటుంబాల్లోని వారు (అంటే ఫెమీలియల్ హైపర్ కొలెస్టెరాలేమియా హైరిస్క్ పేషెంట్స్) అంతకంటే ముందే ఈ పరీక్ష చేయించుకోవచ్చు.
- ముప్పు ఎక్కువగా (హైరిస్క్) ఉన్నవారు మినహాయించి మిగతా అందరికీ చెడు కొలెస్ట్రాల్ మోతాదుల (ఎల్‌డీఎల్–సీ) నార్మల్ విలువ 100 ఎంజీ/డీఎల్.
- ముప్పు ఎక్కువగా ఉన్నవారు మినహాయించి మిగతా అందరికీ హెచ్‌డీఎల్ కాకుండా మిగతా అన్ని కొలెస్ట్రాల్‌ల మోతాదుల (నాన్–హెచ్‌డీఎల్–సీ) నార్మల్ విలువ 130 ఎంజీ/డీఎల్ కంటే తక్కువగా ఉండాలి.
- డయాబెటిస్ / హైబీపీ వల్ల ముప్పు ఎక్కువగా (హైరిస్క్) ఉన్నవారిలో చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్–సీ) విలువ 70 ఎంజీ/డీఎస్ కంటే తక్కువగా ఉండాలి.
- ఈ నార్మల్ విలువల కంటే ఎక్కువగా ఉండటంతో పాటు ట్రైగ్లిజరైడ్స్ అనే కొవ్వులు ఎక్కువగా ఉన్నట్టయితే అది గుండెపోటు (హార్ట్ స్ట్రోక్) లేదా గుండెజబ్బులు (పెరిఫెరల్ హార్ట్ డిసీజ్)లకు దారితీయవచ్చని తెలుసుకోవాలి. ఈ ట్రైగ్లిజరైడ్స్ కొవ్వుల నార్మల్ విలువ 150 ఎంజీ/డీఎల్‌కు లోపున ఉండాలని గుర్తుంచుకోవాలి.
- మరీ ఎక్కువ ముప్పు (వెరీ హై–రిస్క్) ఉన్న పేషెంట్స్... అంటే గుండెపోటు వచ్చి ఉన్నవారు, యాంజైనా అనే చాతీనొప్పి వచ్చినవారు, దీర్ఘకాలిక మూత్రపిండాల జబ్బు (సీకేడీ) ఉన్నవారిలో చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) మోతాదులు 55 ఎంజీ/డీఎల్ కంటే తక్కువగానూ మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) కాకుండా మిగతాది (నాన్–హెచ్‌డీఎల్) కొలెస్ట్రాల్ మోతాదులు 85 ఎంజీ/డీఎల్ కంటే తక్కువగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలి.

లేఅవుట్‌కు రూ.20 లక్షల రైతుబంధు

- ఐదేళ్లుగా పోచారంలో రైతు పేరిట 33 ఎకరాలకు చెల్లింపు
- రూ. 16.80 లక్షలు రికవరీకి రెవెన్యూ శాఖ నోటీసులు
- మేడ్చల్ జిల్లాలో సాగయ్యేది 28,162 ఎకరాలే.. రైతుబంధు 66,519 ఎకరాలకు
- రంగారెడ్డి జిల్లాలో కూడా ఇదే పరిస్థితి



రైతు బంధు రికవరీ కోసం జారీ చేసిన నివేదిక

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్ జిల్లాలో రైతుబంధు పక్కదారి పట్టింది. సాగుకు నోచుకోని లేఅవుట్లు, వెంచర్లు, గుట్టలు, రాళ్లురప్పలు, కంచెలు ఉన్న వేలాది ఎకరాలకు కూడా పెట్టుబడి సాయం అందింది. ఘట్‌కేసర్ మండలం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని 38, 39, 40 సర్వేనంబర్లలోని 33 ఎకరాల లేఅవుట్‌కు రైతుబంధు అందింది. ఇందులో కొంత వ్యవసాయభూమి కూడా ఉంది. రైతు మోత్కుపల్లి యాదగిరిరెడ్డి పేరిట ఐదేళ్లుగా ఈ వెంచర్‌కు రూ. 20 లక్షలు రైతుబంధు పేరిట జమ అయిన విషయం బయటకు పొక్కింది. పోచారానికి చెందిన ఓ వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, రెవెన్యూ అధికారులు విచారించి ఇది వాస్తవమేనని తేల్చారు. మోత్కుపల్లి యాదగిరి రెడ్డి నుంచి రూ.16.80 లక్షలు రికవరీ చేయాలని అధికారులు నిర్ణయించారు. కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఘట్‌కేసర్ తహసీల్దార్ రైతు యాదగిరిరెడ్డి నుంచి రూ.16.80 లక్షల రికవరీ పేరిట నోటీసులు జారీ చేశారు.

నగర శివారులో ఇలా..

నగర శివారులో ఉన్న మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 28,162 ఎకరాల్లో మాత్రమే వివిధ పంటలు సాగవుతున్నాయి. అయితే ఏటా ప్రతి సీజన్‌లో పెట్టుబడి సాయం కింద 66,519 ఎకరాలకు రూ. 39.92 కోట్లు విడుదల అవుతున్నాయి. ఆధార్ కార్డు అనుసంధానం ఆధారంగా రూ. 33.25 కోట్లు సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తోంది. అయితే మిగతావి సాగు భూములు కావని, వెంచర్లు, ఫామ్ ల్యాండ్స్, బీడు భూములనే ఆరోపణలున్నాయి. రంగారెడ్డి జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. రంగారెడ్డి జిల్లాలో 4,45,428 ఎకరాలు ఉన్నాయి. పెట్టుబడి సాయం ప్రతీ సీజన్లో రూ.345.36 కోట్ల చొప్పున ఏడాదిలో రెండు పర్యాయాలు ప్రభుత్వం చెల్లిస్తోంది. రంగారెడ్డి జిలాల్లో సీజన్ల వారీగా సాగవుతున్న భూములకు రూ.222.71 కోట్లు సరిపోతుందని రైతు సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఈ లెక్కన ప్రభుత్వం అదనంగా రూ.117 కోట్లు మేర లేఅవుట్లు, రాళ్లు, రప్పలు, గుట్టలు, కంచెలు ఉన్న భూములకు చెల్లిస్తుందని వారు ఆరోపిస్తున్నారు.

ఏడాది ముందు రిటైర్ అయ్యేవారికి బదిలీల్లో ప్రాధాన్యం

- వైద్య సిబ్బంది బదిలీలకు మార్గదర్శకాలు జారీ

సాక్షి, హైదరాబాద్: సరిగ్గా ఏడాదిలోపు రిటైర్ అయ్యే వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అంటే వచ్చే ఏడాది జూన్ 30వ తేదీ లోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు. వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు తదితరుల బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొంది. భార్యాభర్తలు ఉద్యోగులు అయితే వారికి మొదటి ప్రాధాన్యం కలిస్తారు. ఆ తర్వాతే ఇతరులకు అవకాశం కల్పిస్తారు. అలాగే ఆ తర్వాత ఏడాదిలోపు రిటైర్మెంట్ అయ్యే వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఆ తర్వాత 70 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న ఉద్యోగులకు ప్రాధాన్యం ఉంటుంది. మానసిక వికలాంగ పిల్లలను కలిగి ఉన్న ఉద్యోగులు వారి వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్న ప్రదేశానికి బదిలీ చేయించుకోవచ్చు. ఆ తర్వాత వితంతువులకు ప్రాధాన్యం ఇస్తారు. అలాగే మెడికల్ గ్రౌండ్స్ ఉన్న ఉద్యోగులకు కూడా తదుపరి ప్రాధాన్యం ఉంటుంది. చివరగా మారుమూల కష్టతరమైన ప్రాంతంలో ఎక్కువ కాలం సేవలందించిన వారికి అవకాశం కల్పిస్తారు. ఈ ఏడు రకాల వారికి వారు కోరుకున్నచోట బదిలీ ఉంటుందని వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. బదిలీ కోరుకునే వారు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. దరఖాస్తుదారు పూర్తి పేరు, మొబైల్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ, ఆధార్ నంబర్‌ను నమోదు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు తమ ఉద్యోగ వివరాలు నమోదు చేయాలి. రాష్ట్రం, మల్టీ జోన్, జోన్, జిల్లా వంటి కేడర్ వివరాలు నమోదు చేయాలి. రాష్ట్రం, జిల్లా, మల్టీ జోన్‌ల కోసం మల్టీ జోన్, జోన్‌ల కోసం జోన్ ఎంచుకోవాలి. ప్రస్తుతం పనిచేస్తున్న చోట ఎన్నాళ్ల నుంచి ఉన్నారో.. ప్రస్తుతం ఏ కార్యాలయంలో పనిచేస్తున్నారో నమోదు చేయాలి. వచ్చే ఏడాది జూన్ 30వ తేదీ లోపు పదవీ విరమణ పొందే ఉద్యోగులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాన్ని అప్‌లోడ్ చేయాలి. వైకల్యం ఉన్న వారు సదరం సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయాలి. వితంతువులు తమ జీవిత భాగస్వామి మరణ ధ్రువీకరణ పత్రాన్ని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. మారుమూల కష్టతరమైన ప్రాంతంలో ఎక్కువ కాలం సేవ చేస్తే డీఎంహెచ్ఓ జారీ చేసిన సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయాలని వైద్య ఆరోగ్యశాఖ ఆ మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవంలో తోపులాట

- భక్తుల రద్దీలో కిందపడబోయిన మేయర్ విజయలక్ష్మి
- ఏర్పాట్లు సరిగ్గా లేవంటూ మంత్రి పొన్నం ఆగ్రహం
- ఫుట్‌పాత్‌పై బైఠాయింపు



ఫుట్‌పాత్‌పై కూర్చున్న మంత్రి పొన్నం. చిత్రంలో మేయర్ విజయలక్ష్మి

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన నగర మేయర్ గద్వాల విజయ లక్ష్మి భక్తుల తోపులాటలో కింద పడబోయారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి మంగళవారం దర్శనానికి వెళ్తుండగా వెంట జనాలు కూడా పెద్ద సంఖ్యలో రావడంతో తోపులాట చోటుచేసుకుంది. దీంతో క్యూలైన్ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్ రాడ్ విజయలక్ష్మికి కాలుకు తగిలి కింద పడబోయారు. అక్కడే ఉన్న సిబ్బంది అప్రమత్తమై బయటకు తీసుకు వచ్చారు. ఈ ఘటనతో మంత్రి, మేయర్ కొద్దిసేపు బయట ఫుట్‌పాత్‌పై కూర్చున్నారు. ఏర్పాట్లపై అసహనం వ్యక్తం చేశారు. మంత్రికి, మేయర్‌కు స్వాగతం పలికే తీరు ఇదేనా అంటూ పోలీసు అధికారులపై ఆగ్రహించి ప్రొటోకాల్ పాటించలేదని ఆరోపించారు. ఆ తర్వాత పోలీసు అధికారులు సర్దిచెప్పడంతో ఆలయం లోపలికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

సమీక్షించడం కోసమే కూర్చున్నాం: పొన్నం

ఎల్లమ్మ కల్యాణ మహోత్సవంలో తాను అలకబూనలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. తోపులాట జరిగి మేయర్ కింద పడిపోయే పరిస్థితి నెలకొందనీ, అదేవిధంగా పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఓ గర్భిణి ఫిర్యాదు చేసిందనీ ఈ పరిస్థితుల్లో అధికారులతో సమీక్షించడం కోసం బయట కూర్చున్నామని వివరించారు. ఏర్పాట్ల విషయంలో లోపాలు ఉన్నాయని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని చెప్పారు.

తోపులాట వెనుక కుట్ర

- పోలీసు శాఖదే నిర్లక్ష్యం
- ఖాకీల అత్యుత్సాహంతోనే భక్తులకు ఇబ్బందులు
- బల్కంపేట ఘటనపై సమీక్షా సమావేశంలో మంత్రి కొండా సురేఖ



సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవాలయంలో అమ్మవారి కల్యాణోత్సవం సందర్భంగా మంగళవారం జరిగిన తోపులాట వెనుక కుట్ర కోణం దాగి ఉందని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దేవాలయానికి వచ్చిన సందర్భంలో కొందరు రాజకీయ ప్రేరేపిత అల్లరిమూకలు కావాలని తోపులాటకు దిగి శాంతిభద్రతల సమస్య తలెత్తేలా కుట్రకు పాల్పడ్డాయని ఆమె తెలిపారు. పోలీసు శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించిందంటూ మంత్రి సురేఖ మండలించారు. బల్కంపేట అమ్మవారి దేవాలయం కల్యాణోత్సవంలో మంగళవారం అవాంఛనీయ ఘటనలు జరిగిన నేపథ్యంలో మంత్రి సురేఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ బోనాల ఉత్సవాల్లో పోలీసుల నిర్లక్ష్యం కారణంగా రాజకీయ ప్రేరేపిత అరాచక శక్తులు శాంతి భద్రతల సమస్య సృష్టించేందుకు పన్నాగం పన్నాయని అన్నారు. ఓ మహిళా జర్నలిస్టును డ్యూటీలో ఉన్న ఎస్ఐ దుర్భాషలాడిన విషయం తన దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మంత్రి సురేఖ ఆదేశించారు. పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలనతో పాటు స్థానికంగా ఉంటూ ఉత్సవాలకు హాజరైన ప్రజల నుంచి వివరాలను రాబట్టి బుధవారం లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

బోనాల ఉత్సవాల్లో సిబ్బందికి వాకీటాకీలు ఇవ్వండి: ఈ పరిస్థితుల నేపథ్యంలో బోనాల ఉత్సవాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు గాను దేవాదాయ శాఖ సిబ్బందికి వాకీటాకీలు అందించాలని మంత్రి సురేఖ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు. తదుపరి జరగబోయే ఉత్సవాల్లో పిల్లలు, వృద్ధులు, జోగినీలకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటుచేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అల్లరిమూకల తోపులాట తర్వాత సేద దీరేందుకు తాను ఓ చోట కూర్చుంటే మంత్రి అలిగి దేవాలయం బయట కూర్చున్నాడంటూ సోషల్ మీడియాలో దురుద్దేశ్యంతో చేసిన ట్రోల్స్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ పోలీసు ఉన్నతాధికారులతో ప్రస్తావించారు. సదరు అకౌంట్‌పై సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసి, దోషులను శిక్షించాలని సూచించారు.

వెదిరె శ్రీరామ్‌కు 'కమిషన్' పిలుపు

కాళేశ్వరం బరాజ్‌లపై సాక్ష్యాధారాలను సేకరించనున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్

- శుక్రవారం లేదా సోమవారం రావాల్సిందిగా సూచన
- విద్యుత్ రంగ నిపుణుడు కె.రఘును కూడా విచారించనున్న కమిషన్
- సీడబ్ల్యూసీ, ఇతర అధికారులు, ఇరిగేషన్ మాజీ కార్యదర్శులను సైతం పిలవాలని నిర్ణయం



వెదిరె శ్రీరామ్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బరాజ్‌లపై విచారణలో భాగంగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి మాజీ సలహాదారు వెదిరె శ్రీరామ్ నుంచి సాక్ష్యాధారాలు సేకరించాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నిర్ణయం తీసుకుంది. వచ్చే శుక్రవారం లేదా సోమవారం కమిషన్ కార్యాలయానికి వచ్చి తన వద్ద ఉన్న సమాచారాన్ని అందించాలని ఆయన్ను కోరింది. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మడిహట్టి వద్ద బరాజ్ నిర్మించాల్సి ఉండగా, అక్కడ 165 టీఎంసీల నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) తెలపడం వల్లే బరాజ్‌ను మేడిగడ్డ వద్దకు మార్చినట్టు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేర్కొంది. అయితే వెదిరె శ్రీరామ్ ఇటీవల విలేకరుల సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆ వాదనను తోసిపుచ్చారు. తమ్మడిహెట్టి వద్ద 165 టీఎంసీల లభ్యత ఉందని సీడబ్ల్యూసీ ప్రతిసారీ చెప్పిందని పేర్కొన్నారు. తన వాదనలను బలపర్చే కీలక పత్రాలను సైతం ఆయన ప్రజెంటేషన్‌లో పొందుపరిచారు. కాళేశ్వరం ప్రాజెక్టుకి అనుమతులు, మేడిగడ్డ బరాజ్ వైఫల్యానికి సంబంధించిన పత్రాలు ఇందులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయన వద్ద ఉన్న సమాచారాన్ని సైతం సాక్ష్యాధారాలుగా సేకరించాలని జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ నిర్ణయించింది.

సోమవారం కమిషన్ ముందుకు రఘు

తెలంగాణ జేఏసీ చైర్మన్, విద్యుత్ రంగ నిపుణుడు కె.రఘు నుంచి సైతం సాక్ష్యాధారాలను సేకరించాలని కమిషన్ నిర్ణయించింది. సోమవారం కమిషన్ ఎదుట హాజరై వివరాలను అందించాలని ఆయనకు లేఖ రాసినట్టు తెలిసింది. తమ్మడిహెట్టికి బదులు మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ ఆయన గతంలో అఖిలపక్ష సమావేశాలు, సదస్సులు నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు భారీ ఇంజనీరింగ్ తప్పిదమని, ఎత్తిపోతల కాదు.. తిప్పిపోతల పథకమని పేర్కొంటూ ఆయన ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఈ నేపథ్యంలో కమిషన్ ఆయన్ను సైతం పిలిచింది. రఘు గతంలో ట్రాన్స్‌కో సివిల్ విభాగం సీఈగా వ్యవహరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విభేదించారనే కారణంతోనే రఘును రెండు హోదాలు కిందికి డిమోట్ చేసినట్టు ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో లోపాలను తప్పుబడుతూ తన ఉద్యోగాన్ని మానేసిన ఓ నిర్మాణ సంస్థ కీలక మాజీ ఉద్యోగి ఒకరు త్వరలో కమిషన్ ముందు హాజరై తన వద్ద ఉన్న సమాచారాన్ని సాక్ష్యాధారాలుగా సమర్పించనున్నట్టు తెలిసింది.

త్వరలో సీడబ్ల్యూసీ ఇతర అధికారులకు కబురు

కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్‌ను రూపొందించిన వ్యాప్కోస్ సంస్థ అధికారులతో పాటు హైడ్రాలజీ, ఫైనాన్షియల్ అనుమతులు జారీ చేసిన సీడబ్ల్యూసీ, సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల అధికారులను సైతం విచారణకు పిలిపించాలని జస్టిస్ ఘోష్ కమిషన్ నిర్ణయించింది. ఇక మూడు బరాజ్‌ల వైఫల్యాలపై అధ్యయనానికి ఏర్పాటైన నిపుణుల కమిటీని సైతం త్వరలో కమిషన్ విచారించనుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్ణయాలు తీసుకున్న సమయంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య/ప్రత్యేక ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించిన రిటైర్డ్ ఐఏఎస్‌లు శైలేంద్ర కుమార్ జోషి, రజత్‌కుమార్‌ను త్వరలో కమిషన్ పిలిపించి విచారించనుంది.

20 మంది డీఈఈల విచారణ

కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లు, పంప్‌హౌస్‌ల నిర్మాణంలో పాల్గొన్న 20 మంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను మంగళవారం కమిషన్ విచారించింది. నిబంధనల మేరకే బరాజ్‌ల పనులు జరిగాయా? ఏమైనా పనులను విస్మరించారా? బరాజ్‌లు ఎందుకు విఫలమయ్యాయి? వాటి పునరుద్ధరణకు ఏం చర్యలు తీసుకోవాలి? అనే అంశాలపై వారిని ప్రశ్నించింది. నేడు ఏఈలు, ఏఈఈలను విచారించనుంది.

ఫైళ్లు చూడకుండా ఏమీ చెప్పలేం!

- జస్టిస్ చంద్రఘోష్ కమిషన్‌కు నిపుణుల కమిటీ నివేదిక
- కమిటీ కోరిన ఫైళ్లు ఇవ్వాలని ఆదేశించిన కమిషన్!
- కమిషన్‌కు సహకరించడానికి గతంలో ఈ కమిటీ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణానికి సంబంధించిన కీలక ఫైళ్లను నీటిపారుదల శాఖ తమకు అందించలేదని, ఈ పరిస్థితుల్లో బరాజ్‌ల వైఫల్యానికి గల కారణాలపై ఎలాంటి అభిప్రాయం తెలపలేమని ఎన్ఐటీ వరంగల్ రిటైర్డ్ ప్రొఫెసర్ సీబీ కామేశ్వర్ రావు నేతృత్వంలోని నిపుణుల కమిటీ తన నివేదికలో స్పష్టం చేసినట్టు తెలిసింది. టెక్నికల్ విషయాల్లో జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు సహకరించేందుకు గతంలో ఏర్పాటైన ఈ కమిటీ.. బరాజ్‌లను సందర్శించి తనిఖీలు నిర్వహించిన అనంతరం ఇటీవల నివేదిక సమర్పించింది. ఈ కమిటీలో సీబీ కామేశ్వర్ రావుతో పాటు రిటైర్డ్ సీఈ కె.సత్యనారాయణ, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ ఎన్.రమణమూర్తి, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ టి.శశిధర్, రిటైర్డ్ సీఈ కె.శ్రీకాంత్ ఉన్నారు. బరాజ్‌ల డిజైన్లు, డ్రాయింగ్స్, టెక్నికల్ అనుమతులు, ఇతర అంశాలకు సంబంధించిన ఫైళ్లను పరిశీలన కోసం కమిటీ కోరగా, నీటిపారుదల శాఖ అనుమతించలేదని సమాచారం. ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ తన నివేదికలో తెలియజేయగా, వారు కోరిన ఫైళ్లు, సమాచారాన్ని అందించాలని కమిషన్ ఆదేశించినట్లు తెలిసింది. ఫైళ్లను పరిశీలించిన తర్వాత మరో నివేదిక ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. బరాజ్‌ల వైఫల్యాలపై అధ్యయనానికి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఏర్పాటు చేసిన రెండు వేర్వేరు నిపుణుల కమిటీలు సైతం తమకు నీటిపారుదల శాఖ ఫైళ్లు ఇవ్వలేదని ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

కాళేశ్వరం ఫైళ్ల జిరాక్స్ ఖర్చు రూ.7 లక్షలు

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ఫైళ్లన్నీ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తీసుకెళ్లింది. హైదరాబాద్‌లోని జలసౌధ కార్యాలయంతో సహా క్షేత్ర స్థాయిలోని నీటిపారుదల శాఖ కార్యాలయాల నుంచి ప్రాజెక్టుకు సంబంధించిన టన్నుల కొద్దీ ఫైళ్లను గతంలో విజిలెన్స్ విభాగం జప్తు చేసింది. అయితే నీటిపారుదల శాఖ రోజువారీ అవసరాలకు ఆ ఫైళ్లు అవసరం కావడంతో వాటిని ఒక కాపీ జిరాక్స్ తీయడానికి రూ.7 లక్షలకు పైగా ఖర్చు కానుందని అంచనా వేశారు. ఈ మేరకు నిధులు మంజూరు చేయాలని అధికారులు నీటిపారుదల శాఖను కోరినట్టు శాఖ వర్గాలు తెలిపాయి.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సీనియర్ రెసిడెంట్లకు అవకాశం

వైద్య ఆరోగ్య శాఖ కీలక ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సీనియర్ రెసిడెంట్-2023 బ్యాచ్ డాక్టర్లకు అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల్లో అవకాశం కల్పిస్తూ వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినామంగళవారం ఉత్తర్వులిచ్చారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 630 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు.. 8 కొత్త మెడికల్ కాలేజీల్లోనే 200 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. త్వరలో మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేయనుంది. అయితే ఇప్పటికే సీనియర్ రెసిడెంట్లుగా పనిచేస్తున్న తమకు ఆ కొత్త నోటిఫికేషన్‌లో అవకాశం కల్పించాలని తెలంగాణ సీనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విన్నవించింది. దీంతో ప్రభుత్వం ఈ అంశంపై ఒక కమిటీ వేసింది. ఆ కమిటీ నివేదిక ఆధారంగా తాజాగా జీవో జారీచేసింది. అయితే 2023 ఎస్ఆర్ బ్యాచ్ సెప్టెంబర్ 5 నాటికి ఎస్ఆర్ షిప్ పూర్తి చేయాలని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. పీజీ పూర్తి చేసిన వైద్య విద్యార్థులంతా విధిగా ఏడాది పాటు సర్కారీ దవాఖానాల్లో సీనియర్ రెసిడెంట్లుగా పూర్తి చేయాలన్న నిబంధన ఉంది. అది పూర్తి చేస్తేనే స్పెషలిస్టు వైద్యుడిగా వైద్యమండలిలో రిజిస్టర్ చేసుకునే అవకాశం ఉంటుంది. అధ్యాపక పోస్టులకు పోటీపడే అర్హత వస్తుంది. అయితే ఈ ఒక్కసారికి ప్రస్తుతం మెడికల్ బోర్డు నోటిఫికేషన్ ఇచ్చే నాటికి ఎస్ఆర్ షిప్ పూర్తికాకపోయినా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఇచ్చింది.

యూట్యూబర్ 'ఎక్స్' అకౌంట్ క్లోజ్‌కు తెలంగాణ పోలీస్ లేఖ

తండ్రి, కూతురు వీడియోపై కామెంట్ కేసులో దర్యాప్తు ముమ్మరం

సాక్షి, హైదరాబాద్: తండ్రీకూతుళ్ల అనుబంధంపై అసభ్యకరమైన కామెంట్లు చేసిన యూట్యూబర్ కేసు దర్యాప్తు పోలీసులు ముమ్మరం చేశారు. అసభ్యకరమైన కామెంట్లు చేసిన యూట్యూబర్ ప్రణీత్ హనుమంతు, ఇతరుల జాడ కనిపెట్టేందుకు సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. యూట్యూబర్ ప్రణీత్ హనుమంతు 'ఎక్స్'ఖాతాను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ పోలీసులు 'ఎక్స్'యాజమాన్యానికి లేఖ రాసినట్లు డీజీపీ రవి గుప్తా 'సాక్షి'కి తెలిపారు. నిందితుల జాడ కనిపెట్టేందుకు సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు.

పోస్టు చేస్తే పాట్లే

- సోషల్ మీడియాలో ఫొటోలు, వీడియోలు పంచుకోవద్దు
- దుర్వినియోగమయ్యే ప్రమాదం..పోలీసుల హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: సోషల్ మీడియాలో మనం పంచుకునే సమాచారం కొన్నిసార్లు దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కొందరు యూట్యూబర్లు తండ్రీకూతుళ్ల అనుబంధంపై చేసిన అసభ్య వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ.. పోలీసులు పలు సూచనలు చేశారు. పిల్లలు, కుటుంబ సభ్యుల ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయటం ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. ఫొటోలకు ప్రైవసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొన్నిసార్లు సన్నిహితులే వాటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని.. అప్రమత్తంగా వ్యవహరించాలని తెలంగాణ పోలీస్‌శాఖ ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. దీన్ని తెలంగాణ డీజీపీ రవిగుప్తా రీ ట్వీట్ చేశారు.

హామీలు అమలు చేసేవరకు...

రాష్ట్ర ప్రభుత్వాన్ని విడిచిపెట్టేది లేదు

- గ్యారంటీల పేర్ల మహిళలను మోసం చేసింది
- బెల్ట్‌షాపుల తొలగింపు హామీ ఏమైంది ?
- ఇందిరాపార్కు వద్ద బీజేపీ మహిళామోర్చా ధర్నాలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిరసన కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్/కవాడిగూడ: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసేంతవరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని విడిచిపెట్టేది లేదని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ గారడీలతో ఎన్నికల్లో గెలిచాక..ఆరు గ్యారంటీలు, హామీలు అమలు చేసే పరిస్థితిలో లేదని ధ్వజమెత్తారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సమక్షంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలు ఏమైందని ప్రశ్నించారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేపీ మహిళామోర్చా ఆధ్వర్యంలో 'కానరాని కాంగ్రెస్ గ్యారంటీలు–కదం తొక్కిన మహిళలు'పేరిట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో పాల్గొన్న కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా అప్పులపైనే ఆధారపడ్డారని మండిపడ్డారు. ప్రభుత్వ భూములు, లిటిగేషన్, హౌసింగ్ బోర్డు భూములు అమ్మడం.. అప్పులు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మహిళలకు ప్రతినెలా రూ. 2 వేల సాయం ఏడు నెలలు గడిచినా అమలు చేయలేదని.. దీంతో ప్రతి మహిళకు ప్రభుత్వం రూ.20 వేల చొప్పున బకాయి పడిందని చెప్పారు. 'కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడిస్తారు? ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థికసాయం ఎప్పుడు? మహిళలకు రూ. 500కే వంటగ్యాస్, 18 ఏళ్లు నిండిన అమ్మాయిలకు ఉచితంగా స్కూటీలు ఇస్తామన్నారు ఏమైంది'అని ప్రశ్నించారు. అనేక గ్రామాల్లో వేలాది బెల్ట్ షాపులు ఉన్నాయని, వాటిని తొలగిస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని కిషన్‌రెడ్డి నిలదీశారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.శిల్పారెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే.. ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడిస్తామని చెప్పారు. ఆడపిల్లలను కనాలంటే భయం వేస్తుందని, అమ్మాయిలపై అఘాయిత్యాలు చేస్తున్న వారిపై చర్యలకు ప్రభుత్వం భయపడుతోందని బీజేపీ నేత పాదూరి కరుణ విమర్శించారు.

నేడు కలెక్టరేట్ల ఎదుట బీజేపీ రైతు సత్యాగ్రహం

బుధవారం జిల్లా కలెక్టరేట్ల ఎదుట 'రైతు సత్యాగ్రహం'నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతాంగానికి ఇచ్చిన హామీల అమల్లో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసనలు నిర్వహించనుంది. అధికారంలోకి వచ్చి ఏడునెలలు గడిచినా వివిధ వర్గాల ప్రజలకిచ్చిన వాగ్దానాల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఈ సమావేశం అభిప్రాయపడింది. మంగళవారం బీజేపీ కార్యాలయంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్రపదాధికారుల సమావేశంలో ఆయా అంశాలు చర్చకు వచ్చాయి.



● ఇదో ఇంగ్లిష్ వింగ్లిష్

నారీ అదాలత్ ఏం చెబుతోంది?



భారతీయ న్యాయ సంహిత తాజాగా అమలులోకి వచ్చింది.
అలాగే స్త్రీలకు సత్వర న్యాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం 'నారీ అదాలత్' పేరుతో ప్రత్యేక పంచాయతీ వ్యవస్థను పరిచయం చేయబోతోంది.
పైలట్ ప్రాజెక్ట్‌గా అసోం, జమ్ము–కశ్మీర్‌లలో ప్రవేశపెట్టనున్నారు.
ఇది కోర్టులా న్యాయం చేస్తుందా?
లేదా 'ఖాప్ పంచాయతీ'లా పంచాయతీ పెడుతుందా?
అసలు 'నారీ అదాలత్' ఏంటి?

నళిని ప్రైవేట్ టీచర్. తమ ఊళ్లోనే ఉన్న కాన్వెంట్‌లో పని చేస్తోంది. వృత్తి అంటే ప్రాణం. వాళ్లది గ్రామ పంచాయతీ. వ్యవసాయ కుటుంబం. ఇంట్లోనే పాడి. భార్యగా, ఇంటి కోడలిగా ఆ బాధ్యతలన్నీ నళినే చూసుకోవాలని ఆమె మీద ఒత్తిడి.. భర్త, అత్తగారి నుంచి! ఆఖరికి వాకిలి ఊడ్చి, కళ్లాపి జల్లి, ముగ్గు వేసే పనినీ నౌకరుతో చేయిస్తోందని భర్త కంప్లయింట్. ఆ ఒత్తిడి హింసగా మారి నళిని మానసిక ఆరోగ్యం మీదా ప్రభావం చూపిస్తుండటంతో ఆమె గృహ హింస చట్టాన్ని ఆశ్రయించక తప్పలేదు. 'విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్'లో భర్త మీద ఫిర్యాదు చేసింది. భార్యాభర్తలిద్దరికీ రెండుసార్లు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా నళిని భర్తది ఒకటే మాట.. ఆమె ఉద్యోగం మానేయాలని! దానికి నళిని ససేమిరా అన్నది. దాంతో 'విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆ డొమెస్టిక్ ఇన్సిడెంట్ రిపోర్ట్'(తాము కౌన్సెలింగ్ చేసిన విధానం, అయినా ఫలితం రాని వైనాన్ని రాసిన నివేదిక)ను కోర్ట్‌కి సబ్‌మిట్ చేశారు. ఆ రిపోర్ట్ ఆధారంగా గృహ హింస చట్టం కింద కోర్ట్ ప్రొసీడింగ్స్ మొదలయ్యాయి. గృహ హింస చట్టంలో ఆరోపణ రుజువైతే బాధితులకు ఆర్థిక భద్రత కల్పించాలి. వాళ్లకున్న ప్రాథమిక హక్కుని గౌరవించాలి. ఇది మహిళలకు ఆ యాక్ట్ ద్వారా కోర్టులు అందించే న్యాయం.

నళిని ఉండే ఊర్లో 'నారీ అదాలత్' అమలయితే ఆ పంచాయతీ ఎలా ఉండొచ్చు?

'నారీ అదాలత్'లోని సభ్యుల్లో సగం మంది గ్రామ పంచాయత్ నుంచి ఉంటారు. మిగిలిన సగంలో టీచర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, సామాజిక కార్యకర్తలు మొదలైన వారుంటారు. వీళ్లను గ్రామస్థులే నామినేట్ చేస్తారు. ఈ కమిటీ అంతా మహిళలతోనే ఉంటుందా? లేక స్త్రీ, పురుషులతో కలిసి ఉంటుందా అనేదాని మీద ఎక్కడా పూర్తి వివరం లేదు. సరే.. నళిని కేసు నారీ అదాలత్ స్వీకరించినప్పుడు అదాలత్ సభ్యులపై నళిని అత్తగారి కుటుంబం పలుకుబడి ప్రభావం చూపదా? అలాగే పురుషస్వామ్య సంస్కృతి ప్రభావం వల్ల అదాలత్‌లోని సభ్యులకు కుటుంబం, స్త్రీ, ఆమె విధుల పట్ల సంప్రదాయ ఆలోచనలు, కచ్చితమైన అభిప్రాయాలు ఉండొచ్చు. ఈ నేపథ్యంలో నళిని విషయంలో ఎలాంటి తీర్పు వెలువడవచ్చు? ఆమె హక్కులు, వ్యక్తిత్వాన్ని గుర్తించే, గౌరవం లభించే అవకాశం ఎంత వరకు ఉంటుంది? దీనివల్ల దళిత, గిరిజన మహిళల మీద వేధింపులు పెరగవచ్చు, రాజకీయ ప్రయోజనాలూ మిళితమవచ్చు. కరప్షన్‌కి చాన్స్ ఉండొచ్చు. అసలు ఇది ఊళ్లల్లో పెద్ద మనుషుల పంచాయతీకి ఏ రకంగా భిన్నమైనది? దాన్ని ప్రభుత్వం గుర్తించలేదు.. ఈ అదాలత్‌లను ప్రభుత్వమే నిర్వహిస్తోంది అనే భేదం తప్ప! దీన్ని ఆసరాగా చేసుకుని నారీ అదాలత్ సభ్యులు నిందితుల లేదా వాళ్ల తరఫు పెద్ద మనుషుల ప్రలోభాలకు లొంగి బాధితురాలిని ఇబ్బంది పెట్టే ప్రమాదం మెండు. స్థానిక పోలీసులూ రెచ్చిపోయే అవకాశమూ అంతే అధికం. రేప్పొద్దున లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులు, ఈవ్‌టీజింగ్, స్టాకింగ్ లాంటి సమస్యలను తీసుకుని మహిళలు పోలీస్ స్టేషన్‌కి వెళితే నిందితుల ప్రలోభాలకు తలొగ్గి స్టేషన్‌కి ఎందుకు వచ్చారు? నారీ అదాలత్‌లున్నాయి కదా అక్కడే తేల్చుకుపొండి అనే చాన్సూ ఉంటుంది. ఇదంతా ఎక్కడికి దారి తీస్తుంది? ఈ క్రమంలో మహిళల కోసం వచ్చిన ప్రత్యేక చట్టాల ఉనికే దెబ్బతినే ప్రమాదం కనపడుతోంది. ఏదేమైనా ఇలాంటి ప్రయోగాలు లోతైన అధ్యయనం, విస్తృతమైన చర్చలతో, ఒక నిర్దిష్ట రూపం దాల్చాకే అమల్లోకి వస్తే మంచిది అని అభిప్రాయపడుతున్నారు పలువురు న్యాయ ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు!

– సరస్వతి రమ

ట్రయల్ అండ్ ఎర్రర్‌గానే...

కోర్టులకు పనిభారం తగ్గించేందుకే కేంద్రం ఖాప్ పంచాయత్‌లను పోలిన నారీ అదాలత్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు అనిపిస్తోంది. ఇది ఏ రకంగానూ విమెన్ ఫ్రెండ్లీ కాదు. ఇప్పటి వరకు విన్న, చదివిన దాన్ని బట్టి ఇదో ట్రయల్ అండ్ ఎర్రర్‌గా మిగిలిపోనున్నది. ఎందుకంటే గ్రామస్థాయిలో న్యాయవాదులచే శిక్షణ పొందిన లీగల్ వలంటీర్ వ్యవస్థ ఉంది. మండల, జిల్లా స్థాయిల్లో లీగల్ సర్వీస్ అథారిటీ కేంద్రాలు, సఖీ సెంటర్లున్నాయి. ఇప్పటికే ప్రతి పోలీస్‌స్టేషన్‌కి అనుబంధంగా ఉన్న కౌన్సెలింగ్ సెంటర్స్ వల్ల పోలీసులు ఫిర్యాదులే తీసుకోవట్లేదు. ఎంత తీవ్రమైన సమస్యలనైనా కౌన్సెలింగ్ సెంటర్స్‌కే రిఫర్ చేస్తున్నారు. అక్కడ కొన్ని పరిష్కారం అయ్యి కొన్ని కాక మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అలాంటిది రచ్చబండను పోలిన ఈ నారీ అదాలత్‌లు ఏం న్యాయం చేయగలవు!



– ఇ. పార్వతి,
ఫ్యామిలీ కౌన్సెలర్

అసంబద్ధమైన ఆలోచన



'నారీ అదాలత్' లాంటి అఫీషియల్ ఖాప్ పంచాయత్‌లు మహిళల హక్కుల ఉల్లంఘనకు పాల్పడతాయి. వీటివల్ల మహిళల ప్రైవసీ, డిగ్నిటీ, మర్యాదలకు భంగం వాటిల్లవచ్చు. అంతేకాదు పరువు పేరుతో వాళ్ల ప్రాణాలకూ ముప్పు ఉండొచ్చు. ఇదొక అసంబద్ధమైన ఆలోచన. జూన్ 30 వరకు అమలులో ఉన్న క్రిమినల్ చట్టాల ప్రకారం.. కుటుంబ వివాదాలకు సంబంధించిన అన్ని కేసులు ఇంకా చెప్పాలంటే ఏడేళ్లలోపు శిక్షలు పడ్డ అందరికీ స్టేషన్ బెయిల్ ఇవ్వాలి. అంటే బాధితులకు న్యాయాన్ని అందించడంతో పాటు నిందితుల హక్కులనూ గుర్తిస్తుందన్నమాట. కుటుంబ కలహాలు, గృహ హింస కేసుల్లో కౌన్సెలింగ్ ఫెయిలైతే సదరు కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు రిపోర్ట్ పంపిస్తారు. దాని ప్రకారం వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని చట్టం చెబుతోంది. ఇలాంటి కేసుల్లో కొత్త శిక్షాస్మృతీ దాన్నే ఫాలో కావాలి. కానీ కొత్త క్రిమినల్ చట్టాలు, ముఖ్యంగా భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్నెస్సెస్)లోని కొన్ని రూల్స్ వల్ల అలా జరగకపోవచ్చు. సాధారణంగా ఏ ఫిర్యాదు అందినా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి. అయితే కుటుంబ కలహాల కేసులు, ఆర్థిక నేరాలు వంటి కొన్ని ఆరోపణలలో ఏడు రోజుల వరకు ప్రిలిమినరీ ఎంక్వయిరీ చేయవచ్చు. కానీ అది నిజనిర్ధారణకు కాదు. కాగ్నిజబుల్ కేసు అనిపిస్తే వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి తీరాలి. కానీ బీఎన్నెస్సెస్ ప్రకారం ప్రిలిమినరీ ఎంక్వయిరీ పవర్ పోలీసులకు వచ్చింది. కాబట్టే వాళ్లు ఎఫ్ఐఆర్ నమోదు చేసే ఆస్కారం తక్కువుంటుంది. ఇదివరకైతే పోలీసులు సహకరించకపోతే ఎఫ్ఐఆర్ వేయమని జిల్లా మేజిస్ట్రేట్ దగ్గర పిటిషన్ దాఖలు చేసుకునే వీలుండేది. కానీ ఇప్పుడు బీఎన్నెస్సెస్‌లోని సెక్షన్ 223 (1) ప్రకారం నిందితుడి పక్షం వినకుండా మెజిస్ట్రేట్.. ఎఫ్ఐఆర్ కోసం పోలీసులకు ఆదేశాలిచ్చే అవకాశం లేదు. దాంతో బలవంతులైన పురుషులకు బయటపడే మార్గాలను వెదుక్కునే చాన్స్ దొరుకుతోంది. వీటివల్ల 498 వంటి కేసుల్లోనూ ఎఫ్ఐఆర్ ఆలస్యం అయ్యే సూచనలు కనపడుతున్నాయి. ఇలా కోర్టు పరిధిని తగ్గించే ఇలాంటి ప్రయత్నాలేవీ సమాజానికి మంచివి కావు.

– శ్రీకాంత్ చింతల, తెలంగాణ హైకోర్టు న్యాయవాది

కిడ్స్‌కు పాఠం... క్వీన్ స్విమ్మర్

ఇంగ్లిష్ వింగ్లిష్ సినిమాలో శ్రీదేవి ఇంగ్లిష్ నేర్చుకుని ఇన్‌స్పిరేషన్‌గా నిలుస్తుంది. ఈతకు బద్ధకించే పిల్లల్ని ఇన్‌స్పైర్ చేయడానికి క్వీనీ విక్టోరియా ఏకంగా ఇంగ్లిష్ ఛానల్‌ను ఈది రికార్డ్ సృష్టించింది. ఈ తరానికి ఓ లక్ష్యాన్ని అందించింది. ప్రతి ఒక్కరికీ కలలుంటాయి. జీవనపోరాటంలో మునిగి కొన్నేళ్లకు ఆ కలలను మర్చిపోతాం. ప్రతి ఒక్కరూ జీవితంలో తమకంటూ కొన్ని పేజీలు రాసుకోవాలి. ఆ పేజీల్లో కలలను సాకారం చేసుకున్న కథనాలే ఉండాలి. అప్పుడే మన కలకు గౌరవం... కలకన్న మనసుకు సంతోషం... ఇది ఇటీవల ఇంగ్లిష్ చానెల్ ఈదిన క్వీనీ విక్టోరియా మనోగతం.

క్వీనీ విక్టోరియా గంధం 2018 వరకు సాధారణ గృహిణి. ఆమె స్విమ్మర్‌గా వార్తల్లోకి వచ్చి కొద్దికాలమే అయింది. 38 ఏళ్ల వయసులో స్విమ్మింగ్ ప్రాక్టీస్ చేసిన విక్టోరియా గత జూన్ 25వ తేదీ (భారత కాలమానం ప్రకారం) తెల్లవారు జామున ఇంగ్లండ్ – ఫ్రాన్స్ దేశాల మధ్యనున్న ఇంగ్లిష్ చానెల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళగా రికార్డు సృష్టించారు. 2018లో తొలి రికార్డు, ఇంటర్నేషనల్, నేషనల్, స్టేట్‌లెవెల్, డిస్ట్రిక్ట్ లెవెల్ పోటీల్లో బంగారు, రజత, కాంస్య పతకాల జాబితాలో నలభైకి పైగా ఉంది. క్వీనీ విక్టోరియా ఇంగ్లిష్ చానెల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళగా గుర్తింపు పొందిన సందర్భంగా సాక్షి ఫ్యామిలీతో పంచుకున్న విషయాలు.



● ఇంగ్లిష్ చానెల్ ఈదిన తర్వాత జాతీయ పతాకంతో...

పిల్లలతో కలిసి ప్రాక్టీస్

''నా స్విమ్మింగ్ జర్నీ చాలా ఆశ్చర్యకరంగా మొదలైంది. మా పిల్లలిద్దరినీ స్విమ్మింగ్‌లో చేర్చాం. ప్రాక్టీస్‌కెళ్లడానికి బద్ధకించేవాళ్లు. అలసట, నీరసం, ఓపికలేదు, ఇంటరెస్ట్ లేదు... రోజూ ఏదో ఓ సాకు చెప్పేవాళ్లు. వాళ్లకు బాధ్యత నేర్పడానికి ప్రయత్నించినప్పుడు 'నీకు చెప్పడానికి బాగానే ఉంటుంది. రోజూ నీటిలో దిగి ఈత కొడితే కదా తెలుస్తుంది' అన్నారు. 'అంతకష్టమైన పనా, చూద్దాం పదండి' అని నేను కూడా జాయినయ్యాను. మొదలు పెట్టిన మూడు నెలల్లోనే సికింద్రాబాద్ స్విమ్మింగ్ పూల్‌లో పోటీలు జరిగాయి. పిల్లలిద్దరూ, నేను ముగ్గురం ఎవరి ఏజ్ కేటగిరీలో వాళ్లు పాల్గొన్నాం. ముగ్గురమూ విజేతలుగా నిలిచాం. ఇక అప్పటినుంచి నేను స్విమ్మింగ్‌ని ఆపలేదు.



● ఇంగ్లిష్ చానెల్ ఈదుతూ...

ఏడు చానెళ్లనూ ఈదాలి

దేశవిదేశాల్లో జరిగిన పోటీలకు వెళ్లడం, పతకాలతో తిరిగి రావడం రెగ్యులర్ ప్రాక్టీస్‌గా మారింది. హైదరాబాద్, తెలుగు రాష్ట్రాలు, జాతీయ స్థాయి పోటీలు, దుబాయ్, సెర్బియా, ఈజిప్ట్, శ్రీలంక, టర్కీలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించాను. ఇంగ్లిష్ చానెల్ ఈదిన అనుభవాన్ని మాటల్లో వర్ణించలేను. ఇది అందమైన భావన. గడ్డకట్టే చలి, దేహం బిగుసుకుపోయే చల్లదనపు నీటిలో ఈదాలి. రెండు గంటల సేపు చానెల్‌లో ఉన్నాను. 'చానెల్ స్విమ్మింగ్ అండ్ ఫ్లోటింగ్ ఫెడరేషన్, లండన్' నిర్వహించిన పోటీలో భాగంగా ఇంగ్లిష్ చానెల్‌ను ఈదే క్రమంలో ప్రతి సందర్భాన్నీ, ప్రతి సంఘటననూ ఎంజాయ్ చేశాను. ఏడు ఖండాల్లోని ఏడు చానెళ్లనూ ఈది రికార్డు సాధించాలనేది నా ముందున్న లక్ష్యం.

నా కుటుంబం... క్లయింట్‌ల ప్రోత్సాహం

మాది మధ్య తరగతి కుటుంబం. పాలమూరు జిల్లా, అమనగల్లు మా సొంతూరు. ఇంటర్ తర్వాత పెళ్లయింది. హైదరాబాద్, బర్కత్‌పురాలో వైవాహిక జీవితం మొదలైంది. ఓపెన్ యూనివర్సిటీలో బీఏ, బీఈడీ చేశాను. కుటుంబ అవసరాల రీత్యా బర్కత్‌పురాలో 'క్వీన్స్ టైలరింగ్ షాప్' పెట్టాను. నా స్విమ్మింగ్ కెరీర్ మొదలైన తర్వాత నా క్లయింట్‌లు 'నెక్స్ట్ ఎక్కడ ఈదుతున్నారు' అని అడగడంతోపాటు, నాకు ఖర్చులకు డబ్బు సమకూర్చడం కోసం వాళ్లు వెంటనే అవసరం లేని దుస్తులు కూడా ఇచ్చి పని చేయించుకునేవాళ్లు. నా భర్త, నా క్లయింట్‌ల సహకారమే తప్ప ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా ప్రోత్సాహకంగా అందుకోలేదు. మొదట్నుంచీ అయిన ఖర్చు లెక్క ఎంతో చెప్పలేను, కానీ ఇంగ్లిష్ చానెల్ కోసం ఎనిమిది లక్షల రూపాయలు ఖర్చయ్యాయి. ఒక మిడిల్ క్లాస్ గృహిణిని, ఇద్దరు పిల్లల తల్లిని. ఆ డబ్బును ఇంటి కోసమో, పిల్లల చదువు కోసమో ఖర్చు చేయాల్సిన అవసరం ఉన్న మహిళను. అలాంటి స్థితిలో ఉన్న నేను ఇంత ఖర్చు చేసింది ఒక అచీవ్‌మెంట్ కోసం. చిన్నప్పుడు స్కూల్లో కబడీ, ఖోఖో ఆడేదాన్ని. ఆడపిల్లనైన కారణంగా, మధ్య తరగతి కుటుంబం అయిన కారణంగా క్రీడాజీవితం తెర వెనక్కి వెళ్లిపోయింది.

పిల్లలు బద్ధకించేవాళ్లు

మా పిల్లలిద్దరినీ స్విమ్మింగ్‌లో చేర్చాం. ప్రాక్టీస్‌కెళ్లడానికి బద్ధకించేవాళ్లు. అలసట, నీరసం, ఓపిక లేదు, ఇంటరెస్ట్ లేదు... రోజూ ఏదో ఓ సాకు చెప్పేవాళ్లు. వాళ్లకు బాధ్యత నేర్పడానికి ప్రయత్నించినప్పుడు 'నీకు చెప్పడానికి బాగానే ఉంటుంది. రోజూ నీటిలో దిగి ఈత కొడితే కదా తెలుస్తుంది' అన్నారు. 'అంతకష్టమైన పనా, చూద్దాం పదండి' అని నేను కూడా జాయినయ్యాను.

– క్వీనీ విక్టోరియా గంధం, స్విమ్మర్

కానీ అనుకోకుండా పిల్లల రూపంలో వచ్చిన అవకాశాన్ని నేను జారవిడుచుకోలేదు. మహిళలందరికీ నేను చెప్పేదొక్కటే. మీరూ కలలు కని ఉంటారు. నిద్రలో జోగుతున్న ఆ కలల కళ్లు తెరవండి. కలను నిజం చేసుకోవడానికి ప్రయత్నం చేయండి.

క్వీన్‌ను కలిసింది!

ఇంగ్లిష్ చానెల్ ఈదడం కోసం లండన్‌లో ఉన్న సమయంలోనే నా పుట్టినరోజు (జూన్ 30) వచ్చింది. మా నానమ్మ గంధం కాంతమ్మ. ఆమె దేవరకొండ మిషనరీ స్కూల్‌లో టీచర్. క్వీన్ విక్టోరియా మన దేశానికి వచ్చినప్పుడు ఆమెను కలిసిందట మా నానమ్మ. ఆమె స్ఫూర్తితోనే నాకు పేరు పెట్టింది. నేను ఆ క్వీన్ నేలమీదకు వెళ్లి ఈత విజేతగా నిలవడానికి నాంది మా నాన్నమ్మ పేరు పెట్టడంతో ముడిపడిందేమోననిపించింది. మొత్తంగా నాకు ఈ విజయం అత్యంత సంతోషకరమైన క్షణాలనిచ్చింది'' అంటూ తన పేరు విజేతగా చరిత్రలో నమోదు కావడం గర్వంగా ఉందన్నారు క్వీనీ విక్టోరియా.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు : మోహనాచారి

ఆషాఢం

నాగదోష నివారణకు.. సంతాన ప్రాప్తికి...



జ్ఞానవృద్ధికీ, కుజదోష నివారణకు, సంతాన ప్రాప్తికీ సుబ్రహ్మణ్య ఆరాధన సర్వ శ్రేష్ఠం. స్కంద పంచమి, షష్ఠి రోజుల్లో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామిని శ్రద్ధాభక్తులతో పూజిస్తే సకల శుభాలు చేకూరుతాయని పురాణ వచనం. ఆషాఢ శుద్ధ పంచమికి స్కంద పంచమి అని, షష్ఠికి కుమార షష్ఠి అనీ పేరు. ఈ స్కంద పంచమి సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామిని అష్టోత్తర, శత నామావళితో పూజించి పాలు, పానకం, చలిమిడి నివేదించాలి. మర్నాడు ఉపవాసం ఉండి, కుమార వ్రతం ఆచరించాలి. అనంతరం బ్రహ్మచారికి భోజనం పెట్టి, నూతన వస్త్రాలు, దక్షిణ, తాంబూలాలు సమర్పించాలి.
(నేడు స్కంద పంచమి, రేపు కుమార షష్ఠి)

ఆహారం

అపోహ వాస్తవం



సుజాత స్టీఫెన్ ఆర్.డి.
న్యూట్రిషనిస్ట్

ఇడ్లీ, దోశెల కోసం మినపప్పును మిక్సీలో వేస్తే పోషకాలు నశిస్తాయా? తప్పనిసరిగా వెట్ గ్రైండర్‌లో రుబ్బాల్సిందేనా?

ఇడ్లీ, దోశెల రుచి మంత్రం పిండిరుబ్బడంలోనే ఉంటుందని పెద్దవాళ్లు చెప్పేమాటలో చాలా అర్థం ఉంది. రుచి మాత్రమే కాదు, ఇందులో ఆరోగ్యం కూడా దాగి ఉంది. అందుకే మిక్సీ కంటే వెట్ గ్రైండర్‌దే తొలి ప్రాధాన్యం. ఎందుకంటే మిక్సీతో పోలిస్తే వెట్ గ్రైండర్‌లో పిండి రుబ్బేటప్పుడు అందులో ఎక్కువ వేడి ఉత్పన్నం కాదు. పిండి మెదిగే క్రమంలో వేడి ఎక్కువైతే ఆ దినుసుల్లో ఉండే మైక్రో ఆర్గానిజమ్స్‌ను కోల్పోతాం. మైక్రో ఆర్గానిజమ్స్ పిండి ఫెర్మెంటేషన్‌కు (పులిసి, పొంగి, గుల్లగా రావడం) దోహదం చేస్తాయి. ఫెర్మెంటేషన్ బాగా జరిగితే ఆ పిండిలో జీర్ణవ్యవస్థ పనితీరుకు అవసరమైన ప్రోబయాటిక్ మోతాదు పెరుగుతుంది.

వెట్ గ్రైండర్‌లో పిండి మెదిగే క్రమంలో గోరువెచ్చగా మారుతుంది. ఆ ఉష్ణోగ్రత వల్ల పప్పుల్లో ఉండే మినరల్స్, విటమిన్స్ చక్కగా రక్షింపబడతాయి. మెత్తగా రుబ్బడం కూడా మంచిదే. బాగా పొంగిన మెత్తని పిండితో చేసిన ఇడ్లీలలోని పోషకాలను దేహం సరిగ్గా పీల్చుకోగలుగుతుంది. రాయికీ రాయికీ మధ్య రాపిడి వల్ల పప్పులు, బియ్యం మెదగడం ఆరోగ్యకరమైన పద్ధతి. ఇది పదార్థంలోని రుచిని పెంచడమే కాకుండా పోషకాలను పరిరక్షించి పిండిని ఆరోగ్యకరమైన ఆహారంగా మారుస్తుంది.

హెల్త్ ఫ్యాక్ట్

సిగరెట్ సగమే... రిస్క్ పూర్తి



సిగరెట్ అస్సలు ముట్టనివాళ్లతో పోలిస్తే... సగం సగం లేదా ఒకటి, రెండు పఫ్స్ తీసుకునే వారిలో 64 శాతం మందికి మామూలుగా పొగాకుతో కలిగే ముప్పులన్నీ వస్తుంటాయని హెచ్చరిస్తున్నారు యూఎస్‌లోని నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ చెందిన అధ్యయనవేత్తలు. ఆ అధ్యయనంలోని వివరాల ప్రకారం కొద్ది కొద్దిగా పఫ్ పీల్చినప్పటికీ వాళ్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ముప్పు ఇతర ఆరోగ్యకరమైన వ్యక్తుల కంటే 12 రెట్లు ఎక్కువని, అంతేకాకుండా కొద్దిపాటి మోతాదులోనైనా పొగ పీల్చేవాళ్లలో ఎంఫసిమా వంటి శ్వాసకోశ వ్యాధులు వచ్చే ముప్పు రెండున్నర రెట్లు అధికమని తేలింది. యాభై తొమ్మిది నుంచి ఎనభై రెండేళ్ల వరకు వయసున్న మొత్తం మూడు లక్షల మందిపై ఓ అధ్యయనం నిర్వహించాక వాటి ఫలితాలను బట్టి ఈ అంశాలు వెల్లడయ్యాయి.

యూత్ ప్లస్

ఇంకొంచెం ఇస్మార్ట్‌గా...

అటు ఫ్యాషన్‌ని, ఇటు ఫిట్‌నెస్‌ని... మిళితం చేసి ఫ్యాషనబుల్ ఫిట్‌నెస్ డివైజ్‌లపై ఆసక్తి ప్రదర్శిస్తోంది యువతరం. స్మార్ట్ రింగ్స్ నుంచి ఫిట్‌నెస్ ట్రాకర్‌ల వరకు ఎన్నో డివైజ్‌లను ఇష్టపడుతున్నారు యువత.

యువతరంలో పెరుగుతున్న సెల్ఫ్–ట్రాకింగ్ కల్చర్, బయోఫీడ్ బ్యాక్‌ను దృష్టిలో పెట్టుకొని శాంసంగ్, యాపిల్ లాంటి దిగ్గజ సంస్థలు ఫిట్‌నెస్ డివైజ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టాయి...

బాలీవుడ్ నటి ఆలియా భట్‌ను ఫిట్‌నెస్ డివైజ్‌ల గురించి అడిగితే బోలెడు విషయాలు చెబుతుంది. ఆమెకు ఇష్టమైనది ఒరా రింగ్. ఫిన్‌ల్యాండ్‌లో తయారైన ఈ సెన్సర్–లోడెడ్ టైటానియమ్ రింగ్‌కు యువతరంలో ఎంతోమంది ఫ్యాన్స్ ఉన్నారు. తన బయో–ట్రాకింగ్ సామర్థ్యంతో 'ఒరా'కు కల్ట్ ఫాలోయింగ్ ఏర్పడింది.

దీన్ని దృష్టిలో పెట్టుకొని యాపిల్, శాంసంగ్ లాంటి టెక్ దిగ్గజాలు తమదైన సొంత వెర్షన్‌ను సిద్ధం చేస్తున్నాయి.



స్మార్ట్ రింగ్‌లకు యువతంలోని క్రేజ్‌ను గమనించి నాయిస్, అల్ట్రాహ్యూమన్, పై రింగ్‌లాంటి ఎన్నో కంపెనీలు రంగంలోకి దిగాయి. 'మా స్మార్ట్‌రింగ్స్ లాంచ్ అయిన 24 గంటల్లోనే అమ్ముడు అయ్యాయి' అంటున్నాడు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ 'బోట్' కో–ఫౌండర్ అమన్ గుప్తా.

వివిధ కంపెనీల స్మార్ట్‌రింగ్‌లు హార్ట్‌రేట్ నుంచి ఆక్సిజన్ ఫ్లో వరకు మానిటర్ చేస్తాయి.

నాయిస్, అల్ట్రాహ్యూమన్, పీ రింగ్‌లాంటి కంపెనీలు అందుబాటు ధరల్లో ఉండే స్మార్ట్ రింగ్స్, గ్లూకోజ్ మానిటరింగ్ డివైజ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నాయి. మన దేశంలో యువతరాన్ని భయపెడుతున్న వ్యాధి డయాబెటిస్.

మన దేశంలో యువతరంలో డయాబెటిస్ పెరుగుతున్న నేపథ్యంలో టైప్ 1, టైప్ 2 డయాబెటిస్‌ను దృష్టిలో పెట్టుకొని అల్ట్రాహ్యూమన్, కంటూర్ ప్లస్‌లాంటి గ్లూకోజ్ మానిటర్ డివైజ్‌లు వచ్చాయి.

'వ్యక్తిగత ఆరోగ్యం గురించి శ్రద్ధ పెరిగినప్పుడు హెల్త్ కేర్ టూల్స్‌కు ప్రాధాన్యత పెరగడం అనేది సహజ విషయం' అంటున్నాడు అమన్ గుప్తా.

ఫిట్‌నెస్ టూల్స్ గురించి యూత్‌లో ఆసక్తి పెరగడం ఆహ్వానించదగిన పరిణామం అంటుంది నేషనల్ ఫుట్‌బాల్ టీమ్ గోల్‌కీపర్, షీ కిక్స్ ఫుట్‌బాల్ అకాడమీ వ్యవస్థాపకురాలు అదితి చౌహాన్.

'వ్యాయామ సమయంలో నా శరీరం పనితీరును, నిద్రను పర్యవేక్షించడానికి నేను యాపిల్ వాచ్‌ను ఉపయోగిస్తాను. సమయానికి నిద్రపోవడం లాంటి వాటిని ఇది సూచిస్తుంది' అంటుంది అదితి.

స్టెప్స్, ఫిజికల్ యాక్టివిటీలను ట్రాక్ చేసే ఫిట్‌నెస్ వాచ్‌లను ధరించడానికి యువతరం ఆసక్తి ప్రదర్శిస్తోంది.

'ఒకప్పుడు నాకు ఆరోగ్య విషయాలపై శ్రద్ధ ఉండేది. అయితే కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చిన తరువాత నాలో మార్పు వచ్చింది. బయోఫీడ్ బ్యాక్‌పై ఆసక్తి పెరిగింది. దీంతో రకరకాల గ్యాడ్జెట్స్‌ను వాడుతున్నాను' అంటుంది బెంగళూరుకు చెందిన ఎంసీఏ స్టూడెంట్ సజిత.

హెల్త్‌గ్యాడ్జెట్స్‌ను ప్రేమించేవారితో పాటు వాటి అతి వినియోగాన్ని విమర్శిస్తున్న వారు కూడా యూత్‌లో ఉన్నారు.

'పందశాతం కచ్చితత్వం కోసం సర్టిఫైడ్ టూల్స్ మాత్రమే వాడాలి. లేకపోతే అనవసర ఆందోళనకు దగ్గర కావాల్సి వస్తుంది. గ్యాడ్జెట్‌ల వాడకంలో ఆచితూచి వ్యవహరించాలి' అంటున్నారు నిపుణులు.

'వెల్‌నెస్ వేరబుల్ టెక్నాలజీదే భవిష్యత్' అనే మాట వినిపిస్తున్నప్పటికీ వేలం వెర్రి కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా యువతరంపై ఉంది.



ఐసీసీ 'ప్లేయర్స్‌ఆఫ్ ద మంత్'గా బుమ్రా, స్మృతి

జూన్ నెలకుగాను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డులకు మహిళల విభాగంలో భారత జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన... పురుషుల విభాగంలో భారత పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఎంపికయ్యారు. జూన్ నెలలో దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో స్మృతి 343 పరుగులు చేసింది. మరోవైపు బుమ్రా టి20 ప్రపంచకప్‌లో 15 వికెట్లు తీశాడు.

అండర్సన్... ఆఖరిసారి బరిలోకి...

రెండు దశాబ్దాలుగా ఇంగ్లండ్ పేస్ బౌలింగ్‌కు ముఖచిత్రంగా ఉన్న జేమ్స్ అండర్సన్ అంతర్జాతీయ కెరీర్‌లో చివరి టెస్టు ఆడనున్నాడు. 2003 మే నెలలో జింబాబ్వేపై లార్డ్స్ మైదానంలో తొలి టెస్టు ఆడిన అండర్సన్ తన కెరీర్‌లో చివరి టెస్టును కూడా లార్డ్స్ మైదానంలోనే ఆడనున్నాడు. వెస్టిండీస్ జట్టుతో మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా నేడు లార్డ్స్ మైదానంలో మొదలయ్యే తొలి టెస్టులో అండర్సన్ జాతీయ జట్టు తరఫున ఆఖరిసారి బరిలోకి దిగనున్నాడు. 187 టెస్టులు ఆడిన 41 ఏళ్ల అండర్సన్ 700 వికెట్లు పడగొట్టాడు.



ఘనవిజయంతో ముగింపు


టి20 సిరీస్ ట్రోఫీతో దక్షిణాఫ్రికా కెప్టెన్ లౌరా, భారత కెప్టెన్ హర్మన్

- చివరి టి20లో 10 వికెట్లతో నెగ్గిన భారత మహిళల జట్టు
- పూజ వస్త్రకర్‌కు 4 వికెట్లు
- స్మృతి అజేయ అర్ధసెంచరీ
- దక్షిణాఫ్రికాతో సిరీస్ 1-1తో సమం

చెన్నై: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత మహిళల క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌ను 1-1తో సమంగా ముగించింది. మంగళవారం జరిగిన చివరిదైన మూడో టి20 మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా 10 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం సాధించింది. తొలి టి20లో దక్షిణాఫ్రికా నెగ్గగా... రెండో టి20 వర్షం కారణంగా రద్దయింది. 2006 నుంచి ఇప్పటి వరకు 187 టి20 మ్యాచ్‌లు ఆడిన భారత జట్టుకిది 100వ విజయం కావడం విశేషం. ప్రత్యర్థి జట్టుపై టీమిండియా 10 వికెట్లతో నెగ్గడం ఇది మూడోసారి. ఈ మ్యాచ్‌కంటే ముందు భారత జట్టు 2016లో ఆస్ట్రేలియాపై, 2019లో వెస్టిండీస్‌పై 10 వికెట్ల తేడాతో గెలిచింది. సిరీస్‌ను సమం చేయాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన భారత జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు 17.1 ఓవర్లలో 84 పరుగులకే కుప్పకూలింది. భారత పేస్ బౌలర్ పూజా వస్త్రకర్ 13 పరుగులిచ్చి 4 వికెట్లు, స్పిన్నర్ రాధా యాదవ్ 6 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి దక్షిణాఫ్రికాను దెబ్బతీశారు. అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, దీప్తి శర్మ ఒక్కో వికెట్ తీశారు. అనంతరం 85 పరుగుల లక్ష్యాన్ని భారత జట్టు ఆడుతూపాడుతూ ఛేదించింది. 10.5 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 88 పరుగులు చేసి టీమిండియా గెలిచింది. స్మృతి మంధాన (40 బంతుల్లో 54 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీ సాధించగా... షఫాలీ వర్మ (25 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు) కూడా రాణించింది. పూజా వస్త్రకర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.

స్కోరు వివరాలు


దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: లౌరా వొల్వార్ట్ (సి) అరుంధతి (బి) శ్రేయాంక 9; తజ్మీన్ బ్రిట్స్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 20; మరిజన్ కాప్ (సి) షఫాలీ (బి) పూజ 10; అనెక్ బోష్ (ఎల్బీడబ్ల్యూ) (బి) పూజ 17; చోల్ ట్రయాన్ (సి) రాధ (బి) అరుంధతి 9; నదినె డి క్లెర్క్ (బి) పూజ 0; డెర్సెక్సన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రాధ 2; సినాలో జాఫ్తా (సి) అరుంధతి (బి) రాధ 8; ఎలీజ్ (బి) ఉమా చెత్రి (బి) పూజ 7; మలాబా (సి) సజన (బి) రాధ 0; ఖాకా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (17.1 ఓవర్లలో ఆలౌట్) 84.** **వికెట్ల పతనం:** 1-19, 2-30, 3-45, 4-61, 5-61, 6-65, 7-75, 8-84, 9-84, 10-84. **బౌలింగ్:** పూజా వస్త్రకర్ 3.1-0-13-4, సజన 1-0-11-0, అరుంధతి రెడ్డి 3-0-14-1, శ్రేయాంక పాటిల్ 3-0-19-1, రాధా యాదవ్ 3-1-6-3, దీప్తి శర్మ 4-0-21-1. **భారత ఇన్నింగ్స్:** షఫాలీ (నాటౌట్) 27; స్మృతి మంధాన (నాటౌట్) 54; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (10.5 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా) 88.** **బౌలింగ్:** ఖాకా 2-0-20-0, కాప్ 2-0-3-0, ట్రయాన్ 2-0-8-0, ఎలీజ్ 1-0-11-0, మలాబా 2-0-20-0, క్లెర్క్ 1.5-0-22-0.

టాప్ సీడ్ సినెర్‌కు షాక్

ఐదు సెట్‌లలో మెద్వెదెవ్ విజయం



లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ) క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. 4 గంటల పాటు జరిగిన మ్యాచ్‌లో ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) 6-7 (7/9), 6-4, 7-6 (7/4), 2-6, 6-3తో సినెర్‌ను బోల్తా కొట్టించి వరుసగా రెండో ఏడాది సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. మరో క్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్) 5-7, 6-4, 6-2, 6-2తో టామీ పాల్ (అమెరికా)ను ఓడించాడు. రెండో సీడ్ జొకోవిచ్ 6-3, 6-4, 6-2తో హోల్గర్ రూనె (డెన్మార్క్)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో 37వ ర్యాంకర్ డోనా వెకిచ్ (క్రొయేషియా) 5-7, 6-4, 6-1తో లులు సున్ (న్యూజిలాండ్)పై, ఏడో ర్యాంకర్ జాస్మిన్ (ఇటలీ) 6-2, 6-1తో 19వ సీడ్ ఎమ్మా నవారో (అమెరికా)పై నెగ్గి సెమీఫైనల్‌కు చేరారు.



గౌతముడే శిక్షకుడు

భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్

బీసీసీఐ అధికారిక ప్రకటన • మూడున్నరేళ్ల పాటు పదవీ కాలం

భారత క్రికెట్‌కు సంబంధించి గత కొంత కాలంగా వినిపించిన 'బహిరంగ రహస్యం' ఇప్పుడు అధికారికంగా ఆమోదముద్ర పొందింది. టీమిండియా హెడ్ కోచ్ పదవి కోసం దరఖాస్తులు కోరిన నాటినుంచి వినిపించిన పేరునే బీసీసీఐ ఖరారు చేసింది. ఇంటర్వ్యూలాంటి లాంఛనాలు ముగించక ముందే అందరికీ తెలిసిపోయిన పేరుకే బోర్డు ఓటు వేసింది. మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్‌ను భారత సీనియర్ పురుషుల జట్టు కొత్త హెడ్ కోచ్‌గా నియమిస్తున్నట్లు ప్రకటించింది. వరల్డ్ కప్ విజయం తర్వాత కోచ్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న గంభీర్ మూడున్నరేళ్ల పాటు జట్టుకు శిక్షకుడిగా వ్యవహరిస్తాడు. ఆటగాడిగా మైదానంలో ఢీ అంటే ఢీ అనేలా వ్యవహరించిన గంభీర్... మృదుస్వభావి ద్రవిడ్‌కు కోచింగ్ వారసుడిగా ఎలాంటి ముద్ర చూపిస్తాడనే ఆసక్తికరం.


> నా చిరునామా భారతదేశం. దేశానికి సేవ చేయగలడం నా జీవితంలో కలిగిన అతి పెద్ద అదృష్టం. ఇప్పుడు మరో రూపంలో పునరాగమనం చేయడం గౌరవంగా భావిస్తున్నా. ఎప్పటిలాగే ప్రతీ భారతీయుడు గర్వపడేలా చేయడమే నా లక్ష్యం. 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలను టీమిండియా మోస్తుంది. వారి కలలు నిజం చేసేందుకు నా స్థాయిలో ఏదైనా చేసేందుకు నేను సిద్ధం.
> –గౌతమ్ గంభీర్, భారత జట్టు కొత్త హెడ్ కోచ్

ముంబై: భారత మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ ఇకపై కొత్త పాత్రలో టీమిండియాతో కలిసి పని చేయనున్నాడు. 43 ఏళ్ల గంభీర్‌ను భారత హెడ్ కోచ్‌గా నియమిస్తున్నట్లు మంగళవారం బీసీసీఐ కార్యదర్శి జై షా వెల్లడించారు. అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపే, సులక్షణ నాయక్‌లతో కూడిన క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) అన్ని దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూల అనంతరం గంభీర్‌ను కోచ్‌గా ఎంపిక చేసింది. ఈ నెల 27 నుంచి శ్రీలంక గడ్డపై భారత జట్టు 3 వన్డేలు, 3 టి20లు ఆడుతుంది. ఇదే సిరీస్ నుంచి గంభీర్ కోచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తాడు. డిసెంబర్ 2027 వరకు అతని పదవీ కాలం ఉంటుంది. కొత్త కోచ్ కోసం మే 13 నుంచి బీసీసీఐ దరఖాస్తులు కోరింది. అంతకుముందే కోచ్ పదవిని స్వీకరించమంటూ మరో మాజీ ఆటగాడు వీవీఎస్ లక్ష్మణ్‌ను బీసీసీఐ కోరినా... అతను తిరస్కరించాడు. తన ఆసక్తిని బహిరంగంగానే ప్రకటిస్తూ గంభీర్ కూడా దరఖాస్తు చేసుకోగా, ఒక్క డబ్ల్యూవీ రామన్ మాత్రమే అతనితో పోటీ పడ్డాడు. ఎలాగూ ముందే నిర్ణయించేశారనే భావన వల్ల కావచ్చు, విదేశీ కోచ్‌లు ఎవరూ ఆసక్తి చూపించలేదు. చివరకు ఊహించినట్లుగా గంభీర్‌కు పగ్గాలు లభించాయి.

ఆటగాడిగా ఘనమైన రికార్డు...

2004-2012 మధ్య కాలంలో మూడు ఫార్మాట్‌లలో గంభీర్ ఓపెనర్‌గా జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. 58 టెస్టుల్లో 41.95 సగటుతో 4154 పరుగులు చేసిన అతను 9 సెంచరీలు, 22 అర్ధసెంచరీలు చేశాడు. 147 వన్డేల్లో 39.68 సగటుతో 5238 పరుగులు సాధించాడు. ఇందులో 11 సెంచరీలు, 34 అర్ధ సెంచరీలు ఉన్నాయి. 37 అంతర్జాతీయ టి20ల్లో 119.02 స్ట్రయిక్ రేట్, 7 హాఫ్ సెంచరీలతో 932 పరుగులు పరుగులు సాధించాడు. అన్నింటికి మించి చిరకాలం గుర్తుంచుకునే గంభీర్ రెండు అత్యుత్తమ ప్రదర్శనలు ప్రపంచ కప్ ఫైనల్స్‌లో వచ్చాయి. పాకిస్తాన్‌తో 2007 టి20 వరల్డ్ కప్ ఫైనల్లో 75 పరుగులతో, శ్రీలంకతో వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో 97 పరుగులతో అతను టాప్ స్కోరర్‌గా నిలిచాడు. నేపియర్‌లో న్యూజిలాండ్‌తో 11 గంటల పాటు క్రీజ్‌లో నిలిచి 436 బంతుల్లో 137 పరుగులు చేసి భారత్‌ను ఓటమి నుంచి కాపాడటం టెస్టుల్లో అతని అత్యుత్తమ ప్రదర్శన. ఐపీఎల్‌లో ముందుగా ఢిల్లీ డేర్‌డెవిల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన గంభీర్ ఆ తర్వాత కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు మారాడు. 2012, 2014లలో కెప్టెన్‌గా కేకేఆర్‌కు ఐపీఎల్ టైటిల్ అందించాడు.


2007 టి20 వరల్డ్‌కప్ విజేత జట్టు సభ్యులతో


2011 వన్డే వరల్డ్‌కప్‌తో...

కోచ్‌గా తొలిసారి...

రిటైర్మెంట్ తర్వాత చాలామందిలాగే గంభీర్ కూడా కామెంటేటర్‌గా, విశ్లేషకుడిగా పని చేశాడు. 2019లో బీజేపీ తరఫున ఈస్ట్ ఢిల్లీ నుంచి పార్లమెంట్ సభ్యుడిగా కూడా ఎన్నికయిన అతను పదవీ కాలం ముగిసిన తర్వాత ఈ ఏడాది ఎన్నికలకు ముందు రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. అయితే అధికారికంగా కోచ్ హోదాలో పని చేయడం గంభీర్‌కు ఇదే తొలిసారి. ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌కు 2022, 2023 సీజన్లలో మెంటార్‌గా వ్యవహరించగా, రెండుసార్లు కూడా లక్నో 'ప్లే ఆఫ్స్'కు చేరింది. అయితే 2024 సీజన్‌లో కోల్‌కతాకు మెంటార్‌గా వెళ్లిన అతను టీమ్‌ను విజేతగా నిలపడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ సాఫల్యమే అతడిని భారత జట్టు కోచ్ రేసులో ముందంజలో నిలిపింది. మరో వైపు టి20 వరల్డ్ కప్ వరకు జట్టుతో పని చేసిన విక్రమ్ రాథోడ్ (బ్యాటింగ్ కోచ్), పారస్ మాంబ్రే (బౌలింగ్ కోచ్), టి.దిలీప్ (ఫీల్డింగ్ కోచ్) పదవీ కాలం కూడా ముగిసినట్లు బీసీసీఐ ప్రకటించింది. వీరి స్థానాల్లో తన ఆలోచనలకు అనుగుణంగా కొత్త బృందాన్ని ఎంచుకునే అధికారం గంభీర్‌కు ఉంది.

మరో విజయంపై భారత్ దృష్టి

- నేడు జింబాబ్వేతో మూడో టి20 మ్యాచ్
- సాయంత్రం గం. 4:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

హరారే: యశస్వి జైస్వాల్, సంజూ సామ్సన్, శివమ్ దూబే చేరికతో మరింత పటిష్టంగా మారిన భారత జట్టు... నేడు జింబాబ్వేతో జరిగే మూడో టి20 మ్యాచ్‌లో భారీ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. రెండో మ్యాచ్‌లో అభిషేక్ శర్మ సెంచరీ, రుతురాజ్ అర్ధసెంచరీతో మెరిశారు. తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన కెప్టెన్ శుబ్‌మన్ గిల్ మూడో మ్యాచ్‌లో రాణిస్తాడో లేదో చూడాలి.

సినిమా

వీరి వీరి గుమ్మడిపండు ఈ స్టార్ ఎవరు?



వీరి వీరి గుమ్మడిపండు వీరి పేరేమి? అని కళ్లకు గంతలు కట్టి అడుగుతారు. కానీ గంతలు కట్టకుండానే ఫొటోలు చూపించి, వీరి వీరి గుమ్మడిపండు ఈ స్టార్ ఎవరు? అని అడిగితే... పేరు చెప్పడానికి తడబడాల్సిందే. అలా పోల్చుకోలేనంతగా మారిపోయారు కొందరు స్టార్స్. గుర్తుపట్టలేని వెరైటీ గెటప్స్‌లో ఆ స్టార్స్ కనిపించనున్న చిత్రాల గురించి తెలుసుకుందాం.

• కథ డిమాండ్ చేస్తే అందులోని గెటప్‌లోకి అవలీలగా మారిపోతారు కమల్‌హాసన్. 'భామనే సత్యభామనే'లో బామ్మగా, పది అవతారాల్లో 'దశావతారం' వంటి చిత్రాలు అందుకు మంచి ఉదాహరణలు. 'దశావతారం' (2008) తర్వాత కమల్ ఒకే సినిమాలో ఎక్కువ గెటప్స్‌లో కనిపించలేదు. ఇప్పుడు 'ఇండియన్ 2' ('భారతీయుడు 2')లో ఐదారు గెటప్స్‌లో కనిపించనున్నారు. వీటిలో ఒకట్రెండు గెటప్స్ ఇప్పటికే బయటకు రాగా మిగిలినవి థియేటర్స్‌లో సర్‌ప్రైజ్‌గా ఉండబోతున్నాయని తెలిసింది. 'భారతీయుడు 2' కథ రీత్యా కమల్ వందేళ్ల వయసుపైబడిన సేనాపతి పాత్రలో నటించారు. మొత్తంగా ఆయన ఎన్ని పాత్రల్లో కనిపిస్తారో థియేటర్స్‌లోనే చూడాలి. ఇక శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్ 2' తెలుగు, హిందీ, తమిళ భాషల్లో ఈ నెల 12న విడుదల కానుంది.





• మేకోవర్, కొత్త గెటప్ అనగానే వెంటనే గుర్తొచ్చే హీరోల్లో విక్రమ్ ఒకరు. 'పితామగన్' ('శివ పుత్రుడు'), సేతు, అపరిచితుడు, ఐ, కోబ్రా'... ఇలా చెప్పుకుంటూ పోతే విక్రమ్ చేసిన ప్రయోగాత్మక చిత్రాల్లోని పాత్రల జాబితా ఎక్కువగానే ఉంటుంది. తాజాగా 'తంగలాన్'లోనూ విక్రమ్ వినూత్నంగా కనిపించనున్నారు. పద్దెనిమిదో శతాబ్దంలో కేజీఎఫ్ (కోలార్ గోల్డ్ ఫీల్డ్స్) నేపథ్యంలో జరిగిన కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా 'తంగలాన్' తీశామని ఈ చిత్రదర్శకుడు పా. రంజిత్ పేర్కొన్నారు. అలాగే ఈ చిత్రంలో హీరోయిన్లు మాళవికా మోహనన్, పార్వతీ తిరువోత్తుల గెటప్స్ కూడా పూర్తి డీ-గ్లామరస్‌గా, ఆడియన్స్ గుర్తుపట్టలేని విధంగా ఉన్నాయి.





• డిఫరెంట్ సినిమాలతో ఆడియన్స్‌ను మెప్పించడంలో ధనుష్ ముందు ఉంటారు. ఈ విలక్షణ హీరో ప్రస్తుతం దర్శకుడు శేఖర్ కమ్ములతో 'కుబేర' సినిమా చేస్తున్నారు. ఇందులో నాగార్జున మరో హీరో. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా, సామాజిక అసమానతల మేళవింపుతో రానున్న ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాల్లో ధనుష్ బిచ్చగాడి గెటప్‌లో కనిపిస్తారట.






• తమిళ హిట్ ఫిల్మ్ 'సారపట్ట పరంపరై'లో డీ-గ్లామరస్ రోల్‌లో నటించి, ప్రేక్షకులను మెప్పించారు హీరోయిన్ దుషారా విజయన్. ఇప్పుడైతే మరీ గుర్తుపట్టలేని గెటప్‌లో కనిపించనున్నారు. ధనుష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన 'రాయన్' సినిమాలోనే ఆమె గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. ఈ సినిమాలో దుషారతో పాటు వరలక్ష్మీ శరత్‌కుమార్, అపర్ణా బాల మురళి కూడా డీగ్లామరస్ రోల్స్‌లోనే కనిపిస్తారు. సందీప్ కిషన్, కాళిదాసు ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. నార్త్ చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో ముగ్గురు అన్నదమ్ముల కథగా సాగే ఈ మూవీ ఈ నెల 26న రిలీజ్ కానుంది.



• మాస్ హీరో అనిపించుకున్న విశ్వక్ సేన్ లేడీ గెటప్ వేశారు. అది 'లైలా' సినిమా కోసం అన్నమాట. ఈ సినిమాలో విశ్వక్ సేన్ ఫస్టాఫ్ అబ్బాయిగా, సెకండాఫ్ లైలా అనే అమ్మాయిగా కనిపిస్తారు. ఆకాంక్షా శర్మను హీరోయిన్‌గా పరిచయం చేస్తూ రామ్‌నారాయణ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ సినిమా విడుదల కానుంది.



• అటు కన్నడకు వెళితే ఇప్పుడు శివ రాజ్‌కుమార్ గెటప్ హాట్ టాపిక్‌గా నిలిచింది. 'భైరవనకోనెపాత' అనే చిత్రంలో శివ రాజ్‌కుమార్ గుర్తుపట్టలేని గెటప్‌లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి హేమంత్ రావు దర్శకుడు. ఈ సినిమా తెలుగులోనూ రిలీజ్ కానుంది.

ఇలా గుర్తు పట్టలేని గెటప్‌కి సై అని, సవాల్‌గా తీసుకుని నటిస్తున్న స్టార్స్ మరికొందరు ఉన్నారు.



అది మన నేల గొప్పదనం

\- మంచు లక్ష్మి

''ఆదిపర్వం' వంటి సోషియో ఫ్యాంటసీ కథల్ని ప్రేక్షకులకు చూపిస్తున్నామంటే అది మన నేల గొప్పదనం. ఈ శక్తివంతమైన గడ్డ మీద ఉన్నాం కాబట్టే ఇలాంటి నేపథ్యాలతో సినిమాలు చేయగలుగుతున్నాం'' అని నటి మంచు లక్ష్మి అన్నారు. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో మంచు లక్ష్మి లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఆదిపర్వం'. శివ కంఠంనేని, ఆదిత్య ఓం, ఎస్తేర్ నోరోనా, శ్రీజిత ఘోష్, వెంకట్ కిరణ్, సత్యప్రకాశ్, సుహాసిని ఇతర పాత్రల్లో నటించారు. రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్వికా ఆర్ట్స్, ఏఐ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం తెలుగుతో పాటు కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో త్వరలో విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం పాట ఆవిష్కరణ కార్యక్రమంలో మంచు లక్ష్మి మాట్లాడుతూ– ''ఇటీవల 'యక్షిణి' వెబ్ సిరీస్ చేశాను... చాలా మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు 'ఆదిపర్వం' చేశాను. దేవత అయినా దెయ్యం పాత్ర అయినా నన్నే సంప్రదిస్తున్నారు'' అన్నారు. ''ఆదిపర్వం'లో నాగులాపురం నాగమ్మ పాత్ర చేశారు లక్ష్మి. ఆమె చేసిన యాక్షన్ సీక్వెన్సులు హైలైట్ అవుతాయి'' అన్నారు సంజీవ్ మేగోటి. ''ఈ చిత్రంలో నేను క్షేత్రపాలకుడి పాత్ర చేశాను'' అన్నారు శివ కంఠంనేని.


• త్రిష

బృంద వస్తోంది

హీరోయిన్ త్రిష టైటిల్ రోల్‌లో నటించిన థ్రిల్లింగ్ క్రైమ్ మిస్టరీ వెబ్ సిరీస్ 'బృంద'. సూర్య మనోజ్ వంగాలా దర్శకత్వం వహించిన ఈ సిరీస్ టీజర్ విడుదలైంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, మరాఠీ, బెంగాలీ, హిందీ భాషల్లో ఆగస్టు 2 నుంచి ఈ సిరీస్ సోనీ లివ్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ఇంద్రజిత్ సుకుమారన్, జయప్రకాశ్, ఆమని, రాకేందు మౌళి కీలక పాత్రలు పోషించారు. ఈ సిరీస్‌లో పోలీసాఫీసర్ బృందగా త్రిష నటించారు. ఆమె నటించిన తొలి వెబ్ సిరీస్ ఇదే కావడం విశేషం.

సస్పెన్స్... థ్రిల్


• అజయ్


అజయ్, రవిప్రకాశ్, హర్షిణి, మాండవియా సెజల్, చమ్మక్ చంద్ర, చిత్రం శ్రీను నటించిన చిత్రం 'కేస్ నం. 15'. తడకల వంకర్ రాజేశ్ స్వీయ దర్శకత్వంలో బీజీ వెంచర్స్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా తడకల వంకర్ రాజేశ్ మాట్లాడుతూ– ''సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'కేస్ నం.15'. అజయ్ మంచి పాత్ర చేశారు. ఆయనకు మంచి పేరు వస్తుంది. రవిప్రకాశ్ పోలీసాఫీసర్ పాత్ర చేశారు. ఈ చిత్రంలోని సన్నివేశాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి'' అన్నారు.

డల్లాస్‌లో...


• వీఎస్ ఆదిత్య

''మనసంతా నువ్వే, శ్రీరామ్, నేనున్నాను' వంటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు వీఎస్ ఆదిత్య దర్శకత్వంలో కొత్త సినిమా రానుంది. ఓఎంజీ ప్రొడక్షన్ హౌస్‌లో మీనాక్షి అనిపిండి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని మంగళవారం ప్రకటించారు మేకర్స్. కాగా ఈ చిత్ర నిర్మాణం డల్లాస్‌లో జరగనుందట. అందుకే అక్కడ ఆడిషన్స్ నిర్వహించింది చిత్రబృందం. ''ఈ సినిమా వీఎస్ ఆదిత్యగారి శైలిలో ఉంటుంది. గత చిత్రాల్లోలానే ఈ చిత్రంలోనూ ఆయన సున్నితమైన భావోద్వేగాలకు పెద్దపీట వేస్తారు. డల్లాస్‌లో నిర్వహించిన ఆడిషన్స్‌కి ప్రవాస భారతీయులతో పాటు అమెరికన్స్, స్పానిష్, ఆఫ్రికన్స్, యూరోపియన్స్, ఏషియన్స్ రావడం ఆనందంగా ఉంది. ముఖ్యంగా తెలుగు, తమిళ, కన్నడకు చెందిన వారు భారీ సంఖ్యలో ఆడిషన్స్‌లో పాల్గొన్నారు. ఈ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్తుంది'' అన్నారు మేకర్స్.

సరికొత్త కథాంశంతో...


• ప్రగ్య, ధృవ

ధృవ వాయు హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కళింగ'. ప్రగ్యా నయన్ కథానాయిక. నరేన్ కీలక పాత్రధారి. దీప్తీ కొండవీటి, పృథ్వీ యాదవ్ నిర్మాతలు. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను రచయిత, దర్శకుడు విజయేంద్ర ప్రసాద్ రిలీజ్ చేసి, సినిమా హిట్ అవ్వాలన్నారు. ''ఇప్పుడు కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలను చూసేందుకు ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. సరికొత్త కథతో రూపొందిన మా 'కళింగ' ఆ తరహా చిత్రమే'' అన్నారు మేకర్స్. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

వినోదం... భావోద్వేగం


• రాకేష్ వర్రే, అనూష, వినోద్

వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా నటించిన చిత్రం 'పేక మేడలు'. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్‌పై రాకేష్ వర్రే నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ– ''ప్రతి ఒక్కరి జీవితంలో జరిగే ఘటనలకి దగ్గరగా ఈ సినిమా తీశాను. కుటుంబంలోని భావోద్వేగాలు, వినోదంతో రూపొందిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ''ఇది కేవలం కామెడీ సినిమానే కాదు. పురుషులకి మహిళలు ఇస్తున్న సపోర్ట్ ఏంటన్నది ఈ మూవీలో చూపించాం'' అన్నారు రాకేష్ వర్రే. ''తెలుగులో హీరోగా నా మొదటి సినిమా 'పేక మేడలు'. ఈ చిత్రాన్ని ఆదరించి మా యూనిట్‌ని సపోర్ట్ చేయాలి'' అన్నారు వినోద్ కిషన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	391	80,352
నిఫ్టీ ▲	113	24,433

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ వారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	18,402	▲ 7
డోజోన్స్	39,423	▲ 79
ఎఫ్‌టీఎస్ఈ 100	8,140	▼ 54
డాక్స్	18,236	▼ 236
షాంఘై	2,959	▲ 37
నికాయ్	40,580	▲ 800

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,346	▲ 690
బంగారం (99.5 స్వచ్ఛత)	72,056	▲ 399
వెండి (కేజీ)	91,847	▲ 114

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.08	84.10
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.44	107.80
€	యూరో	ఎస్‌బీఐ	89.27	91.64
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.47	52.60
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.30	57.28
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.44

కిమ్స్ చేతికి క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల సంస్థ కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) వైజాగ్‌లోని క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్‌ను కైవసం చేసుకుంది. 380 పడకల సామర్థ్యం కలిగిన ఈ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని చలసాని హాస్పిటల్స్ నిర్వహిస్తోంది. క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్‌ను డాక్టర్ రంగారావు చలసాని, డాక్టర్ విజయ లక్ష్మి చలసాని 1994లో స్థాపించారు. ఇప్పటికే వైజాగ్‌లో తమ సంస్థకు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌తో పాటు గ్యాస్ట్రో యూనిట్ ఉందని కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ బి.భాస్కర రావు ఈ సందర్భంగా తెలిపారు.

కిమ్స్... 12 ఆస్పత్రులు– 3,975 పడకలు

కిమ్స్ ఖాతాలో వివిధ నగరాల్లో మొత్తం 12 ఆసుపత్రులకుగాను 3,975 పడకలు ఉన్నాయి. విస్తరణలో భాగంగా వచ్చే 18 నెలల్లో 1,500–2,000 పడకలు జత కానున్నాయని కంపెనీ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిర్వహణ లాభం 15 శాతం వృద్ధి చెందుతుందని సంస్థ భావిస్తోంది. కొన్ని చికిత్సల చార్జీలను 2–3 శాతం పెంచే అంశాన్ని కిమ్స్ పరిశీలిస్తోంది. బెంగళూరులోని పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ వద్ద 350 పడకల ఆసుపత్రి ఏర్పాటుకై కిమ్స్ హాస్పిటల్స్ మే నెలలో లీజ్ అగ్రిమెంట్ చేసుకుంది. అలాగే బెంగళూరులోని మహదేవపుర వద్ద నెలకొల్పుతున్న హాస్పిటల్ ఈ ఏడాదే కార్యరూపంలోకి రానుంది. రూ.515 కోట్లతో మహారాష్ట్రలోని థానే వద్ద ఆసుపత్రి స్థాపనకై 99 ఏళ్ల లీజు ఒప్పందాన్ని కిమ్స్ ఇప్పటికే కుదుర్చుకుంది. ఈ ఆసుపత్రి 2025 జనవరి–ఫిబ్రవరిలో ప్రారంభం కానుంది. కార్యకలాపాలు ప్రారంభం అయిన రెండేళ్లలో 400 పడకల పూర్తి స్థాయి సామర్థ్యానికి చేరుకోనుంది. కాగా, కిమ్స్ షేరు ధర బీఎస్ఈలో మంగళవారం 0.17శాతం లాభపడి రూ.2,103.85 వద్ద స్థిరపడింది.

ఆగని బుల్ పరుగు

మార్కెట్ల సరికొత్త రికార్డులు



ఆటో, ఎఫ్ఎంసీజీ, అధిక వెయిటేజీ షేర్ల దన్ను	ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూలతలు	జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద

ముంబై: ఆటో, ఎఫ్ఎంసీజీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు మరో రికార్డు స్థాయిలకు చేరాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు సెంటిమెంట్ బలపరిచాయి. అధిక వెయిటేజీ మారుతీ సుజుకీ(7%), ఎంఅండ్ఎం(3%), ఐటీసీ(2%), ఐసీఐసీఐ బ్యాంక్(1%) రాణించి సూచీల రికార్డు ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఫలితంగా మంగళవారం సెన్సెక్స్ 391 పాయింట్లు పెరిగి 80,352 వద్ద ముగిసింది. నిఫ్టీ 113 పాయింట్ల లాభంతో 24,433 వద్ద స్థిరపడింది. ముగింపు స్థాయిలు ఇరు సూచీలకు సరికొత్త రికార్డు. ఉదయం లాభాలతో మొదలైన స్టాక్ సూచీలు రోజంతా లాభాల్లో ట్రేడయ్యాయి. ఆటో, ఎఫ్ఎంసీజీతో పాటు కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, వినిమయ, ఫార్మా, యుటిలిటీ, కన్జూమర్ డిస్క్రెషనరీ షేర్లకూ కొనుగోళ్ల మద్దతు లభించింది. ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 437 పాయింట్లు బలపడి 80,397 వద్ద, నిఫ్టీ 123 పాయింట్లు ఎగసి 24,444 వద్ద జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. రికార్డు ర్యాలీలోనూ టెలికం క్యాపిటల్ గూడ్స్, టెక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా చట్ట సభల్లో ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగానికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

మారుతీ పరుగు



➤ పర్యావరణహిత వాహనాలను ప్రోత్సహించేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం హైబ్రిడ్ కార్ల రిజిస్ట్రేషన్ పన్ను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. యూపీ సర్కారు నిర్ణయంలో దేశంలో ఈ తరహా కార్లను ఉత్పత్తి చేసే మారుతీ సుజుకీ కంపెనీ షేర్లకు భారీ కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈలో 6.60% పెరిగి రూ.12,820 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 8% దూసుకెళ్లి రూ.12,955 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే.

➤ నైరుతి రుతుపవనాలు రాకతో దేశవ్యాప్తంగా ఖరీఫ్ సందడి మొదలైంది. దీంతో వినియోగ ఆధారిత రంగ ఎఫ్ఎంసీజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

బీఎస్ఈ @ రూ. 451.27 లక్షల కోట్లు



➤ స్టాక్ సూచీలు రికార్డు స్థాయికి చేరడంతో ఇన్వెస్టర్ల సంపద సైతం జీవితకాల గరిష్టానికి చేరుకుంది. మంగళవారం ఒక్క రోజే రూ.1.56 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ ఆల్‌టైం గరిష్టం రూ. 451.27 లక్షల కోట్లకు చేరింది.

ఫండ్స్‌లోకి పెట్టుబడుల ప్రవాహం

- జూన్‌లో ఈక్విటీల్లోకి రూ.40,608 కోట్లు

ముంబై: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ జూన్‌లో రూ.40,608 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. అంతకుముందు నెలలో వచ్చిన పెట్టుబడుల కంటే 17 శాతం అధికం. మే నెలలోనూ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ 83 శాతం అధికంగా రూ.34,670 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం గమనార్హం. డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి రూ.1,07,357 కోట్లు బయటకు వెళ్లాయి. అన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని ఆస్తుల విలువ జూన్ చివరికి రూ.61.15 లక్షల కోట్లకు చేరింది. మే నెలతో పోలిస్తే 4% అధికం. ఇందులో ఈక్విటీ పెట్టుబడుల విలువ రూ.27.67 లక్షల కోట్లుగా ఉంది.

కొత్త గరిష్టానికి సిప్ పెట్టుబడులు

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఈక్విటీ ఫండ్స్‌లోకి రూ.21,262 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది నెలవారీ సరికొత్త గరిష్ట స్థాయి. మే నెల సిప్ పెట్టుబడులు రూ.20,904 కోట్లు. జూన్‌లో కొత్తగా 55.13 లక్షల సిప్ రిజిస్ట్రేషన్లు పెరిగాయి. దీంతో మొత్తం సిప్ ఖాతాల సంఖ్య మే చివరికి ఉన్న 8.76 కోట్ల నుంచి జూన్ చివరికి 8.99 కోట్లకు చేరాయి. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని మొత్తం సిప్ పెట్టుబడులు రూ.12.44 లక్షల కోట్లకు దూసుకుపోయాయి. మే చివరికి ఇవి రూ.11.53 లక్షల కోట్లుగా ఉన్నాయి. ''మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ చెప్పుకోతగ్గ వృద్ధిని చూసింది. ఆర్థిక స్థిరత్వానికి, కోట్లాది మంది ఇన్వెస్టర్ల సంపద సృష్టికి కీలకంగా మారింది.''అని ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) సీఈవో వెంకట్ చలసాని తెలిపారు.

జూన్‌లో పెట్టుబడులు	రూ.21,262 కోట్లు
మేలో పెట్టుబడులు	రూ.20,904 కోట్లు
పెట్టుబడుల మొత్తం	రూ.12.44 లక్షల కోట్లు

(యాంఫి నివేదిక)



థీమ్యాటిక్ అదుర్స్

రంగాలవారీ/థీమ్యాటిక్ ఫండ్స్ జూన్ నెలలో రూ.22,351 కోట్లు ఆకర్షించాయి. ముఖ్యంగా ఈ విభాగంలో 9 కొత్త పథకాలు (ఎన్ఎఫ్‌వోలు) ప్రారంభమయ్యాయి. ఇవి ఇన్వెస్టర్ల నుంచి రూ.12,974 కోట్లు సమీకరించాయి. మల్టీక్యాప్ ఫండ్స్‌లోకి 78% అధికంగా రూ.4,708 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. లార్జ్‌క్యాప్ పథకాల్లోకి పెట్టుబడులు 46% పెరిగి రూ.970 కోట్లుగా ఉన్నాయి. స్మాల్‌క్యాప్ పథకాల్లోకి 17% తగ్గి రూ.2,263 కోట్లు, మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి 3% తక్కువగా రూ.2,527 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. హైబ్రిడ్ ఫండ్స్ రూ.8,854 కోట్ల పెట్టబడులను ఆకర్షించాయి. ప్యాసివ్స్‌లోకి రూ.14,601 కోట్లు వచ్చాయి.

సైయంట్‌కు ప్రీమియర్ అవార్డు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐటీ ఇంజినీరింగ్ సేవల సంస్థ సైయంట్ వరుసగా మూడో ఏడాది తమ కస్టమర్ 'ఆర్‌టీఎక్స్' నుంచి ప్రీమియర్ అవార్డును పొందినట్లు వెల్లడించింది. 2023 సంవత్సరానికి గాను కస్టమర్ సర్వీసు, సహకారం, ఆదా అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనపర్చిన సరఫరాదారుగా తాము ఎంపికైనట్లు వివరించింది. కస్టమర్ల సమస్యలకు తగిన పరిష్కారాలను అందించేందుకు తాము చేసే కృషికి ఈ ప్రతిష్టాత్మక పురస్కారం నిదర్శనమని సైయంట్ ఈడీ కార్తికేయన్ నటరాజన్ తెలిపారు.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

ఆదాయపు పన్ను తగ్గించాలి	ఆర్థికాభివృద్ధికి బ్యాంకింగ్ మద్దతు

సిలికాంచ్ ఎల్అండ్‌టీ సొంతం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డైవర్సిఫైడ్ దిగ్గజం ఎల్అండ్‌టీ తాజాగా బెంగళూరు సంస్థ సిలికాంచ్ సిస్టమ్స్‌ను కొనుగోలు చేసింది. సొంత అనుబంధ సంస్థ ఎల్అండ్‌టీ సెమీకండక్టర్ టెక్నాలజీస్ లిమిటెడ్ ద్వారా సిలికాంచ్‌లో 100 శాతం వాటా కొనుగోలు ఒప్పందం(ఎస్‌పీఏ)పై సంతకాలు చేసినట్లు ఎల్అండ్‌టీ పేర్కొంది. ఇందుకు రూ. 183 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. ఈ కొనుగోలుతో ఫ్యాబ్‌లెస్ సెమీకండక్టర్ బిజినెస్‌ను మరింత పటిష్టపరచనున్నట్లు తెలియజేసింది. సెప్టెంబర్‌కల్లా డీల్ పూర్తికావచ్చని అంచనా వేసింది.

విజయా డయాగ్నోస్టిక్‌లో వాటా విక్రయం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా విజయా డయాగ్నోస్టిక్స్‌లో 2.2 శాతం వాటాను అల్ మెహ్వార్ కమర్షియల్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎల్ఎల్‌సీ విక్రయించింది. ఎన్ఎస్ఈ బల్క్ డీల్ వివరాల ప్రకారం షేరుకి రూ. 783 సగటు ధరలో 22.5 లక్షల షేర్లను అమ్మివేసింది. వీటి విలువ రూ. 176 కోట్లుకాగా.. ఇదే ధరలో కొటక్ మహీంద్రా ఎంఎఫ్ 18 లక్షల షేర్లను కొనుగోలు చేసింది. 2024 మార్చికల్లా విజయా డయాగ్నోస్టిక్‌లో అల్ మెహ్వార్ కమర్షియల్ 2.99 శాతం వాటాను కలిగి ఉంది.

ప్రాపర్టీ విలువ చెప్పే 'మ్యాజిక్ బ్రిక్స్' టూల్



హైదరాబాద్: ప్రముఖ రియల్ ఎస్టేట్ ప్లాట్‌ఫామ్ 'మ్యాజిక్ బ్రిక్స్' ప్రాపర్టీ విలువను అప్పటికప్పుడు తెలుసుకునే టూల్ 'ప్రాప్ వర్త్'ను ఆవిష్కరించింది. అత్యాధునిక మెషిన్ లెర్నింగ్ ఆల్గోరిథమ్‌ల సాయంతో పనిచేసే ఈ టూల్ సాయంతో.. ప్రాపర్టీ అంచనా విలువను కొనుగోలుదారులు, విక్రయదారులు తెలుసుకోవచ్చని మ్యాజిక్ బ్రిక్స్ తెలిపింది. 15 ఏళ్ల డేటా, 30 మిలియన్‌కు పైగా లిస్టింగ్‌ల సాయంతో దీన్ని రూపొందించామని.. 30 పట్టణాల్లోని 5,500 ప్రాంతాల పరిధిలో 50,000 ప్రాజెక్టులు ఈ టూల్ పరిధిలోకి తీసుకొచ్చామని వెల్డించింది. అపార్ట్‌మెంట్‌లు, విడి ఇళ్లు, విల్లాల విలువలు ఇందులో లభిస్తాయి.

భారత్‌లో వీఎల్ఎఫ్ ఎంట్రీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీలో ఉన్న ఇటలీ కంపెనీ వీఎల్ఎఫ్ భారత మార్కెట్లో ప్రవేశించింది. వాహనాల తయారీ, పంపిణీ కోసం కేఏడబ్ల్యూ వెలోస్ మోటార్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఏడాది పండుగల సీజన్‌కల్లా టెన్నిస్ ఈ–స్కూటర్‌ను మూడు వేరియంట్లలో పరిచయం చేస్తోంది. ధర రూ.1.5–2 లక్షల మధ్య ఉండొచ్చని సమాచారం. వేరియంట్‌నుబట్టి 1.44–2.88 కిలోవాట్ అవర్ బ్యాటరీ, మోటార్ పవర్ 1,500–4,000 వాట్స్ ఉంది. 60–100 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. గరిష్ట వేగం గంటకు 45–100 కిలోమీటర్లు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-7-2024	
విశాఖ	530–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555–00
విజయవాడ	555–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 52 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్/డిప్యూటేషన్ ప్రాతిపదికన నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 52.
» **పోస్టుల వివరాలు:** గ్రూప్ ఎ పోస్టులు–09, గ్రూప్ బి పోస్టులు–10, గ్రూప్ సి పోస్టులు–33.
» **గ్రూప్–ఎ పోస్టులు:** డిప్యూటీ రిజిస్ట్రార్–02, ఇంటర్నల్ ఆడిట్ ఆఫీసర్–01, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్–01, సీనియర్ సిస్టమ్ అనలిస్ట్–01, అసిస్టెంట్ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్–01,అసిస్టెంట్ రిజిస్ట్రార్–02, నెట్‌వర్కింగ్ ఇంజనీర్–01.
» **గ్రూప్–బి పోస్టులు:** సెక్షన్ ఆఫీసర్– 3, అసిస్టెంట్ ఇంజనీర్–1, సీనియర్ అసిస్టెంట్–3, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్–1, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్–1, పర్సనల్ అసిస్టెంట్–1.
» **గ్రూప్–సి పోస్టులు:** టెక్నికల్ అసిస్టెంట్–01, జూనియర్ ప్రొఫెషనల్ అసిస్టెంట్ –01, ఆఫీస్ అసిస్టెంట్–04, స్టెనోగ్రాఫర్–05, ల్యాబొరేటరీ అసిస్టెంట్–04, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్–14, ల్యాబొరేటరీ అటెండెంట్–04.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 10+2, సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, నెట్/స్లెట్/సెట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** గ్రూప్–ఏ పోస్టులకు 62 ఏళ్లు, గ్రూప్–బి పోస్టులకు 35 ఏళ్లు, గ్రూప్–సి పోస్టులకు 32 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.07.2024.
» **వెబ్‌సైట్:** https://uohyd.ac.in

ఏఐఏఎస్ఎల్‌లో 1,049 పోస్టులు

ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన మూడేళ్ల కాల పరిమితికి ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1,049.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్–343, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్–706.
» **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సీనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 33 ఏళ్లు, కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు సీనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.28,605. కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.27,450.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.07.2024
» **వెబ్‌సైట్:** www.aiasl.in

యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్‌లో 544 అప్రెంటిస్‌లు

దేశవ్యాప్తంగా యునైటెడ్ కమర్షియల్ బ్యాంక్ శాఖల్లో.. 544 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 544 (ఏపీ–07, తెలంగాణ–08).
» **అర్హత:**ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 16.07.2024 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **స్టైపెండ్:** నెలకు రూ.15,000. శిక్షణ వ్యవధి: ఏడాది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 16.07.2024.
» **వెబ్‌సైట్:** https://ucobank.com/en

నార్త్ ఈస్ట్రన్ రైల్వేలో 1104 యాక్ట్ అప్రెంటిస్‌లు

గోరఖ్‌పూర్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్–నార్త్ ఈస్టర్న్ రైల్వే ఎన్ఈఆర్ పరిధిలోని అప్రెంటిస్‌షిప్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 1104
» **వర్క్‌షాప్/యూనిట్:** మెకానికల్ వర్క్‌షాప్ (గోరఖ్‌పూర్), సిగ్నల్ వర్క్‌షాప్ (గోరఖ్‌పూర్ కంటోన్మెంట్), బ్రిడ్జ్ వర్క్‌షాప్ (గోరఖ్‌పూర్ కంటోన్మెంట్), మెకానికల్ వర్క్‌షాప్ (ఇజ్జత్ నగర్), డీజిల్ షెడ్ (ఇజ్జత్ నగర్),క్యారేజ్ అండ్ వ్యాగన్ (ఇజ్జత్ నగర్), క్యారేజ్ అండ్ వ్యాగన్ (లక్నో జంక్షన్), డీజిల్ షెడ (గోండా), క్యారేజ్ అండ్ వ్యాగన్(వారణాసి).
» **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, మెకానిక్ డీజిల్, ట్రిమ్మర్.
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 12.06.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **శిక్షణ వ్యవధి:** ఒక ఏడాది.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.07.2024.
» **వెబ్‌సైట్:** https://ner.indianrailways.gov.in

నేవీలో.. 'అగ్నివీర్' కొలువు

పదో తరగతి ఉత్తీర్ణులకు నావికా దళం స్వాగతం పలుకుతోంది! ఎంపికైతే నాలుగేళ్ల పాటు నేవీలో ఉద్యోగానికి అవకాశం కల్పిస్తుంది. ఇందుకోసం ఇండియన్ నేవీ తాజాగా అగ్నివీర్-ఎంఆర్ (మ్యుజిషియన్) నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రస్తుతం దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో.. ఇండియన్ నేవీ అగ్నివీర్ (ఎంఆర్)-మ్యుజిషియన్ వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» అగ్నివీర్-ఎంఆర్ (మ్యుజిషియన్) నోటిఫికేషన్
» పదో తరగతి అర్హతతో పోటీ పడే అవకాశం
» ఎంపికైతే నావికా దళంలో నాలుగేళ్ల కొలువు



అగ్నివీర్ ఎంఆర్ అంటే

త్రివిధ దళాల్లో ఉద్యోగాల భర్తీకి కేంద్ర ప్రభుత్వం అగ్నిపథ్ స్కీమ్‌ను ప్రవేశ పెట్టింది. ఇందులో భాగంగా అగ్నివీర్ (ఎంఆర్), అగ్నివీర్ (ఎస్ఎస్ఆర్) పేరుతో నియామకాలు జరుపుతున్నారు. అదేవిధంగా మెట్రిక్ రిక్రూట్ (ఎంఆర్) పేరుతో నేవీ నియామకాలు చేపడుతోంది. వీటికి పదో తరగతి ఉత్తీర్ణతను అర్హతగా నిర్దేశించారు. తాజాగా ఎంఆర్ మ్యుజిషియన్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

రెండు వేల పోస్టులు

నేవీ అగ్నివీర్ (ఎంఆర్)–మ్యుజిషిన్ నోటిఫికేషన్ 2/2024 ద్వారా దాదాపు రెండు వేల పోస్టులను భర్తీ చేసే అవకాశమున్నట్లు సమాచారం. వీటిలో మహిళలకు కూడా నిర్దేశిత సంఖ్యలో పోస్టులను కేటాయిస్తారు. అవివాహితులైన పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పదో తరగతి అర్హత

- నేవీ అగ్నివీర్ (ఎంఆర్)–మ్యుజిషియన్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతోపాటు మ్యూజికల్ ఎబిలిటీ కూడా ఉండాలని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పాడటం, ఆయా మ్యూజిక్ పరికరాలపై వాయిద్య నైపుణ్యాలను పరిశీలిస్తారు. కీ బోర్డ్, స్ట్రింగ్/విండ్ ఇన్‌స్ట్రుమెంట్స్/డ్రమ్ కిట్‌లపై ఉన్న పట్టును పరిశీలిస్తారు.
- **వయసు:** నవంబర్ 1, 2002–ఏప్రిల్ 30, 2007 మధ్యలో జన్మించి ఉండాలి.
- **కనీస ఎత్తు:**పురుషులు 158సెంటీ మీటర్లు, మహిళలు 152సెంటీ మీటర్లు ఉండాలి.

అనుభవం సర్టిఫికెట్

అగ్నివీర్ (ఎంఆర్)–మ్యుజిషియన్ పోస్టులకు.. మ్యూజికల్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ తప్పనిసరి. హిందుస్తానీ, సంప్రదాయ సంగీతం లేదా విండ్ ఇన్‌స్ట్రుమెంట్స్ కళాకారులు గుర్తింపు పొందిన మ్యూజికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ పొంది ఉండాలి. ఇతర వాయిద్యాలకు సంబంధించిన అభ్యర్థులు ఆయా ఈవెంట్లలో పాల్గొన్నట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్లు లేదా అవార్డుల సర్టిఫికెట్లను చూపించాల్సి ఉంటుంది.

రెండు దశల ఎంపిక ప్రక్రియ

అగ్నివీర్ (ఎంఆర్) పోస్టుల భర్తీలో భాగంగా రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తొలిదశలో.. ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మ్యూజిక్ స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుంది. వీటిలో విజయం సాధించిన వారికి రిక్రూట్‌మెంట్ మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు.

ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్

- ఎంపిక ప్రక్రియలో కీలకంగా నిలిచే ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్‌లో భాగంగా పలు ఈవెంట్లలో పోటీ నిర్వహిస్తారు.
- **1.6 కిలో మీటర్ల పరుగు:** పురుష అభ్యర్థులు 6 నిమిషాల 30 సెకన్లలో, మహిళా అభ్యర్థులు ఎనిమిది నిమిషాల్లో పూర్తి చేయాలి.
- **స్క్వాట్స్:** పురుష అభ్యర్థులు 20, మహిళా అభ్యర్థులు 15 స్క్వాట్స్ చేయాల్సి ఉంటుంది. పురుష అభ్యర్థులు 12 పుషప్స్ చేయాలి. మహిళా అభ్యర్థులు 10బెంట్‌నీ సిటప్స్ పూర్తి చేయాలి.

ఐఎన్ఎస్ చిల్కాలో శిక్షణ

రాత పరీక్ష, పీఈటీలలో ప్రతిభ చూపిన వారికి చివరగా మెడికల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులోనూ విజయం సాధిస్తే.. ఐఎన్ఎస్ చిల్కాలో ఆరు నెలలపాటు శిక్షణనిస్తారు. తాజా బ్యాచ్‌కు సంబంధించిన శిక్షణ నవంబర్‌లో ప్రారంభం కానుంది. ఈ శిక్షణ కూడా విజయవంతంగా పూర్తి చేసుకుంటే.. ఆయా విభాగాల్లో విధులు కేటాయిస్తారు. అన్ని ప్రక్రియల్లో విజయం సాధించి.. కొలువులు సొంతం చేసుకున్న వారికి నేవీ మ్యూజిక్ విభాగంలో నాలుగేళ్లపాటు విధులు నిర్వర్తించే అవకాశం కల్పిస్తారు. ఈ సమయంలో వారికి అగ్నిపథ్ స్కీమ్‌ను అనుసరించి వేతనం అందిస్తారు.

25 శాతం మందికి

నాలుగేళ్ల వ్యవధిలో అగ్నివీర్ సర్వీస్ పూర్తి చేసుకున్న వారిలో 25 శాతం మందిని నేవీలో శాశ్వత హోదాలో సెయిలర్‌గా నియమిస్తారు. అందుకోసం ప్రత్యేక నోటిఫికేషన్ వెలువరిస్తారు. అందులో పేర్కొన్న ఎంపిక ప్రక్రియలో విజయం సాధించాల్సి ఉంటుంది. అదే విధంగా అగ్నివీర్‌లుగా సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి సీఏపీఎఫ్, అస్సాం రైఫిల్స్ నియామకాల్లోనూ పది శాతం రిజర్వేషన్ కల్పిస్తారు.

వేతనం ఇలా

అగ్నివీర్ (ఎంఆర్)–మ్యూజిషియన్లుగా ఎంపికైన అభ్యర్థులకు ఏడాది ప్రాతిపదికగా నాలుగేళ్ల పాటు ఒక్కో ఏడాది ఒక్కో మొత్తంలో నెల వేతనం అందిస్తారు. మొదటి ఏడాది రూ.30 వేలు, రెండో ఏడాది రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40 వేలు చొప్పున నెల వేతనం లభిస్తుంది. ఈ వేతనంలోంచి ప్రతి నెల 30 శాతం చొప్పున అగ్నివీర్ కార్పస్ ఫండ్‌కు జమ చేస్తారు. ఈ 30 శాతానికి సమానమైన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం కూడా ఈ కార్పస్ ఫండ్‌కు జమ చేస్తుంది. ఇలా నాలుగేళ్లు పూర్తయ్యే సరికి అభ్యర్థుల కార్పస్ ఫండ్‌లో రూ.10.04 లక్షలు జమ అవుతాయి.

వేతనంతోపాటు రిస్క్ అండ్ హార్డ్‌షిప్ అలవెన్స్, ట్రావెల్ అలవెన్స్‌లను కూడా అందిస్తారు. దీంతోపాటు నాన్ –కంట్రిబ్యూటరీ జీవిత బీమా పేరుతో రూ.48 లక్షల మొత్తానికి జీవిత బీమా కల్పిస్తారు. అదేవిధంగా విధి నిర్వహణ సమయంలో ప్రమాదవశాత్తు మరణిస్తే మరో రూ.44 లక్షల పరిహారం అందిస్తారు.

పట్టు సాధించేలా

అగ్నివీర్ (ఎంఆర్)–మ్యుజిషియన్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు.. తమకు ప్రావీణ్యం ఉన్న సంగీత విభాగాల్లో పట్టు సాధించేలా కృషి చేయాలి. పాటకు తగిన రీతిలో సంగీతం అందించేలా ఆయా వాయిద్య పరికరాలతో ప్రాక్టీస్ చేయాలి. రాత పరీక్ష లేకుండా.. కేవలం మ్యూజికల్ ఎబిలిటీని పరిశీలించే నేపథ్యంలో ఈ విషయంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జూలై 11.
- **స్టేజ్–1 పరీక్ష తేదీ:** ఆగస్టులో నిర్వహించే అవకాశం.
- **స్టేజ్–2 పరీక్ష తేదీ:** సెప్టెంబర్‌లో జరిగే అవకాశం.
- **తుది జాబితా/ఫలితాల విడుదల:** 2024, అక్టోబర్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఎన్‌జీఆర్‌ఐ చీఫ్ సైంటిస్ట్ ప్రశాంత్‌కు 'భూవిజ్ఞాన పురస్కారం'



ఉప్పల్ (హైదరాబాద్): ఎన్‌జీఆర్‌ఐ శాస్త్రవేత్తను నేషనల్ జియో సైన్స్ అవార్డు వరించింది. ప్రశాంత్ కె.పాత్రో ప్రతిష్టాత్మకమైన జాతీయ భూవిజ్ఞాన పురస్కారం-2023కి ఎంపికైనట్లు ఆ సంస్థ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. భూభౌతిక శాస్త్రం, అప్లయిడ్ భూభౌతికశాస్త్ర రంగాల్లో ఆయన చేసిన అసాధారణమైన కృషికి భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఈ గౌరవాన్ని ఇచ్చిందన్నారు. భౌభౌతిక, అన్వేషణ సవాళ్లను పరిష్కరించడానికి ఆధునాతన ఎంటీ పద్ధతులను ఉపయోగించినట్లు ఆ ప్రకటనలో వెల్లడించారు. ప్రస్తుతం ఆయన పరిశోధనలు హిమాలయాల టెక్టోనిక్స్‌పై దృష్టి సారించిందన్నారు. పాత్రో పరిశోధనలు భూభౌతిక శాస్త్ర పరిశోధన రంగాన్ని పురోగమింపజేస్తూనే ఉన్నాయని పలువురు కొనియాడారు.

సిరాజ్‌కు ప్రభుత్వోద్యోగం, స్థలం: సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ క్రికెట్‌లో దేశానికి, రాష్ట్రానికి ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ గొప్ప పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చాడని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభినందించారు. టీ20 వరల్డ్ కప్ గెలిచిన సందర్భంగా మహమ్మద్ సిరాజ్ మంగళవారం సీఎంను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా సిరాజ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ క్రికెట్‌లో సిరాజ్ అద్భుతమైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడని, అత్యున్నత స్థాయి క్రికెటర్లలో ఒకడిగా పేరు సంపాదించుకున్నాడని ప్రశంసించారు. ఈ సందర్భంగా సిరాజ్‌కు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగం, ఇంటి స్థలం తక్షణం కేటాయించాలని సీఎం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భారత జట్టు మాజీ క్రికెటర్ మహమ్మద్ అజహారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వోగా శ్రీధర్



సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వోగా ఎ.శ్రీధర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్ (ఐఆర్‌టీఎస్) 2011 బ్యాచ్‌కు చెందిన ఆయన ఈ నియామకానికి ముందు డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పనిచేశారు. ఇప్పటి వరకు సీపీఆర్వోగా పనిచేసిన సీహెచ్ రాకేశ్ డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. శ్రీధర్ మొదట భద్రాచలం రోడ్‌లో ఏరియా ఆఫీసర్‌గా, తదుపరి రామగుండం ఏరియా ఆఫీసర్‌గా, హైదరాబాద్ అండ్ సికింద్రాబాద్ డివిజన్‌లో డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌గా, సికింద్రాబాద్ డివిజన్‌లో డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా, హైదరాబాద్ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌గా, నాందేడ్ డివిజన్‌లో సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా, డిప్యూటీ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్‌గా పలు బాధ్యతలు నిర్వహించారు. శ్రీధర్‌కు 2022లో ప్రతిష్టాత్మక జనరల్ మేనేజర్ అవార్డు లభించింది.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.